


‘రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి.
పాడిపంటలతో పులకించిపోవాలి’

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16+40 పేజీల ఆదివారం అనుబంధం
వెల: ₹ 6.00
సంపుటి: 10
సంచిక: 163

SUNDAY Special

ఆదివారం 3-9-2017

SIMULTANEOUSLY PRINTED AT KADAPA | VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL





- ఫ్యామిలీలో

## అనుసంధానం ఆమడదూరం

నదుల అనుసంధానానికి ముందుకు రాని రాష్ట్రాలు

- ఫోకస్ 10లో





శనివారం ఇడుపులపాయ వైఎస్సార్ ఘాట్‌లో నివాళులర్పిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ భారతీరెడ్డి, హర్ష, వర్ష, షర్మిల, బ్రదర్ అనిల్‌కుమార్, రాజారెడ్డి, అంజలి, ఎంపీ అవినాశ్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు

# ప్రతి గ్రామానికీ సచివాలయం

**వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే పది మంది సిబ్బందితో ఏర్పాటు**

**జనం ఎవరి చుట్టూ తిరక్కుండా ఎక్కడికక్కడే సమస్యల పరిష్కారం**

**‘వైఎస్సార్ కుటుంబం’ కార్యక్రమం ప్రారంభంలో వైఎస్ జగన్**

- 11 నుంచి అక్టోబరు 2 దాకా రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమం
- బూత్ కమిటీ సభ్యులు బాబు మోసాలను ఇల్లిల్లూ తిరిగి ప్రజలకు వివరించాలి
- 91210 91210 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తే పార్టీ సభ్యత్వం
- అక్టోబర్ 27 నుంచి ఆరు నెలల పాటు పాదయాత్ర


5లో




## తమిళనాట ‘నీట్’ అలజడి

- వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్‌ను వ్యతిరేకిస్తూ దళిత విద్యార్థిని అనిత ఆత్మహత్యకు పాల్పడటంతో తమిళనాడులో ఆందోళనలు మిన్నంటాయి. రాజకీయ పార్టీలు, ఇతర తమిళ సంస్థలు శనివారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి.

- 6లో



అశ్వనీ కుమార్ చౌబే (బిహార్)


శివప్రతాప్ శుక్లా (ఉత్తరప్రదేశ్)


వీరేంద్రకుమార్ (మధ్యప్రదేశ్)


అనంతకుమార్ హెగ్డే (కర్ణాటక)


హర్‌దీప్ సింగ్ పూరి మాజీ ఐఎఫ్‌ఎస్ (ఢిల్లీ)


గజేంద్ర సింగ్ షెకావత్ (రాజస్తాన్)


సత్యపాల్ సింగ్ మాజీ ఐపీఎస్ (యూపీ)


అల్ఫాన్స్ కన్నంథనమ్ మాజీ ఐఏఎస్ (కేరళ)

# కేబినెట్‌కు కొత్త రక్తం

**మోదీ మంత్రివర్గంలో కొత్తగా 9 మందికి చోటు**

- భారీ కసరత్తు తర్వాత జాబితా ఖరారు చేసిన మోదీ
- రాత్రి వరకు అమిత్ షా, బీజేపీ ముఖ్యనేతలతో భేటీ
- పలు రాష్ట్రాల అసెంబ్లీ, 2019 ఎన్నికల దృష్టితో విస్తరణ
- జాబితాలో ఏపీ, తెలంగాణలకు మొండిచేయి!
- జేడీయూ, అన్నాడీఎంకేలకు దక్కని చోటు
- పునర్వ్యవస్థీకరణపై అలిగిన శివసేన
- రక్షణ, రైల్వే శాఖలు ఎవరికి? తొలగని సందిగ్ధత
- పలువురికి ప్రమోషన్.. మరికొందరికి డిమోషన్

6లో


రాజ్‌కుమార్ సింగ్ మాజీ ఐఏఎస్ (బిహార్ కేడర్)

అల్ఫాన్స్ కన్నంథనమ్, హర్‌దీప్‌సింగ్ పూరి రాజ్యసభ, లోక్‌సభలో సభ్యులు కారు...









## ఇదండీ సంగతి




... ఇక నుంచి పెరిగిన ధరకు సరిపడా గ్యాస్ తీసేసుకుని ఇవ్వు!

## బాలికపై గ్యాంగ్‌రేప్, హత్య!

**విజయనగరం జిల్లాలో దారుణ ఘటన**

- స్కూలుకు వెళ్తున్నప్పుడు అడ్డగింత
- బాలికను భయపెట్టి నలుగురు అత్యాచారం
- అందరికీ ఎక్కడ చెబుతుందోనని గొంతునులిమి హత్య
- మృతదేహాన్ని చెరువులో పారేసిన వైనం.. పోలీసుల అదుపులో నిందితులు

- 3లో



## గ్రీన్‌కార్డుకు ఇంటర్వ్యూ తప్పనిసరి

- భారతీయులకు ట్రంప్ మరో షాక్
- ఆర్‌ఎఫ్‌ఈల పేరిట హెచ్–1బీ దరఖాస్తులపై పెరిగిన నిఘా
- ఆందోళనలో 8 లక్షల వలసదారులు

- వివరాలు 6లో

# స్థానికులను ముంచేసింది!

**పోలవరం నిర్వాసితుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం**

అన్ని ధ్రువపత్రాలు, తాతల కాలం నుంచి ఉంటున్నా స్థానికులు కాదట

రూ.300 కోట్ల పరిహారానికి గండి.. రోడ్డున పడ్డ 4,000 కుటుంబాలు

- వివరాలు 16లో




# సాక్షి రౌండప్

వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం I సెప్టెంబర్ I 3 I 2017





భారత్‌లో చైనా స్మార్ట్ ఫోన్ల వాడకం విపరీతంగా పెరిగింది. 2014లో చైనా తయారీ స్మార్ట్‌ఫోన్ల వినియోగం 15.1 శాతం ఉండగా... 2017 నాటికి 51.5 శాతానికి పెరిగింది.



## మైఖేల్ కోసం ఫేస్‌బుక్, గూగుల్ పోటీ




కేవలం 21 ఏళ్ల యువకుడి కోసం దిగ్గజ కంపెనీలు గూగుల్, ఫేస్‌బుక్‌లు పోటీ పడుతున్నాయి. మైఖేల్ సేమన్ అనే కుర్రాడికి 17 ఏళ్ల వయసులోనే ఇంటర్న్‌షిప్ కోసం ఫేస్‌బుక్ సంస్థలో చేరాడు. ఆ తర్వాత అతడి ప్రతిభ చూసిన ఫేస్‌బుక్ 18 ఏళ్లకే ఫుల్‌టైమ్ ఇంజనీరింగ్ జాబ్ ఇస్తూ అతడిని రిక్రూట్ చేసుకుంది. ఇంటర్న్‌షిప్‌కు ముందే అతడు ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్‌తోనూ భేటీ అయ్యాడు. ఫేస్‌బుక్‌ను యువతకు మరింత చేరువయ్యేలా చేయడంలో సేమన్ చొరవ చూపాడు. టీనేజ్ యువతకు నచ్చేలా వినూత్న ఉత్పత్తులపై కీలక సూచనలు చేశాడు. అయితే గత వారం 21 ఏళ్లు వచ్చిన సేమన్ ఫేస్‌బుక్‌కు బైబై చెప్పేసి గూగుల్‌లో చేరాడు. సేమన్ గూగుల్‌లో అత్యంత పిన్నవయస్కుడైన ప్రొడక్ట్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టాడు. సేమన్ 13 ఏళ్ల వయసులో యూట్యూబ్ ట్యుటోరియల్ వీడియోలు వీక్షిస్తూ స్వయంగా మొబైల్ యాప్స్ రూపొందించడం నేర్చుకున్నాడు. అతడి కోసం ఈ రెండే కాకుండా మరిన్ని సంస్థలు అధిక మొత్తంలో జీతం ఇచ్చి తమ కంపెనీలో చేర్చుకునేందుకు ముందుకు వస్తున్నాయి.






వైఎస్సార్ సీపీ నేత బొత్స సత్యనారాయణకు అమెరికాలో ఘనస్వాగతం పలుకుతున్న అమెరికన్ ప్రోగ్రెస్ తెలుగు అసోసియేషన్(ఆప్టా) సౌత్ ఈస్ట్ కాన్ఫరెన్స్ సంఘం సభ్యులు

# పరవశించిన కోవిందుడు

**శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి రామ్‌నాథ్**

- ఇస్తికఫాల్ మర్యాదలతో స్వామి దర్శనం
- రాష్ట్రపతి వెంట గవర్నర్, సీఎం
- టీటీడీ ఆతిథ్యం బాగుందని అభినందనలు

సాక్షి, తిరుమల

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శనివారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. రాష్ట్రపతి సతీమణి సవితా కోవింద్, కుమారుడు ప్రశాంత్‌కుమార్, కుమార్తె స్వాతి, ఇతర కుటుంబ సభ్యులతో కలసి ఉదయం 7.08 గంటలకు క్షేత్ర సంప్రదాయం ప్రకారం తొలుత భూవరాహస్వామివారిని దర్శించుకున్నారు. తర్వాత ఉదయం 7.32 గంటలకు మహద్వారం వద్దకు చేరుకున్నారు. టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో కేఎస్ శ్రీనివాసరాజు, అర్చకులతో కలసి రాష్ట్రపతికి ఇస్తికఫాల్ మర్యాదలతో స్వాగతం పలికారు. పచ్చ కర్పూరపు వెలుగులో శ్రీవారి దివ్య మంగళరూపాన్ని దర్శించుకుని రాష్ట్రపతి ఆనంద పరవశులయ్యారు. స్వామివారి పాదాల వద్ద ఉంచిన పట్టు శేషవస్త్రాన్ని ఆలయ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు రాష్ట్రపతికి బహూకరించారు. అనంతరం వకుళమాతను దర్శించుకుని హుండీలో కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించగా టీటీడీ ఈవో సింఘాల్, జేఈవో కేఎస్ శ్రీనివాసరాజు శ్రీవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు రాష్ట్రపతికి అందజేశారు. గవర్నర్ నరసింహన్, సీఎం చంద్రబాబు కూడా ఆయనతో కలసి శ్రీవారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు.

**టీటీడీ ఆతిథ్యంపై కోవింద్ మహదానందం**

శ్రీవారి దర్శనం తర్వాత కుటుంబ సభ్యులతో కలసి ఉదయం 8.30 గంటలకు అతిథి గృహానికి చేరుకుని రాష్ట్రపతి అల్పాహారం స్వీకరించారు. అన్నప్రసాద విభాగం ప్రత్యేక శ్రద్ధతో షడ్రసోపేత రుచులతో వడ్డించటంపై రాష్ట్రపతి కుటుంబం మహదానందం చెందింది. అతిథి మర్యాదలు చాలా బాగున్నాయని రాష్ట్రపతి కోవింద్ స్వయంగా టీటీడీ ఈవో, జేఈవోలను అభినందించారు.



ఆలయంలో కుటుంబ సభ్యులతో కలసి ధ్వజస్తంభానికి మొక్కుతున్న రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ దంపతులు, పక్కన టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్

## అగ్రి టీచింగ్ అసోసియేట్, అసిస్టెంట్లకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

### అసోసియేట్లకు 4న, అసిస్టెంట్లకు 5న ఇంటర్వ్యూ

**సాక్షి, అమరావతి:** ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ ప్రభుత్వ, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల్లో టీచింగ్ అసోసియేట్, టీచింగ్ అసిస్టెంట్ల నియామకానికి యూనివర్సిటీ అధికారులు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. సుమారు 80 వరకు పోస్టులున్నాయి. కాంట్రాక్ట్ పద్ధతిన ఈ పోస్టులను భర్తీ చేస్తున్నారు. టీచింగ్ అసోసియేట్లకు 4న, టీచింగ్ అసిస్టెంట్లకు 5న గుంటూరు సమీపంలోని లాం ఫాంలో యూనివర్సిటీ పాలనా కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు జరుగుతాయి. వ్యవసాయ పట్టభద్రులు, వ్యవసాయ ఇంజినీరింగ్ పట్టభద్రులు ఈ పోస్టులకు అర్హులని రిజిస్ట్రార్ టీవీ సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను చూడొచ్చు.

**నేటి నుంచి స్పోర్ట్స్ కోటా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన**

అగ్రికల్చర్, హార్టికల్చర్, వెటర్నరీ డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు స్పోర్ట్స్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను ఆది, సోమ వారాల్లో పరిశీలించనున్నట్టు రిజిస్ట్రార్ టీవీ సత్యనారాయణ తెలిపారు. ఆన్‌లైన్‌లో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే ఇది వర్తిస్తుంది. ఏపీ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) అధికారులు లాంఫాంలోని ఆడిటోరియంలో సర్టిఫికెట్లను పరిశీలించి ప్రతిభ ప్రాతిపదికన పాయింట్లు ఇస్తారు. వీటి ఆధారంగా ప్రత్యేక కౌన్సెలింగ్‌కు తేదీని ప్రకటిస్తారు. ఇదే తరహాలో ఎన్‌సీసీ, సీఏపీ, పీహెచ్ కోటా కింద దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ప్రత్యేక కౌన్సెలింగ్ ఉంటుంది. వీటి అనంతరం మిగిలిపోయిన సీట్లకు రెండో విడత కౌన్సెలింగ్ తేదీని ప్రకటిస్తారు.

# రికార్డు స్థాయిలో ఉల్లి దిగుబడులు

- 2016–17లో 2.17 కోట్ల మెట్రిక్ టన్నుల ఉల్లి ఉత్పత్తి
- 2015–16 కంటే 7.87 లక్షల మెట్రిక్ టన్నులు అధికం
- ఉద్యాన ఉత్పత్తులు 30 కోట్ల మెట్రిక్ టన్నులు
- 1.37 కోట్ల మెట్రిక్ టన్నులు అధికంగా దిగుబడులు



**సాక్షి, హైదరాబాద్:** దేశంలో రికార్డు స్థాయిలో ఉల్లి దిగుబడులొచ్చాయి. 2016–17లో ఉల్లిగడ్డ 2.17 కోట్ల మెట్రిక్ టన్నులు ఉత్పత్తయింది. అంతకుముందు ఏడాది కంటే 7.87 లక్షల మెట్రిక్ టన్నులు అధికంగా ఉత్పత్తయినట్లు కేంద్రం ప్రకటించింది. కేంద్ర వ్యవసాయ శాఖ 2016–17 ఆర్థిక సంవత్సరపు ఉద్యాన ఉత్పత్తుల మూడో అంచనా నివేదికను శనివారం విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాల ఉత్పత్తులు రికార్డు స్థాయిలో 29.98 కోట్ల మెట్రిక్ టన్నులు దిగుబడి అయ్యాయి. 2015–16 ఆర్థిక సంవత్సరం కంటే 1.37 కోట్లు అధికంగా ఉత్పత్తి అయినట్లు స్పష్టం చేసింది. ఉల్లి 2015–16లో 2.09 కోట్ల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి కాగా, ఈ సారి 3.8 శాతం అధికంగా ఉత్పత్తి అయినట్లు తెలిపింది. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, బిహార్, గుజరాత్‌లో ఎక్కువగా ఉల్లి సాగు చేస్తారు. వాస్తవంగా 2015–16లో ఉల్లి సాగువిస్తీర్ణం దేశవ్యాప్తంగా 33 లక్షల ఎకరాలు కాగా, 2016–17లో 32.32 లక్షల ఎకరాలకే పరిమితమైంది. కానీ ఉత్పాదకత పెరగడంతో దిగుబడి అధికంగా వచ్చిందని నివేదిక స్పష్టం చేసింది.

**కూరగాయల దిగుబడి 17.61 కోట్ల మెట్రిక్ టన్నులు**

కూరగాయల దిగుబడి కూడా రికార్డు స్థాయిలోనే ఉండటం గమనార్హం. 2015–16లో 16.9 కోట్ల మెట్రిక్ టన్నుల కూరగాయలు ఉత్పత్తి కాగా, 2016–17లో 17.61 కోట్ల మెట్రిక్ టన్నులు పండటం గమనార్హం. రికార్డు స్థాయిలో 71 లక్షల మెట్రిక్ టన్నులు అధికంగా కూరగాయలు ఉత్పత్తి అయ్యాయి. బీన్స్, కాకరకాయ, క్యాప్సికం, క్యారెట్, కాలీఫ్లవర్, దోసకాయ, పచ్చిమిర్చి, పుట్టగొడుగులు, ఆలూ, టమాటాలు అంతకముందు ఏడాది కంటే అధికంగా దిగుబడి అయ్యాయి. పండ్ల దిగుబడి 2015–16లో 9.01 కోట్ల మెట్రిక్ టన్నులు దిగుబడి కాగా, 2016–17లో 9.37 కోట్ల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయ్యాయి. 36 లక్షల మెట్రిక్ టన్నులు అధికంగా ఉత్పత్తి కావడం గమనార్హం. బత్తాయి, ద్రాక్ష, మామిడి, బొప్పాయి, పైనాపిల్ పండ్ల దిగుబడి అధికంగా ఉంది. సుగంధ ద్రవ్యాల దిగుబడులు కూడా పెరిగాయి. 2015–16లో 69.88 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి కాగా, 2016–17లో ఏకంగా 82.02 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయ్యాయి. పసుపు, చింతపండు, ఎండుమిర్చి గణనీయంగా దిగుబడి అయ్యాయి. పూల ఉత్పత్తి 2015–16లో 21.84 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, 2016–17లో 22.77 లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయ్యాయి. తేనె 2015–16లో 88 వేల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి కాగా, 2016–17లో 95 వేల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయ్యాయని కేంద్ర వ్యవసాయ శాఖ తెలిపింది.

## కశ్మీర్ ఎన్‌కౌంటర్‌లో లష్కరే ఉగ్రవాది హతం

**శ్రీనగర్ :** జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. కుల్గామ్ జిల్లాలోని తంత్రి పొరా గ్రామంలో నక్కిన లష్కరే ఉగ్రవాది ఇష్ఫాక్ అహ్మద్ పద్దర్‌ను ఆర్మీ, పోలీసుల సంయుక్త బలగాలు శనివారం హతమార్చాయి. ఈ ఏడాది మేలో షోపియాన్‌లో ఓ పెళ్లికి హాజరైన లెఫ్టినెంట్ ఉమర్ ఫయాజ్(22)ను అపహరించి, కాల్చిచంపిన ఘటనలో ఇష్ఫాక్ పాల్గొన్నట్లు పోలీస్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. తంత్రి పొరా గ్రామాన్ని చుట్టుముట్టి గాలింపు జరుపుతుండగా..ఇష్ఫాక్ భద్రతా బలగాలపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపాడని వెల్లడించారు. వెంటనే బలగాలు అప్రమత్తమై జరిపిన ఎదురుకాల్పుల్లో అతను హతమయ్యాడని పేర్కొన్నారు. యరిపొరా పోలీస్ స్టేషన్‌పై దాడి చేయడంతో పాటు జమ్మూకశ్మీర్ బ్యాంక్, ఎల్లాకై దెహాతీ బ్యాంకుల్లో ఇష్ఫాక్ దోపిడీకి పాల్పడ్డాడని వెల్లడించారు. సంఘటనా స్థలం నుంచి ఓ ఏకే–47 తుపాకీ, రెండు మేగజీన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.






## నాపై ఎలాంటి కేసులు లేవు

### ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ

**బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు):** ప్రస్తుతం తనపై ఎలాంటి కేసులు ఏ పోలీస్‌స్టేషన్‌లో కూడా లేవని పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ తెలిపారు. సాక్షి పత్రిక, టీవీల్లో శుక్రవారం 'వేధింపుల్లో ఘనులు' శీర్షికతో తనపై వచ్చిన వార్తపై ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. ఏడీఆర్ స్వచ్ఛంద సంస్థ ఒక బూటకపు సంస్థ అన్నారు. తాను ఎవరో అమ్మాయిని వేధించినట్లు, ఆమె తనపై కేసు పెట్టినట్లు తప్పుడు వార్తలు రాయించారన్నారు. వారం రోజుల్లో ఆ కేసుకు సంబంధించిన ఆధారాలను బయట పెట్టాలని, లేకుంటే సాక్షిపై పరువు నష్టం దావా వేస్తానన్నారు. గతంలో ఉద్యమం కేసులు నాలుగు, ఎన్నికల్లో అధిక వాహనాలు వినియోగించిన కేసులు రెండు ఉండేవని పేర్కొన్నారు. ప్రస్తుతం వాటి నుంచి కూడా విముక్తి పొందానని చెప్పారు.



## పరవళ్లు తొక్కిన ఆనందం

తిరుమలలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి శేషాచలంపై ఉన్న చెక్‌డ్యాంలు, పిల్ల కాలువలు నీటితో కళకళలాడుతున్నాయి. జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నాయి. కొండకే కొత్త అందాలు తెస్తున్నాయి. తిరుపతిలోని కపిలతీర్థానికి శనివారం వర్షపు నీరు పోటెత్తింది. తీర్థానికి భక్తులు క్యూ కట్టారు. జలపాత సోయగాలను సెల్‌ఫోన్లలో బంధిస్తూ పలువురు సెల్ఫీలు దిగారు.

– సాక్షి, తిరుపతి

# కనికరించని 'కృష్ణా'!

**ఊరించి ఉసూరుమనిపించిన కృష్ణా నది వరద**

- తగ్గుముఖం పట్టిన వరద ఉద్ధృతి
- ఉజ్జయిని, ఆల్మట్టి, నారాయణపూర్‌లలో నీటి విడుదలపై నియంత్రణ
- పరిస్థితి ఇలానే కొనసాగితే తాగునీటికి కష్టాలే

**సాక్షి, అమరావతి:** కృష్ణా నదిలో వరద ఉద్ధృతి తెలుగు రాష్ట్రాలను ఊరించి ఉసూరుమన్పించింది. వరద తగ్గుముఖం పట్టడంతో ఉజ్జయిని జలాశయం నుంచి దిగువకు విడుదలచేసే నీటిని మహారాష్ట్ర తగ్గించింది. దీంతో కర్ణాటక సర్కార్ ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల నుంచి నీటి విడుదలను నియంత్రిస్తూ యథేచ్ఛగా జలాలను మళ్లిస్తోంది. ఈ ఏడాది కనీసం 60 నుంచి 70 టీఎంసీలైనా తెలుగు రాష్ట్రాలకు వస్తాయా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. శుక్రవారంతో పోల్చితే శనివారం కృష్ణా నదిలో వరద ఉద్ధృతి తగ్గింది. దీంతో ఉజ్జయిని జలాశయం నుంచి దిగువకు 5,653 క్యూసెక్కులు విడుదలవుతున్నాయి. శనివారం ఉదయం ఆల్మట్టి జలాశయం నుంచి 53,033 క్యూసెక్కులు, నారాయణపూర్ నుంచి 52,005 క్యూసెక్కులు విడుదల చేసిన కర్ణాటక.. ఎగువ నుంచి వరద రాకపోవడంతో నీటి విడుదలను క్రమేణా తగ్గించింది. ఆల్మట్టి, నారాయణపూర్‌ల నుంచి భారీఎత్తున వరద వస్తుందని భావించిన తెలంగాణ సర్కార్ జూరాల నుంచి శుక్రవారం 0.30 టీఎంసీలను శ్రీశైలానికి విడుదలచేసింది. ఎగువ నుంచి వరద వచ్చే అవకాశం లేదని పసిగట్టిన తెలంగాణ సర్కార్ శనివారం జూరాల నుంచి నీటి విడుదలను కట్టడిచేసింది.

**అప్పటిలోగా రాకుంటే ఇక ఆశలు లేనట్టే:** నదీ పరివాహక ప్రాంతంలో వర్షాలు తగ్గిన నేపథ్యంలో ఎగువ నుంచి వచ్చే వరద రోజుకు రెండు నుంచి 2.50 టీఎంసీలకు మించదు. ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు పూర్తిగా నిండినా వరద నీటిని దిగువకు విడుదల చేయకుండా కాలువలకు మళ్లిస్తోంది. కనీసం మూడు టీఎంసీలకు మించి వరద వస్తేనే కర్ణాటక సర్కార్ అరకొరగా జలాలను దిగువకు విడుదలచేసే అవకాశాలున్నాయి. సాధారణంగా అక్టోబర్ రెండో వారానికే నైరుతి రుతుపవనాల తిరోగమనం వల్ల కృష్ణా పరివాహక ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పడతాయి. అక్టోబర్ రెండోవారం తర్వాత కృష్ణాలో వరద జలాలపై ఆశలు పెట్టుకోలేమని సాగునీటి నిపుణులు విశ్లేషిస్తున్నారు. వరద ప్రవాహం ఇలానే కొనసాగితే జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్‌ల చరిత్రలో అత్యల్ప నీటి లభ్యత సంవత్సరంగా ఈ ఏడాది నమోదవుతుంది.

**తాగునీటికీ కష్టాలు తప్పవా..**

కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో ఇరు రాష్ట్రాల్లోనూ తాగునీటి అవసరాలకే కనీసం 73 టీఎంసీలు అవసరం. ఎగువ నుంచి వరద ప్రవాహం ఇదే రీతిలో కొనసాగితే రెండు రాష్ట్రాల్లోనూ తాగునీటి కష్టాలు తప్పవు. నీటి లభ్యత కనిష్ట స్థాయికి పడిపోయిన నేపథ్యంలో 2 రాష్ట్రాల్లోనూ శ్రీశైలం, నాగార్జునసాగర్ ఆయకట్టు కింద రైతులు పంటలు సాగుచేయలేని దుస్థితి నెలకొంది. కృష్ణా ఉప నది అయిన తుంగభద్రలో నీటి లభ్యత కాస్త మెరుగ్గా ఉంది. శనివారం 31,086 క్యూసెక్కులు చేరడంతో టీబీ డ్యామ్‌లో నీటి నిల్వ 70 టీఎంసీలకు చేరుకుంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లలో తాగునీటి అవసరాల కోసం 5,035 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం టీబీ డ్యామ్‌లో నిల్వ ఉన్న జలాలు రెండు రాష్ట్రాల్లో పంటల సాగుకు సరిపోవు. ఈ నేపథ్యంలో వరుసగా నాలుగో ఏటా తుంగభద్ర డ్యామ్ ఆయకట్టులో పంటలు సాగుచేయలేని పరిస్థితి నెలకొంది.

| జలాశయం | నీటి నిల్వ సామర్థ్యం (టీఎంసీలు) | ప్రస్తుత నిల్వ (టీఎంసీలు) | ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | అవుట్ ఫ్లో (క్యూసెక్కులు) | శనివారానికి వచ్చిన జలాలు(టీఎంసీలు) | గతేడాది ఇదే సమయానికి(టీఎంసీలు) |
|---|---|---|---|---|---|---|
| ఉజ్జయిని | 117.24 | 117.24 | 12,531 | 5,653 | 70.947 | 80.185 |
| ఆల్మటి | 129.721 | 128.19 | 53,033 | 53,033 | 171.739 | 362.434 |
| నారాయణపూర్ | 37.646 | 37.61 | 51,609 | 52,005 | 57.802 | 257.992 |
| జూరాల | 9.657 | 7.371 | 7,285 | 14,229 | 18.037 | 217.9 |
| శ్రీశైలం | 215.807 | 24.43 | 3,513 | 52 | 7.80 | 204.916 |
| నాగార్జునసాగర్ | 312.045 | 115.31 | 943 | 0 | 4.045 | 53.302 |
| పులిచింతల | 45.77 | 5.46 | 596 | 0 | 6.929 | 32.239 |

# నాసిరకం మందులతో పరేషాన్!

- తెలుగు రాష్ట్రాలకు సరఫరా అయ్యే మందుల్లో చాలా వరకు నాణ్యత లేనివే..
- 8 వేలకు పైగా మందుల నమూనాలను పరిశీలించిన కేంద్ర ఔషధ ప్రమాణాల సంస్థ
- అందులో 946 బ్యాచ్‌ల మందులు నాసిరకమైనవేనని వెల్లడి
- నాసిరకం మందులు తయారు చేస్తున్నవన్నీ ఉత్తరాది రాష్ట్రాల కంపెనీలే

**సాక్షి, అమరావతి:** అనారోగ్యం నుంచి కుదుటపడటానికి మందులు వేసుకుంటాం.. అయితే ఆ మందులే నాసిరకమైతే.. ఆ మందులే కొత్త జబ్బులు సృష్టిస్తే.. పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవడం కష్టం. ప్రస్తుతం మన తెలుగు రాష్ట్రాలకు సరఫరా అయ్యే మందుల్లో చాలా వరకు నాసిరకమని ఓ సర్వేలో తేలింది. దేశవ్యాప్తంగా పేద ప్రజలకు అందుతున్న మందుల్లో చాలా మందులు డొల్ల అని తేలింది. నాసిరకం మందులు మార్కెట్లోకి విపరీతంగా వస్తున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో... తాజాగా కేంద్ర ఔషధ నాణ్యతా నియంత్రణ ప్రమాణాల సంస్థ(సీడీఎస్‌సీఓ) దేశవ్యాప్తంగా మందుల నాణ్యతపై సర్వే చేసింది. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి సుమారు 8 వేలకు పైగా నమూనాలు సేకరించి కోల్‌కతాలోని జాతీయ డ్రగ్ ల్యాబొరేటరీలో పరీక్షించగా సుమారు 946 మందులకు సంబంధించి(బ్యాచ్‌లు) నాసిరకమైనవిగా తేలింది. దీన్నిబట్టి చూస్తే దేశవ్యాప్తంగా మందుల నాణ్యత, వాటి పరిశీలన, నియంత్రణ వంటివి ఆయా కంపెనీలు సరిగా పాటించడం లేదని అర్థమవుతోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వాలకు సరఫరా అయ్యే మందుల్లో 90 శాతం నాసిరకం మందులు చేస్తున్నట్టు తేలిన కంపెనీల నుంచే కొనుగోలు చేస్తుండటం గమనార్హం.

**ఉత్తరాది నుంచే ఎక్కువ నాసిరకం మందులు..**

తాజాగా జాతీయ డ్రగ్ సర్వేలో ఉత్తరాది రాష్ట్రాల్లో తయారయ్యే మందుల కంపెనీల నుంచే ఎక్కువ బ్యాచ్‌లు నాణ్యత లేకుండా వచ్చినట్టు తేలింది. మొత్తం 66 కంపెనీలకు సంబంధించి 946 బ్యాచ్‌లు ఎన్ఎస్‌క్యూ(నాట్ స్టాండర్డ్ క్వాలిటీ– నాసిరకమైన)విగా తేలాయి. ఇవే మందులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు సరఫరా అవుతుండగా.. ఆ మందులు ఇక్కడ సరఫరా అయి, రోగులు తిన్నాక కూడా ల్యాబొరేటరీకి పంపిన నిర్ధారణ రిపోర్టులు రావడం లేదు. ఆ కంపెనీలకు ఆయా రాష్ట్రాల్లో లైసెన్సులు ఉన్నాయా లేదా, అక్కడి డ్రగ్ అధికారులు నిర్ధారించారా లేదా, ఇక్కడ నుంచి ఎవరైనా ఔషధ నియంత్రణ అధికారులు అక్కడికి వెళ్లారా లేదా ఇలాంటివేమీ లేకుండానే ఆయా కంపెనీల నుంచి మందులు కొనుగోలు చేస్తున్నారు. వీటిని నిర్ధారించుకోకుండా కొనుగోలు చేయడంతో రోగులు భారీగా నష్టపోతున్నారు.

**ఇక్కడి కంపెనీలకు తీవ్ర ఇబ్బందులు**

ప్రధానంగా కొత్త రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ఫార్మా కంపెనీలకు మంచి అవకాశం కల్పించాల్సింది పోయి.. కొంతమంది నాయకులకు చెందిన కంపెనీల నుంచి మందులు కొనుగోలు కోసం రకరకాల ఇబ్బందులు సృష్టిస్తున్నారు. ఔషధ నియంత్రణ అధికారులు రకరకాల ఆంక్షలు విధించి కొత్త కంపెనీలను మూసుకునేలా చేసిన ఘటనలూ ఉన్నాయి. లైసెన్సులు, తనిఖీల పేరిట తీవ్రంగా వేధిస్తున్నారు. ఉత్తరాదిన ఉత్పత్తి అయ్యే కంపెనీల నుంచి కొంతమంది కమీషన్లు తీసుకుని ఇక్కడి చిన్న చిన్న కంపెనీలను వేధిస్తున్నట్టు ఆరోపణలున్నాయి.

**తెలుగు రాష్ట్రాలకు మందులు సరఫరా చేసిన కంపెనీల పేర్లను తాజాగా సీడీఎస్‌సీఓ విడుదల చేసింది. ఆ జాబితా ఇది..**

| కంపెనీ | రాష్ట్రం | నాసిరకం బ్యాచ్‌ల సంఖ్య |
|---|---|---|
| యూనిక్యూర్ ఇండియా లి. | ఢిల్లీ | 61 |
| హేల్‌వుడ్ ల్యాబొరేటరీస్ | గుజరాత్ | 48 |
| మెడిపాల్ ఫార్మ లి. | హిమాచల్‌ప్రదేశ్ | 20 |
| కర్నాటక యాంటీబయోటిక్స్ | కర్నాటక | 15 |
| నోరిస్ మెడిసిన్స్ | గుజరాత్ | 14 |
| మోడ్రన్ ల్యాబొరేటరీస్ | మధ్యప్రదేశ్ | 13 |
| బయోజెనెటిక్స్ డ్రగ్స్ లి. | హిమాచల్‌ప్రదేశ్ | 08 |
| ఏలూరి ఫార్ములేషన్స్ | తెలంగాణ | 08 |
| వివేక్ ఫార్మకెమ్ ఇండియా | రాజస్థాన్ | 07 |
| భారత్ పేరెంటరల్స్ | గుజరాత్ | 06 |
| మైక్రాన్ ఫార్మస్యూటికల్స్ | గుజరాత్ | 06 |


మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి
రాష్ట్రీయం
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం | సెప్టెంబర్ | 3 | 2017
www.sakshi.com



## సెల్ఫీతో కామెర్లను గుర్తించవచ్చు!



రక్తంలోకి బైలిరూబిన్ అనే పదార్థం ఎక్కువగా విడుదల కావడం వల్ల వచ్చే కామెర్ల వ్యాధిని ముందుగా గుర్తించడం కష్టం. రక్త పరీక్ష చేస్తేగానీ గుర్తించలేని ఈ వ్యాధిని.. కేవలం ఓ సెల్ఫీతో గుర్తించవచ్చుట. అదీ ముందుగానే. వాషింగ్టన్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు ఇందుకు సంబంధించి ఓ యాప్‌ను అభివృద్ధి చేశారు. ఈ యాప్‌లోని కెమెరాతో సెల్ఫీ దిగితే.. మనకు కామెర్ల(జాండీస్) వ్యాధి వచ్చే అవకాశముందా? లేదా? అనే విషయాన్ని ముందుగానే గుర్తించి చెబుతుందట. ఈ విషయమై యూనివర్సిటీ శాస్త్రవేత్త ఒకరు మాట్లాడుతూ.. 'జాండీస్ రావడానికి ముందు మనిషి కళ్లలో అనేక మార్పులు సంభవిస్తాయి. వాటిని గుర్తించి, విశ్లేషించి వందశాతం సరైన సమాచారం అందించేలా ఈ యాప్‌ను అభివృద్ధి చేశాం. అంతేకాదు పాంక్రియాటిక్ కేన్సర్‌ను కూడా ముందుగానే గుర్తించవచ్చు. గుర్తించిన వెంటనే చికిత్స చేయించుకుంటే ప్రాణహాని తప్పుతుంది' అని ఆయన అన్నారు.

## ఈ రోబో ట్రాఫిక్ రూల్స్ పాటిస్తుంది!



మాసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు కొత్తరకం రోబోను తయారుచేశారు. సామాజిక అవగాహన వ్యవస్థ (సోషల్ అవేర్‌నెస్ నావిగేషన్)తో కూడిన ఈ రోబో.. ఎంతటి రద్దీ ప్రాంతంలోనైనా ఎవరినీ ఢీకొట్టకుండా సాగిపోతుందట. అంతేకాదు ట్రాఫిక్ నియమాలను కూడా కచ్చితంగా పాటిస్తుందని చెబుతున్నారు. వాహనం నడిపే డ్రైవర్ ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఎలా పరిశీలిస్తూ ముందుకు సాగుతాడో ఈ రోబో కూడా అచ్చంగా అలాగే పరిస్థితులను బట్టి ముందుకు సాగిపోతుందట. బోస్టన్ ట్రాఫిక్ రూల్స్ ప్రకారం.. రోడ్డుకు కుడి వైపునే ప్రయాణించడం, ఎడమవైపు నుంచి ఓవర్‌టేక్ చేయడం, వాహనానికి, వాహనానికి మధ్య ఉండాల్సిన గ్యాప్‌ను కొనసాగించడం, ఎరుపు, ఆకుపచ్చ సిగ్నల్స్ పడినప్పుడు ఆగడం, ముందుకు కదలడం వంటి నియమాలను కచ్చితంగా పాటిస్తుందని చెబుతున్నారు. పరిస్థితులను అంచనా వేసుకుంటూ నిర్ణయాలు తీసుకునే ఇటువంటి రోబోల రూపకల్పనతో భవిష్యత్తులో మరెన్నో ప్రయోజనాలున్నాయని పరిశోధకులు చెబుతున్నారు.

**3**

ఒక అధ్యయనం ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 20-54 ఏళ్ల గ్రూపులో కొలోన్, రెక్టల్ కేన్సర్ మరణాల రేటు 2004లో లక్ష మందికిగానూ 3.9 ఉండగా, 2014 నాటికి 4.3కి చేరింది.



# బాలికపై గ్యాంగ్‌రేప్, హత్య!

- విజయనగరం జిల్లాలో దారుణ ఘటన
- స్కూలుకు వెళ్తున్న సమయంలో అడ్డగింత
- బాలికను భయపెట్టి నలుగురు అత్యాచారం
- అందరికీ ఎక్కడ చెబుతుందోనని గొంతునులిమి హత్య
- మృతదేహాన్ని చెరువులో పారేసిన వైనం
- నిందితులను పట్టుకుని పోలీసులకు అప్పగించిన స్థానికులు



ఇందు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో) మృతురాలు ఇందు (ఫైల్)

పార్వతీపురంటౌన్/సీతానగరం

మహిళల రక్షణకు నిర్భయ లాంటి చట్టాలు చేసినా కామాంధులు రెచ్చిపోతూనే ఉన్నారు. ప్రతీరోజు దేశంలో ఏదో ఒక చోట కామాంధుల చేతిలో మహిళలు బలైపోతూనే ఉన్నారు. తాజాగా ఓ దారుణ ఘటన విజయనగరం జిల్లాలో కలకలం రేపింది. సీతానగరం మండలంలోని గాదెలవలసలో పదోతరగతి చదువుతున్న విద్యార్థినిపై నలుగురు యువకులు సామూహికంగా లైంగికదాడి చేసి అనంతరం ఆమెను హత్యచేశారు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. జిల్లాలో కలకలం రేపిన ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. బొబ్బిలి మండలం రెడ్డియ్యవలస గ్రామానికి చెందిన మిరియాల ఇందు సీతానగరం మండలంలోని గాదెలవలసలో 10వ తరగతి చదువుతోంది. రోజూ మాదిరిగానే శుక్రవారం పాఠశాలకు వచ్చిన ఆమె మధ్యాహ్నం భోజనం చేసేందుకు సైకిల్‌పై ఇంటికివెళ్లింది. ఇంటినుంచి తిరిగి పాఠశాలకు వస్తుండగా మార్గమధ్యలో గాదెలవలసలోని వైన్‌షాపు సమీపంలో పోతల శంకరరావు అనే యువకుడు ఆమెను ఆపి మాటలతో భయపెట్టి తన కోరిక తీర్చాలని బెదిరించాడు. అదే క్రమంలో గేదెలవలస, బడేవలస మధ్యన వున్న మామిడితోటలోకి ఆ బాలికను తీసుకొని వెళ్లాడు. తనతోపాటు తన మిత్రులు సొంగల లోకేశ్, చుక్క రాంబాబు, కోదేటి రవితేజలను కూడా అక్కడికి రప్పించాడు. అనంతరం వారంతా బాలికపై లైంగికదాడికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని ఎక్కడ చెబుతుందోనని ఆమె గొంతును లిమి హత్యచేసి... మృతదేహాన్ని సమీపంలోవున్న వంగపండు చెరువులో పడేసి వెళ్లిపోయారు.

**ప్రత్యక్ష సాక్షి సమాచారంతో..**

స్కూలుకు వెళ్లిన కుమార్తె సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో బాలిక తల్లిదండ్రులు మిరియాల శ్రీనివాసరావు, సత్యవతి గాదెలవలస వచ్చి విచారించారు. ఇందుతో శంకరరావు మధ్యాహ్నం 1.45 గంటల ప్రాంతంలో మాట్లాడినట్లు, ఇందును బెదిరించినట్లు ప్రత్యక్ష సాక్షి పి.అచ్చుత్ వారికి తెలిపారు. వెంటనే వారు గ్రామ పెద్దలతో కలసి శంకరరావును గట్టిగా నిలదీశారు. జరిగిన విషయాన్ని శంకరరావు పెద్దల ముందు ఒప్పుకున్నాడని, తనతోపాటు మరో ముగ్గురు కలసి అత్యాచారం చేసిన అనంతరం హత్యచేసి చెరువులో పారేసినట్లు పెద్దల ముందు అంగీకరించాడని గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న బొబ్బిలి డీఎస్పీ సౌమ్యలత, సీఐ గోవిందరావు, ఎస్ఐ సాయికృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని ఇందు మృతదేహాన్ని చెరువులోంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం బొబ్బిలి తరలించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఇందు మృతికి కారణమైనవారిని కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.



మాట్లాడుతున్న కమలానంద భారతి స్వామీజీ

## దైవంతోనే మానవ మనుగడ

### కమలానంద భారతి స్వామీజీ

**బాలాయపల్లి:** మానవ మనుగడ దైవంతోనే ముడిపడి ఉందని కమలానంద భారతి స్వామీజీ పేర్కొన్నారు. బాలాయిపల్లి మండలం అలిమిలి సమీపంలోని కనుము రాయుడు కొండపై గల లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి శనివారం ఆయన సంపూర్ణ గ్రామ దేవాలయ సందర్శనా రథయాత్ర కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ భవంతుడు లేకపోతే మనిషి జీవించలేడన్నారు. అనంతరం అలిమిలి, మన్నూరు గ్రామాల్లోని ఆలయాలను దర్శించి యాగహోమ విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో లక్ష్మీ నరసింహస్వామి ఆలయం చైర్మన్ సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

## అప్పల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

- పెరిగిపోయిన అప్పులు
- దిక్కుతోచక పురుగు మందు తాగిన వైనం



శివకుమార్ (ఫైల్)

**బనగానపల్లె రూరల్ :** అప్పుల బాధ తాళలేక ఓ యువ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కర్నూలు జిల్లా బనగానపల్లెలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. పట్టణంలోని తెలుగుపేటకు చెందిన వెంకటయ్య ,లక్ష్మిదేవి దంపతుల పెద్ద కుమారుడు మంజుల శివ కుమార్ (30) ఆరెకరాల వ్యవసాయ భూమిని 2015లో కౌలుకు తీసుకున్నాడు. ఏడాదికి రూ.65 వేలు కౌలు చెల్లించేలా మూడేళ్లకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. పెట్టుబడి కోసం రూ.4 లక్షల వరకు అప్పు చేసి రెండేళ్లుగా వరి పంట వేశాడు. పంట దిగుబడి సక్రమంగా రాలేదు. దీంతో అప్పు ఎలా తీర్చాలా అని తరచూ మథన పడేవాడు. ఈ నేపథ్యంలో వరి సాగు కోసం పొలాన్ని సిద్ధం చేసేందుకు శుక్రవారం రాత్రి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. అక్కడే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శనివారం ఉదయం చుట్టుపక్కల పొలాల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. శివకుమార్‌కు మూడేళ్ల క్రితం వివాహమైంది. భార్య చంద్రకళ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. కౌలు రైతు గుర్తింపు కార్డు లేకపోవడంతో బ్యాంకుల్లో రుణం తీసుకోలేకపోయాడు. మృతుని సోదరుడు శివశంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## డైరీలో సంతకం లేదని చితకబాదిన టీచర్

### సాలూరు ప్రైవేటు స్కూల్‌లో ఘటన



బుగ్గలపై గాయాలతో తరుణ్

**సాలూరు:** పాఠశాల డైరీలో తల్లిదండ్రుల సంతకాలు చేయించని రెండో తరగతి విద్యార్థి చెంపల్ని పగలగొట్టిన ఉపాధ్యాయిని ఘటన విజయనగరం జిల్లా సాలూరులో చోటు చేసుకుంది. విద్యార్థి తండ్రి రామకృష్ణ శనివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక చాడావారి వీధిలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో కొంకివీధికి చెందిన జగ్గేన తరుణ్ రెండో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం తరుణ్ ఇంటికి వచ్చేటపుడు రెండు బుగ్గలు కందిపోయి గాయాలై ఉండడంతో గమనించిన తల్లి.. పాఠశాలకు వెళ్లి ఇదేమని టీచర్లను ప్రశ్నిస్తే, క్షమాపణలు చెప్పి ఊరుకున్నారు. విద్యార్థి మాట్లాడుతూ టీచర్ డైరీలో సంతకాలు పెట్టించలేదని రెండు బుగ్గలపై దెబ్బలు కొట్టినట్టు తెలిపాడు. విద్యార్థి తండ్రి మాట్లాడుతూ వేలాది రూపాయల ఫీజులు చెల్లించి, ప్రైవేటు పాఠశాలలకు పిల్లలను పంపిస్తే, తీవ్రంగా కొట్టి పంపిస్తారా? అంటూ మండిపడ్డారు. మళ్లీ మరో విద్యార్థికి ఇలా జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. పాఠశాల హెచ్ఎం కాశినాయుడును వివరణ కోరగా జరిగిన తప్పిదంపై విద్యార్థి తల్లిదండ్రులకు క్షమాపణలు కోరామని తెలిపారు.

## జీవో 64ను రద్దు చేయండి

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్

**సాక్షి, అమరావతి:** వ్యవసాయ విద్యా ప్రమాణాలను దెబ్బతీసే జీవో నంబర్ 64ను రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆయన శనివారం లేఖ రాశారు. ఈ జీవో రద్దు కోసం వ్యవసాయ కళాశాలల విద్యార్థులు నెల రోజులుగా ఆందోళన చేస్తున్నా పట్టించుకోకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్) అక్రిడిటేషన్ ఉన్న వ్యవసాయ కళాశాలల నుంచి పట్టా పొందిన వారికే వ్యవసాయ శాఖలో ఉద్యోగాలు ఇవ్వాలని, దీనికి సంబంధించి 17 ఏళ్లుగా అమల్లో ఉన్న జీవో నంబర్ 16ను కొనసాగించాలని కోరారు. నకిలీ రాయుళ్లను కాపాడేందుకు ప్రస్తుత వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ జూలై 27న హడావిడిగా జీవో తెచ్చారని ఆరోపించారు.

## అపోలో సీట్ల భర్తీలో సాంకేతిక సమస్యలు

**సాక్షి, అమరావతి:** అపోలో వైద్య కళాశాలలోని ఎంబీబీఎస్ సీట్ల భర్తీలో పలువురు అభ్యర్థులు సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. అపోలో వైద్య కళాశాలకు సుప్రీంకోర్టు అనుమతి మేరకు సీట్లు వచ్చిన విషయం తెలిసిందే. ఈ కళాశాలలో ఉన్న 150 సీట్లకు 75 సీట్లు కన్వీనర్ కోటా (ఎ–కేటగిరీ) కింద సీట్లకు ఈనెల 2 నుంచి 3వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట వరకూ గడువిచ్చారు. అయితే పలువురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా ఓటీపీ రాలేదు. చివరి అవకాశంగా భావిస్తున్న తమకు ఇలాంటి పరిస్థితి ఎదురు కావడం ఆందోళన కలిగిస్తోందన్నారు. దీనిపై ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.అప్పలనాయుడును వివరణ కోరగా.. ఇప్పటి వరకూ 1,700 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఒకవేళ ఏదైనా సమస్య వస్తే, వెబ్‌సైట్‌లో ఫోన్ నంబర్లు ఇచ్చామని, వాటికి ఫోన్ చేస్తే వెంటనే సమస్య పరిష్కరిస్తారని, ఫోన్ నంబర్లు స్పందించకపోతే అక్కడ ఇచ్చిన మెయిల్‌కు సమాచారం ఇవ్వచ్చునన్నారు. అవసరమైతే దరఖాస్తుకు మరో గంట సమయం పొడిగిస్తామన్నారు.

# ర్యాగింగ్ భూతానికి అంతమెప్పుడు?



విద్యార్థులతో మాట్లాడుతున్న డైరెక్టర్ ఆచార్య వీరంకి వెంకటదాసు

## జూనియర్లను కొట్టిన సీనియర్ విద్యార్థుల గుర్తింపు

- నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులపై చర్యలకు రంగం సిద్ధం
- 22 మంది సీనియర్లను గుర్తించిన అధికారులు

**నూజివీడు :** కృష్ణాజిల్లా, నూజివీడులోని ట్రిపుల్‌ఐటీ కాలేజీలో గతనెల 29న అర్ధరాత్రి సమయంలో జూనియర్లను కొట్టిన సీనియర్ ఇంజినీరింగ్ విద్యార్థులపై చర్యలకు రంగం సిద్ధమైంది. మొత్తం 22 మంది విద్యార్థులకు ఈ సంఘటనతో సంబంధంఉన్నట్లుగా అధికారులు తేల్చారు. వీరిలో ప్రధాన పాత్ర పోషించిన విద్యార్థులు ఆరుగురని, మిగిలిన వారు సహకరించారని తెలుసుకున్నారు. డైరెక్టర్ ఏర్పాటు చేసిన కమిటీ.. విచారణ పూర్తి చేసి దాడిలో పాల్గొన్న విద్యార్థుల జాబితాను తయారు చేసినట్లు తెలిసింది. ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా విద్యార్థులపై చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ ఆచార్య వీరంకి వెంకటదాసు తెలిపారు.

**సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్, ఎస్పీ**

ట్రిపుల్ ఐటీ కాలేజీ విద్యార్థుల తీరును కలెక్టర్ లక్ష్మీకాంతం, ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. విద్యాసంస్థలో ఆందోళనలకు, నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. అవసరమైతే ట్రిపుల్ ఐటీలో 144 సెక్షన్ విధించేందుకు ఆదేశాలు ఇవ్వాలని కూడా నూజివీడు తహసీల్దారు దోనవల్లి వనజాక్షిని కలెక్టర్ ఆదేశించారు. పరిస్థితులను చక్కదిద్దాలని, దాడిచేసిన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని ఎస్పీ కూడా పోలీసు అధికారులను ఆదేశించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. జూనియర్ విద్యార్థులను సీనియర్లు కొట్టిన సంఘటన వివరాలను మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు వివరించినట్లు డైరెక్టర్ ఆచార్య వీరంకి వెంకటదాసు తెలిపారు.

- రాష్ట్రంలోని విద్యాలయాల్లో కొనసాగుతున్న ర్యాగింగ్ ఘటనలు
- ఇటీవల సంచలనం రేపిన నూజివీడు ట్రిపుల్ ఐటీ ఘటన
- బాధ్యులపై చర్యలంటూ హడావుడి చేస్తున్న ప్రభుత్వం, అధికారులు
- ర్యాగింగ్ నిరోధక చర్యలను పట్టించుకోని యాజమాన్యాలు
- ఘటన జరిగినపుడు హడావుడి.. ఆపై అంతా గప్‌చుప్



**సాక్షి, అమరావతి:** ర్యాగింగ్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తున్నా.. రాష్ట్రంలోని విద్యాలయాల్లో ర్యాగింగ్ భూతం రెక్కలు విప్పుతూనే ఉంది. గత కొద్దికాలంగా పలు ర్యాగింగ్ సంఘటనలు రాష్ట్రంలో బయటపడ్డాయి. అయితే కార్పొరేట్ కాలేజీల్లో జరుగుతున్న ఘటనలు ప్రభుత్వ సహకారంతో బయటకు రాకుండా తొక్కిపెడుతున్నారన్న విషయం తెలిసిందే. ఇటీవల నూజివీడు ట్రిపుల్ ఐటీలో జూనియర్ విద్యార్థులను సీనియర్లు చితకబాదిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనలో జూనియర్ విద్యార్థులు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రుల్లో చేరాల్సి వచ్చింది. ఇంత జరిగినా ఈ ఘటన బయటకు రాకుండా సంస్థ అధికారులు కప్పిపుచ్చే ప్రయత్నం చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చివరకు బయటకు పొక్కడంతో ఇప్పుడు ప్రభుత్వం, అధికారులు ఆదరాబాదరాగా ర్యాగింగ్ నిరోధక చర్యలంటూ హడావుడి చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం.. విచారణకు ఆదేశించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ట్రిపుల్ ఐటీ అధికారులను ఆదేశించింది.

**ర్యాగింగ్ నిరోధక చర్యలేవీ..**

రాష్ట్రంలో ర్యాగింగ్ ఘటనలు జరుగుతున్నా.. ప్రభుత్వం నుంచి కానీ, విద్యాసంస్థల యాజమాన్యాల నుంచి కానీ ర్యాగింగ్ నిరోధక చర్యలు పూర్తిస్థాయిలో చేపట్టడం లేదు. ఆయా ఘటనలకు కారకులైన వారిపై సరైన చర్యలు తీసుకోకపోతుండటంతో ర్యాగింగ్ ఘటనలు పునరావృతమవుతూనే ఉన్నాయి. సంఘటనలు జరిగిన కొద్దిరోజులు హడావుడి చేసి ఆ తరువాత ఆయా సంస్థలు, ప్రభుత్వం గప్‌చుప్ అయిపోతున్నాయి. గత కొంతకాలంగా రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలు, అనంతర చర్యలను చూస్తే ఇదే విషయం స్పష్టమవుతుంది.

**గతంలో జరిగిన ర్యాగింగ్ సంఘటనలు..**

- నాగార్జున వర్సిటీలో ఆర్కిటెక్చర్ విద్యార్థిని రిషితేశ్వరి ర్యాగింగ్ భూతానికి బలైపోయిన సంగతి విదితమే. రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపిన ఈ ఘటనలో దోషులను ప్రభుత్వం వెనకేసుకురావడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. అప్పటి కాలేజీ ప్రిన్సిపాల్ బాబూరావుపై ఆరోపణలు వెల్లువెత్తినా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించింది.
- కర్నూలు జిల్లా పాణ్యంలోని రాజీవ్‌గాంధీ మెమోరియల్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ఫస్టియర్ విద్యార్థిని ఉషారాణి.. ర్యాగింగ్ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంది.
- ఎస్వీ మెడికల్ కాలేజీలో ఫేర్‌వెల్ డే ప్రాక్టీస్ పేరుతో సీనియర్లు.. జూనియర్లను వేధింపులకు గురిచేయడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు.
- యోగి వేమన వర్సిటీలోని మహిళా వసతి గృహాల్లో సైన్స్ విభాగం సీనియర్ విద్యార్థినులు జూనియర్లను ర్యాగింగ్ చేశారు. దీనిపై బాధిత విద్యార్థినులు యూజీసీ ర్యాగింగ్ నిరోధక విభాగానికి ఫిర్యాదు చేయాల్సి వచ్చింది.
- నెల్లూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో గత ఏడాది సీనియర్ విద్యార్థులు జూనియర్లను వేధించడమే కాకుండా వారి మాట వినడం లేదని దాడులు చేసిన ఘటనలూ చోటుచేసుకున్నాయి.
- విశాఖపట్నంలో నారాయణ కాలేజీలో ర్యాగింగ్ ఘటనతో విద్యార్థులు పరస్పరం దాడులు చేసుకున్నారు. గుంటూరు జిల్లాలో తమకు ఆహారం పెట్టమని అడిగినందుకు ఏకంగా వారిపై నారాయణ కాలేజీ సిబ్బంది దాడి చేసి కొట్టారు.
- ఇలాంటి ఘటనలు పలు చోటుచేసుకుంటున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నందునే అవి పునరావృతమవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌కు మంత్రి గంటా ఫోన్**

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) వైస్ చాన్సలర్ రామచంద్రరాజు, నూజివీడు ట్రిపుల్ ఐటి డైరక్టర్‌తో మంత్రి గంటా శ్రీనివాసరావు ఫోన్లో మాట్లాడారు. ర్యాగింగ్ నిరోధానికి చర్యలు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ర్యాగింగ్ ఘటనలు, తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ర్యాగింగ్‌కు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు మంత్రి కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది.

## రాష్ట్రాన్ని అగ్రిహబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి

### వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి వెల్లడి

**రామవరప్పాడు (గన్నవరం):** రాష్ట్రాన్ని అగ్రిహబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయం, ఉద్యానం, పట్టుపరిశ్రమ, అగ్రిప్రోసెసింగ్ శాఖల మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. కృష్ణా జిల్లా రామవరప్పాడులోని శుభం కల్యాణ మండపంలో శనివారం ప్రపంచ కొబ్బరి దినోత్సవం సందర్భంగా సెంట్రల్ కోకోనట్ బోర్డు, రాష్ట్ర ఉద్యాన శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయం కంటే ఉద్యాన పంటల్లో ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. దేశంలో కొబ్బరి సాగులో రాష్ట్రం మూడో స్థానంలో ఉందని తెలిపారు. అనంతరం కొబ్బరిసాగుకు సంబంధించిన పుస్తకాలను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్ బి.ఎన్.ఎస్.మూర్తి, సీపీసీఆర్ఐ డైరెక్టర్ చౌడప్ప, ఉద్యాన శాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి, కోకోనట్ బోర్డు కార్యదర్శి నంది, సభ్యులు సంజీవ్‌కుమార్, హార్టీకల్చర్ అధికారులు పాల్గొన్నారు.

## శ్రీవారి బూందీపోటులో ప్రమాదం

### తిరుమల ఆలయం వెలుపల ఘటన



బూందీపోటు నుంచి ఎగిసిపడిన మంట, దట్టమైన పొగ

**సాక్షి, తిరుమల:** తిరుమల శ్రీవారి ఆలయం వెలుపల బూందీ పోటులో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు అగ్నిప్రమాదం జరిగింది. బూందీ తయారీకి వాడే బాండీలు (పెనం) అతివేడి కారణంగా మంటలు చెలరేగాయి. నెయ్యికి మండే స్వభావం ఉండటంతో మంటలు క్షణాల్లోనే ఎత్తుకు ఎగిసిపడ్డాయి. తక్షణమే అప్రమత్తమైన పోటు సిబ్బంది డ్రై కెమికల్ పౌడర్ (డీసీపీ)తో మంటలు ఆర్పి వేశారు. గ్యాస్ సరఫరా ఆపివేశారు. పోటు సిబ్బంది క్షేమంగా బయటపడ్డారు. సమాచారంతో అక్కడికి ఫైరింజన్ కూడా చేరుకుంది. తర్వాత డిప్యూటీ ఈవో కోదండ రామారావు, పోటు పేష్కార్ అశోక్ ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మూడు బాండీలు కాలినట్టు గుర్తించి వాటిని తొలగించారు. వెంటనే పునురుద్ధరణ చర్యలు చేపట్టారు. గంట వ్యవధిలోనే తిరిగి బూందీ తయారీ ప్రారంభించారు. బూందీ పోటులో ఎటువంటి అగ్నిప్రమాదం జరగలేదని, బాండీల్‌కు అంటుకుని ఉన్న నెయ్యి వ్యర్థాలు మాత్రమే కాలాయని కోదండ రామారావు తెలిపారు. ఈ ఘటనలో ఎటువంటి ఆస్తి నష్టం జరగలేదన్నారు.

## మదనపల్లె ఎస్‌బీఐ ఏటీఎంలో భారీ చోరీ

- రూ. 23 లక్షలకుపైగా నగదు అపహరణ
- సీసీ కెమెరాలు ధ్వంసం
- గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం తెరిచి దోపిడీ
- ఆలస్యంగా స్పందించిన ఏజెన్సీ సిబ్బంది



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



గ్యాస్‌కట్టర్‌తో ధ్వంసం చేసిన ఏటీఎం

**మదనపల్లె క్రైం:** మదనపల్లె పట్టణంలోని నక్కలదిన్నె తండాలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో శనివారం పట్టపగలే భారీ చోరీ జరిగింది. బెంగళూరుకు వెళ్లే జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఈ ఏటీఎం నుంచి సుమారు రూ. 23 లక్షల నగదు అపహరించారు. ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఈ భారీ చోరీ జరగడంతో అంతా విస్తుపోతున్నారు. స్థానికంగా తీవ్ర కలకలం రేపిన ఈ సంఘటనకు సంబంధించి డీఎస్పీ చౌడేశ్వరి, సీఐ నిరంజన్‌కుమార్, ఎస్‌బీఐ మేనేజర్ కేఎస్ఆర్ మూర్తి కథనం మేరకు.. వారం క్రితం రైటర్స్ ఏజెన్సీ సిబ్బంది నక్కలదిన్నె తండా ఏటీఎంలో రూ. 30 లక్షలు డబ్బు పెట్టారు. శనివారం ఉదయం 11:20 గంటలకు ఏటీఎం డౌన్ అయినట్లు ఆ ఏజెన్సీకి ఎస్ఎంఎస్ అలర్టు వచ్చింది. ఈ ఏటీఎం కాకుండా మదనపల్లె డివిజన్‌లలోని మరో 10 ఏటీఎంలు కూడా డౌన్ అయినట్లు అదే సమయానికి సమాచారం వచ్చింది. ఆలస్యంగా మేలుకున్న ఆ సంస్థ సిబ్బంది సాయంత్రం 4 గంటలకు నక్కలదిన్నె తండా ఏటీఎం వద్దకు వచ్చి షట్టర్ తెరచి చూడగా చోరీ జరిగినట్లు ఆనవాళ్లు గుర్తించారు. వెంటనే బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ కేఎస్ఆర్ మూర్తికి సమాచారం ఇచ్చారు. ఆయన వచ్చిన తర్వాత రూ. 23 లక్షలు చోరీ అయినట్లు నిర్ధారించి పోలీసులకు సమాచారం అందించారు. దొంగలు పక్కా పథకం ప్రకారం ఏటీఎం చోరీ చేసినట్లు తెలుస్తోంది. ఏటీఎంకు సమీపంలోని మసీదుకు భారీ సంఖ్యలో చేరుకున్న ముస్లింలు ప్రార్థనలు చేస్తున్న సమయంలో ఈ చోరీ జరిగినట్లు భావిస్తున్నారు. దొంగలు ఏటీఎంలోకి చొరబడి సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను తెరచి నగదు చోరీ చేసినట్టు పోలీసులు గుర్తించారు. కాగా, సెక్యూరిటీ సిబ్బంది, పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటులో బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంపై గతంలో నోటీసులు ఇచ్చామని సీఐ తెలిపారు. అయినా వారు పట్టించుకోలేదన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి
మార్కెటింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ (e-టెండరు మరియు e-రివర్స్ వేలం) ప్రకటన
Roc.No. M1/831/MRKT/2017, తేది: 02-09-2017
మెసర్స్ MSTC e-టెండరు నం. TTD/17-18/ET/26 మరియు e-రివర్స్ ఆక్షన్ నం. మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్ TTD/17-18/RA/27. ద్వారా యాలకులు (ఇలాచి) 8mm సైజు (AGEB) 40,000 కి.గ్రా. (నాలుగు నెలల పరిమాణం) సేకరణ కోసం e-బిడ్లు కోరబడుచున్నవి. ఆసక్తి గల పాటదార్లు టెక్నో-కమర్షియల్ డాక్యుమెంట్లు, బయానా మరియు ట్రాన్‌శాక్షన్ రుసుంను రివర్స్ ఆక్షన్ తేదీకి కనీసం ఒక పని రోజు ముందు MSTC యొక్క ఏదేని కార్యాలయంకు దాఖలు చేయాలి. సాంకేతికంగా అర్హులైన పాటదార్లు E-రివర్స్ వేలంలో పాల్గొనుటకు అనుమతించబడతారు.
వివరమైన వేలం కేటలాగ్ : NIT నిబంధనలను MSTC వెబ్‌సైట్: www.mstcecommerce.com/ eprochome/ttd నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. తదుపరి వివరాల కోసం సంప్రదించండి: ఫోన్ నంబర్లు:0877-2264079. MSTC: మొబైల్ నం. 9666040607/9441487624.
బయానా: రూ. 16,87,000/-
e-టెండరు షెడ్యూలు తేది, సమయం: ధర బిడ్ దాఖలు : 08-09-2017న మ. 12:00 గం.వరకు,
e-రివర్స్ వేలం: 08-09-2017న మ. 2:00 గం. నుంచి సా. 4:00 గం.వరకు.
Roc. No.PR4/1247/Adv.No.203/PRO/2017, Dt: .09.2017
ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

w w w . s a k s h i . c

# మోదీ విస్త'రణం'

## నరేంద్ర మోదీ (ప్రధాని) రాయని డైరీ



మాధవ్ శింగరాజు

మధ్యాహ్నం ఫ్లయిట్‌కి చైనా వెళ్లాలి. ముందు ప్రమాణ స్వీకారాలు చేయించేస్తే, పోర్ట్‌ఫోలియోల సంగతి అమిత్‌షా చూసుకుంటాడు.

చైనాలో బ్రిక్స్ మీటింగ్. మీటింగ్‌కి వచ్చేవాళ్లంతా ప్రెసిడెంట్లు. నేనొక్కడినే ప్రైమ్ మినిస్టర్‌ని. ప్రత్యేకంగా కనిపించాలి.

ఫ్లయిట్ కుదుపులకు సూట్‌కేస్‌లోని బట్టలు చెదరకుండా లగేజీ సర్దమని చెప్పాను. మూడున్నర గంటల ప్రయాణానికి బట్టలకేం కాదని ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్ మినిస్ట్రీ నుంచి నివేదిక రావడానికైతే వచ్చింది కానీ నాకైతే డౌటే. ఎన్ని ఇంటెలిజెన్స్ రిపోర్టులు ఫెయిల్ కాలేదూ!

"దీనికి పెద్దగా ఇంటెలిజెన్స్ అవసరం లేదు సార్" అన్నాడు సుబ్రహ్మణ్యం జైశంకర్.

"దేనికి పెద్దగా ఇంటెలిజెన్స్ అక్కర్లేదు జైశంకర్" అని అడిగాను.

"అదే సర్.. మూడున్నర గంటల విమాన ప్రయాణానికి సూట్‌కేస్‌లో సర్దిన బట్టలకు ఏమీ కాదు అని చెప్పడానికి" అన్నాడు.

జైశంకర్ ఫారిన్ సెక్రటరీ. 'వెరీ ఇంటెలిజెంట్ ఫెలో' అని అతడి గురించి సుష్మా స్వరాజ్ ఎప్పుడో చెప్పినట్లు గుర్తు.



మయన్మార్‌లో వేసుకోవలసిన బట్టల బ్యాగ్ సపరేట్‌గా ఉంది. అక్కడేం సమ్మిట్ లేదు. మయన్మార్ ప్రెసిడెంట్‌తో కలిసి అక్కడా ఇక్కడా తిరగడమే. బట్టలతో ప్రాబ్లమ్ లేదు. ఆయన పేరుతోనే ప్రాబ్లమ్! సుష్మా స్వరాజ్‌కి ఫోన్ చేసి నా ప్రాబ్లమ్ చెప్పాను.

సుష్మ నవ్వారు. "పేరుతో పనేముంది మోదీజీ.. 'మిస్టర్ ప్రెసిడెంట్'.. 'మిస్టర్ ప్రెసిడెంట్' అంటూ ఉండండి చాలు" అన్నారు.

"అది ఓకే.. సుష్మాజీ, అక్కడున్న రెండు రోజుల్లో ఒక్కసారైనా ఆయన్ని పేరుతో సంబోధిస్తే సంతోషిస్తారు కదా.. భారత ప్రధానికి తన పేరు గుర్తుందని.." అన్నాను.

"నిజమే మోదీజీ.. అయితే పొరపాటున మీరాయన్ని మిస్టర్ 'హ్యాటిన్ జా' అనబోయి మిస్టర్ 'జా హ్యాటిన్' అనే ప్రమాదం ఉంది" అన్నారు సుష్మ.

"అందులో ప్రమాదం ఏముంది సుష్మాజీ!" అని అడిగాను.

"జా హ్యాటిన్ అనే ఆయన బర్మా ఆర్మీ చీఫ్. చనిపోయి పదేళ్లవుతోంది మోదీజీ" అన్నారు సుష్మ. 'వావ్..! సుష్మాజీ' అనుకున్నాను. బ్రిలియంట్ తను.

"కానీ సుష్మాజీ.. ఇంకో ప్రాబ్లమ్ కూడా ఉంది. మయన్మార్ ప్రెసిడెంట్ ఒక మగవాడు అన్న విషయమే నాకు గుర్తుండడం లేదు" అన్నాను.

సుష్మ పెద్దగా నవ్వారు. "ఎక్స్‌టర్నల్ అఫైర్స్ మినిస్టర్‌ని నాకే గుర్తుండడం లేదు మోదీజీ. తల నిండా పూలు పెట్టుకున్న ఆంగ్ సాన్ సూకీ నే ఎప్పటికీ నాకు మయన్మార్ ప్రెసిడెంట్‌లా అనిపిస్తుంటారు" అన్నారు.

నవ్వాను. "సుష్మాజీ.. ఎప్పటికీ మీరే మా ఎక్స్‌టర్నల్ మినిస్టర్" అన్నాను.

---

## త్రికాలమ్



కె. రామచంద్రమూర్తి

ఈ రోజు ఉదయం జరగనున్న మంత్రిమండలి పునర్నిర్మాణం బీజేపీకీ, ప్రధాని నరేంద్ర మోదీకీ అత్యంత ప్రధానమైనది. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు ముందు జరుగుతున్న చివరి పూర్తి స్థాయి విస్తరణ ఇది. దీని తర్వాత భాగస్వామ్య పక్షాల ప్రతినిధులను చేర్చుకునేందుకు కొన్ని చేర్పులు ఉండవచ్చు కానీ ఇంత పెద్ద కుదుపు ఉండదు. విస్తరణ తర్వాత రూపొందే కొత్త మంత్రిమండలి పనితీరుపైనే 2019 ఎన్నికలలో ఎన్‌డీఏ సాధించే ఫలితాలు ఆధారపడి ఉంటాయి. మంత్రుల రాజీనామాల గురించీ, కొత్తగా చేరబోయే మంత్రుల గురించీ రకరకాల వదంతులు వింటున్నాం. ప్రభుత్వం ఎటువంటి ప్రకటనా చేయలేదు. రాజీనామా చేసిన మంత్రులలో ఒకరు అవినీతి ఆరోపణల కారణంగా వైదొలగవలసి వస్తున్నదని అంటున్నారు. అవినీతి మంత్రి పేరు మాత్రం వెల్లడి కాలేదు. ఇటీవల ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా మట్లాడుతూ, 'మాది కాంగ్రెస్ ప్రభుత్వం కాదు లీకులు ఇవ్వడానికి. మేం మీడియా మిత్రులను ఆశ్చర్యపర్చుతాం. ఒక్క వెంకయ్యనాయుడి విషయంలోనే మీరు ముందుగా చెప్పగలిగారు. కోవింద్ విషయంలో కానీ ఇంకా అనేక ఇతర సందర్భాలలో కానీ మీడియా జోస్యం నిజం కాలేదు. ఇప్పుడు కూడా అంతే'అన్నారు. ఈ సారి ప్రధాని కంటే పార్టీ అధ్యక్షుడు ఎక్కువ క్రియాశీలకంగా ఉండటం విశేషం. మంత్రుల రాజీనామాలను ప్రధాని కార్యాలయం(పీఎంఓ) కాకుండా అమిత్‌షా ఫోన్ చేసి అడుగుతున్నారు. మంత్రివర్గ విస్తరణ సందర్భంలో 54 ఏళ్ళ కిందటి కామరాజ్ తర్వాత ఒక పార్టీ అధ్యక్షుడు అంతటి కీలకమైన భూమిక పోషించడం ఇదే ప్రథమం. మూడేళ్ళుగా తన మంత్రుల పనితీరును ప్రధాని శ్రద్ధగా గమనిస్తూ వచ్చారు. రెండువారాల పాటు వివిధ మంత్రిత్వ శాఖలను నిర్వహిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీలనూ, జాయింట్ సెక్రటరీలనూ ప్రధాని, పీఎంఓకు చెందిన ముఖ్యమైన అధికారులూ కలుసుకొని సుదీర్ఘంగా చర్చలు జరిపారు. దీనికి తోడు ఇంటెలిజెన్స్ నివేదికలు తెప్పించుకున్నారు. బీజేపీ పక్షాన పనిచేస్తున్న సోషల్ మీడియా యంత్రాంగం ద్వారా సమాచారం సేకరించారు. మూడు వ్యవస్థల నుంచి అందిన సమాచారాన్ని కాచి వడబోసే బాధ్యతను అమిత్‌షాకి అప్పగించారు. ఆయనకు రాజ్‌నాథ్‌సింగ్, అరుణ్‌జైట్లీ, సుష్మాస్వరాజ్‌లు సహకరించారు. ఇది కాకుండా మథురలోని బృందావన్‌లో జరుగుతున్న మూడు రోజుల ఆర్ఎస్ఎస్ సమన్వయ సమితి సమావేశాలలో పాల్గొన్న అమిత్‌షా సంఘ్ ప్రముఖుల అభిప్రాయాలు సేకరించారు. విస్తరణ గురించి ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్‌తో అమిత్‌షా సవివరంగా చర్చించారు. చివరికి నరేంద్ర మోదీతో శనివారం రాత్రి సమాలోచనలు జరిపి తుది జాబితా రూపొందించారు. నిరుడు జులైలో విస్తరణ జరిగినప్పుడు ఇంత విస్తృత సమాలోచనలు లేవు. అప్పుడు 19 మంది కొత్తవారికి అవకాశం ఇచ్చారు. ప్రకాశ్ జావదేకర్‌ను సహాయ మంత్రి హోదా నుంచి కేబినెట్ హోదాకు పెంచారు. ఐదుగురు సహాయ మంత్రులకు ఉద్వాసన చెప్పారు. చడీచప్పుడు లేకుండా జరిగిపోయింది. ఈ సారి రెండురోజులుగా వివిధ నాయకులతో అమిత్‌షా చర్చిస్తున్నారు.

### తలలేని ముఖ్యమైన శాఖలు

వెంకయ్యనాయుడు రాజీనామా, మనోహర్ పారీకర్ రక్షణశాఖను వదిలేసి గోవా ముఖ్యమంత్రిగా వెళ్ళిపోవడంతో పట్టణాభివృద్ధి, సమాచార, ప్రసార శాఖలూ, రక్షణ శాఖా ఇతర మంత్రులకు అదనపు శాఖలుగా చేరాయి. కీలకమైన ఈ శాఖలకు సమర్థులైన మంత్రులను నియమించవలసిన అవసరం ఉన్నది. ఈ సారి మార్పులు చేర్పులకు నిర్దిష్టమైన మార్గదర్శకాలు నిర్ణయించుకున్నారు. ఒకటి, అవినీతి మరక అంటిన వారికి ఉద్వాసన చెప్పడం. రెండు, ప్రధాని అత్యంత ముఖ్యమైనవిగా పరిగణిస్తున్న కార్యక్రమాలను (ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాంలు) ఉద్యమసదృశంగా నడిపించ లేనివారిని గుర్తించి తొలగించడం. మూడు, మంత్రులు చూపుతున్న చొరవనూ, వారి సృజనాత్మకతనూ, వారు సాధిస్తున్న ఫలితాలనూ అధ్యయనం చేసి మూల్యాంకన చేయడం. నాలుగు, 2019 లోపు శాసనసభ ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలకు ఎక్కువ ప్రాతినిధ్యం ఇవ్వడం. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రిని తొలగించినట్టు రూఢి కాని వార్తలు ప్రచారంలో ఉన్నాయి. నిప్పు లేకుండా పొగ రాదని భావిస్తే ఈ ఆరోపణలలో ఎంతో కొంత నిజం ఉంటుందని అనుకోవాలి. ఇది మోదీ ప్రభుత్వానికి అప్రదిష్ట. ప్రస్తుతానికి రహస్యంగా ఉంచినప్పటికీ కాలక్రమేణా వివరాలు వెలుగులోకి రావచ్చు. మంత్రి పేరు వెల్లడి కావచ్చు. రాజీనామా చేసిన వారిలో రాజీవ్‌ప్రతాప్ రూడీ, కల్‌రాజ్ మిశ్రా, దత్తాత్రేయలు మూడు ముఖ్యమైన శాఖలు నిర్వహిస్తున్నారు. రూడీది స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వశాఖ. మిశ్రాది మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ శాఖ. దత్తన్నది కార్మికశాఖ. యువతకు మెలకువలు నేర్పించి, వారి చేత చిన్న వ్యాపారాలో, పరిశ్రమలో పెట్టించి ఉపాధి కల్పించే కార్యక్రమాలు చేయవలసింది ఈ శాఖలే. లక్షల సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తానంటూ మోదీ 2014 ఎన్నికల ప్రచారంలో ఊదరకొట్టారు. ఉద్యోగాల కోసం యువతరం మూడేళ్ళుగా ఎదురు చూస్తోంది. కనీసం స్కిల్స్ నేర్పించి ఉపాధి కల్పించే ప్రయత్నమైనా జరిగిందా అంటే అదీ లేదు. 'నయా ఇండియా'నినాదంతో యుద్ధ ప్రాతిపదికపైన జరగవలసిన పనులు నత్తనడక నడుస్తుంటే వచ్చే ఎన్నికలలో ఎన్‌డీఏ యువతీయువకుల ఆగ్రహం చవి చూడవలసి వస్తుంది. ఈ మూడు శాఖల నిర్వహణ ఆశించిన విధంగా లేకపోవడంతో ముగ్గురు మంత్రులచేతా రాజీనామా చేయించారు. కల్‌రాజ్‌మిశ్రాకి 77 ఏళ్ళు. వయసు పైనపడింది కనుక బాధ్యతల నుంచి తప్పించవలసిందిగా తానే ప్రధానిని కోరినట్టు మిశ్రా చెప్పారు. 'బేటీ బచావ్, బేటీ పఢావ్'కూడా ప్రధాని ప్రతిష్ఠాత్మకంగా పరిగణిస్తున్న కార్యక్రమాలలో ఒకటి. ఈ కార్యక్రమం కుంటినడక మేనకా గాంధీ శాఖ మార్పిడికి గల కారణాలలో ఒకటి. 'స్వచ్ఛభారత్', 'మేక్ ఇన్ ఇండియా'కూడా మోదీ అట్టహాసంగా ప్రకటించిన కార్యక్రమాలు. ఇటువంటి 'ఫ్లాగ్‌షిప్'కార్యక్రమాల విజయంపైనే ఎన్‌డీఏ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. వాటిని తిరిగి ఎవరికి అప్పజెప్పాలనేది కీలకమైన అంశం. అందుకే సుదీర్ఘ సమాలోచన.

### నయా కామరాజ్ నాడార్ అమిత్‌షా

తొమ్మిదిమంది మంత్రులు రాజీనామా చేశారని కొన్ని చానళ్ళూ, ఏడుగురే చేశారని మరికొన్ని చానళ్ళూ చెబుతున్నాయి. శుక్రవారంనాడు రాజీనామా చేసిన మంత్రుల జాబితాలో ఉమాభారతి, నిర్మలాసీతారామన్ పేర్లు ఉన్నాయి. శనివారంనాడు మోహన్‌భాగవత్‌తో అమిత్‌షా సమావేశం ఫలితంగా ఉమాభారతి రాజీనామాను ఆమోదించకపోవచ్చునని అభిజ్ఞవర్గాల భోగట్టా. అట్లాగే నిర్మలా సీతారామన్‌కు సమర్థురాలైన మంత్రిగా పేరుంది. కాకపోతే మాట పెళుసు. ఆమెకు ఉద్వాసన చెప్పే ప్రసక్తి లేదు. పైగా ఆమెకు తమిళనాడులో బీజేపీ వ్యవహారాలను పర్యవేక్షించే అదనపు బాధ్యత అప్పగించవచ్చు. ఈ మధ్య జరిగిన వరుస రైలు ప్రమాదాలకు నైతిక బాధ్యత తీసుకుని రాజీనామా చేస్తానని చెప్పిన రైల్వే మంత్రి సురేశ్‌ప్రభుకు సమర్థుడిగా, నిజాయతీపరుడిగా మంచి పేరుంది. ఆయనకు రక్షణ శాఖను అప్పగించవచ్చు. నితిన్‌గడ్కరీ, పీయూష్ గోయెల్ వంటి కొందరు మంత్రులు దీక్షాదక్షతలతో పని చేస్తున్నారని ప్రధాని కార్యాలయం గుర్తించింది. గడ్కరీకి ఉపరితల రవాణా, జలరవాణాతో పాటు రైల్వే శాఖ కూడా అప్పగించే అవకాశం ఉన్నదని చెబుతున్నారు. రైల్వే బదులు పౌర విమానయాన శాఖ అప్పగించినా ఆశ్చర్యం లేదు. ఆయన సామర్థ్యంపై ఆర్ఎస్ఎస్ అధినేతకు అపార విశ్వాసం. మోదీని గడ్కరీ శనివారం రాత్రి కలుసుకున్నారు. ఏమి నిర్ణయించారో తెలియదు. కర్ణాటకలో వచ్చే సంవత్సరం ఏప్రిల్ –మేలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ రాష్ట్రం నుంచి ఇప్పటికే అనంతకుమార్ (బ్రాహ్మణ), సదానందగౌడ (వొక్కలిగ), రమేశ్ జిగజిగడి (దళిత్) మోదీ కేబినెట్‌లో ఉన్నారు. అనంతకుమార్ హెగ్డే (బ్రాహ్మణ)కు కూడా మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఉంది. హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ఈ యేడాది చివరలో జరగనున్నాయి. ఆ రాష్ట్రం నుంచి అనురాగ్ ఠాకూర్‌ను మంత్రిమండలిలోకి తీసుకోవాలన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చినట్టులేదు.



### తెలుగు రాష్ట్రాలకు మొండిచెయ్యేనా?

తెలుగు రాష్ట్రాల విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. విశాఖ లోక్‌సభ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు కుటుంబ సమేతంగా విజయవాడ నుంచి ఢిల్లీ వెళ్ళారు. తుది జాబితాలో ఆయన పేరు ఉన్నట్టు లేదు. చివరి క్షణంలో ఏమైనా మార్పులు జరిగితే ఆయనకు పదవి దక్కవచ్చు. రెండు రోజులుగా రామ్‌మాధవ్ పేరు ప్రచారంలోకి వచ్చింది. ఆయన కొలంబోలో తన ఆధ్వర్యంలోని 'ఇండియా ఫౌండేషన్'నిర్వహిస్తున్న 'ఇండియన్ ఓషన్ కాన్ఫరెన్స్'లో నిమగ్నమై ఉన్నారు. తెలంగాణలో బండారు దత్తాత్రేయ స్థానంలో ఎవరిని తీసుకుంటారనేది అస్పష్టం. కిషన్‌రెడ్డి, మురళీధరరావు పేర్లు చర్చకు వచ్చాయి. కిషన్‌రెడ్డి అసెంబ్లీలో బీజేపీ పక్ష నాయకుడు. మురళీధరరావు శనివారం రాత్రి వరకూ బెంగళూరులోనే ఉన్నారు. రాజస్థాన్‌లో నీటి పారుదల వ్యవహారాలలో ముఖ్యమంత్రి వసుంధరరాజేకు సలహాదారుడిగా పనిచేస్తున్న వెదిరె శ్రీరామ్ పేరు బుల్లితెర మీదికి వచ్చింది. బీజేపీ అందుబాటులో రెండు రాజ్యసభ స్థానాలు ఉన్నాయి. వెంకయ్యనాయుడు ఖాళీ చేసిన రాజస్థాన్ స్థానం, కేంద్రమంత్రి అనిల్ దవే అకాల మరణం కారణంగా మధ్యప్రదేశ్‌లో ఖాళీ అయిన స్థానం. ముగ్గురు తెలంగాణ నాయకులలో ఎవరికి అవకాశం ఇచ్చినా రాజ్యసభ సభ్యత్వం ఇవ్వాలి. ఎవ్వరికీ అవకాశం రాకపోయినా ఆశ్చర్యం లేదు.

ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలకు ఇప్పుడు అవకాశం లేనట్టు కనిపిస్తోంది. జేడీ(యూ) ఇటీవలే ఎన్‌డీఏ తీర్థం పుచ్చుకున్నా మోదీ ఇవ్వజూపుతున్న ఒక కేబినెట్ మంత్రి పదవి, మరో సహాయ మంత్రి పదవి ఆ పార్టీకి ఆమోదయోగ్యం కాదు. తమిళనాడు రాజకీయం రసకందాయంలో పడింది. ఏఐఏడీఎంకె భవిష్యత్తు అగమ్యగోచరం. పన్నీర్‌సెల్వం, పళనిస్వామి భుజాలు కలిపినప్పటికీ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి దినకరన్ సిద్ధంగా ఉన్నాడు. ఈ అయోమయ స్థితిలో ఏఐఏడీఎంకెని భాగస్వామ్యపక్షంగా చేర్చుకోవడమా, తమిళ కథ ఒక కొలిక్కి వచ్చే వరకూ వేచి చూడటమా అన్న సందిగ్ధంలో బీజేపీ నాయకత్వం కొట్టుమిట్టాడుతోంది. మొత్తం మీద జేడీ(యూ), ఏఐఏడీఎంకెలకు ఇప్పటికైతే అవకాశం రాకపోవచ్చు. తుది జాబితాలో ఈ పేర్లు ఉంటాయని అంచనా: శివప్రతాప్ శుక్లా (ఉత్తర ప్రదేశ్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు), అశ్వనీకుమార్ చౌబే (బస్తర్–ఛత్తీస్‌గఢ్), వీరేంద్రకుమార్ (మధ్యప్రదేశ్), అనంత్‌కుమార్ హెగ్డే (కర్ణాటక), ఆర్‌కె సింగ్ (బిహార్, కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి),హర్‌ప్రీత్‌సింగ్ పూరీ (ఐఎఫ్ఎస్ అధికారి, దౌత్య ఉద్యోగి), గజేంద్రసింగ్ శెఖావత్ (రాజస్థాన్), సత్యపాల్‌సింగ్ (యూపీ) అల్ఫోన్స్ కన్ననంతకన్ (కేరళ, ఐఏఎస్). కేవలం కులాల, ప్రాంతాల లెక్కలు కాకుండా సామర్థ్యానికీ, ప్రతిభకూ ప్రాధాన్యం ఇచ్చినట్టు కనిపిస్తున్నది. ఇది మంచి సంప్రదాయం. ప్రభుత్వం ఆశించిన లక్ష్యాలను సాధించే మంత్రిమండలి అవసరం. ఆ దశగా అడుగువేస్తున్నందుకు అభినందించాలి.

---

# పరిశుద్ధ గంగావతరణం ఎప్పుడు?



జయసూర్య

భారతీయ ఆధ్యాత్మిక జీవనం నదులను దైవంగా భావిస్తూ ఉంటుంది. నదీజలాలను సంపదగా పరిగణిస్తుంది. కానీ అభివృద్ధి పేరుతో జరుగుతున్న ఒక విధ్వంసం ఇలాంటి భావనను విచక్షణా రహితంగా చులకన చేయడమే విషాదం. పురోగతి అవసరమే. కానీ ప్రస్తుత శాస్త్ర, సాంకేతిక యుగం ఆ అభివృద్ధి పేరుతోనే ప్రకృతి వనరులను యథేచ్ఛగా కొల్లగొట్టే దుర్మార్గానికి ఒడిగడుతున్నది. నవనాగరికత కూడా మానవ మనుగడను ఒక సంక్షోభం దిశగా తీసుకుపోతోంది. లోపించిన దూరదృష్టి, భవిష్యత్ తరాల గురించి ఆలోచించకపోవడం, విపరీత జనాభా అలాంటి ప్రమాదాన్ని రోజురోజుకూ తీవ్రం చేస్తున్నాయి. పల్లెలు, పచ్చని పొలాలు కనుమరుగవుతున్నాయి. నగరాలు, పారిశ్రామిక వాటికలు విస్తరిస్తున్నాయి. ఫలితం– కాలుష్య మేఘాలతో పుడమి తల్లడిల్లుతోంది. ఇలాంటి విపత్తు కోరలలో గంగానది కూడా చిక్కుకుపోవడం తీవ్ర ఆందోళన కలిగించే వాస్తవం.

గంగామాతను విష కాలుష్య పరిష్వంగం నుంచి రక్షించాలని ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ తన వంతు కృషికి శ్రీకారం చుట్టిన మాట వాస్తవమే. జాతిపిత గాంధీజీ 150వ జయంతి లోపున (2019) గంగను కాలుష్య రహిత నదీమతల్లిగా ప్రక్షాళన చేయాలని ఆయన సంకల్పం. కానీ ఈ లక్ష్యాన్ని చేరడం సులభమా?

పేర్లు ఏవైనా గంగానది ప్రక్షాళన ప్రణాళిక మూడు దశాబ్దాలుగా కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నదే. కానీ సాధించినదేమీ కనిపించదు. 1986లో జలశుద్ధికి కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడం ఆరంభించారు. కానీ ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల మీదుగా ప్రవహించే ఈ మహోన్నత నది దుస్థితిని ఆ ప్రణాళిక ఏ విధంగాను మార్చలేకపోయింది. గంగోత్రి నుంచి ఉత్తర కాశీ వరకు 135 కిలోమీటర్ల ప్రాంతాన్ని కాలుష్యం నుంచి రక్షించడానికి 2010లో కేంద్ర ప్రభుత్వం ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించింది. అంతేకాకుండా, 2015–20 మధ్య శుద్ధి కార్యక్రమాన్ని పూర్తి చేసే ధ్యేయంతో జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, రూ. 20,000 కోట్లు కూడా కేటాయించింది. కానీ ఈ రెండు సంవత్సరాలలో, అంటే 2017 నాటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి, స్థానిక పాలక సంస్థల సాయంతో ఖర్చు చేసినది– రూ. 7,304 కోట్లు. అయినా గంగాతీరంలో ఉన్న 27 నగరాలు విసర్జించే వ్యర్థాలు, భక్తుల స్నానాలు, విసర్జనలు, మృతదేహాలు ఇప్పటికీ ఆ నదిని కాలుష్యం కోరలలోనే బంధించి ఉంచుతున్నాయి.



ఆసుపత్రుల వ్యర్థాలు, కర్మాగారాల నుంచి వచ్చే ప్రమాదకర రసాయనాలు ఆ నదిలో కలసిపోతూనే ఉన్నాయి. వీటిని అదుపు చేసే వ్యవస్థ ఇప్పటికీ సక్రమంగా లేదు. 497 క్లాస్ –1 నగరాలు నిత్యం తమ సమీపంలో ఉన్న నదులను కాలుష్యంతో నింపివేస్తున్నాయి. ఈ కాలుష్యం 38 బిలియన్ లీటర్లుగా అంచనావేశారు. ఆధ్యాత్మికవేత్త, హరిద్వార్ మైత్రీసదన్ ఆశ్రమ వాసి స్వామీ నిగమానంద (36) గంగాతీరంలో అక్రమ గనుల తవ్వకాలను నిలిపివేయాలని కోరుతూ 115 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేశారు. 2011, జూన్ 13న ఆయన తనువు చాలించారు. ఇది జరిగి ఆరేళ్లు కావస్తున్నది.

ప్రముఖ పర్యావరణ కార్యకర్త, న్యాయవాది ఎంసీ మెహతా మరో అడుగు ముందుకు వేసి గంగా కాలుష్య నివారణకు గట్టి చర్యలను కోరుతూ 1985లో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 1987లో ఈ కేసులో మొదటి తీర్పు వచ్చింది. కాన్పూర్‌లో ఉన్న రసాయనాలతో జంతు చర్మాలను శుభ్రం చేసే కర్మాగారాలను మూసి వేయించవలసిందని ఆ తీర్పులో సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. మరొక తీర్పులో నదీతీరంలోని మునిసిపల్ కార్పొరేషన్లు, స్థానిక సంస్థలు మురికినీటిని శుభ్రం చేసే ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కూడా అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. కానీ ముప్ఫయ్ ఏళ్లు గడిచినా ఇవేమీ ఆచరణకు నోచుకోలేదు. ప్రభుత్వాల నిస్సహాయతా, నిర్లక్ష్యం గంగను మరింత కలుషితం కావడానికి దోహదం చేస్తున్నాయి. ఈ వివాదం 2014లో సుప్రీంకోర్టు నుంచి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు బదిలీ అయింది. 2017, జూలై 13న ఈ ట్రిబ్యునల్ చైర్మన్ స్వతంత్ర కుమార్ కీలకమైన ఆదేశాలు జారీ చేశారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ మొదలు, ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ వరకు గంగా తీరంలో 100 మీటర్ల లోపున నిర్మాణాలను స్వతంత్ర కుమార్ బెంచ్ నిషేధించింది. 500 మీటర్ల లోపున చెత్తాచెదరం పారేయడం కూడా నిషేధించింది.

నిజానికి గంగతో పాటే భారతావనిలో ఉన్న చిన్నా పెద్దా దాదాపు 450 నదులకు చట్టబద్ధంగా రక్షణ కల్పించవలసిన అవసరం ఎంతో ఉంది. గంగ మృత్యు ముఖంగా ప్రవహిస్తున్నది. యమున మృతనదిగా మారిపోయింది. ఈ ఘోర వాస్తవాన్ని రెండేళ్ల క్రితమే కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు ప్రకటించింది. ఈ నేపథ్యంలో గంగను బతికించుకోగలమా అన్న ప్రశ్న సహజం. నీటిని పరిరక్షించుకోవడం దగ్గరైనా మన నిజాయితీగా వ్యవహరించపోతే, ఇంక ఈ దేశంలో దేనిని మనం రక్షించుకోగలం?

*వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్, సెల్ 9440664610*

---

# ఎదురు గాలిగా మారని ప్రభుత్వ వైఫల్యాలు

*పెద్ద నోట్ల రద్దుపై ఆర్‌బీఐ తాజా నివేదిక, అర్థిక వ్యవస్థ క్షీణతలను ప్రభుత్వ వ్యతిరేక పవనాలుగా మార్చవచ్చని ప్రతిపక్షాలు ఆశిస్తున్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ అల్ప ఆర్థిక వృద్ధి రేట్లతోనే విస్తృత జనాదరణను కలిగివుండి, పలుమార్లు విజయాలను సాధించారు. కాబట్టి కనీసం రాబోయే కొన్ని మాసాలపాటైనా మోదీ నిశ్చింతగా ఉండవచ్చు.*

## అవలోకనం



ఆకార్ పటేల్

గత వారం నేను బెంగళూరులో ఒక కళాశాలలోని పెద్ద హాలులో వెయ్యి మంది విద్యార్థుల బృందంతో మాట్లాడాను. వారిలో ఎక్కువ మంది ఆర్థికశాస్త్ర విద్యార్థులు. నాతో పాటూ ఇద్దరు పార్లమెంటు సభ్యులు కూడా వేదికపై ఉన్నారు. ''యూపీఏ అధికారంలో ఉన్న పదేళ్ల సగటు వృద్ధి కంటే గత మూడేళ్లలో స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) వేగంగా వృద్ధి చెందిందని మీలో ఎంత మంది అనుకుంటున్నారు?''అని శ్రోతలను ప్రశ్నించాను. జీడీపీ నేడు ఎక్కువ వేగంగా వృద్ధి చెందుతుందనుకునే వారిని చేతులెత్తమన్నాను. దాదాపుగా విద్యార్థులంతా చేతులెత్తారు. కానీ, యూపీఏ హయాంలో జీడీపీ సగటు వార్షిక వృద్ధి ఏడాదికి 8 శాతం. కాగా, ఆ తర్వాత గత మూడేళ్ల ఎన్‌డీఏ పాలనలో ఏ ఒక్క ఏడాదీ ఆ వృద్ధి రేటును అందుకోలేదనేది వాస్తవం. ముందే చెప్పినట్టుగా వాళ్లలో చాలా మంది ఆర్థికశాస్త్ర విద్యార్థులు కాబట్టి వారికి ఈ విషయం బాగా తెలిసి ఉండాల్సింది. కానీ, గణాంకాలను రాజకీయాల ఆధారంగా చర్చించడం, ప్రత్యేకించి మన దేశంలో కష్టం.

ఇటీవలి కాలంలోని రెండు ఘటనలను భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకమైన గాలిగా మార్చడానికి ఉపయోగించుకోవచ్చని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. కాబట్టే నేను ఈ విషయాన్ని చెప్పాల్సి వస్తోంది. ఒకటి, పెద్ద నోట్ల రద్దు విఫలమైందనే వార్త. దాదాపుగా రూ. 1,000, రూ.500 నోట్లన్నిటినీ రూ. 2,000, రూ. 500 నోట్లుగా మార్చేసుకున్నారు. అంటే నల్లధనం తెల్లధనంగా మారిపోయిందని అర్థం. బ్యాంకులలో డిపాజిట్ కాని కొన్ని లక్షల కోట్ల రూపాయల నల్లధనాన్ని వదుల్చుకోగలమని ప్రభుత్వం భావించి ఉండినట్టయితే, అది జరగలేదు. ఇక ఇప్పుడు నల్లధనం సమస్య పరిష్కారానికి ఉన్న దారి నోటీసులు జారీ చేయడం, పన్నులను తిరిగి రాబట్టడమే. మన దేశంలో ఇది అంత సులువూ కాదు, త్వరగా జరిగేదీ కాదు.

రెండు, పెద్ద నోట్ల రద్దు ఉగ్రవాదాన్ని లేదా భారత్‌లో ఉగ్రవాదంగా నిర్వచించేదాన్ని అణచడంలోను విఫలం కావడం. దేశంలోని సంఘర్షణాత్మకమైన మూడు ప్రాంతాలకు వెలుపల ఉగ్రవాద హింస వాస్తవానికి చాలా స్వల్పం. ఈ ఏడాది ఉగ్రవాదం వల్ల ఒకరు మృతి చెందితే, ముందటి ఏడాది 11 మంది, అంతకు ముందటి ఏడాది 13 మంది, ఇంకా ముందటి ఏడాది నలుగురు మాత్రమే మరణించారు. కానీ ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దుకు, ఉగ్రవాదానికి మధ్య సంబంధం గురించి ప్రస్తావించినప్పుడు.. అది మాట్లాడేది జమ్మూకశ్మీర్‌లోని



హింస గురించి. నోట్ల రద్దు కశ్మీర్‌లో హింసను తగ్గించిందని రక్షణమంత్రి చెప్పుకుంటున్నారు. అది జరిగిందా? లేదు. గత ఏడాది అక్కడ 267 మంది మరణించారు. ఈ ఏడాది ఎనిమిది నెలల్లోనే 239 మంది మరణించారు. అంటే ప్రభుత్వం చెబుతున్నట్టు నోట్ల రద్దు ఉగ్రవాదంపై ప్రతికూల ప్రభావాన్ని చూపలేదు.

మూడవది, చివరిది ప్రధాని అవినీతిని అరికట్టడానికి నోట్ల రద్దు సమర్థవంతమైన మార్గమని చెప్పారు. అది అత్యున్నత స్థానాలలోని అవినీతికి సంబంధించినది కాదు. ఇప్పటికే ఆయన అందుకు హామీని కల్పించారు. నగదు కొరత, ఇతర చోట్ల అవినీతిని అరికడుతుందని ఆయన అన్నారు. దీనికి సంబంధించి నా వద్ద గణాంక సమాచారం లేదు కాబట్టి, పాఠకులే అది జరిగిందో లేదో నిర్ణయించాలి.

ఇక ప్రతిపక్షానికి ఉత్సాహాన్ని కలుగజేసిన మరో అంశం, ఆర్థిక వ్యవస్థ క్షీణిస్తున్నదనేది. దీనికి సంబంధించి మనవద్ద గణాంక సమాచారం ఉంది కాబట్టి, దీన్ని కచ్చితంగా చెప్పగలం. గత ఐదు త్రైమాసికల కాలంలోని ప్రతి త్రైమాసికానికీ మన ఆర్థిక వ్యవస్థ క్షీణిస్తోంది. అంటే 15 నెలలుగా అది మందగిస్తూ ఉందని అర్థం. ఏప్రిల్, జూన్ మధ్య ఆర్థిక వ్యవస్థ 5.7 శాతం మాత్రమే వృద్ధి చెందిందని ప్రభుత్వ గణాంక సమాచారం తెలుపుతోంది. మీరు గనుక ప్రభుత్వ మద్దతుదార్లయితే, వస్తు సేవల పన్ను, సరుకుల నిల్వలను తగ్గించుకోవడం ఇందుకు కారణమని చెబుతారు. అంటే జీఎస్‌టీ అమల్లోకి వచ్చాక ఉత్పత్తుల ధరలను నిర్ణయించేదెలాగో కంపెనీలకు కచ్చితంగా తెలియక జూన్‌లో వారు వస్తూత్పత్తిని నిలిపివేశారని, జూలై 1న జీఎస్‌టీని ప్రకటించాక గోదాములను ఖాళీ చేశారని అర్థం. మీరు ప్రభుత్వ ప్రత్యర్థులైతే ఈ క్షీణతకు కారణం జీఎస్‌టీ, నోట్ల రద్దు రెండింటి మిశ్రమ ఫలితమని అంటారు. న్యాయవాది అరుణ్ జైట్లీకి, రాజకీయశాస్త్రంలో కరస్పాండెన్స్ కోర్స్ డిగ్రీని పొందిన నరేంద్ర మోదీకి భిన్నంగా ఆర్థికశాస్త్రవేత్త అయిన మునుపటి ప్రధాని మన్మోహన్‌సింగ్... నోట్ల రద్దు వల్ల దేశ జీడీపీకి 2 శాతం పాయింట్ల మేరకు హాని కలుగుతుందని చెప్పారని, ఆయన అంచనా సరైందని రుజువైందని అంటారు. బహుశా ఆయన సరిగ్గానే చెప్పి ఉండొచ్చు. అయితే, ఆ పక్షానికి, ఈ పక్షానికి చెందని మన బోటి వాళ్లకు... ఆర్థిక వ్యవస్థ ఐదు త్రైమాసికల పాటూ వరుసగా మందగిస్తున్నదంటే అది ఏ ఒక్క దాని ఫలితమో కాదని స్పష్టమే. ఈ ప్రభుత్వ ఆర్థిక నిర్వహణకు సంబంధించి మౌలికంగానే ఏదో లోపం ఉంది.

కాబట్టి ప్రతిపక్షం ఈ వాస్తవాలు, గణాంకాల ఆధారంగా ప్రభుత్వాన్ని ఒక మూలకు నెట్టేసి దెబ్బతీయగలమని, అందువలన తమకు సానుకూలత ఉంటుందని అనుకోగలదా? లేదు, అనే నా సమాధానం. చాలా తక్కువ ఆర్థిక వృద్ధిని మాత్రమే అందించినా, అత్యంత జనాదరణ కలిగిన నేతలుగా ఉన్నవారు మనకు ఉన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ 5 శాతం కంటే తక్కువ వృద్ధితోనే పలుమార్లు విజయాలు సాధించారు.

నరేంద్ర మోదీ పెద్ద నోట్ల రద్దు కథనాన్నే మార్చివేశారనేది రెండో అంశం. ఆయన చెప్పిన విషయాలన్నిటినీ మరచిపోయారు. ఆయన ఇప్పుడు డిజిటల్, నగదు రహిత చెల్లింపుల వంటి ఇతర విషయాలపైకి మళ్లారు. ఆయనపైన మీరు ఎన్ని ఆరోపణలనైనా చేయవచ్చుగానీ, రాజకీయంగా తప్పులు చేస్తున్నారని మాత్రం అనలేదు. 2014 తర్వాత కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల కారణంగా తమ జీవితాలు భౌతికంగా మారాయని ఎందరు భావిస్తున్నారని నేను ఆ వెయ్యి మంది విద్యార్థులను అడిగాను. దాదాపుగా అంతా చేతులు పైకెత్తారు. అది జరుగుతున్నంత కాలమూ, కనీసం రాబోయే కొన్ని నెలల పాటైనా నరేంద్ర మోదీ నిశ్చింతగా ఉండవచ్చు.

*వ్యాసకర్త కాలమిస్టు, రచయిత*

*ఈ-మెయిల్: a a*

---


## జైలు భోగులు

చట్టం ముందు అందరూ సమానులే. కారాగారంలో మాత్రం కాదు. నిన్న మొన్న అరెస్టయిన గుర్మీత్ రామ్‌రహీమ్‌బాబా సింగ్ సహా ఏడుగురి కేసులు ఈ విషయాన్ని బల్లగుద్ది చెబుతున్నాయి. డేరాబాబా అయితే తన 'దత్తపుత్రిక'హనీప్రీత్‌ను తను ఉన్న జైలు గదిలో ఉండడానికి అనుమతించాలని, ఆమె చేసే మర్దన తప్పితే మరొకటి తన ఒంటికి సరిపడదని కోర్టును వేడుకున్నాడు. డేరాబాబాకు ఏసీ గది ఇచ్చారని వార్తలు వచ్చాయి. తరువాత వాటిని అధికారులు ఖండించారనుకోండి! ఇంకా శశికళ, లాలూప్రసాద్, సుబ్రతారాయ్, అమర్‌సింగ్, బీబీ జాగీర్ కౌర్, మను శర్మ – వీరంతా కూడా జైలులో భోగాలు అనుభవించిన వారే. ఇందులో ఒకరిద్దరు మాత్రం భారీ ఆర్థిక నేరాల వారు గానీ, మిగిలిన వాళ్లు హత్యల స్థాయి నేరాలు చేసిన వాళ్లే. టీవీలు, ఏసీలు, ప్రత్యేక వంటగదులు ఇలా ప్రత్యేక సౌకర్యాలు దక్కాయి వీరికి.

## గ్రహం అనుగ్రహం

శ్రీహేవిళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, తిథి శు.ద్వాదశి ఉ.9.53 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం ఉత్తరాషాఢ ఉ.9.37 వరకు, తదుపరి శ్రవణం, వర్జ్యం ప.11.32 నుంచి 1.26 వరకు, దుర్ముహూర్తం సా.4.31 నుంచి 5.22 వరకు, అమృతఘడియలు రా.10.58 నుంచి 11.45 వరకు

## నమాజ్ వేళలు



| | | |
|---|---|---|
| ఫజర్ | : | 4.49 |
| జొహర్ | : | 12.15 |
| అసర్ | : | 4.41 |
| మగ్రీబ్ | : | 6.28 |
| ఇషా | : | 7.41 |

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం : 6.11
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083



శనివారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఇడుపులపాయలో నివాళులర్పిస్తున్న ప్రతిపక్షనేత వైఎస్ జగన్

# మహానేతకు ఘన నివాళులు

- ఇడుపులపాయలో ప్రత్యేక ప్రార్థనలు
- హాజరైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, అభిమానులు

**వేంపల్లె:** దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా శనివారం వైఎస్సార్ జిల్లా వేంపల్లె మండలం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు ఘనంగా నివాళుల ర్పించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉదయం 8 గంటలకు కుటుంబ సభ్యులతో కలసి వైఎస్సార్ ఘాట్‌కు చేరుకొని పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఫాస్టర్ నరేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న వైఎస్సార్ విగ్రహానికి జగన్ పూలమాల వేసి నివాళులర్పించారు.

**మహానేతకు ఘనంగా నివాళులు**

వైఎస్సార్ ఘాట్ వద్ద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు ఆయన సతీమణి వైఎస్ భారతిరెడ్డి, కుమార్తెలు హర్ష, వర్ష, షర్మిలమ్మ, బ్రదర్ అనిల్‌కుమార్, వారి కుమారుడు రాజారెడ్డి, కుమార్తె అంజలి ఘనంగా నివాళులర్పించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఒంగోలు ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పురుషోత్తమరెడ్డి, వైఎస్ సోదరులు వైఎస్ వివేకానందరెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మామ డాక్టర్ ఈసీ గంగిరెడ్డి, ఆయన సతీమణి ఈసీ సుగుణమ్మ, పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్ వైఎస్ ప్రమీలమ్మ, వైఎస్ వివేకా సతీమణి వైఎస్ సౌభాగ్యమ్మ, వైఎస్ భాస్కర్‌రెడ్డి సతీమణి వైఎస్ లక్ష్మమ్మ, వైఎస్ కొండారెడ్డి, ఈసీ దినేష్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్టీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి, కమలాపురం సమన్వయకర్త దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండా రాఘవరెడ్డి, వైఎస్ కొండారెడ్డి, రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు భార్య కేవీపీ సునీత, ప్రముఖ వైద్యుడు శివభరత్‌రెడ్డి తదితరులు వైఎస్‌కు నివాళుల ర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సాక్షి
రాష్ట్రీయం
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం I సెప్టెంబర్ I 3 I 2017
www.sakshi.com




**ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా టీబీ బ్యాక్టీరియా సోకిన జనాభా 200 కోట్లు. 2015లో ప్రపంచవ్యాప్తంగా 18 లక్షల మంది మరణించగా, కోటి మందికి పైగా జబ్బున పడ్డారు. టీబీ వ్యాప్తి అధికంగా ఉన్న 22 దేశాల్లో భారత్ ఒకటి. 83 శాతం కేసులు ఈ దేశాల్లోనే ఉన్నాయి.**



# ప్రతి గ్రామానికీ సచివాలయం







శనివారం పులివెందులలో 'వైఎస్సార్ కుటుంబం' కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వేదికపై మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి, ఎమ్మెల్సీ గోవింద రెడ్డి, ఎమ్మెల్యేలు రవీంద్రనాథ్ రెడ్డి, రఘురామి రెడ్డి, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్ వైఎస్ ప్రమీలమ్మ తదితరులు. భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు

## వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే పది మంది సిబ్బందితో ఏర్పాటు: జగన్

- 11 నుంచి అక్టోబరు 2 దాకా 'వైఎస్సార్ కుటుంబం' కార్యక్రమం
- అక్టోబర్ 27 నుంచి ఆరు నెలల పాటు జగన్ పాదయాత్ర

**91210 91210**
**నంబర్‌కు మిస్డ్ కాల్ ఇస్తే పార్టీ సభ్యత్వం**

సాక్షి ప్రతినిధి, కడప

'వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అధికార వికేంద్రీకరణతో జరిగే విప్లవాత్మక పాలనలో భాగంగా ప్రతి గ్రామంలో గ్రామ సెక్రటేరియట్ (సచివాలయం) ఏర్పాటు చేస్తాం. ఈ సెక్రటేరియట్‌లో గ్రామానికి చెందిన వివిధ సామాజిక వర్గాల వారికి పది మందికి ఉద్యోగాలు ఇస్తాం. మిస్డ్ కాల్ ద్వారా తమ సమస్యలు తెలియజేసుకున్న వారి సమస్యలు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తాం. ప్రజలు ఎమ్మెల్యేల చుట్టూ, మంత్రుల చుట్టూ తిరక్కుండా అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించే ఏర్పాటు చేస్తాం' అని ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ జిల్లా పులివెందులలోని వైఎస్సార్ ఆడిటోరియంలో శనివారం సాయంత్రం ఆయన 'వైఎస్సార్ కుటుంబం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని 'వైఎస్సార్ కుటుంబం'లో సభ్యులుగా చేయడానికి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఇంటింటికీ వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంపై శనివారం నుంచి ప్రారంభమైన శిక్షణ రాష్ట్రవ్యాప్తంగా బూత్ కన్వీనర్లకు ఈ నెల 11వ తేదీ దాకా కొనసాగుతుందని చెప్పారు. ఈ నెల 11వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ దాకా రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం జరుగుతుందని ప్రకటించారు. అక్టోబర్ 27వ తేదీన తాను ప్రారంభించే పాదయాత్ర ఆర్నెల్లపాటు జరుగుతుందని, ఈ యాత్ర ద్వారా చంద్రబాబు ప్రజా వ్యతిరేక పాలనను అంతం చేయడానికి అందరూ ఆశీస్సులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇంకా ఏమన్నారంటే...

### అది స్వర్ణ యుగం

''రాష్ట్రంలో ఎవరి దగ్గరికి పోయి వైఎస్ హయాంలో మీకు మేలు జరిగిందా? అని అడిగితే ప్రతి చెయ్యి అవునని పైకి లేస్తుంది. వైఎస్ హయాంలో ఎమ్మెల్యేలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు గర్వంగా ఊళ్లలోకి పోయే వాళ్లు. ఫలానా పని మేం చేశామని తలెత్తుకుని చెప్పేవారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఫించన్, రేషన్ కార్డు వచ్చేది. గ్రామాల్లో ఇళ్లు లేని వారే లేకుండా చేసేలా ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇచ్చాం. ప్రతి విద్యార్థికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చాం. అనారోగ్యం వల్ల పేదవారు అప్పుల పాలు కాకుండా ఉండేలా ఉచితంగా వైద్యం చేయించాం. అది వైఎస్ కాలపు స్వర్ణయుగమని గర్వంగా చెప్పవచ్చు. ఆ కాలాన్ని రాజన్న రాజ్యంగా ఇంకా గొప్పగా చెప్పుకుంటున్నారు. ఇప్పుడు గ్రామాల్లో పరిస్థితి ఏమిటి? ఎన్నికలప్పుడు చంద్రబాబు ప్రతి పేదవాడికి మూడు సెంట్ల స్థలం ఇస్తామన్నాడు. ఇల్లు కట్టిస్తామన్నాడు. జాబు కావాలంటే బాబు రావాలన్నాడు. జాబు ఇవ్వకపోతే ఇంటికి రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నాడు. మూడున్నర ఏళ్లలో ఇంటికి రూపాయైనా వచ్చిందా? ఇంటికి రూ.2 వేలు చొప్పున ఇప్పటికి 40 నెలలకు గాను ఒక్కో కుటుంబానికి రూ.80 వేలు నిరుద్యోగ భృతి బాకీ పడ్డాడు. బ్యాంకుల్లో పెట్టిన బంగారం ఇంటికి రావాలంటే, రూ.87,612 కోట్ల రైతు రుణాలు బేషరతుగా మాఫీ కావాలంటే బాబు ముఖ్యమంత్రి కావాలన్నాడు. మూడున్నర సంవత్సరాలైంది బంగారం మీ ఇంటికి వచ్చిందా? ఇప్పటి వరకు ఇచ్చిన రుణమాఫీ సొమ్ము వడ్డీకి కూడా సరిపోవడం లేదు. డ్వాక్రా రుణాలన్నీ బేషరతుగా మాఫీ కావాలంటే బాబు ముఖ్యమంత్రి కావాలన్నాడు. ఒక్క రూపాయి అయినా మాఫీ అయ్యిందా? ఏ వాగ్దానం కూడా నెరవేర్చని పరిస్థితి ఉంది. ఇలా చంద్రబాబు అన్ని వర్గాల వారిని మోసం చేశాడు. మనకు ఎలాంటి నాయకుడు కావాలి? మాట ఇస్తే మడమ తిప్పని, మాట మీద నిలబడే నాయకుడా? లేక బాబు లాగా జీవితంలో నిజం చెప్పని మాట మీద నిలబడని నాయకుడా?

### 11 నుంచి 2 దాకా 'వైఎస్సార్ కుటుంబం'

వైఎస్సార్ కుటుంబం కార్యక్రమానికి ఏ పేపర్లు తీసుకుని పోవాలి? ప్రజలకు ఏం చెప్పాలి? అనే విషయాలను 11వ తేదీ వరకు జరిగే శిక్షణలో వివరించి చెబుతారు. ఈ నెల 11వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు 20 రోజులపాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. గ్రామంలో బూత్ కమిటీలో 10 మంది ఉంటే ఒక్కొక్కరు రోజుకు రెండు కుటుంబాలను కలవాలి. ప్రతి బూత్ కమిటీ సభ్యుడు ప్రతి ఇంట్లో కనీసం 20 నిమిషాలు కూర్చొని వారితో మాట్లాడి చంద్రబాబు మూడున్నరేళ్ల పాలనకు సంబంధించి తయారు చేసిన 100 ప్రశ్నలకు వారితోనే మార్కులు వేయించాలి. వైఎస్సార్ హయాంలో జరిగిన మేలును గుర్తు చేయాలి. నవరత్నాల గురించి వివరించాలి. చంద్రబాబు మోసాలను, వైఎస్సార్ హయాంలో జరిగిన అభివృద్ధి.. సంక్షేమ పథకాలు, ఆయన స్వర్ణయుగం పాలన గురించి వివరించాలి. ఈ రకంగా చేసిన తర్వాత కుటుంబంలో కనీసం ఒక్కరి నుంచి 91210 91210 నంబరుకు మిస్డ్ కాల్ ఇప్పించాలి. ఇలా మిస్డ్ కాల్ ఇచ్చిన వెంటనే నా ఆఫీసుకు ఫోన్ వస్తుంది. రెండు మూడు రోజుల్లో మిస్డ్ కాల్ ఇచ్చిన ఫోన్ నంబరుకు నేరుగా ఫోన్ చేసి మాట్లాడి వివరాలు తీసుకుంటారు. ఫోన్ చేసిన వ్యక్తికి పింఛన్, రేషన్ కార్డు, ఇల్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ ఇలా ఏ సమస్య ఉన్నా రాసుకుంటారు. ఇలా చేస్తే రాష్ట్రంలోని కుటుంబాలు వైఎస్సార్ కుటుంబంలో సభ్యులవుతాయి. ఈ కార్యక్రమంతో చంద్రబాబు దిమ్మ తిరగాలి.

### మీ అందరి ఆశీస్సులు కావాలి

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ అమలు చేయని చంద్రబాబు రాష్ట్రానికి పట్టిన శని. ఆయన రాజకీయాల్లో ఉన్నంత కాలం రాజకీయాలకు విశ్వసనీయత ఉండదు. ప్రజలు చంద్రబాబును కాలర్ పట్టుకుని నిలదీసే రోజులు రావాలి. అప్పుడే ప్రజలకు మేలు జరుగుతుంది. ఇది జరగాలంటే ప్రతి కార్యకర్త ప్రతి ఇంటికి పోయి చంద్రబాబు చేసిన మోసాలను వివరించాలి. దివంగత వైఎస్ హయాంలో జరిగిన మంచి పనుల గురించి మరోసారి గుర్తు చేయాలి. మనం అధికారంలోకి రాగానే అమలు చేయబోయే నవరత్నాల పథకాల వల్ల జరిగే మేలు గురించి వివరించాలి. అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ సెక్రటేరియట్ (సచివాలయం) ఏర్పాటు చేసి ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కరించేలా విప్లవాత్మక మార్పులు తీసుకువస్తాం. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం నెలల తరబడి ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు. ఇలాంటి చంద్రబాబు పాలనను బంగాళాఖాతంలో కలిపేసేందుకు అక్టోబర్ 27వ తేదీ నుంచి నేను పాదయాత్ర ప్రారంభిస్తున్నాను. ఈ పాదయాత్ర ఆరు నెలలు జరుగుతుంది. ఈ పాదయాత్రతో చంద్రబాబు ప్రభుత్వాన్ని సాగనంపుదాం. ఇది ఒక్క జగన్ వల్లే అయ్యేది కాదు. జగన్‌కు మీ అందరి ఆశీస్సులు కావాలి. ప్రతి కార్యకర్త ఈ బాధ్యతను తమ భుజస్కంధాల మీద వేసుకుని నాకు అండగా నిలిచి చంద్రబాబు పాలనకు చరమగీతం పాడటంలో భాగస్వామ్యం కావాలి. వైఎస్సార్ స్వర్ణయుగం మళ్లీ తేవాలి.

## బాబు పాలన చూసి ఓట్లేయలేదు

చంద్రబాబునాయుడు ఉప ఎన్నికలో గెలిచామని సంబరపడిపోతున్నాడు. కానీ ఉప ఎన్నికలో ప్రజలు చంద్రబాబు మూడున్నరేళ్ల పాలనను చూసి ఓట్లేయలేదు. ఆయన రూ.200 కోట్లు ఖర్చు పెట్టారు. ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు కూడా ఓటుకు రూ.2 వేలు చొప్పున పంచాడు. ఓటేయకపోతే ఫించన్, రేషన్‌కార్డు కత్తిరిస్తామని, ఇల్లు రాకుండా చేస్తామని బెదిరించారు. పోలీసులను, అధికారులను అడ్డం పెట్టుకుని అధికార దుర్వినియోగం చేశాడు. ఆయనకు ఓటు వేయకపోయినా ఇంకా ఏడాదిన్నర అధికారంలో ఉంటాడు. తమకు ఇబ్బందులు వస్తాయనే భయంతో ఆయన ఇచ్చిన డబ్బులు తీసుకుని ఆయనకు ఓటేశారు. అంతే కానీ మూడున్నరేళ్ల పాలన బాగుందనో, ఎన్నికల సమయంలో ఆయన ఇచ్చిన హామీలు నిలుపుకున్నారనో కాదు'' అని జగన్ పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, అంజద్‌బాషా, కొరముట్ల శ్రీనివాసులు, ఎస్.రఘురామిరెడ్డి, పి.రవీంద్రనాథరెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి, పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్ వైఎస్ ప్రమీలమ్మ, బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త వెంకట సుబ్బయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్.పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.







శనివారం హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లో వైఎస్‌కు నివాళులర్పిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, పీఎన్‌వీ ప్రసాద్, ఆదిశేషగిరి రావు, దుర్గాప్రసాద్ రాజు, బి. సాయినాథ్ రెడ్డి, వెల్లాల రామ్మోహన్, నందమూరి లక్ష్మీ పార్వతి, పద్మజారెడ్డి, పుత్తా ప్రతాప్ తదితరులు



వైఎస్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లో చీరలు పంపిణీ చేస్తున్న చల్లా మధు, పార్థసారథి తదితరులు



వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా జొన్నవాడలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

# సువర్ణ పాలన

## వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో సజ్జల • చీరలు, బెడ్ షీట్లు పంపిణీ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేసి విజయం సాధించిన వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని, ఆయన పాలన ఒక సువర్ణయుగం అని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాజకీయ కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. వైఎస్సార్ కోట్లాది మంది తెలుగు ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న మహానేత అని కొనియాడారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం వైఎస్సార్ 8వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ ఏనాడు మాటలు చెప్పలేదని.. అభివృద్ధిని చేసి చూపించారని, ఆ చేతలే పేద ప్రజలకు అండగా నిలిచాయని చెప్పారు. వైఎస్సార్ వెళుతూ వెళుతూ మనకు ఓ వారసత్వం, భవిష్యత్తుకు అవసరమైన నాయకున్ని జగన్ రూపంలో ఇచ్చి వెళ్లారన్నారు. వైఎస్సార్ అలుపెరగని పోరాటం ఆయన వారసత్వంగా జగన్‌కు వచ్చిందన్నారు. రాబోయే కాలం మనది, కసితో ముందుకు పోదామని తెలుగు రాష్ట్రాల ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నానని చెప్పారు. ఈ మూడున్నరేళ్లలో బాబు చేసిందేమీ లేదని, అంతా మోసమేనని దుయ్యబట్టారు. నంద్యాల, కాకినాడ ఎన్నికల్లో పగలు, రాత్రి తేడా లేకుండా ఓటర్లను బెదిరించి, డబ్బులు వెదజల్లి వికృత క్రీడకు తెరలేపాడని ధ్వజమెత్తారు. ఈ అరాచకాలు చూసి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు నిరాశ పడాల్సిన అవసరం లేదని, మరింత కసితో పార్టీని ముందుకు తీసుకెళ్దామని తెలిపారు. ప్రతి పేదవాడి గుండెల్లో వైఎస్సార్ చిరస్మరణీయుడుగా ఉన్నారని పార్టీ అధికార ప్రతినిధి కె. పార్థసారధి చెప్పారు. రాజన్న రాజ్యం కోసం ప్రజలంతా ఎదురు చూస్తున్నారని పార్టీ ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు జి. ఆదిశేషగిరిరావు, పీఎన్‌వీ ప్రసాద్, ప్రసాద రాజు, బత్తుల బ్రహ్మానందరెడ్డి, వాసిరెడ్డి పద్మ, పుత్తా ప్రతాప్ రెడ్డి, చల్లా మధు, విజయచందర్, పద్మజా రెడ్డి, మరురు రామలింగారెడ్డి, భవనం భూషణ్, బి. మోహన్ కుమార్, తెలంగాణ ప్రాంత నాయకులు సింగిరెడ్డి భాస్కర్ రెడ్డి, మాదిరెడ్డి భగవంత్ రెడ్డి, బొడ్డు సాయినాథ్ రెడ్డి, బెంబడి శ్రీనివాస్ రెడ్డి, వెల్లాల రామ్మోహన్, పర్వతరెడ్డి బాలక్రిష్ణారెడ్డి, బీష్వ రవీందర్, పాలెం రఘునాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**చీరలు, బెడ్ షీట్లు పంపిణీ**

మహానేత వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేత పుత్తా ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కేంద్ర కార్యాలయంలో పెద్ద ఎత్తున చీరల పంపిణీ జరిగింది. చల్లా మధు అంధులకు రూ. 25 వేల చెక్ అందించారు. బెడ్ షీట్లు పంపిణీ చేశారు.

# జనహృదయ విజేతకు ఘన నివాళి

## రాష్ట్ర వ్యాప్తంగా పలు సేవాకార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు

**సాక్షి, నెట్‌వర్క్ :** మహానేత దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా శనివారం వైఎస్సార్ సీపీ శ్రేణులు, ఆయన అభిమానులు రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా అన్నదానాలు చేశారు. ఆస్పత్రుల్లో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. రక్తదాన శిబిరాలు నిర్వహించారు. కర్నూలు జిల్లాలో ఎంపీ బుట్టా రేణుక, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం పూసలపాడులో ఒంగోలు ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, చిత్తూరు జిల్లా తిరుపతిలో ఎంపీ వరప్రసాద్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమన కరుణాకరరెడ్డి, మదనపల్లిలో ఎంపీ మిథున్ రెడ్డి వైఎస్ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పలు మండలాల్లో జరిగిన సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పుత్తూరులోఎమ్మెల్యే ఆర్కే రోజా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖ జిల్లాలో పాడేరు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, అనంతపురం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ బాలాజీ చెరువు సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, రాజానగరంలో యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా తదితరులు పాల్గొన్నారు. పార్టీ గుంటూరు జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో పట్టణంలోని ఏరియా వైద్యశాలలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వేమూరు నియోజకవర్గంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ మేరుగ నాగార్జున ఆధ్వర్యంలో వైఎస్ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. గురజాల నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమాల్లో బీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జంగా కృష్ణమూర్తి పాల్గొన్నారు. విజయనగరం జిల్లా చినమేరంగిలో కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి రక్తదానం చేశారు. పార్వతీపురం నియోజకవర్గం బలిజిపేట మండలం గంగాడ గ్రామంలో తెలుగుదేశం సర్పంచ్ చిన్నోడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో కలసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలను వేసి జోహార్లు అర్పించారు. శ్రీకాకుళంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి శాంతి, పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు ధర్మాన కృష్ణదాస్, ఆమదాలవలసలో పార్టీ హైపవర్ కమిటీ సభ్యుడు తమ్మినేని సీతారాం, పాలకొండలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గం బేస్తవారి పేట మండలం పూసలపాడులో వైఎస్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తదితరులు



← కురుపాం నియోజకవర్గం చినమేరంగిలో రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో అత్యంత ఎక్కువ రోజులు (288) ఉండి రికార్డు సృష్టించిన నాసా వ్యోమగామి పెగ్గీ విట్సన్ తిరిగి భూమ్మీదికి రానున్నట్లు అమెరికా అంతరిక్ష సంస్థ నాసా వెల్లడించింది.



# మోదీ కేబినెట్‌కు కొత్తరక్తం

## కేంద్ర కేబినెట్‌లో తొమ్మిది కొత్త ముఖాలకు చోటు

### ఏపీ, తెలంగాణలకు మొండిచేయి! • జేడీయూ, అన్నాడీఎంకేలకు దక్కని చోటు

**న్యూఢిల్లీ:** చాన్నాళ్లుగా ఆసక్తి రేపుతున్న కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై సస్పెన్స్ వీడింది. నాలుగైదు రోజులుగా మంత్రి పదవులపై జరుగుతున్న చర్చకు తెరదించుతూ 9 మంది కొత్తవారికి అవకాశం ఇస్తూ ప్రధాని మోదీ, బీజేపీ చీఫ్ అమిత్ షా నిర్ణయం తీసుకున్నారు. వచ్చే ఏడాది హిమాచల్ ప్రదేశ్, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, 2019 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే కేబినెట్ పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఆదివారం ఉదయం 10.30 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ట్విటర్ ద్వారా వెల్లడించారు. ప్రధాన మంత్రి నాలుగు 'పీ' (అభిరుచి (ప్యాషన్), సామర్థ్యం (ప్రొఫిషియన్సీ), నైపుణ్యత (ప్రొఫెషనలిజం), రాజకీయ చతురత (పొలిటికల్ అక్యుమెన్)) ఫార్ములా ఆధారంగానే ఈ జాబితాను రూపొందించినట్లు భావిస్తున్నారు. కాగా, ఎన్డీయేలో చేరిన జేడీయూతోపాటుగా అన్నాడీఎంకే పార్టీకి కేబినెట్ విస్తరణలో చోటు దక్కలేదు. అటు, ఈ విస్తరణలో మరో బెర్తు దక్కుతుందని భావించిన శివసేన కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అయితే, తెలంగాణ, ఏపీలనుంచి కేబినెట్‌లో ఎవరికీ తాజా పునర్వ్యవస్థీకరణలో చోటు దక్కలేదు. కుటుంబంతో సహా రావాలంటూ ఏపీ బీజేపీ చీఫ్ హరిబాబుకు సమాచారం వచ్చినా.. తాజా జాబితాలో మాత్రం ఆయన పేరు ప్రస్తావించలేదు. అటు తెలంగాణ నుంచి బండారు దత్తాత్రేయ స్థానంలోనూ ఎవరికీ కేబినెట్ బెర్తు దక్కలేదు.

#### నలుగురు బ్యూరోక్రాట్లు

కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో.. అశ్విని కుమార్ చౌబే (బిహార్), శివ్ ప్రతాప్ శుక్లా (యూపీ), రాజ్ కుమార్ సింగ్ (బిహార్), వీరేంద్ర కుమార్ (మధ్యప్రదేశ్), అనంత కుమార్ హెగ్డే (కర్ణాటక), హర్‌దీప్ సింగ్ పూరీ (పంజాబ్), గజేంద్ర సింగ్ షెకావత్ (రాజస్తాన్), సత్యపాల్ సింగ్ (యూపీ), అల్ఫోన్స్ కణ్ణాంథనం (కేరళ)లకు చోటు దక్కింది. ఇందులో ఆర్కే సింగ్, హర్‌దీప్ సింగ్‌పురీ, సత్యపాల్ సింగ్, అల్ఫోన్స్‌లు అఖిలభారత సర్వీసుల్లో బాధ్యతలు నిర్వహించారు. అల్ఫోన్స్, హర్‌దీప్ సింగ్‌లు ఎంపీలు కారు. రాజీనామా చేసిన స్థానాలతోపాటుగా మంత్రులు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న శాఖల్లోనూ మార్పులు జరగనున్నాయి. పనితీరు సంతృప్తికరంగా ఉన్నవారికి ప్రమోషన్లతోపాటుగా.. అసంతృప్తులను అప్రాధాన్య శాఖల కేటాయింపు జరిగే అవకాశాలున్నాయి.



#### మార్పులు, చేర్పులపై సస్పెన్స్!

అయితే, సీనియర్ మంత్రుల శాఖల్లోనూ మార్పులుండొచ్చన్న నేపథ్యంలో పలువురు మంత్రులు నిర్వహిస్తున్న అదనపు బాధ్యతలను ఎవరికి కట్టబెడతారనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. సురేశ్ ప్రభు, నితిన్ గడ్కారీల్లో ఒకరికి కీలకమైన రక్షణ శాఖను కట్టబెట్టే యోచనలో మోదీ–షా ద్వయం ఉన్నట్లు తెలుస్తోంది. ఒక వేళ సురేశ్ ప్రభుకు రక్షణ శాఖను కేటాయిస్తే.. మరో కీలకమైన శాఖను గడ్కారీకి అదనంగా అప్పగించవచ్చని తెలుస్తోంది. కేంద్ర విద్యుత్ మంత్రి పీయూష్ గోయల్, పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, టెలికాం మంత్రి మనోజ్ సిన్హాలకు ప్రమోషన్‌లు లభించనున్నాయని సమాచారం. అయితే అంచనాలకు భిన్నంగా నిర్ణయాలు తీసుకునే మోదీ–షాలు.. శాఖల మార్పు విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారనేది ఆదివారం ఉదయమే తెలుస్తుందని పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా, శనివారం రాత్రి బీజేపీ కీలక నేతలతో మోదీ, షాలు భేటీ అయ్యారు. సుష్మ, రాజ్‌నాథ్, గడ్కరీ, జైట్లీ తదితర ప్రముఖులు ఈ సమావేశంలో హాజరయ్యారు.

#### రాజీనామా చేసిన మంత్రులు

కల్రాజ్ మిశ్రా, దత్తాత్రేయ, రాజీవ్ ప్రతాప్ రూడీ, సంజీవ్ కుమార్ బల్యాన్, ఫగన్‌సింగ్ కులస్తే, మహేంద్రనాథ్ పాండేలు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పార్టీ సీనియర్ నేత కల్రాజ్ మిశ్రా వృద్ధాప్యం కారణంగా రెండు నెలల క్రితమే తప్పుకోనున్నట్లు ప్రకటించారు. కేంద్ర మంత్రి ఉమాభారతి రాజీనామా చేసినా తుది నిర్ణయం తీసుకోలేదు.

#### జేడీయూ, అన్నాడీఎంకేలకు దక్కని చోటు

జేడీయూ కేంద్ర కేబినెట్‌లో చేరటంపైనా స్పష్టత రాలేదు. దీనిపై ఇప్పటి వరకు బీజేపీ తమతో చర్చలు జరపలేదని బిహార్ సీఎం నితీశ్ చెప్పారు. 'కేబినెట్‌లో జేడీయూ చేరిక గురించి చర్చలేమీ జరగలేదు. జేడీయూ కేంద్ర ప్రభుత్వంలో చేరుతోందనే వార్త మీడియా ద్వారానే నాకు తెలిసింది. దీని గురించి నాకు ఎలాంటి సమాచారం లేదు' అని నితీశ్ స్పష్టం చేశారు. అటు, అన్నాడీఎంకేలో అంతర్గత సమస్యలు పెరిగిపోవటంతో ఈ పార్టీ కేంద్ర ప్రభుత్వంలో చేరేందుకు ప్రధాన అవరోధంగా మారింది.

#### రెండో జాబితా వస్తుందా?

కేంద్రం గరిష్టంగా 81 మంది మంత్రులను నియమించుకోవచ్చు. ప్రస్తుతం ప్రధానితో సహా కేంద్ర మంత్రుల సంఖ్య 73. ఆరుగురు మంత్రులు రాజీనామా చేయటంతో ఈ సంఖ్య 67కు చేరింది. ఆదివారం 9 మంది మంత్రులు ప్రమాణ స్వీకారం చేస్తే.. కేంద్ర కేబినెట్ సంఖ్య 76కు చేరుతుంది. అంటే కేంద్రం మరో ఐదుగురిని నియమించుకునే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతానికి జేడీయూ సహా ఎన్డీయే మిత్ర పక్షాలకు తాజా విస్తరణలో చోటు దక్కనందున.. అన్నీ సర్దుకున్నాక త్వరలోనే మరో ఐదుగురికి మోదీ అవకాశం ఇస్తారా? అనేదీ ప్రశ్నార్థకమే. కాగా, రాజీనామా చేసిన కేంద్ర మంత్రులు అవినీతిలో కూరుకుపోయినందునే వీరిని తప్పిస్తున్నారా? అని కాంగ్రెస్ అనుమానం వ్యక్తం చేసింది.

## ఆరెస్సెస్ అసంతృప్తి!

**సాక్షి ప్రత్యేక ప్రతినిధి, న్యూఢిల్లీ:** కేంద్ర మంత్రి వర్గ విస్తరణపై రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. బృందావన్‌లో జరుగుతున్న ఆరెస్సెస్ కీలక సమావేశానికి బీజేపీ చీఫ్ అమిత్ షా హాజరయ్యారు. సమావేశాల సందర్భంగా ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, ఇతర సంఘ్ ముఖ్యనేతలతో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ, ప్రభుత్వం రూపొందించిన జాబితాపై చర్చించినట్లు సమాచారం. ఈ భేటీ కొందరు మంత్రులను తొలగించాలని మోదీ తీసుకున్న నిర్ణయంపై సంఘ్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆరెస్సెస్‌తో సుదీర్ఘ అనుబంధమున్న బండారు దత్తాత్రేయ.. తను తొలగించటంపై ఆరెస్సెస్ అధిష్టానానికి ఫిర్యాదుచేసినట్లు తెలిసింది. ఉమా భారతి కూడా తనను రాజీనామా చేయమని కోరటంపై ఆరెస్సెస్‌కు ఫిర్యాదు చేశారని.. వెంటనే జోక్యం చేసుకోమని కోరారని చర్చ జరుగుతోంది. నిర్మలా సీతారామన్‌ను ప్రమోట్ చేయటంపైనా సంఘ్ సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ కూడా ఈ విస్తరణపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. రాజీనామా చేసిన మంత్రుల్లో అధికులు తనకు దగ్గరివారయి ఉండటమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

**శివసేన అసంతృప్తి**

అటు ఎన్డీయే భాగస్వామి శివసేన కూడా మంత్రివర్గ విస్తరణపై అసంతృప్తితో ఉంది. 'కేబినెట్ విస్తరణ వార్త మీడియా ద్వారానే మాకు తెలిసింది. బీజేపీ నాయకత్వం దీనిపై నన్నేమీ అడగలేదు. అయినా అధికారంపై మాలో ఆతృత లేదు' అని శివసేన చీఫ్ ఉద్ధవ్ థాక్రే పేర్కొన్నారు.

## కొత్త మంత్రుల గురించి క్లుప్తంగా..

#### అనంత్‌కుమార్ హెగ్డే

కర్ణాటకలోని ఉత్తర కన్నడ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఐదోసారి ఎన్నికయ్యారు. విదేశాంగ వ్యవహారాలు, మానవ వనరుల అభివృద్ధి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల్లో సభ్యుడిగా ఉన్నారు. గ్రామీణాభివృద్ధి, గ్రామీణారోగ్యం, స్వయం సహాయక సంఘాలు తదితర రంగాల్లో సేవలందించే ఓ స్వచ్ఛంద సంస్థను నడుపుతున్నారు.

#### శివ ప్రతాప్ శుక్లా

ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈయన ఆ రాష్ట్రంలో గతంలో 8 ఏళ్లు మంత్రిగా పనిచేశారు. గ్రామీణాభివృద్ధి, విద్య, జైళ్ల శాఖల్లో సంస్కరణలు చేపట్టి మంచి పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం గ్రామీణాభివృద్ధిపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘంలో సభ్యునిగా ఉన్నారు.

#### సత్యపాల్ సింగ్

మాజీ ఐపీఎస్ అధికారి అయిన సింగ్ ప్రస్తుతం యూపీలోని బాగ్‌పత్ నుంచి ఎంపీగా ఉన్నారు. హోం శాఖ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా, లాభదాయక పదవుల సంయుక్త కమిటీ అధ్యక్షుడిగా ఉన్నారు. ఏపీ, మధ్యప్రదేశ్‌లలో నక్సలైట్ల నియంత్రణకు కృషిచేసినందుకు 1990లో ప్రత్యేక సేవా పతకాన్ని అందుకున్నారు. 1990ల్లో ముంబైలో వ్యవస్థీకృత నేర వ్యవస్థ నడ్డి విరిచినందుకు ప్రశంసలందుకున్నారు. ముంబై, పుణె నగరాల పోలీస్ కమిషనర్‌గానూ పనిచేశారు.

#### అశ్వినీ కుమార్ చౌబే

బిహార్‌లోని బక్సర్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం కేంద్ర జౌళి మండలిలో సభ్యుడైన చౌబే గతంలో బిహార్ శాసనసభకు వరసగా ఐదు సార్లు ఎన్నికయ్యారు. 1974–75లో లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో వచ్చిన బిహార్ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. రాష్ట్రంలో ఎనిమిదేళ్లపాటు పట్టణాభివృద్ధి, ప్రజారోగ్యం తదితర మంత్రిత్వ శాఖలు నిర్వహించారు.

#### రాజ్‌కుమార్ సింగ్

మాజీ ఐఏఎస్ అధికారి అయిన రాజ్‌కుమార్ ప్రస్తుతం బిహార్‌లోని ఆరా నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, సిబ్బంది, పింఛన్లు, ప్రజా ఫిర్యాదులపై ఏర్పాటైన వివిధ పార్లమెంటరీ స్థాయీ సంఘాల్లో సభ్యుడిగా ఉన్నారు. గతంలో కేంద్ర హోం శాఖ కార్యదర్శిగానూ పనిచేశారు.

#### వీరేంద్ర కుమార్

మధ్యప్రదేశ్‌లోని టికంగఢ్ ఎంపీ అయిన వీరేంద్ర ప్రస్తుతం కార్మిక సంక్షేమంపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘంలో సభ్యుడు. ఇప్పటికి ఆరు పర్యాయాలు లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆర్థిక శాస్త్రంలో ఎం.ఏ, బాల కార్మికులపై పీహెచ్‌డీ చేసిన ఆయన గతంలోనూ పలు పార్లమెంటరీ కమిటీల్లో సభ్యుడిగా పనిచేశారు.

#### హర్‌దీప్ సింగ్ పూరి

పంజాబ్‌కు చెందిన మాజీ ఐఎఫ్ఎస్ అధికారి అయిన హర్‌దీప్ సింగ్‌కు విదేశాంగ వ్యవహారాలపై మంచి పట్టుంది. ప్రస్తుతం ఆయన అభివృద్ధి చెందుతున్న దేశాలకు సంబంధించిన ఆర్ఐఎస్ అనే మేధో సంస్థకు అధ్యక్షుడిగా ఉన్నారు. గతంలో న్యూయార్క్‌లోని అంతర్జాతీయ శాంతి సంస్థకు ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.

#### గజేంద్ర సింగ్ షెకావత్

ప్రస్తుతం రాజస్తాన్‌లోని జోధ్‌పూర్ నుంచి ఎంపీగా ఉన్నారు. ఆర్థిక వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘంలో సభ్యుడిగా, ఫెలోషిప్ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా యువతకు చేరువగా ఉంటారు. బాస్కెట్‌బాల్‌లో జాతీయ స్థాయి పోటీల్లో ఆడారు. ప్రస్తుతం భారత బాస్కెట్‌బాల్ ఆటగాళ్ల సంఘం అధ్యక్షుడిగా ఉన్నారు.

#### ఆల్ఫోన్స్ కణ్ణాంథనం

కేరళకు చెందిన ఆల్ఫోన్స్ మాజీ ఐఏఎస్ అధికారి. ఢిల్లీ అభివృద్ధి సంస్థ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో 15 వేల అక్రమ నిర్మాణాలను కూల్చేసి పేరు తెచ్చుకున్నారు. తద్వారా 1994లో టైమ్స్ మేగజీన్ ప్రచురించిన 100 ప్రపంచ యువ నాయకుల జాబితాలో చోటు సంపాదించారు.

## సాహితీ సౌరభాలతో రైళ్ల పేర్లు



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా అవార్డు పొందిన సాహిత్యకారుల పేర్లను రైళ్లకు పెట్టాలని రైల్వే శాఖ యోచిస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను రైల్వేశాఖ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. సాహిత్యకారులు దేశంలో ఏ ప్రాంతానికి చెందిన వారో ఆ ప్రాంతంలో ప్రయాణించే రైళ్లకు వారి పేర్లను పెట్టాలని రైల్వే శాఖ భావిస్తోంది. తొలుత పశ్చిమబెంగాల్ నుంచి బిహార్‌కు వెళ్లే ఓ రైలుకు రచయిత్రి మహాశ్వేతాదేవీ పేరును పెట్టినట్లు రైల్వేశాఖ అధికారి తెలిపారు. ఇందుకు సంబంధించి రైల్వే శాఖ దేశవ్యాప్తంగా అవార్డు పొందిన సాహిత్యవేత్తల జాబితాను సిద్ధం చేసిందని, రైల్వే జోన్ల వారీగా రైళ్లకు పెట్టనున్నట్లు తెలిపారు. 2014లో కేంద్రంలో ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే కొన్ని రైళ్లు, రైల్వేస్టేషన్లు, రైల్ సర్క్యూట్స్, రైల్వే పథకాల పేర్లను మార్పు చేసింది. నాగ్‌పూర్ –ముంబై దురంతో ఎక్స్‌ప్రెస్ రైల్ పట్టాలు తప్పిన ఘటనలో చాకచక్యంగా వ్యవహరించి పెద్ద ప్రమాదం నుంచి ఎందరో ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన రైలు డ్రైవర్లను శనివారం రైల్వేశాఖ అవార్డుతో ఘనంగా సత్కరించింది.

## తమిళనాట 'నీట్' అలజడి

### విద్యార్థిని మృతితో మిన్నంటిన ఆందోళనలు



చెన్నైలో నినాదాలిస్తున్న ర్యాడికల్ స్టూడెంట్స్ యూత్ ఫ్రంట్ సభ్యులు

**సాక్షి ప్రతినిధి, చెన్నై:** వైద్య విద్య ప్రవేశ పరీక్ష నీట్‌ను వ్యతిరేకిస్తూ దళిత విద్యార్థిని అనిత ఆత్మహత్యకు పాల్పడటంతో తమిళనాడులో ఆందోళనలు మిన్నంటాయి. రాజకీయ పార్టీలు, ఇతర తమిళ సంస్థలు శనివారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. నీట్ నిర్వహణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. చెన్నై నగరంలో సీపీఎం, అనుబంధ విద్యార్థి, యువజన సంఘాలు రోడ్లను దిగ్బంధనం చేశాయి. దీంతో రాష్ట్ర పార్టీ యూనిట్ కార్యదర్శి జి. రామక్రిష్ణన్, మరికొందరు కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. కిల్పాక్‌లో నిరసనకు దిగిన వీసీకే పార్టీ కార్యకర్తలను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఓమంతురార్ ఎస్టేట్‌లో ప్రభుత్వ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద నిరసన ప్రదర్శనకు దిగిన ఓ విద్యార్థి విభాగం కార్యకర్తలను అరెస్టు చేశారు. తిరునల్వేలి జిల్లాలోని పలాయంకొట్టాయిలో 'నామ్ తమిజర్ కచ్చి' సంస్థ మహిళా సభ్యులు రోదిస్తూ నిరసన చేపట్టారు. అనిత సొంత జిల్లా అరియలూరులో బంద్ పాటించారు. కోయంబత్తూర్, సేలం, రామేశ్వరంలలో ఆందోళనలు జరిగాయి. 'నీట్' నుంచి తమిళనాడుకు మినహాయింపు దక్కదన్న బెంగతో విద్యార్థిని అనిత ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ప్రముఖుల సమక్షంలో ఆమె అంత్యక్రియలు జరిగాయి. అనిత కుటుంబానికి రూ.7 లక్షల పరిహారం ప్రకటించడంతోపాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని తమిళనాడు ప్రభుత్వం తెలిపింది.


## నేడు చైనాకు ప్రధాని

### బ్రిక్స్ సదస్సుకు హాజరుకానున్న నరేంద్ర మోదీ



**న్యూఢిల్లీ:** చైనాలో జరగనున్న బ్రిక్స్ దేశాల సదస్సు నుంచి ఫలవంతమైన చర్చలు, సానుకూల ఫలితాల కోసం ఎదురుచూస్తున్నానని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. బ్రిక్స్ సదస్సు కోసం నేడు చైనాకు బయల్దేరి వెళ్లనున్న సందర్భంగా ఆయన ప్రకటన విడుదల చేశారు. 'గోవా బ్రిక్స్ సదస్సు ద్వారా సాధించిన ఫలితాలు తెలుసుకునేందుకు ఆసక్తిగా ఉన్నాను. శాంతి, భద్రత, ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్ల పరిష్కారంలో బ్రిక్స్ కూటమి ముఖ్య భూమిక పోషించింది' అని ప్రధాని అన్నారు. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాలు సభ్య దేశాలుగా ఉన్న బ్రిక్స్ సదస్సు సెప్టెంబర్ 3 నుంచి 5 వరకూ చైనాలోని గ్జియామెన్ నగరంలో జరగనుంది. బ్రిక్స్ సదస్సు వేదికగా దేశాధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతామని వెల్లడించారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అధ్యక్షతన సెప్టెంబర్ 5న జరిగే 'ఎమర్జింగ్ మార్కెట్స్, అండ్ డెవలపింగ్ కంట్రీస్' సదస్సులో పాల్గొనడంతో పాటు, బ్రిక్స్ బిజినెస్ కౌన్సిల్‌తో కూడా భేటీ అవుతామని ప్రకటనలో పేర్కొన్నారు. బ్రిక్స్ సదస్సు వేదికగా జిన్‌పింగ్ ప్రధాని ప్రత్యేక చర్చలు జరపవచ్చని భావిస్తున్నారు. మయన్మార్ పర్యటన గురించి స్పందిస్తూ.. భద్రత, ఉగ్రవాద పోరు, వాణిజ్యం, పెట్టుబడులు, మౌలిక వసతులు, ఇంధనం, సంస్కృతి రంగాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న సహకారం బలోపేతం కోసం ఇరు దేశాలు ఆసక్తిగా ఉన్నాయని మోదీ అన్నారు. మయన్మార్‌లో సెప్టెంబర్ 5 నుంచి 7 వరకూ మోదీ పర్యటిస్తారు.

## భారత్‌కు అమెరికా రాయబారిగా కెన్నెత్!



**వాషింగ్టన్:** భారత్‌కు అమెరికా రాయబారిగా ఆర్థికవేత్త కెన్నెత్ జస్టర్‌ను ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియమించనున్నారు. భారత్– అమెరికా మధ్య అణు ఒప్పందం కుదరడంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తుల్లో కెన్నెత్ ఒకరు. 62 ఏళ్ల కెన్నెత్ అంతర్జాతీయ ఆర్థిక వ్యవహారాల్లో అమెరికా అధ్యక్షుడి వద్ద డిప్యూటీ అసిస్టెంట్‌గా, నేషనల్ ఎకనమిక్ కౌన్సిల్ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు. దక్షిణాసియా సంబంధాల విషయంలో భారత్‌తో ద్వైపాక్షిక బంధం పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్న ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో కెన్నెత్ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో అణు, అంతరిక్షం, సైనిక రంగం వంటి అంశాల్లో భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక బంధాలు మరింత బలపడనున్నాయి. గతంలో కెన్నెత్ వాణిజ్య శాఖలో వద్ద 2001 నుంచి 2005 వరకు సేవలందించారు.

## తస్మాత్...'లాకీ' ముప్పు



**న్యూఢిల్లీ:** కొత్త మాల్‌వేర్ 'లాకీ రాన్సమ్‌వేర్' వ్యాప్తిపై కేంద్రం హెచ్చరికలు జారీచేసింది. ఇది కంప్యూటర్లలోకి చొరబడి, డబ్బు ఇస్తేనే సమాచారాన్ని విడుదల చేస్తామని డిమాండ్ చేస్తోందని పేర్కొంది. లాకీ రాన్సమ్‌వేర్ రూ.1.5 లక్షలకు సమానమైన హాఫ్ బిట్‌కాయిన్‌ను కోరుతున్నట్లు తెలిసింది. 'సైబర్ స్వచ్ఛ కేంద్ర'లో జారీచేసిన ఈ అలర్ట్‌లో...లాకీ రాన్సమ్‌వేర్‌ను విస్తరించడానికి ఉమ్మడి సబ్జెక్టుతో పలు స్పామ్ మెయిల్స్ వ్యాపిస్తున్నాయని పేర్కొన్నారు. ఈమేరకు ఇదివరకే సుమారు 2 కోట్ల సందేశాలను పంపినట్లు వార్తలొచ్చాయని, 'ప్లీజ్ ప్రింట్', 'డాక్యుమెంట్స్', 'ఫొటో', 'ఇమేజెస్', 'స్కాన్స్', 'పిక్చర్స్' లాంటి సబ్జెక్టులతో అవి ఉన్నాయని అలర్ట్ తెలిపింది. ఈ రాన్సమ్‌వేర్ తీవ్రత అధికంగానే ఉండొచ్చని హెచ్చరించింది. లాకీ వేరియంట్లను విస్తరించడానికి నకిలీ డ్రాప్‌బాక్స్ లింకులతో కూడిన స్పామ్ సందేశాలను వినియోగిస్తున్నారని పేర్కొంది. ఈ–మెయిల్స్ తెరిచేటపుడు వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని, సంస్థలు యాంటీ స్పామ్ పరిష్కారాలను సమకూర్చుకోవాలని సూచించింది.

## అమెరికాలో సిక్కు యువకుడి హత్య

**వాషింగ్టన్ :** అమెరికాలో దారుణం చోటుచేసుకుంది. ఓ విశ్వవిద్యాలయంలో సీటు రాలేదన్న ఆగ్రహంతో ఓ సిక్కు ట్యాక్సీ డ్రైవర్ గగన్‌దీప్‌సింగ్(23)ను అమెరికన్ విద్యార్థి జాకబ్ కోలెమన్(19) కత్తితో పొడిచి చంపాడు. గగన్‌దీ అమెరికాలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతూ, ట్యాక్సీ నడిపేవాడు. జాకబ్ స్పోకన్‌లోని గోన్జగా వర్సిటీలో ప్రవేశం కోసం వచ్చాడు. 'తన ప్రవేశాన్ని అధికారులు తిరస్కరించడంతో ఆవేశానికి లోనైన జాకబ్ హత్య చేయాలనుకున్నాడు. వెంటనే దగ్గర్లోని ఓ షాపుకెళ్లి కత్తి కొన్నాడు. తర్వాత గగన్ నడుపుతున్న ట్యాక్సీ ఎక్కి, బొన్నెర్ కౌంటీలోని తన స్నేహితుడి ఇంటికి తీసుకువెళ్లాలని జాకబ్ చెప్పాడు. కొంతదూరం ప్రయాణించాక తాను తప్పుడు మార్గంలో వెళుతున్నట్లు గుర్తించిన గగన్ కూటెనై పట్టణంలో ట్యాక్సీని ఆపాడు. వెంటనే జాకబ్ గగన్‌ను పలుమార్లు కత్తితో పొడిచి హతమార్చాడు' అని పోలీసులు తెలిపారు.

## రిటర్నులపై ఆలస్య రుసుం రద్దు



**న్యూఢిల్లీ:** వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) రిటర్నులను గడువులోగా దాఖలు చేయని వారికి ఆలస్య రుసుమును రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే దాఖలు చేసిన జీఎస్టీఆర్ 3బీ రిటర్నుల్లో ఉన్న లోపాలను సరిచేసుకుని ఫైనల్ రిటర్నులను దాఖలు చేసేందుకు వ్యాపారులకు ఐదో తేదీ వరకు గడువిచ్చింది. జూలైకి సంబంధించిన తొలి జీఎస్టీ రిటర్నులను దాఖలు చేసి పన్నుల చెల్లింపును ఆగస్టు 25 నాటికి వ్యాపారులు పూర్తి చేయాలి. జూలై నెల అమ్మకాలకు సంబంధించిన తుది రిటర్నులను ఈ నెల 5వ తేదీ నాటికి కొనుగోళ్లకు సంబంధించిన రిటర్నులను ఈ నెల 10వ తేదీ నాటికి దాఖలు చేయాలి. జూలై నెలకుగానూ జీఎస్టీఆర్ 3బీ దాఖలు చేయని పన్ను చెల్లింపుదారులందరికీ ఆలస్య రుసుమును రద్దు చేస్తున్నట్టు ఆర్థిక శాఖ సర్క్యులర్ జారీ చేసింది. చెల్లించాల్సిన మొత్తంపై వడ్డీని మాత్రం పన్ను చెల్లింపుదారులు చెల్లించాల్సిందే అని స్పష్టం చేసింది.

## హైదరాబాద్‌కు దినకరన్ ఎమ్మెల్యేలు



**సాక్షి ప్రతినిధి, చెన్నై:** తమిళనాడులో ముఖ్యమంత్రి ఎడపాడి పళనిస్వామి ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకున్న అన్నాడీఎంకే దినకరన్ వర్గ 19 మంది ఎమ్మెల్యేలు తమ మకాంను పుదుచ్చేరి నుంచి హైదరాబాద్‌కు మారుస్తున్నారు. పళని వర్గ ప్రలోభాలకు గురికాకుండా దినకరన్ తన వర్గం ఎమ్మెల్యేలను రిసార్టులో ఉంచి కాపాడుతున్నారు. శని లేదా ఆదివారం వారందరినీ దినకరన్ హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. అనర్హత వేటుపై షోకాజ్ నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు మంగళవారం 19 మంది శాసనసభ్యులు స్పీకర్‌ను విడివిడిగా కలుస్తారని దినకరన్ వర్గ ఎమ్మెల్యే తంగతమిళ్ సెల్వన్ తెలిపారు. శశికళ కుటుంబంపై దివంగత సీఎం జయలలిత చేసిన విమర్శలకు సంబంధించిన వీడియోను మంత్రి ఉదయకుమార్ రిలీజ్‌చేయగా, ప్రతిగా దినకరన్ వర్గం ఎమ్మెల్యేలు మరో వీడియో రిలీజ్‌చేశారు. పెరియకుళం ఎంపీగా దినకరన్ పోటీచేసినపుడు అతణ్ని, శశికళను జయ పొగిడిన దృశ్యం ఈ వీడియోలో ఉంది.

## 800 ఇంజనీరింగ్ కాలేజీలు బంద్?



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ప్రవేశాలు తగ్గిపోతున్న సుమారు 800 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలను మూసివేయాలని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) యోచిస్తోంది. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఏఐసీటీఈ చైర్మన్ అనిల్ ఈ వివరాలు చెప్పారు. తగిన మౌలిక వసతులు లేని, వరసగా ఐదేళ్లు 30 శాతం కన్నా తక్కువ సీట్లు నిండే కాలేజీలు స్వచ్ఛందంగా మూతపడుతున్నాయన్నారు. 2014–18 మధ్యకాలంలో 410 కాలేజీల 'ప్రోగ్రెసివ్ క్లోజర్'కు ఏఐసీటీఈ అనుమతిచ్చింది. ఈ విధానంలో తొలి ఏడాది విద్యార్థుల ప్రవేశాలను అనుమతించరు. 2016–17లో ఈ విధానం ద్వారా గరిష్టంగా 149 ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలను మూసివేశారు. ప్రొగ్రెసివ్ క్లోజర్ ద్వారా మూతపడిన వాటిలో తెలంగాణ నుంచి అత్యధికంగా 64 కాలేజీలున్నాయి. తరువాతి స్థానాల్లో మహారాష్ట్ర(59), ఉత్తరప్రదేశ్(47), తమిళనాడు, హరియాణా(37), ఆంధ్రప్రదేశ్(29) ఉన్నాయి.

## గ్రీన్‌కార్డుకు ఇంటర్వ్యూ తప్పనిసరి

### భారతీయులకు ట్రంప్ సర్కారు మరో షాక్

### ఆర్ఎఫ్ఈల పేరిట హెచ్-1బీ దరఖాస్తులపై పెరిగిన నిఘా

**న్యూయార్క్:** గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూస్తున్న భారతీయులకు ట్రంప్ సర్కారు మరో షాకిచ్చింది. హెచ్–1బీ వీసాపై అమెరికాలో పనిచేస్తూ గ్రీన్‌కార్డు(శాశ్వత నివాసం)పొందాలనుకునే వారికి అక్టోబర్ 1 నుంచి యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీస్(యూఎస్‌సీఐఎస్) ఇంటర్వ్యూల్ని తప్పనిసరి చేసింది. ఇప్పటికే లక్షల గ్రీన్‌కార్డుల దరఖాస్తులు ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉండగా తాజా నిర్ణయంతో మరిన్ని చిక్కులు రావచ్చు. ఇంటర్వ్యూల్ని తప్పనిసరని చేస్తూ గ్రీన్‌కార్డు నిబంధనల్లో మార్పులపై ఆగస్టు 28న యూఎస్‌సీఐఎస్ ప్రకటన విడుదల చేసింది. హెచ్–1బీ వీసా దరఖాస్తుదారులు రిక్వెస్ట్ ఫర్ ఎవిడెన్స్(ఆర్ఎఫ్ఈ)లు సమర్పించాలని ఇమిగ్రేషన్ అటార్నీలకు లేఖలు పెరుగుతున్నాయి. హెచ్–1బీ వీసాకు లెవల్–1 వేతనాలు అంగీకరించబోమని యూఎస్‌సీఐఎస్ తేల్చిచెప్పింది. 2017 ఏప్రిల్‌లో చేసిన హెచ్–1బీ వీసా దరఖాస్తులు అక్టోబర్, 1 2017 నుంచి చెల్లుబాటు కానున్న నేపథ్యంలో ఆర్ఎఫ్ఈలు సమర్పించాల్సి ఉంది. గ్రీన్‌కార్డుల కోసం చేసిన మార్పులపై ఎన్‌పీజెడ్ లా గ్రూప్ మేనేజింగ్ అటార్నీ డేవిడ్ హెచ్ నచ్‌మన్ మాట్లాడుతూ.. 'కుటుంబ ఆధారిత గ్రీన్ కార్డులు, పౌరసత్వ ప్రక్రియ కోసం ఇంటర్వ్యూలు తప్పనిసరి. నిజానికి ఉద్యోగ వీసా నుంచి గ్రీన్‌కార్డుకు మారాలంటే ఇంటర్వ్యూలు నిర్వహించడం దశాబ్దకాలంగా అమల్లోఉంది. ఇంతవరకూ ఇంటర్వ్యూల్లో చాలామందికి మినహాయింపు ఇచ్చేవారు. కొత్త విధానంలో అలా మినహాయింపు ఉండదు. గ్రీన్‌కార్డుల కోసం మరింత సమయం నిరీక్షించాల్సి రావచ్చు' అని చెప్పారు. అమెరికాలో తాత్కాలిక వీసాపై పనిచేస్తున్నవారికే అధిక శాతం గ్రీన్‌కార్డులు దక్కుతున్నాయి. 2010 నుంచి 2014 మధ్య హెచ్–1బీ వీసాదారులు 2 లక్షల గ్రీన్‌కార్డులు పొందారని 'బైపార్టిసన్ పాలసీ సెంటర్' తెలిపింది. యూఎస్‌సీఐఎస్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2015లో దాదాపు 34,843 మంది భారతీయులు తాత్కాలిక వీసా నుంచి గ్రీన్‌కార్డుకు మారారు. ఇందులో 25,179మంది హెచ్–1బీ కేటగిరిలో అమెరికాలో ఉద్యోగం చేస్తున్నవారే.



**హెచ్–1బీకి లెవల్ 1 జీతాలకు అంగీకరించం**

హెచ్–1బీ దరఖాస్తుల్లో వెల్లడించిన వివరాలపై విచారణను యూఎస్‌సీఐఎస్ వేగవంతం చేసింది. హెచ్–1బీ వీసాదారులకు కంపెనీలు ఆఫర్ చేసిన లెవల్–1 వేతనాలు అంగీకరించమని హెచ్చరికలు వస్తున్నాయని ఇమిగ్రేషన్ అటార్నీ రాజీవ్ ఖన్నా తెలిపారు. 'ఎంట్రీ లెవల్ ఉద్యోగాలకు కంపెనీలు లెవల్–1 వేతనాలు, సాంకేతిక నిపుణులు, ఉన్నత స్థాయి ఉద్యోగులకు లెవల్–4 కేటగిరీ వేతనాలు ఇస్తున్నాయి. శాన్ జోస్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌కు(లెవల్ 1) 88,733 డాలర్ల(రూ. 56 లక్షలు) వేతనం ఉండగా, లెవల్ 4లో 1,55,147 డాలర్ల వేతనం ఆఫర్ చేస్తున్నారు.

## ఆందోళనలో 8 లక్షల వలసదారులు

వలసదారుల్ని స్వదేశానికి పంపడమే లక్ష్యంగా పనిచేస్తున్న ట్రంప్ మరో వివాదాస్పద నిర్ణయంపై మంగళవారం నిర్ణయం తీసుకోనున్నారు. ట్రంప్ తీసుకునే ఈ నిర్ణయంపై దాదాపు లక్షల మంది వలసదారుల జీవితాలు ఆధారపడి ఉన్నాయి. చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు అమెరికాకు వచ్చి తాత్కాలిక వీసాపై అక్కడ ఉద్యోగం చేస్తున్న వీరంతా ట్రంప్ నిర్ణయం ఎలా ఉంటుందోనని ఆందోళనలో ఉన్నారు. 'చిన్నారులుగా ఉన్నప్పుడు దేశంలోకి అక్రమంగా వచ్చి ఉద్యోగాలు చేస్తున్న లక్షల మంది భవిష్యత్తుపై మంగళవారం ట్రంప్ తన నిర్ణయం ప్రకటిస్తారు'అని వైట్ హౌస్ పేర్కొంది. కాగా శుక్రవారం ట్రంప్ మాట్లాడుతూ.. 'వీరిని స్వదేశాలకు పంపాలని ఒబామా హయాంలోనే డిమాండ్ చేయగా 2012లో నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదావేశారు. డిఫెర్డ్ యాక్షన్ ఫర్ చైల్డ్‌హుడ్ అరైవల్స్ పేరిట అమెరికాలో ఉద్యోగం చేసుకునేందుకు తాత్కాలిక వర్క్‌పర్మిట్లు జారీ చేశారు.


## 100 కోట్ల పైనే హిందీ హక్కులు!

‘2.0’ హిందీ రైట్స్ బాగానే పలికింది. ఫస్ట్ పార్ట్ సుమారు 20 కోట్లకు అమ్ముడుపోతే సెకండ్ పార్ట్ అందుకు ఐదింతలు పెరగడం విశేషం. దాదాపు 100 కోట్లకు పైనే హిందీ థియేట్రికల్ రైట్స్ అమ్ముడుపోయాయట.

## 110 కోట్లకు శాటిలైట్ రైట్స్

450 కోట్లతో ఈ సినిమాని తీస్తే అందులో పావు శాతం సినిమా విడుదలకు ముందే శాటిలైట్ రూపంలో వచ్చేసిందని టాక్. ఈ ప్రెస్టీజియస్ మూవీని దక్కించుకోవడానికి పలు ప్రముఖ ఛానళ్లు పోటీ పడ్డాయట. చివరికి ‘జీ టీవీ’ చేజిక్కించుకుంది. తమిళ, తెలుగు, హిందీ భాషల శాటిలైట్ రైట్స్‌ను 110 కోట్లకు సొంతం చేసుకుందట.

1.0 లో వంద పాయింట్లు వచ్చాయి.
శంకరన్న వంద పాయింట్లు కొట్టాడు.
రజనీ ఇంకో వంద కొట్టారు.
అమాంతం 200 పాయింట్లు వచ్చాయి కదా..
ఇప్పుడు 2.0 వస్తోంది.
సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్‌లో 2.0 అంటే ఇంప్రూవ్డ్ వెర్షన్ అని.
ఆ రోబో అన్నీ చేసేశాడు.
ఇంప్రూవ్డ్ వెర్షన్‌లో ఇంకేం చేస్తాడో!
స్క్రీన్లు, డిస్ట్రిబ్యూటర్లు, మార్కెట్..
టెక్నీషియన్లు, క్యాషూ, డ్యాషూ..
ఆటలు, పాటలు, ఫైట్‌లు, హీరోయిన్...
కథ లైట్‌గా చెబుతున్నాం కానీ
టూ పాయింట్ జీరో కథాకమామిషు మాత్రం..
ఫుల్‌ల్‌ల్‌గా....!




## కథేంటి?




మర మనిషి (రోబో)కి ఎమోషన్స్ ఉంటాయా? ఆలోచించగలుగుతుందా? ప్రేమలో కూడా పడుతుందా? మనం ‘కీ’ ఇచ్చినట్లు ఆడే రోబో మనకు సంబంధం లేకుండా పైవన్నీ చేస్తే, చూడ్డానికి ఓ థ్రిల్. ‘రోబో’ సినిమా అలాంటి థ్రిల్‌నే ఇచ్చింది. అందులో డాక్టర్ వశీ (రజనీకాంత్) ఎంతో శ్రమపడి ఓ రోబో (చిట్టి)ను తయారు చేస్తాడు. ఆ రోబోను ఇండియన్ ఆర్మీకి ఇవ్వాలన్నది అతని ఆశయం. ఆర్మీకి ఉపయోగపడాలంటే చిట్టిలో హ్యూమన్ ఎమోషన్స్ ఉండాలి. వశీ ఆ పని కూడా చేసేస్తాడు. చివరికి అతని లవర్‌తోనే చిట్టి లవ్‌లో పడుతుంది. మరోవైపు చిట్టి దేశానికి ఉపయోగపడకూడదని, దాన్ని అంతం చేయాలని విలన్ గ్యాంగ్ ప్లాన్ చేస్తుంది. క్లుప్తంగా ‘రోబో’ కథ ఇది. మరి.. ఈ చిత్రం సీక్వెల్ ఇ‘2.0’ కథేంటి? అంటే ఇప్పటివరకూ టూకీగా కూడా కథ గురించి బయటకు రాలేదు. అయితే చెన్నై కోడంబాక్కమ్‌లో ఓ కథ ప్రచారంలో ఉంది. అదేంటంటే... పక్షులంటే ఓ వ్యక్తి (అక్షయ్‌కుమార్)కి పిచ్చి ప్రేమ. టెక్నాలజీ పెరుగుతోన్న కొద్దీ కొన్ని పక్షులు కనిపించకుండాపోతున్నాయి. ఆ బర్డ్ లవర్ బాధ అంతా అదే. అతనికి సెల్ టవర్లు చూస్తే ఒళ్లు మండిపోతుంది. వాటి నుంచి వచ్చే రేడియేషన్ వల్లే పక్షులు అంతమవుతున్నాయని టెక్నాలజీపై పగ పెంచుకుంటాడు. సైంటిస్టులను అంతం చేయాలని, టెక్నాలజీని నాశనం చేయాలని అనుకుంటాడు. మరోవైపు... అవినీతిని అంతం చేయడానికి ఓ రోబోను కనిపెడతాడో సైంటిస్ట్ (రజనీకాంత్). ఆ సైంటిస్ట్, అతను కనిపెట్టిన రోబో, ఆ పక్షి ప్రేమికుడు... ప్రధానంగా ఈ మూడు పాత్రల చుట్టూ ‘2.0’ కథ ఉంటుందని సమాచారం. ఇది ఆసక్తిరాయుళ్లు అల్లిన కథా లేక నిజమైనదా? అనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. అయితే ఈ కథలో ఎంతో కొంత నిజం ఉండి ఉంటుందని అక్షయ్ గెటప్‌ని బట్టి ఊహించవచ్చు.




## ఐదు గెటప్స్‌లో రజనీ!


ఈ చిత్రంలో రజనీకాంత్ ఐదు గెటప్స్‌లో కనిపిస్తారని ఓ టాక్. వాటిలో రోబో ఒకటి. దీనికోసం రజనీ ఫేస్ మాస్కులు తయారు చేశారు. అదంత ఈజీ కాదు. ఏవేవో పదార్థాలు రజనీ ఫేస్‌కి అప్లై చేసి, అది ఎండిన తర్వాత తీస్తే, వచ్చేదే మాస్క్. దీనికోసం రజనీ నాలుగైదు గంటలు కేటాయించాల్సి వచ్చింది. ఈ సూపర్ స్టార్ వయసు దాదాపు 65. ఈ ఏజ్‌లో అన్నేసి గంటలు కదలకుండా కూర్చోవడం అంటే చిన్న విషయం కాదు. ‘లార్డ్ ఆఫ్ ద రింగ్స్’, ‘ఐరన్ మాన్’, ‘లైఫ్ ఆఫ్ పై’ తదితర హిట్ సిన్మాలకు పని చేసిన హాలీవుడ్ మేకప్ ఆర్టిస్ట్ వాన్స్ హార్ట్‌వెల్ రజనీ– అక్షయ్‌ల స్పెషల్ గెటప్స్‌కి మేకప్ చేశారు. రజనీ ఇంత శ్రమపడ్డారు కదా? ఆయన ఎంత పారితోషికం తీసుకుని ఉంటారు.. అనుకుంటున్నారా? సినిమా సాధించే లాభాల్లో షేర్ ఇస్తారట. ఆ లెక్క రిలీజ్ తర్వాత తెలుస్తుంది.

## ఎప్పుడు మొదలు? ఎప్పుడు ముగింపు?

డిసెంబర్ 12 రజనీకాంత్ పుట్టినరోజు. 2015లో ఆయన బర్త్‌డే నాడు ‘2.0’ని ప్రారంభించారు. అప్పుడు చెన్నైలో తుఫాను కారణంగా సింపుల్‌గా ఆ వేడకను కానిచ్చేశారు. ఆ తర్వాత అదే నెల 16న రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టారు. ఈ ఆగస్ట్‌కి మొత్తం షూటింగ్ పూర్తి చేశారు. కంటికి కనిపించేది 20 నెలలు. అంటే.. దాదాపు 600 రోజులు. కానీ, షూటింగ్‌కి పట్టిన రోజులు మాత్రం దాదాపు 300 రోజులు అట. మధ్యలో అనారోగ్యం కారణంగా రజనీకాంత్ కొన్ని రోజులు బ్రేక్ తీసుకోవడం వల్ల, షూటింగ్ డేస్ మినహా కొన్ని రోజులు ప్లానింగ్‌కి కేటాయించడం వల్ల ఆగస్ట్ వరకూ ఎక్స్‌టెండ్ అయింది. లేకపోతే ఇంకొంచెం ముందే అయ్యుండేదని టాక్. ఫస్ట్ పార్ట్‌కన్నా సెకండ్ పార్ట్ టెక్నాలజీ వైజ్‌గా రెండింతలు ఉండటం యూనిట్‌కి ఓ సవాల్. అందుకే ప్రతిదీ చాలా జాగ్రత్తగా ప్లాన్ చేసుకున్నారు. చిత్రీకరణ జరిపిన రోజులుకన్నా ప్రీ–ప్రొడక్షన్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌కి ఎక్కువ రోజులు పడుతుంది.

## అక్షయ్‌కుమార్ గెటప్ వెనక బోల్డంత కహానీ

హిందీలో హీరోగా దూసుకెళుతోన్న అక్షయ్‌కుమార్‌కి విలన్‌గా చేయాల్సిన అవసరం ఏంటి? రెమ్యునరేషనా? స్టోరీయా? క్యారెక్టరా? రజనీకాంత్‌తో ఢీ కొనొచ్చనా? శంకర్ డైరెక్టర్ అనా? అని చాలామంది అనుకున్నారు. యస్.. అక్షయ్‌కుమార్ ఈ సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడానికి ఇవన్నీ కారణాలు. ‘‘రజనీకాంత్‌తో దెబ్బలు తినడంలో ఓ మజా ఉంది’ అని స్వయంగా అక్షయ్ ఓ సందర్భంలో పేర్కొన్నారు. ఇందులో విచిత్రమైన గెటప్‌లో అక్షయ్ కనిపిస్తోన్న ఫొటోలు ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. పక్షులు పలు రకాలు కదా. ఈ పక్షి ప్రేమికుడి గెటప్‌ని కూడా పలు రకాల పక్షులను తలపించే రీతిలో ప్లాన్ చేశారట. ఉదాహరణకు కనుబొమలు ఓ పక్షిలా, చేతి గోళ్లు మరో పక్షిలా, జుత్తు ఓ పక్షిని పోలినట్లుగా, మీసాలు మరో పక్షిలా... ఇలా అక్షయ్ గెటప్‌ని మౌల్డ్ చేశారు. అక్షయ్ మేకప్‌కి నాలుగైదు గంటలు పట్టేదట. ఒక్కసారి మేకప్ వేశాక ‘నో సాలిడ్ ఫుడ్’. ‘ఓన్లీ లిక్విడ్స్’. జ్యూసులు, నీళ్లు, పాలు లాంటివి. అందుకే ఎక్కువ గంటలు షూటింగ్ చేసేవారు కాదని సమాచారం. ఇంతకీ అక్షయ్ పారితోషికం ఎంతో తెలుసా? రోజుకి 2 కోట్ల రూపాయలు తీసుకున్నారట. ఈ సినిమాకి ఆయన అక్షరాలా 50 కోట్లకు చెక్కు పుచ్చుకున్నారట. మామూలుగా హిందీలో హీరోగా నటించే సినిమాలకు అక్షయ్ 50 నుంచి 70 కోట్లు తీసుకుంటారని భోగట్టా.


## ఈవీపీ వర్ల్డ్‌లో...

చెన్నైలోని పూనమల్లిలో ‘ఈవీపీ వరల్డ్’ అనే థీమ్ వర్క్ ఉండేది. 2015లో దాన్ని మూసేశా రట. దాదాపు 150 ఎకరాలు ఉన్న ఆ పార్క్‌ని ‘2.0’ నిర్మాతలు హైర్ చేసుకున్నారు. అందులో భారీ సెట్స్ వేశారు. వాటిలో మొబైల్ ఫోన్ స్టోర్ సెట్ ఒకటి. అక్కడే మిలిటరీ ట్యాంక్స్ తయారు చేయించారట. కేవలం షూటింగ్ కోసమే కాదు.. సినిమాకి సంబంధించిన లావాదేవీలు జరపడానికి, అక్కడే బస చేయ డానికి వీలుగా ఏర్పాట్లు చేసుకున్నారట. వేరే ప్లేస్‌లో తీసిన సీన్స్‌లో ప్యాచ్‌వర్క్ ఉంటే.. ఈవీపీ వరల్డ్‌లో సెట్ వేసి, మ్యాచింగ్ సీన్స్ తీసేవారట. దర్శకుడు శంకర్ ఇంటికి వెళ్ల కుండా ఆల్మోస్ట్ ఈ లొకేషన్‌లోనే ఉండేవారట. అంత డెడికేషన్, ఎంతో ప్యాషన్ ఉంటే తప్ప ఇలాంటి సినిమాలు తీయలేరు.




## బడ్జెట్ ఎంత?

ఈ చిత్రంలో లెక్కలేనన్ని రోబోలు, టెక్నికల్‌గా క్రియేట్ చేసిన పక్షులు కనిపిస్తాయట. అలాగే, భారీ సెట్స్ కనువిందు చేస్తాయి. బోలెడంత మంది తారాగణం. ఇండియన్ టెక్నీషియన్స్‌తో పాటు హాలీవుడ్ టెక్నీషియన్స్ కూడా పని చేశారు. ఎక్కువమంది హాలీవుడ్ టెక్నీషియన్స్ పని చేసిన మొదటి ఇండియన్ సినిమా ఇదే అవుతుంది. ‘ట్రాన్స్‌ఫార్మర్స్’, ‘ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్’ వంటి హాలీవుడ్ చిత్రాలకు పని చేసిన సాంకేతిక నిపుణులు ‘2.0’కి చేశారు. కెమెరామేన్ నిరవ్ షా, మ్యూజిక్ డైరెక్టర్ ఎ.ఆర్. రెహమాన్, సౌండ్ డిజైనర్ రసూల్ పూకుట్టి తదితర ఇండియన్ టెక్నీషియన్స్‌తో పాటు స్పెషల్ కాస్ట్యూమ్స్ డిజైన్ చేయడానికి మేరీ ఇ. వోగ్, స్టంట్ కొరియోగ్రాఫర్ బేట్స్, విజువల్ ఎఫెక్ట్స్ స్పెషలిస్ట్ జాన్ హ్యూగెస్, వాల్ట్ జోన్స్ వంటి హాలీవుడ్ టెక్నీషియన్స్ పని చేశారు. అమెరికాకు చెందిన ‘ది లెగసీ ఎఫెక్ట్స్’ యానిమేట్రానిక్స్ వర్క్ చేసింది. టెక్నీషియన్స్, ఆర్టిస్ట్స్ రెమ్యునరేషన్లు, సినిమా సెట్స్, లొకేషన్ ఖర్చు.. ఇలా టోటల్‌గా ఇది భారీ బడ్జెట్ సినిమా అయింది. ముందు 250 నుంచి 300 కోట్ల రూపాయల బడ్జెట్‌లోనే తీయాలనుకున్నారనే వార్త వచ్చిన విషయం తెలిసిందే. సినిమా ముగిసేసరికి దాదాపు 450 కోట్లు అయింది. భారతీయ సినిమాల్లో భారీ బడ్జెట్‌తో రూపొందిన ఫస్ట్ మూవీ ఇదే అవుతుంది.

## తెలుగు రైట్స్ కోసం పోటాపోటీ!


నారాయణ దాస్ నారంగ్, సునీల్, రాజు మహాలింగం తదితరులు...

రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ చిత్రాన్ని ఏషియన్ ఫిలింస్ సునీల్ నారంగ్ విడుదల చేయనున్నారు. రైట్స్ దక్కించుకోడానికి పెద్ద ఎత్తున పోటీ నెలకొంది. చివరకు హక్కులు చేజిక్కించుకోవడానికి రాజకీయ నాయకుల సహాయం కూడా కొంతమంది తీసుకున్నారట. కానీ, ఈ ప్రెస్టీజియస్ మూవీని సరిగ్గా రిలీజ్ చేసి, నిలబెట్టగల సంస్థకే ఇవ్వాలని లైకా ప్రొడక్షన్స్ అనుకుందట. అందుకే 40 ఏళ్లుగా 500 చిత్రాలకు పైగా ఫైనాన్స్ చేసి, వందకు పైగా సినిమాలను పంపిణీ చేసిన ఏషియన్ ఫిలింస్‌కి ఇచ్చారు. ఫైనల్‌గా రిలయన్స్, సురేశ్ ప్రొడక్షన్స్‌తో కలసి ఏషియన్ ఫిలింస్ ఈ చిత్రం రైట్స్‌ను దాదాపు 80 కోట్లకు దక్కించుకుంది.

## 8 లక్షల ఖర్చుతో త్రీడీ స్క్రీన్

‘2.0’ని కంప్లీట్‌గా త్రీడీలో తీశారు. బాగానే ఉంది. కానీ, ఇండియాలో త్రీడీ స్క్రీన్లు చాలా తక్కువ. అందుకే జనవరి 25న ‘2.0’ రిలీజ్ లోపు వీలైనన్ని థియేటర్లను త్రీడీ ప్రొజెక్షన్‌కు అనువుగా కన్వర్ట్ చేయాలనుకుంటున్నారు. ఒక్క తమిళనాడులోనే 300 థియేటర్లను త్రీడీకి మార్చాలనుకుంటున్నారు. దీనికయ్యే ఖర్చు ఒక్కో థియేటర్‌కి దాదాపు 8 లక్షలని సమాచారం. స్క్రీన్‌కి 5 లక్షలు, ప్రొజెక్టర్‌కి 3 లక్షలు అవుతుందట. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఎక్కువ థియేటర్లను త్రీడీకి కన్వర్ట్ చేయాలనుకుంటున్నారు.

‘కిల్లిమంజారో...’ పాటలో రజనీ, ఐష్



‘పూలనే కునుకేయమంటా..’ పాటలో విక్రమ్, అమీ



‘ఆలే.. ఆలే..’ పాటలో జెనీలియా సిద్ధార్థ్



## ఒక్క పాటకు 32 కోట్లు!

ఇది చదివినవాళ్లు 10 చిన్న సినిమాలు తీసే బడ్జెట్ ఒక్క పాటకా? అనుకోకుండా ఉండలేరు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఇటీవల చెన్నైలో ఓ పాట తీశారు. ఆ పాటకు అయిన ఖర్చు 32 కోట్లు అట. రజనీకాంత్–అమీజాక్సన్, కొన్ని రోబోల మీద పదీ పదిహేను రోజుల పాటు ఈ పాట తీశారట. 32 కోట్లతో సాంగ్ అంటే.. ఎంత రిచ్‌గా ఉండి ఉంటుందో? సాంగ్స్ విషయంలో శంకర్ స్పెషల్ ఫోకస్ పెడుతుంటారని స్పెషల్‌గా చెప్పక్కర్లేదు. ‘జీన్స్’ సినిమాలో ‘పూవుల్లో దాగున్న..’ పాటను ప్రపంచంలోని ఏడు వింతలైన తాజ్‌మహల్, గ్రేట్ వాల్ ఆఫ్ చైనా, ఈఫిల్ టవర్, ఈజిప్టియన్ పిరమిడ్స్.. తదితర ప్రదేశాల్లో తీసిన విషయం గుర్తుండే ఉంటుంది. ఈ పాట చిత్రీకరణకు 30 రోజులకు పైగా పట్టింది. ‘బాయ్స్’లో ఫ్రీజ్ టెక్నిక్‌తో ‘ఆలే.. ఆలే..’ సాంగ్ తీయడం అప్పట్లో ఓ హాట్ టాపిక్. రోబో’లో ‘కిల్లిమంజారో..’ పాటను పెరూలోని కొండల దగ్గర తీశారు. ఆ లొకేషన్లో షూట్ చేసిన ఫస్ట్ ఇండియన్ మూవీ ఇదే. ‘ఐ’లో ‘పూలనే కులికేయమంటా..’ పాటను చైనాలో తీశారు. పూల బ్యాక్‌డ్రాప్‌లో తీసిన ఆ సాంగ్ ఐ–ఫీస్ట్. ‘ఈ పాటలన్నీ ఒక ఎత్తయితే ‘2.0’ కోసం తీసిన 32 కోట్ల పాట మరో ఎత్తు అవుతుందని చెన్నై టాక్.

## ప్రమోషన్ అదుర్స్

సినిమా తీస్తే సరిపోదు.. దానికి సరైన పబ్లిసిటీ అవసరం. అది స్టార్ మూవీ అయినా నాన్–స్టార్ మూవీ అయినా. ఈ విషయంలో దర్శకుడు శంకర్, లైకా నిర్మాణ సంస్థకు ఫుల్ క్లారిటీ ఉంది. అందుకే ప్రపంచవ్యాప్తంగా ప్రమోట్ చేయాలనుకుంటున్నారు. ఇప్పటికే హాట్ ఎయిర్ బెలూన్ తయారు చేయించిన విషయం తెలిసిందే. 100 అడుగులు ఎత్తు ఉన్న ఈ బెలూన్ ఇండియాలోనే కాకుండా విదేశాల్లో పలు చోట్ల దర్శనమిస్తుంది. ఇప్పటికే యూఎస్‌లో పెట్టారు.




## 2 పాటలు! 3 చోట్ల ఆడియోలు!

ఆడియో వేడుకను బ్రహ్మాండంగా చేయాలనుకుంటున్నారు. అబుదాబి, హైదరాబాద్, చెన్నైలలో ఆడియో వేడుకను ప్లాన్ చేశారు. ఆ సంగతలా ఉంచితే పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం ఈ చిత్రంలో రెండే పాటలు ఉంటాయట. కానీ, ఏ.ఆర్. రహమాన్ ఐదు పాటలు తయారు చేసారట. అవి ఆల్బమ్ వరకే పరిమితమవుతాయని తెలిసింది. స్టోరీ పెద్దది కావడంతో పాటలకు పెద్దగా స్కోప్ లేకపోవడంవల్లే రెండు పాటలనే సినిమాలో పెట్టాలనుకున్నారట. మరి.. ఇది నిజమేనా? వేచి చూద్దాం.

## తెలుగు ప్రమోషన్‌కు 5 కోట్లు?

జనవరి 25న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నారు. అంతకు నెల ముందు ప్రమోషన్ కార్యక్రమాల జోరు పెంచాలనుకుంటున్నారు. తెలుగు ప్రమోషనల్ కార్యక్రమాలకు 5 కోట్లు ఖర్చుపెట్టాలనుకుంటున్నారట. ఈ ఖర్చుని లైకా ప్రొడక్షన్సే పెట్టుకుంటుందట.

## అదిరిపోయే స్టేడియమ్ సీన్!




ఈ చిత్రంలో రజనీ– అక్షయ్ కాంబినేషన్‌లో వచ్చే స్టేడియమ్ సీన్స్ వన్నాఫ్‌ది హైలైట్స్ అని సమాచారం. ఢిల్లీల్లోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియమ్‌లో కొన్ని రోజులు ఆ సీన్స్ తీసి, ఆ తర్వాత చెన్నైలో ప్యాచ్ వర్క్ తీశారట. లెంగ్త్ తక్కువ ఉన్న ఈ సీన్స్ కోసం 60, 70 రోజులు కేటాయించడం విశేషం. దాన్నిబట్టి కథకు ఎంత కీలకమో ఊహించవచ్చు.

- డి.జి. భవాని

ఆచార్య దేవోభవ

# గురువుకు ఆ శక్తి ఉంటుంది


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



కుక్కుట దీక్ష లేదా స్పర్శదీక్షలాగానే గురువు శిష్యుణ్ణి అనుగ్రహించే పద్ధతులలో మరొకటి నయన దీక్ష. గురువు కేవలం తన చూపులచేత అనుగ్రహిస్తాడు. ఒకప్పుడు పూరీ శంకరాచార్యుల వారు రమణ మహర్షిని ఇలాగే అనుగ్రహించారు. ఎదురుగా కూర్చున్న శిష్యుణ్ణి గురువు ఒక్కసారి పరమ ప్రేమతో అలా చూస్తాడు. అంతే! శిష్యుడికి జ్ఞానబోధ జరుగుతుంది. తత్త్వం తెలుసుకోవాలని పాల్‌బ్రాంటన్ అనే ఒక విదేశీయుడు భగవాన్ రమణుల దగ్గరికి వచ్చారు. రోజూ రమణుల సమక్షంలో కూర్చునేవారు. రమణులు మౌనస్వామి. ఎప్పుడో తప్ప నోరువిప్పేవారుకారు. అక్కడ ఒక ఆసనంలో కూర్చుని తనలోతాను రమిస్తుండేవారు. పాల్‌బ్రాంటన్ రోజూ రావడం, అక్కడ కూర్చోవడం, రమణులు ఏమీ మాట్లాడకపోవడం.. ఇలా చాలాకాలం జరిగింది. ఆయన విసిగిపోయి ఇక వెళ్ళిపోదామని నిర్ణయించుకుని తన సామాను సర్దుకుని ఇక గురువుగారికి చివరగా ఓ నమస్కారం పెట్టడానికి వచ్చి కూర్చున్నాడు. రమణులు తీక్షణంగా ఆయనకేసి చూశారు. అంతే! అజ్ఞానపు చీకట్లు విచ్చిపోయాయి బ్రాంటన్‌కు. భారతీయ తత్త్వవైభవాన్ని ప్రపంచానికి అందించడానికి ఎన్ని పుస్తకాలు రాశాడో ఆయన! అదీ నయన దీక్ష.. గురువు తన కంటి చూపుతో పాల్‌బ్రాంటన్‌ను అనుగ్రహించాడు. ఎందరో మహాత్ములు కేవలం తమ దృష్టిచేత అనుగ్రహిస్తారు.

నేనొకసారి విశాఖపట్టణ నివాసి అయిన మా దగ్గరి బంధువుతో కలిసి అరుణాచలం కొండమీది కెళ్ళా. కొంతమంది విదేశీయులు నూలుచీరలు కట్టుకుని బొట్లు పెట్టుకుని కొండమీద తిరుగుతూ కనిపించారు. మా బంధువు అది చూసి 'మీరు చాలా సుదూర దేశాలనుంచి వచ్చారు. ఇక్కడ ఎలా అనిపిస్తున్నది' అంటూ కరచాలనం కోసం చెయ్యిచాపారు. వాళ్ళు దానికి ప్రతిగా ''ఇంతటి మహాపురుషుడు (రమణులు) తిరుగాడిన భూమిని సేవించడానికి కావలసిన వాఙ్మయాన్ని పునాదిగా పొందిన కర్మభూమి భారతదేశంలో పుట్టిన మీకు చేతులెత్తి నమస్కరిస్తాం'' అన్నారు. అదీ ఈ దేశ వైభవం.

జీవశాస్త్రంలో ఏముందో కానీ, వేదాంత శాస్త్రంలో చెప్పేదేమిటంటే– ఒక నదిలో చేపగుడ్లు పెట్టినప్పుడు అవి ముందు తేలుతూ వెళ్ళిపోతుంటాయి. చేప వాటి వెనకో ముందో వెడుతూ 'అవి పిల్లలు కావాలి' అని ప్రేమతో వాటికేసి చూస్తుందట. ఆ చూపులకే అవి పొదగబడి పిల్లలవుతాయి. చూపులచేత పోషించి ఆత్మశక్తిని, ఆత్మానుభవాన్ని ఇవ్వగలిగిన దక్షత ఉన్న గురువు చూపు కనుక నయనదీక్ష. దానికి మీనాక్షీ పరదేవత సంకేతం.

అలాగే కమఠ దీక్ష అని మరొకటి ఉంది. దానిని స్మరణ దీక్ష అని కూడా అంటారు. గురువు ఎక్కడో ఉండి పరమ ప్రేమతో శిష్యుణ్ణి స్మరిస్తాడు. నా శిష్యుడు వృద్ధిలోకి రావాలి, అనుగ్రహింపబడాలి–అని ఒక్కసారి అనుకుంటాడు. స్మరించినంత మాత్రాన శిష్యుడికి వైభవం అందుతుంది.

గురువు స్మరణచేత, చూపులచేత శిష్యుణ్ణి కాపాడగలడు, ఉద్ధరించగలడు. నీకు ఆ శక్తి లేదు కదా అని ఎవరికీ ఉండదనకూడదు. ఉంటుంది. 'నాకు లేదు' అను– తప్పు కాదు. ఎవరికీ ఉండదండీ' అనకు అది తప్పు. నీకు జ్వరం ఎప్పుడూ రాలేదు కాబట్టి 'జ్వరమేమిటండీ' అనకు. జ్వరం అనేది ఒకటి ఉంది, దాని బాధేమిటో వచ్చిన వాడికి తెలుస్తుంది. అలా లోకంలో తపశ్శక్తి ఉన్న వాళ్ళకుంటుందా శక్తి. మీరు చేస్తే మీకూ వస్తుంది. అంతేకానీ చెయ్యకుండా అలా ఉండదండీ అనకూడదు. అది మూర్ఖత్వం.



## గడపకు పసుపు రాసి బొట్టు పెడితే..?

ఆచారం

వారానికి ఒకసారి ప్రధాన ద్వారపు గడపకు పసుపు రాసి కుంకుమ బొట్టు పెట్టడం చాలా మంచిది. లేదంటే కనీసం పర్వదినాల్లో అయినా గడపకు పసుపు రాసి కుంకుమ బొట్టు పెట్టాలి. అలా చేయడం లక్ష్మీప్రదం. దుష్టశక్తులు ఇంటిలోనికి రావు. శుక్రవారం రోజున ఉదయం స్నానం చేసి ఇంటి గడపకు పైన నల్లటి తాడుతో పటిక కడితే దృష్టి దోషం తొలగిపోతుంది. పండుగ రోజుల్లో మామిడి తోరణాలు కట్టడం ఇంటికి సౌభాగ్యాన్నిస్తుంది. అలాగే ఇంట్లో వారానికి ఒకసారి శుక్రవారం పూట లేదంటే, శని, గురువారాల్లో తప్పకుండా దీపారాధన చేయాలి. ప్రతిరోజూ చేస్తే మంచిది. పూజగదిని ఎప్పుడూ పరిశుభ్రంగా, పవిత్రంగా వుంచుకోవాలి. స్నానం చేయకుండా, అపరిశుభ్రమైన దుస్తులతో కాళ్లు కడుక్కోకుండా పూజగదిని తెరవ రాదు. దేవుళ్ల ప్రతిమలను తాకరాదు. దీపారాధన చేసిన తర్వాత దేవుళ్ల ప్రతిమలకు లేదా పటాలకు పూలు అలంకరించాలి. పూజగది ఎంత కళకళలాడితే అంతగా మన జీవితాలు కళకళలాడుతాయని పండితులు చెప్తున్నారు. వీలైనంత వరకు రెండు లేదా మూడు పటాలను మాత్రమే పూజగదిలో ఉంచాలి. అంతే కానీ, సన్నిహితులు, బంధువులు ఇచ్చిన చిన్న దేవుళ్ళ ఫోటోలతో పూజా మందిరాన్ని నింపడం మంచిది కాదని పెద్దల మాట.



## శైవాగమంలో గణపతి... మరి వైష్ణవంలో..?

ఆగమం

శైవసంప్రదాయంలో తొలిపూజ అందుకునేది వినాయకుడైతే, శ్రీవైష్ణవ ఆగమాలు విష్వక్సేనునికి అగ్రపూజ చేస్తాయి. 'విశ్వ' అంటే సకల లోకాలను, 'సేనుడు' అంటే నడిపించేవాడనీ అర్థం. విష్వక్సేనుడు విష్ణు గణాలకు అధిపతి. విష్ణు సైన్యాధిపతియైన విష్వక్సేనుని ఆశ్రయించిన వారికి ఎన్ని అడ్డంకులనైనా తొలగిస్తాడు. నాలుగు భుజాలతో శంఖు, చక్ర, గదలను ధరించి నాలుగువేళ్ళను మడిచి, చూపుడు వేలును పైకి చూపిస్తోన్న ముద్రతో దర్శనమిస్తుంటాడు విష్వక్సేనుడు. కొన్ని సందర్భాలలో గదకు బదులుగా దండాయుధంతో కనబడుతుంటాడు. ఆ స్వామిని ఆశ్రయిస్తే చాలు, సమస్త దోషాలను హరించి, భక్తులలో జ్ఞానజ్యోతిని వెలిగిస్తాడు. ఎవరైతే విష్వక్సేనుని ఆరాధిస్తారో, ధ్యానిస్తారో, వారికి ఎలాంటి విఘ్నాలు, ఆపదలు, కష్టాలు కలుగవని వైఖానస ఆగమం చెబుతోంది. విష్వక్సేనునికి సూత్రవతీ, జయ అనేవారు భార్యలు. మనం చేతికి ధరించే రక్షాసూత్రానికి అధి దేవతే సూత్రవతి. శ్రీవైష్ణవాగమాలు విష్వక్సేనుని దర్భకూర్చుగా ఆరాధిస్తాయి. శైవంలో పసుపు గణపతిని పూజిస్తే, వైష్ణవంలో తమలపాకుపై వక్కను ఉంచి, విష్వక్సేనునిగా భావిస్తారు. అందుకే వక్కలు లేని ఆకులు నిరర్థకం, నిష్ఫలం అంటారు.



### మీకు తెలుసా?

- కలలో ఏనుగు కనిపిస్తే శుభప్రదం.
- అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లలో పెద్దవారి వివాహం కాకుండా చిన్నవారు వివాహం చేసుకోవడం దోషం. అటువంటివారిని పంక్తి బాహ్యులుగా పరిగణిస్తుంది శాస్త్రం. అయితే... అన్న- చెల్లి విషయంలో ఈ నియమం వర్తించదు. అన్న కంటే ముందు చెల్లెలికి పెళ్లి చేయవచ్చు.
- స్వయంవరంలో వధువు తన చేతిలో ఉన్న మాలను వరుడి మెడలో అలంకరిస్తే వారికి వివాహం అయినట్లే.

నోములు-వ్రతాలు

సెప్టెంబర్ 5, మంగళవారం
అనంత పద్మనాభ చతుర్దశి

## అనంతపద్మనాభ వ్రతం

అనంత సంపదలనిచ్చే దైవం అనంత పద్మనాభస్వామి. సంపదలకోసం, సంతానం కోసం ఈ వ్రతం చేస్తారు. ఈ వ్రతాన్ని సాధారణంగా ఇంటి ఆచారాన్ని బట్టి అనూచానంగా చేస్తుంటారు. భాద్రపద శుద్ధ చతుర్దశినాడు ఈ వ్రతాన్ని ఆచరించాలి. ఈ వ్రతానికి తోరాలు ముఖ్యం. ఇవి ఎర్రటి పట్టు దారంతో చేసినవి గాని లేదా తెల్లనిదారంతో చేసినవి కానీ ఉండాలి. తెల్లటివైతే కుంకుమనీటిలో తడిపి ఉంచుకోవాలి. వీటికి పద్నాలుగు ముడులు ఉండాలి. ప్రసాదానికి గోధుమపిండి, బెల్లంతో నేతి అప్పాలు తయారు చేయాలి. ఇందులో ఇరవై ఎనిమిది అప్పాలు దేవునికి నైవేద్యం పెట్టి, తోరం కట్టుకుని పద్నాలుగు అప్పాలను వాయన దానమివ్వాలి. పూజాద్రవ్యాలన్నీ పద్నాలుగు చొప్పున ఉండాలి. సంకల్పం చెప్పుకుని షోడశోపచారాలతో స్వామివారిని పూజించాలి. ఆ తర్వాత తోరాలను కూడా పూజించి, చేతికి కట్టుకోవాలి. అనంతరం వ్రత కథ చెప్పుకుని, అక్షతలు శిరస్సున ధరించాలి. ఈ వ్రతంలో ఉంచిన తోరాలను భద్రంగా దాచి ఉంచుకోవాలి. వ్రతం రోజున ఉప్పులేని చప్పిడి పదార్థాలనే తినాలి. అందువల్ల తీపిపదార్థాలకే ప్రాధాన్యత.



పఠనీయం

## ప్రశ్నలు- జవాబులుగా శ్రీమద్భాగవతం

భారతీయ సంస్కృతికి వేదాలు, పురాణేతిహాసాలు మూలస్తంభాలని తెలుసు. వాటిని తెలుసుకోవాలని ఉన్నా, నిడివి రీత్యానో, సమయాభావం వల్లో కొందరు చదవరు. భాష తెలియక, భావం బోధపడక ఇంకొందరూ వాటి జోలికి వెళ్లరు. మరి వేదవిజ్ఞానంలో కనీస పరిజ్ఞానమైనా ఉండాలి కదా! అందుకే మన పురాణేతిహాసాలను ప్రశ్నోత్తరాల రూపంలో అందిస్తున్నారు విశ్రాంత ఆచార్యులు డాక్టర్ నండూరి గోవిందరావు. గతంలో రామాయణ, భారతాలను ఇదేవిధంగా అందించిన నండూరి, వాటికి లభించిన ప్రోత్సాహ ఉత్సాహంతో ఇప్పుడు భాగవతాన్ని కూడా అదే కోవలో రచించారు. అన్ని తరగతుల వారికి ఉపయోగించేలా ప్రశ్నోత్తరాలను రూపొందించారు. తేటతెలుగులోని పోతన భాగవతాన్ని కూడా అర్థం చేసుకోలేని ఈ తరానికి సైతం ఈ పుస్తకాన్ని ఆసక్తిదాయకంగా మలిచేందుకు ప్రయత్నించారు. శ్రీమద్భాగవతంలోని పన్నెండు స్కంధాలను ఏ భాగానికి ఆ భాగాన్ని ప్రశ్నలు– సమాధానాలుగా మలిచిన ఈ గ్రంథం క్విజ్ పోటీలకు కూడా పనికొచ్చేలా ఉంది.



410 పుటలు గల ఈ గ్రంథం వెల రూ. 200. (తపాలా ఛార్జీలు అదనం)

**ప్రతులకు:** డా. నండూరి గోవిందరావు,
ఫ్లాట్ నెం. 303, పార్క్‌వ్యూ రెసిడెన్సీ, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట,
హైదరాబాద్– 500 013, ఫోన్: 9849801490

జెన్‌పథం

## సాయం చేసి మరచిపో!

ఓ శిష్యుడు గురువు వద్దకు వచ్చి, నమస్కరించి ''నాకిప్పుడు బోలెడు సంపద లభించింది. దానినేం చేయాలి? మీరు ఏం చెప్తే అది చేస్తాను. ఏం చేస్తే నా మనసుకి ఆత్మకు ప్రశాంతత, ఆనందం కలుగుతుందో చెప్పండి... చేస్తాను'' అన్నాడు శిష్యుడు.


''కొన్ని రోజుల తర్వాత రా. చెప్తాను'' అన్నారు గురువుగారు.

శిష్యుడు వారం పది రోజుల తర్వాత గురువు దగ్గరకు తిరిగొచ్చాడు.

అప్పుడు గురువు ఇలా చెప్పారు – ''నీకు ఏం చెప్పాలో అర్థం కావడం లేదు. నీ సంపదను నువ్వే ఖర్చు చేస్తే అందువల్ల నీకు ఎలాటి ప్రయోజనమూ ఉండదు. పోనీ బంధువులకూ మిత్రులకూ ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోతుంది. అలాగని ఆలయాలకో మరి దేనికో ఇస్తే అక్కడి నిర్వాహకుల ధనాశకు మేత పెట్టినట్టు అవుతుంది. అంతా పేదలకు ఇచ్చావనుకో నీకు తృప్తి కలుగుతుందనడంలో సందేహం లేదు. కానీ నీలో పోను పోను 'నేనేగా చేసాను అంతటి పనిని' అంటూ అహం పెరిగి దానితోపాటు గర్వం ఎక్కువైతే అది నీ వ్యక్తిత్వానికి, పురోగతికి అడ్డుకట్టు అవుతుంది, నిన్ను దెబ్బ తీస్తుంది. ఆ దెబ్బతో నువ్వు దిగజారిపోతావు...'' అన్నారు గురువు.

''అయితే మరేం చెయ్యమంటారు చెప్పండి. మీరు చెప్పినట్టే చేస్తాను'' అన్నాడు శిష్యుడు.

''నిరుపేదలకు ఇచ్చెసెయ్. దానితో వారికి ఆనందం కలుగుతుంది. కానీ నువ్వు వారికి ఇచ్చాననుకున్న విషయాన్ని మరచిపో. సహాయం చేసిన వారికి గుర్తు పెట్టుకోనక్కర లేదు. సహాయం పొందిన వారు మరచిపోకుండా ఉంటే చాలు'' అన్నారు గురువు.



– యామిజాల జగదీశ్

## తగిన ఉద్యోగం దొరకడం లేదా?

ఉప శమనం

అర్హతలు ఉన్నా కొందరికి ఉద్యోగం దొరకడం దుర్లభం. దొరికినా అర్హతలకు, అనుభవానికి తగిన జీతం దొరకవు. ఆర్థిక ఇబ్బందులు, నిరాశా నిస్పృహలు వెన్నాడుతాయి. తరచు ఆరోగ్య సమస్యలు పీడిస్తూ ఉంటాయి. ఇలాంటి సమస్యల నుంచి గట్టెక్కడానికి కొన్ని పరిహారాలు...

- అరచేతిలో పట్టేంత పరిమాణంలో ఉన్న రాగిపాత్రలను తీసుకోండి. వాటిని శనగపిండితో తయారు చేసిన లడ్డూలతో నింపి, పాత్రలతో సహా ఆ లడ్డూలను ఐదుగురు బ్రాహ్మణులకు దానంగా ఇవ్వండి. ఈ పరిహారాన్ని ఆదివారం లేదా గురువారం ఆచరించడం మంచిది
- ప్రతిరోజూ రుద్రగాయత్రి మంత్రాన్ని 108 సార్లు జపించండి. కొత్త ప్రయత్నం ఏదైనా ప్రారంభించే ముందు పూజలో పసుపు వినాయకుడి ముందు ఆకులు వక్కలు ఉంచి, నిర్విఘ్నంగా పని పూర్తికావాలని వేడుకుని, గణపతి మంత్రాన్ని 11 సార్లు జపించండి
- ప్రతి శనివారం మధ్యాహ్నం నల్ల నువ్వులు కలిపిన అన్నం ముద్దలను కాకులకు పెట్టండి. ఆదివారం సూర్యోదయ వేళ రాగి పాత్రలో బెల్లం కలిపిన పానకాన్ని సూర్యుడికి నివేదించి, ఆ పానకాన్ని చిన్నారులకు పంచిపెట్టండి
- ప్రతినెలా పున్నమి, అమావాస్య రోజుల్లో కనీసం ముగ్గురు వికలాంగులకు భోజనం పెట్టండి. ప్రతి గురువారం ఆవులకు అరటిపండ్లు తినిపించండి
- రావిచెట్టు మొదట్లో ఆవనూనెతో దీపం వెలిగించిన తర్వాత ఆ ప్రమిదలో రెండు లవంగాలను వేసి, ఇష్టదైవాన్ని ప్రార్థించండి.

– పన్యాల జగన్నాథ దాసు

## ఆశీర్వచనాలు ఫలిస్తాయా?

సందేహం

భారతీయ సంస్కృతిలో ఆశీర్వచనానికి చాలా విలువ వుంది. అనేక సందర్భాలలో చిన్నవారిని పెద్దవారు ఆశీర్వదిస్తారు. విద్యార్థులను విద్యాప్రాప్తిరస్తు అని, పెళ్ళయిన ఆడవారిని దీర్ఘ సుమంగళీభవ అని, పురుషులని దీర్ఘాయుష్మాన్ భవ అనీ... ఇలా సమయానికి తగ్గట్లు వుంటాయి ఆ దీవెనలు. యజ్ఞయాగాదులు చేసేటప్పుడు, వేదోక్తంగా జరిగే కార్యక్రమాలలో పండితులు సమాజంలో అందరి శ్రేయస్సు కోరుతూ ఆశీర్వచనం చేస్తారు. అయితే ఈ ఆశీర్వచనాలకి ప్రభావం వుందా? అవి ఫలిస్తాయా? అంటే ఫలిస్తాయి. సత్పథంలో నడిచే వారికి సత్పురుషులు చేసిన ఆశీర్వచనాలు తప్పక ఫలిస్తాయి. ఈ ఆశీర్వచనాల వల్ల జాతక దోషాలు, మృత్యుగండాలు తొలుగుతాయి. గురువులు, సిద్ధులు, యోగులు, వేద పండితులు మనకన్నా చిన్నవారైనా వారి కాళ్ళకి నమస్కరించి ఆశీర్వచనం తీసుకోవచ్చు. అక్కడ మనం నమస్కరించేది వారి వయసుకి కాదు – వారి విద్వత్తుకు, వారిలోని సరస్వతికి. మార్కండేయుడు అల్పాయుష్కుడని తెలిసిన తలిదండ్రులు అతడికి పెద్దలు ఎవరు ఎదురైనా వారికి పాదనమస్కారం చేయమని చెప్పారు. మార్కండేయుడు అలాగే చేసి, దీర్ఘాయుష్మాన్ భవ అనే ఆశీర్వాద బలంతోనే చిరంజీవి అయ్యాడు.



## అక్షింతలే ఎందుకంటే...

అంతరార్థం

సాధారణంగా శిశువు జన్మించినప్పుడు పురిటి స్నానం రోజునుంచీ ప్రతి శుభసందర్భంలోనూ ఆశీర్వదించినప్పుడు తలమీద అక్షింతలు జల్లుతారు. ఆశీర్వచనానికీ, అక్షింతలకీ ఏమిటి సంబంధం? అక్షింతలే ఎందుకు చల్లాలి, పసుపుతో కలిపిన బియ్యమే ఎందుకు చల్లాలి? బియ్యం చంద్రుడికి కారకం. చంద్రుడు మనస్సుకి కారకుడు. అంటే మనస్ఫూర్తిగా ఇచ్చే ఆశీర్వచనానికి చిహ్నమన్నమాట. బియ్యంలో కలిపే పసుపు గురువుకి కారకం. గురువు శుభ గ్రహం. ఆయనకి సంకేతంగా, శుభానికి సంకేతంగా పసుపు రంగు కలిపిన అక్షింతలను మంత్రపూర్వకంగా తలమీద చల్లుతారు. మంత్రం అంటే క్షయం లేనటువంటిది. అకారంనుంచి క్షకారం దాకా వున్న అక్షరాలతో, బీజాక్షరాలతో కూడిన మంత్రానికి శక్తి వుంటుంది. మంత్రాన్ని చదివేటప్పుడి చేతితో పట్టుకున్న అక్షింతలకి కూడా ఆ శక్తి వస్తుంది. క్షయంలేని మంత్రాలను, క్షయంలేని అక్షింతలు పట్టుకుని చదివి, అవి ఎవరి తలపై వేస్తారో వారు కూడా క్షయం లేకుండా అభివృద్ధి చెందాలని ఆశీర్వదిస్తారు. ఆలాంటి ఆశీర్వచనానికి శక్తి వుంటుంది.



నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

సువార్త

## విశ్వాసి నిప్పులా బతకాలి



బేతనియలో యేసు గొప్ప అద్భుతం చేశాడు. ఆయనకు ఎంతో దగ్గరివాడైన లాజరు చనిపోగా అతని సోదరీమణులైన మరియ, మార్తను పరామర్శించేందుకు యేసు ఆ గ్రామానికొచ్చాడు. అంతేకాదు, నేరుగా లాజరు సమాధి వద్దకు వెళ్లి 'లాజరూ! బయటికి రా!'అని పిలవగా అప్పటికే చనిపోయి నాలుగురోజులైన లాజరు సజీవుడై బయటికొచ్చాడు. గొర్రెలమందను కాసే కాపరుల్లో, జీతగాళ్లుంటారు. వాటి యజమానులు కూడా ఉంటారని, మందపై తోడేళ్లు దాడి చేస్తే, జీతగాడు ప్రాణభయంతో వాటిని వదిలి పారిపోతాడని, యజమానుడైన కాపరి మాత్రం తన ప్రాణాలొడ్డి వాటితోనే పోరాడి మందను కాపాడుకుంటాడని, తాను కూడా యావత్ మానవాళి రక్షణకోసం ప్రాణార్పణ చేయబోతున్న 'పరమ కాపరి'నని కొద్దిరోజుల క్రితమే ఆయన చేసిన సంచలన బోధ విని ఛాందస యూదులాయన్ను రాళ్లతో కొట్టబోయారు. ''నీవు మంచి కాపరివి, మేము పారిపోయే జీతగాళ్లమా?'' అంటూ ఆయన మీద వ్యసనపడ్డారు. (యోహాను 10వ అధ్యాయం) రాళ్లతో కొడితే చనిపోవడానికి తాను అందరివాడిలాగా మానవమాత్రుణ్ణి కానని, తానే స్వచ్ఛందంగా ప్రాణం పెట్టబోతున్నానని వారికి యేసు స్పష్టం చేశాడు (10:18). ఈ సంచలనాత్మక బోధతో ఆయనకు ఛాందస యూదుల్లో చాలామంది శత్రువులయ్యారు కానీ సామాన్యుల్లో అంతకన్నా ఎక్కువమంది అనుచరులు, మిత్రులయ్యారు (10:42). తాను మాట్లాడిన ప్రతి మాటనూ ఆచరణలో రుజువు చేసే యేసు, మరణం మీద తనకున్న దైవాధికారాన్ని వెల్లడించేందుకే బేతనియలో లాజరుని ఆ తర్వాత కొద్దిరోజులకే సజీవుణ్ణి చేశాడు. ఆ తర్వాత రెండువారాలకు సిలువలో తన ప్రాణం పెట్టి మానవాళికంతటికీ 'మంచి కాపరి' అయ్యాడు

లాజరు అద్భుతానికి ముందు మరియమార్తల గ్రామంగా చెప్పుకునే బేతనియ (యోహాను 11:1) ఆ తర్వాత లాజరు నివసించే గ్రామంగా మారింది (12:1). ఎందుకంటే శవంగా మారిన తనలో మళ్లీ ఊపిరిని పోసి బతికించడం ద్వారా దేవుడు అద్భుతాన్ని చేస్తే, అలా పునఃప్రారంభమైన జీవితాన్ని దేవునికే అంకితం చేసి, పరివర్తనతో జీవించి దేవునికి మహిమకరంగా జీవించడం ద్వారా లాజరు తన జీవితాన్ని మహాద్భుతంగా మార్చుకున్నాడు. యేసు ఆరోహణానంతరం లాజరు చేసిన పరిచర్యతో యూదయ ప్రాంతమంతా ఆశీర్వదించబడిందని, చివరికి అతను యేసుకోసం హతసాక్షి అయ్యాడని చరిత్ర చెబుతోంది. యేసు చేసిన అద్భుతానికి లాజరు రుణం తీర్చుకున్న విధానమది. యేసు నా జీవితంలో అద్భుతం చేశాడంటూ చంకలు గుద్దుకోవడం కాదు, ఆ తర్వాత యేసుకోసం, ఆయన ప్రజల కోసం మనం మరెంత అద్భుతంగా జీవిస్తున్నామన్నది ప్రాముఖ్యమైన అంశం. యేసు అద్భుతాలు చేయాలన్న శ్రద్ధ మంచిదే కాని పరివర్తన పొంది యేసుకోసం మహాద్భుతంగా బతకాలన్న శ్రద్ధ మరీ మంచిది. నిప్పుకణికల్లాగా మండాల్సిన చాలా జీవితాలు, చర్చిలు బూడిదలా చల్లబడి చప్పబడి పోవడానికి కారణం ఆ శ్రద్ధ లోపించడమే! బూడిదలా వందేళ్లు బతకడం కాదు, నిప్పులా నిమిషంపాటు కణకణలాడినా చాలు!!

– రెవ.డా.టి.ఎ. ప్రభుకిరణ్

ఇస్లాం వెలుగు

## అంతా మన మంచికే...



ఒక్కోసారి అనుకోకుండా కొన్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. అంతా దైవ నిర్ణయం. కాని అందులో శుభం ఉంటుంది. మంచైనా, చెడైనా దైవ నిర్ణయమని తలచడం విశ్వాసుల లక్షణం.

పూర్వం యుద్ధరంగంలో ఒక రాజుకు చేతివేలు తెగిపోయింది. ఈ విషయం తెలిసి అందరూ వచ్చి పరామర్శించి వెళుతున్నారు. మంత్రి కూడా వచ్చి రాజుగార్ని పరామర్శించాడు. 'మాషా అల్లాహ్... దేవుడు తాను తలచింది చేస్తాడు. అందులో శుభం ఉంటుంది. ఏది ఏమైనా అంతా మనమంచికే.' అని ఊరడించాడు.

కానీ రాజుకు తీవ్రమైన కోపం వచ్చింది. వెంటనే మంత్రిని కొలువు నుండి తొలగించమని ఆదేశించాడు. మంత్రి 'మాషా అల్లాహ్... దైవం తాను తలిచింది చేస్తాడు. అందులోనే శుభం ఉంది.' అంటూ ఇంటి ముఖం పట్టాడు. ఇంతలో రాజ్యం నుండి కూడా బహిష్కరించమని మరోఆజ్ఞ జారీ అయింది. దీంతో మంత్రి రాజ్యం విడిచి వెళ్ళిపోయాడు.

అప్పుడప్పుడూ రాజు తన చేతిని చూసుకొని బాధపడుతూ ఉండేవాడు. ఒకసారి వేటకు బయలుదేరాడు. అడవిలో ఓ అందమైన లేడి కనిపించింది. దాన్ని పట్టుకోవాలని అశ్వాన్ని దౌడు తీయించాడు. ప్రాణభయంతో లేడి అడ్డదిడ్డంగా పరుగులు పెట్టసాగింది. రాజుకూడా అశ్వాన్ని దౌడుతీయిస్తున్నాడు. ఈ క్రమంలో వెంట ఉన్న రక్షణ దళం బాగా వెనుకబడి, రాజును సమీపించలేకపోయింది. కీకాకారణ్యంలో లేడి అదృశ్యమైపోయింది. బాగా అలసిపోయిన రాజు ఓ చెట్టుకింద మేనువాల్చాడు. నిద్రలోకి జారుకున్నాడు. మెలకువ వచ్చేసరికి అక్కడి పరిస్థితి అంతా చిత్రవిచిత్రంగా ఉంది. దేవతకు నరబలి ఏర్పాట్లు జరుగుతున్నాయక్కడ. అడవి మనుషులు పసుపు కుంకుమలు చల్లి, రకరకాల అలంకారాలతో రాజును బలిపీఠం ఎక్కించారు. తల తెగనరికేముందు నఖశిఖ పర్యంతం పరిశీలించిన పూజారి అతణ్ణి బలివ్వడానికి తిరస్కరించాడు. ఏ లోపమూలేని బలినే దేవత స్వీకరిస్తుందని చెప్పడంతో వారు రాజును విడిచి పెట్టారు. రాజు రాజధానికి చేరుకున్నాడు.

'మాషా అల్లాహ్' మర్మం తెలిసొచ్చిన రాజు వెంటనే మంత్రి ఎక్కడున్నా వెతికి సగౌరవంగా తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు. మంత్రి రాగానే నమస్కరించి, గుండెలకు హత్తుకుని, పక్కనే కూర్చోబెట్టుకున్నాడు. 'నా వేలు తెగినప్పుడు, నన్ను సహనం వహించమని, దేవుడు ఏది చేసినా మన మంచికే చేస్తాడని చెప్పారు. మీమాట నిజమైంది. కాని, నేను మిమ్మల్ని పదవిలోంచి తీసేసి దేశబహిష్కారం చేసినప్పుడు కూడా మీరు అదేమాట అన్నారు. కారణం ఏమిటి?' అని ప్రశ్నించాడు.

''రాజా! మీరు నన్ను పదవిలోంచి తొలగించకుండా, రాజ్యబహిష్కారం చేయకుండా ఉండి ఉంటే, నేను కూడా మీతోపాటు వచ్చి ఉండేవాడిని. మీ వెన్నంటే ఉండేవాడిని. వేలు తెగిన లోపం వల్ల మీకు విముక్తి లభించినా, ఏలోపమూ లేని నన్ను బలిపీఠం ఎక్కించి తెగనరికేవారు. ఆరోజు నన్ను పదవినుండి తొలగించడం వల్లనేకదా బతికిపోయాను. దేవుడుఏది చేసినా మనమంచికే చేస్తాడు. మాషా అల్లాహ్! అంటూ నవ్వాడు మంత్రి. ఈసారి ప్రేమగా కౌగిలించుకున్నాడు రాజు.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్



మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083


● నాగచైతన్య

# ముందు కాలేజీకి వెళ్లి...

కండలు తిరిగిన చేతులు... చేతులు రెండిటిలో శూలాల్లాంటి ఆయుధాలు... రణరంగంలో అర్జునుణ్ణి వెనక నుంచి చూస్తే అచ్చంగా ఈ విధంగానే ఉంటాడేమో అన్నట్టుంటుంది... 'సవ్యసాచి' ప్రీ–లుక్ చూస్తే! అక్కినేని నాగచైతన్య హీరోగా చందూ మొండేటి దర్శకత్వంలో మొదలైన ఈ సినిమా టైటిల్, ప్రీ–లుక్‌తో ఆడియన్స్‌ని ఎట్రాక్ట్ చేసింది. మైత్రీ మూవీస్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవి శంకర్, మోహన్ చెరుకూరి (సీవీయం) నిర్మించనున్న ఈ సినిమా చిత్రీకరణను ఈ నెల ద్వితీయార్ధంలో లేదా వచ్చే నెల అక్టోబర్ మొదటివారంలో ప్రారంభించాలనుకుంటున్నారు. హై–వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్‌ను ఓ కాలేజీలో ప్లాన్ చేశారట! పదిహేను, ఇరవై రోజుల పాటు కీలక సన్నివేశాలు చిత్రీకరించిన తర్వాత కొన్ని రోజులు విరామం ఇచ్చి నెక్స్ట్ షెడ్యూల్ ప్రారంభించే ఆలోచనలో చిత్రబృందం ఉన్నారట. ఇందులో హీరోయిన్ ఎవరనేది ప్రకటించనప్పటికీ పూజా హెగ్డేను ఖరారు చేసినట్టు సమాచారం. ఈ సిన్మా సంగతి పక్కన పెడితే.. నాగచైతన్య హీరోగా వారాహి చలన చిత్రం నిర్మించిన 'యుద్ధం శరణం' ఈ నెల 8న ప్రేక్షకుల ముందుకొస్తోంది.

# దసరాకు మహానుభావుడు


● శర్వానంద్

కాళ్లకు సాక్సులు తీయకుండానే నిద్రపోతాడు. ప్రేయసి కాళ్లకు ముద్దుపెట్టాలంటే ఆ కాళ్లకు పెర్ఫ్యూమ్ కొడతాడు. ఎవరికైనా తుమ్మొస్తోందంటే ఆమడ దూరం పారిపోతాడు. ఒక్క మాటలో చెప్పాలంటే కనిపించని గాలిని కూడా క్లీన్ చేయాలనుకునే టైప్. ఈ కుర్రాడి యవ్వారం తేడాగా ఉంది కదూ. నిజమే.. ఈ కుర్రాడికి ఓసీడీ అనే డిజార్డర్ ఉంది. అంటే.. అతి శుభ్రం అన్నమాట. ఈ డిజార్డర్ ఈ కుర్రాడి జీవితాన్ని ఎలా మలుపు తిప్పిందన్న అంశాలతో రూపొందిన చిత్రం 'మహానుభావుడు'. శర్వానంద్, మెహరీన్ జంటగా మారుతి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్‌లు నిర్మించారు. ఎస్.ఎస్. తమన్ స్వరకర్త. షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రాన్ని దసరాకు రిలీజ్ చేయాలనుకుంటున్నారు. మారుతి మాట్లాడుతూ– ''మ్యూజికల్ లవ్‌స్టోరీగా రూపొందిన ఈ చిత్రం శర్వానంద్ కెరీర్‌లో బెస్ట్ మూవీగా నిలుస్తుంది. శర్వా బాగా యాక్ట్ చేశాడు. తమన్ సంగీతం సూపర్'' అన్నారు. ''మారుతి క్రియేట్ చేసిన శర్వా క్యారెక్టరైజేషన్ నుంచి వచ్చే కామెడీ ప్రేక్షకులను నవ్విస్తుందనే నమ్మకం ఉంది. టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది'' అన్నారు నిర్మాతలు.

# సంక్రాంతికి... అజ్ఞాతవాసి?


● కీర్తి సురేశ్, పవన్‌కల్యాణ్

వచ్చే సంక్రాంతికి చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు పవన్‌కల్యాణ్ అండ్ కో కన్ఫర్మ్ చేశారు. 10.01.2018... పవన్ హీరోగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఎస్. రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న సినిమా విడుదల తేదీ ఇది. శనివారం పవన్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన 'బయటకొచ్చి చూస్తే..' మ్యూజికల్ ప్రోమోలో ఈ విషయాన్ని కన్ఫర్మ్ చేశారు. అనిరుధ్ రవిచందర్ పాడుతూ, సంగీతమందించిన ఈ ప్రోమోకు మంచి స్పందన లభిస్తోంది. ఇంకో వార్త ఏంటంటే... ఈ చిత్రానికి 'అజ్ఞాతవాసి' టైటిల్ ఖరారు చేశారని టాక్. దేవుడే దిగి వచ్చినా, ఇంజినీర్ బాబు, రాజు వచ్చినాడు వంటి టైటిల్స్ అంతకు ముందు వినిపించాయి. అయితే... కథకు 'అజ్ఞాతవాసి' టైటిల్ కరెక్టుగా సూటవుతుందని త్రివిక్రమ్ సూచించారట. ఇందులో కీర్తీ సురేశ్, అనూ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్లు.

# వరుణ్‌ది తొలిప్రేమే!


● రాశీ ఖన్నా

తొలి ప్రేమను మరచిపోవడం అంత సులువు కాదు. రియల్ లైఫ్ లవ్ ఇది. రీల్‌పై వచ్చిన పవన్ కల్యాణ్ 'తొలి ప్రేమ'నూ అంత ఈజీగా మరచి పోలేం. బాబాయ్ పవన్‌కల్యాణ్ కెరీర్‌లో మంచి హిట్‌గా నిలిచిన ఈ చిత్రం పేరునే అబ్బాయ్ వరుణ్‌తేజ్ కొత్త సినిమాకు ఖరారు చేశారని సమాచారం. వెంకీ అట్లూరి దర్శకత్వంలో వరుణ్‌తేజ్, రాశీఖన్నా జంటగా 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న సినిమా టైటిలే 'తొలి ప్రేమ'.

# అందమైన దెయ్యాన్ని చూశారా!?

ఏంటి... మీరు ఇంకా చూడలేదా? అయితే త్వరగా ఇన్‌సెట్ ఫొటోపై ఓ లుక్కేయండి. అందులో ఉన్నది దెయ్యమే. సమంతను దెయ్యం అనేస్తున్నారేంటి? అనొద్దు. ఎందుకంటే... నాగార్జున హీరోగా ఓంకార్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'రాజుగారి గది–2'లో ఆమె దెయ్యంగానే నటిస్తున్నారు మరి. ఈ దెయ్యం భలే అందంగా ఉంది కదూ! శుక్రవారంతో తన పాత్రకు సంబంధించిన చిత్రీకరణను సమంత పూర్తి చేశారు. సిన్మాలో చాలా ఆసక్తికరమైన పాత్ర పోషించానని ఈ ఫొటోను ట్వీట్ చేశారు. ఈ లుక్‌కి మంచి స్పందన లభిస్తోంది. పీవీపీ సినిమా, మ్యాట్నీ ఎంటర్‌టైన్‌మెంట్, ఓక్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఆల్మోస్ట్ పూర్తయినట్లే. మరో రెండు మూడు రోజులు మాత్రమే బ్యాలెన్స్ ఉందట! ఆల్రెడీ డబ్బింగ్ వర్క్ మొదలైంది. ''ఓంకార్ పర్‌ఫెక్షనిస్ట్. డబ్బింగ్ చెబుతున్నాను కదా! సినిమా బాగా వచ్చింది. మరో పది రోజుల్లో ఫస్ట్ కాపీ రెడీ అవుతుంది'' అన్నారు నాగార్జున. ఇందులో ఆయనది మెంటలిస్ట్ పాత్ర. దెయ్యానికి, మెంటలిస్ట్‌కి మధ్య జరిగే డ్రామాయే సినిమా. సీరత్ కపూర్, అశ్విన్‌బాబు, 'వెన్నెల' కిశోర్, 'షకలక' శంకర్ నటిస్తున్న ఈ చిత్రానికి ఎస్.ఎస్. తమన్ సంగీత దర్శకుడు.


● 'రాజుగారి గది–2'లో సమంత


● సమంత

# హీరో రాహుల్ దర్శకత్వంలో సుశాంత్


● సుశాంత్

'అందాల రాక్షసి', 'అలా ఎలా', 'గాలిపటం' తదితర చిత్రాల్లో హీరోగా, మహేశ్‌బాబు 'శ్రీమంతుడు'లో కీలక పాత్రలో నటించిన రాహుల్ రవీంద్రన్ దర్శకుడిగా మారనున్నారు. సుశాంత్ హీరోగా సిరిని సినీ కార్పొరేషన్ నిర్మాణంలో ఈ సిన్మా తెరకెక్కనుందని రాహుల్ తెలిపారు. ''చిన్ననాటి కలలను నిజం చేసుకునేందుకు దర్శకత్వంలో తొలి అడుగులు వేయబోతున్నాను. అక్టోబర్ లేదా నవంబర్‌లో షూటింగ్ స్టార్ట్ చేయాలనుకుంటున్నాం'' అని రాహుల్ ట్వీట్ చేశారు. ''లవ్లీ స్క్రిప్ట్‌తో రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ఈ సినిమా చేయబోతున్నా'' అని సుశాంత్ ట్వీటారు.


● రాహుల్ రవీంద్రన్

# ప్రేమించిన అమ్మాయి మోసం చేస్తే?

'ప్రేమిస్తే'తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు 'బాయ్స్' ఫేమ్, తమిళ హీరో భరత్. ఆయన నటించిన తాజా సినిమా 'మళ్ళీ ప్రేమిస్తే'. రవి భార్గవన్ దర్శకత్వంలో రామా రీల్స్ పతాకంపై జాన్ సుధీర్ పూదోట నిర్మించారు. రుహాని శర్మ, అంగనా రాయ్ కథానాయికలు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''ప్రేమిస్తే' తర్వాత భరత్ చేసిన ప్రేమకథా చిత్రమిది. ప్రేమించిన అమ్మాయి మోసం చేస్తే ఆ బాధ ఎలా ఉంటుందో దర్శకుడు అద్భుతంగా చిత్రీకరించారు. విజయ్ కురాకుల స్వరపరచిన ఐదు పాటలు వినసొంపుగా ఉన్నాయి. ఈ నెలలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. 'ప్రేమిస్తే' సినిమా ఎంత హిట్ అయిందో 'మళ్ళీ ప్రేమిస్తే' కూడా అంతటి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ముజీజ్ మాలిక్, సహ నిర్మాత: కిరణ్ తనమాల.


● రుహాని, భరత్, అంగన

# యధార్థ సంఘటన ఆధారంగా..

'మిస్టర్ ఆంధ్ర' బల్వాన్, మౌనిక జంటగా వీవీవీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'హైటెక్ కిల్లర్'. సోహ్రాబ్ ఆర్ట్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై మజ్ను సోహ్రాబ్ నిర్మించారు. ఎమ్. భాగ్యలక్ష్మి సహనిర్మాత. ఎస్.కె. మజ్ను సంగీత దర్శకుడు. మజ్ను సోహ్రాబ్ మాట్లాడుతూ– ''ప్యాచ్ వర్క్ మినహా సినిమా టాకీ పార్ట్ కంప్లీట్ అయ్యింది. ఎస్కే మజ్ను సంగీతం బాగుంది. ఈ చిత్రంలోని రెయిన్ సాంగ్ సినిమాకు హైలైట్‌గా ఉంటుంది. దసరాకు ఆడియోను, డిసెంబర్‌లో సినిమాను రిలీజ్ చేయాలనకుంటున్నాం'' అన్నారు. ''ఇటీవల కాలంలో జరిగిన ఓ యధార్థ సంఘటన ఆధారంగా కొన్ని కల్పిత పాత్రలతో చిత్రీకరించాం'' అన్నారు ఎమ్. భాగ్యలక్ష్మి. సత్యప్రకాశ్, చందు, గౌతమ్‌రాజు తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: యాదగిరి.












**నాణేనికి ఓ వైపు...**

ఉత్తరాదిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నదులు ఉప్పొంగాయి. ఉత్తరాఖండ్, బిహార్, పశ్చిమ బెంగాల్, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, గుజరాత్, ముంబైలను అతలాకుతలం చేశాయి.. పెద్దఎత్తున ప్రాణ నష్టం, ఆస్తి నష్టం వాటిల్లింది. దక్షణాదిలో అందుకు పూర్తిగా భిన్నం. జీవనదుల్లో నీటి లభ్యత తగ్గిపోవడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఒక్క కర్ణాటక పరిస్థితి మాత్రమే మెరుగ్గా ఉంది.

**మరోవైపు...**

ఒకే నది.. ఓ వైపు నిండుగా ప్రవహిస్తే.. మరోవైపు చుక్కలేక జలకళ తప్పింది. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో కురిసిన వర్షాలకు కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాలు పూర్తిగా నిండిపోతే.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులు నీళ్లులేక బోసిపోయాయి. అలాగే గోదావరిలోనూ. ఎగువన జైక్వాడ్, బాబ్లి, శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లో నీటి కొరత ఉంటే దిగువన నిండుగా ప్రవహిస్తోంది. ఈ ఏడాది ఇప్పటికే 648.67 టీఎంసీల గోదావరి జలాలు ధవళేశ్వరం బ్యారేజీ నుంచి సముద్రంలోకి వదిలేశారు.

దేశవ్యాప్తంగా నెలకొన్న ఇలాంటి అతివృష్టి, అనావృష్టి పరిస్థితులను అధిగమించడానికి నదుల అనుసంధానం ప్రత్యామ్నాయంగా తెరపైకి వచ్చింది. దీని ద్వారా పర్యావరణ సమతుల్యాన్ని పరిరక్షిస్తూ.. ఆయకట్టును స్థిరీకరిస్తే దేశంలో కొత్తగా 35 మిలియన్ హెక్టార్లకు నీటిని అందించవచ్చని జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) తేల్చింది. ఇదే అంశంపై అధ్యయనం చేసిన ఈ సంస్థ 34 వేల మెగావాట్ల జలవిద్యుత్‌ను కూడా ఉత్పత్తి చేయవచ్చునని లెక్కకట్టింది. నదుల అనుసంధానానికి 2003–04 అంచనాల ప్రకారం రూ.5.60 లక్షల కోట్లు ఖర్చవుతుందని కేంద్రానికి నివేదిక ఇచ్చింది. కానీ, ఈ యజ్ఞానికి రాష్ట్రాల వైఖరి ప్రతిబంధకంగా మారుతోంది.

# ‘అనుసంధానం’.. ఆమడదూరం

- నదుల అనుసంధానానికి ముందుకు రాని రాష్ట్రాలు
- కేంద్రం నడుం బిగించినా కుదరని ఏకాభిప్రాయం
- ఉత్తరాదిలో వరదలు.. దక్షిణాదిలో దుర్భిక్షం
- ఎగువన గోదారి కళతప్పితే.. దిగువన ఉప్పొంగుతోంది
- కృష్ణమ్మ ఎగువన మురిపిస్తే.. దిగువన దిగాలుపరుస్తోంది
- ఇలా అయితే తెలుగు రాష్ట్రాలు ఎడారే

**ద్వీపకల్ప నదుల అనుసంధానం ప్రతిపాదనలు**

| | |
|---|---|
| 1 | మహానది – గోదావరి |
| 2 | పార్ – తాపి – నర్మద |
| 3 | కెన్ – బెత్వా |
| 4 | దామన్‌గంగ – పింజాల్ |
| 5 | గోదావరి (పోలవరం) – కృష్ణా(విజయవాడ) |
| 6 | గోదావరి (ఇచ్ఛంపల్లి) – కృష్ణా (నాగార్జునసాగర్) |
| 7 | గోదావరి (ఇచ్ఛంపల్లి లోడ్యామ్) – కృష్ణా (నాగార్జునసాగర్) |
| 8 | పార్‌బటి – కలిసింద్ – చంబల్ |
| 9 | కృష్ణా (నాగార్జునసాగర్) – పెన్నార్ (సోమశిల) |
| 10 | కృష్ణా (శ్రీశైలం) – పెన్నార్ |
| 11 | కృష్ణా (ఆల్మట్టి) – పెన్నార్ |
| 12 | పెన్నార్ (సోమశిల) – కావేరి (గ్రాండ్ ఆనికట్) |
| 13 | కావేరి – వేగై – గుండూర్ |
| 14 | పంబ – అంచన్‌కోవిల్–వైప్పర్ |
| 15 | బెడ్తి – వరద |
| 16 | నేత్రావతి – హేమావతి |

**హిమాలయ నదుల అనుసంధానం ప్రతిపాదనలు**

| | |
|---|---|
| 1 | మానస్ – శంకోష్ – తీస్టా – గంగా |
| 2 | జోగిగోస్పా – తీస్టా – ఫరక్కా |
| 3 | గంగా – దామోదర్ – సుబర్ణరేఖ |
| 4 | సుబర్ణరేఖ – మహానది |
| 5 | కోసి – మోచీ |
| 6 | కోసి – గాగ్రా |
| 7 | చునార్ – సోన్ బ్యారేజ్ |
| 8 | సోన్ డ్యామ్ – గంగా దక్షిణ భాగం |
| 9 | ఫరక్కా – సుందర్బన్స్ |
| 10 | శారదా – యమునా |
| 11 | యమునా – రాజస్థాన్ |
| 12 | రాజస్థాన్ – సబర్మతి |
| 13 | గాగ్రా – యమునా |
| 14 | గండక్ – గంగా |



రాంగోపాల్ ఆలమూరు – సాక్షి, అమరావతి

దేశ భవితను సమూలంగా మార్చివేసే నదుల అనుసంధానం ప్రక్రియ ఒక అడుగు ముందుకు.. మూడు అడుగులు వెనక్కు అన్నట్లుగా తయారైంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నదుల అనుసంధానంపై కేంద్రం ప్రత్యేకంగా దృష్టి పెట్టినా రాష్ట్రాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తుండడటం ప్రతిబంధకంగా మారింది. దేశంలో రాయలసీమ తరహాలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన బుందేల్‌ఖండ్‌ను సస్యశ్యామలం చేయడానికి కెన్–బెత్వా నదుల అనుసంధానానికి మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాలు అంగీకరించడంతో దాన్ని కేంద్రం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించింది. రూ.20,340.02 కోట్లతో కెన్–బెత్వా నదుల అనుసంధానం ప్రాజెక్టును నదుల అనుసంధానానికి దిక్సూచిలా నిలిచేలా రెండు దశల్లో పూర్తిచేసేందుకు కేంద్రం దీనికి శ్రీకారం చుట్టింది. దేశంలో దుర్భిక్ష పరిస్థితులపై అధ్యయనం చేసిన ఎన్‌డబ్ల్యూడీఏ కరువు రక్కిసిని తరిమికొట్టడానికి నదులను అనుసంధానించడం ఒకటే మార్గమని కేంద్రానికి నివేదిక ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నదుల అనుసంధానంపై సమగ్రంగా అధ్యయనం చేసి.. హిమాలయ నదులను అనుసంధానం చేయడానికి 14, ద్వీపకల్ప నదులను అనుసంధానం చేయడానికి 16 ప్రతిపాదనలను చేసింది. 2003–04 ధరల (ఎస్ఎస్ఆర్) ప్రకారం ద్వీపకల్ప నదుల అనుసంధానానికి రూ.1.85 లక్షల కోట్లు.. హిమాలయ నదుల అనుసంధానానికి 3.75 లక్షల కోట్లు.. వెరసి రూ.5.60 లక్షల కోట్లు అవసరమని కేంద్రానికి నివేదిక ఇచ్చింది. దేశంలో తరచుగా తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడుతున్నా నదుల అనుసంధానంపై కేంద్రం చర్యలు తీసుకోకపోవడంపై మే, 2014లో సామాజికవేత్తలు సుప్రీంకోర్టులో ‘ప్రజాప్రయోజన వ్యాజ్యం’ దాఖలు చేశారు. దీనిపై విచారించిన సుప్రీంకోర్టు నదుల అనుసంధానాన్ని వేగంగా చేయడానికి ఏం చర్యలు తీసుకుంటున్నారని కేంద్రాన్ని వివరణ కోరింది. దీంతో కేంద్ర జలవనరుల శాఖ మంత్రి, సీడబ్ల్యూసీ (కేంద్ర జల సంఘం), ఎన్‌డబ్ల్యూడీఏ నేతృత్వంలో ప్రత్యేక కమిటీ వేయాలని జూలై 16, 2014న కేంద్ర కేబినెట్ తీర్మానించింది. అదే ఏడాది సెప్టెంబరు 23న నదుల అనుసంధానానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసింది. అప్పటి నుంచి ఇప్పటివరకూ ఈ కమిటీ 12సార్లు అన్ని రాష్ట్రాలతోనూ సమావేశాలు నిర్వహించింది. సబ్ కమిటీ, టాస్క్‌ఫోర్స్ కమిటీలతో 17 పర్యాయాలు రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపింది. అనుసంధానంపై ఏకాభిప్రాయాన్ని సాధించేందుకు రెండుసార్లు ప్రత్యేక సమావేశాలను నిర్వహించింది. కానీ.. అధిక శాతం రాష్ట్రాలు నదుల అనుసంధానంపై ఏకాభిప్రాయానికి రాలేదు. కెన్–బెత్వా నదుల అనుసంధానానికి మాత్రమే ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లు ముందుకు వచ్చాయి. దాంతో దాన్ని ‘జాతీయ ప్రాజెక్టు’గా ప్రకటించిన కేంద్రం.. ఆ ప్రాజెక్టును పూర్తిచేసేందుకు శ్రీకారం చుట్టింది.

## ముందుకు రాని రాష్ట్రాలు

ఇన్నిసార్లు సమావేశాలు జరిగినప్పటికీ రాష్ట్రాలు ముందుకు రాకుండా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తుండడంతో అనుసంధాన ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ప్రతిపాదనల పరిస్థితి మరీ ఘోరం. గోదావరి (ఇచ్ఛంపల్లి)–కృష్ణా(నాగార్జునసాగర్) అనుంధానానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సానుకూలంగా ఉంటే తెలంగాణ సర్కార్ వ్యతిరేకిస్తోంది. కృష్ణా(ఆల్మట్టి)–పెన్నా నదుల అనుసంధానానికి ఆంధ్రప్రదేశ్ ఆమోదం తెలిపితే కర్ణాటక తిరస్కరిస్తోంది. మహానది–గోదావరి–కావేరీ నదుల అనుసంధానానికి తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు అనుకూలమైతే.. ఒడిశా, తెలంగాణలు వ్యతిరేకిస్తున్నాయి. కెన్–బెత్వా మినహా దేశవ్యాప్తంగా మిగిలిన 29 అనుసంధాన ప్రతిపాదనలదీ ఇదే కథ.

## అనుసంధానం కాకపోతే తెలుగు రాష్ట్రాలు ఎడారే

నదుల అనుసంధానం ప్రతిపాదనల్లో తెలుగు రాష్ట్రాల భవితను మార్చే ప్రధానమైన ప్రతిపాదనలు మూడు ఉన్నాయి. గోదావరి (పోలవరం)–కృష్ణా (ప్రకాశం బ్యారేజీ), గోదావరి (ఇచ్ఛంపల్లి)–కృష్ణా (నాగార్జునసాగర్), కృష్ణా (ఆల్మట్టి)–పెన్నా (కాలువపల్లి) అనుసంధానం ప్రతిపాదనలు అత్యంత ప్రధానమైనవి. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ముందుచూపుతో 2005లోనే గోదావరి (పోలవరం)–కృష్ణా (ప్రకాశం బ్యారేజీ) అనుసంధానానికి నడుం బిగించారు. 194.6 టీఎంసీల సామర్థ్యంతో పోలవరం రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువ పనులను ప్రారంభించారు. తన హయాంలోనే కుడి కాలువను దాదాపుగా పూర్తిచేశారు. ఎడమ కాలువ పనులను పాక్షికంగా పూర్తిచేశారు. పోలవరం రిజర్వాయర్ పనులు ఓ కొలిక్కి తెస్తుండగానే ఆయన హఠాన్మరణం చెందారు. పోలవరం రిజర్వాయర్‌ను పూర్తిచేస్తే గ్రావిటీ ద్వారా కృష్ణా డెల్టాకు 80 టీఎంసీలను తరలించవచ్చు. కానీ.. పోలవరాన్ని పూర్తిచేయకుండా పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా కుడి కాలువలోకి నీటిని ఎత్తిపోసి నదుల అనుసంధానం చేశామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. ఇక గోదావరి(ఇచ్ఛంపల్లి)–కృష్ణా (నాగార్జునసాగర్) ప్రతిపాదననూ అప్పట్లో వైఎస్ చేపట్టడానికి ప్రయత్నించినా ఓ వర్గం నుంచి వ్యతిరేకత రావడంతో నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ ప్రాజెక్టును చేపట్టారు. కానీ.. విభజన నేపథ్యంలో ఆ ప్రాజెక్టుకు తెరపడింది. కృష్ణా నదిలో నీటి లభ్యత తగ్గిన నేపథ్యంలో గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు మళ్లించకపోతే తెలుగు రాష్ట్రాలు ఎడారిగా మారుతాయని సాగునీటి రంగ నిపుణులు స్పష్టీకరిస్తున్నారు.


### కేంద్రంలో కదలిక!

ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ తాజా వైఖరి నదుల అనుసంధానంపై కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఇందుకోసం త్వరలో కసరత్తు ప్రారంభం కానున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టులో భాగంగా ముందుగా ఈ రెండు నదులను అనుసంధానించి ఇతర రాష్ట్రాల్లోని ప్రాజెక్టులకు మోడల్‌గా మార్చాలని కేంద్రం భావిస్తోంది. కొద్దిరోజుల్లో కేంద్ర కేబినెట్ కూడా దీనికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే, పార్–తాపి నదులను నర్మదాతో.. దమన్ గంగాను పింజాల్ నదితో అనుసంధానించే ప్రణాళికలపై కూడా కేంద్రం దృష్టిపెట్టింది. ఇవన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాలకు సంబంధించినవి కావడంతో పనులు వేగంగా సాగవచ్చునని అధికారులు భావిస్తున్నారు. కాగా, ఇంత భారీ ప్రాజెక్టుపై విమర్శలూ లేకపోలేదు. దీనిపై లక్షల కోట్లు ఖర్చు చేసే బదులు నీటి పరిరక్షణపై దృష్టిసారించాలని వ్యవసాయ ఆర్థికవేత్తలు సూచిస్తున్నారు.




ఎండిపోయిన నాగార్జునసాగర్

## ఏకాభిప్రాయంతోనే సుభిక్షం..





కృష్ణా నదిలో నీటి లభ్యత తగ్గడం.. కర్ణాటక జలచౌర్యంవల్ల గత మూడేళ్లుగా నాగార్జునసాగర్‌కు అరకొరగా మాత్రమే నీళ్లు చేరుతున్నాయి. దాంతో 22 లక్షల ఎకరాల ఆయకట్టు బంజరుగా మారే పరిస్థితి నెలకొంది. సాగర్ ఆయకట్టు సస్యశ్యామలం కావాలంటే **గోదావరి (ఇచ్ఛంపల్లి)–కృష్ణా (నాగార్జునసాగర్)**ను అనుసంధానం చేయడం ఒక్కటే మార్గం. తెలంగాణలోని జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లాలో ఇచ్ఛంపల్లి వద్ద గోదావరి నదిపై బ్యారేజీ నిర్మించి, 94 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం ద్వారా 16,426 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీటిని నాగార్జునసాగర్‌కు తరలించవచ్చు. ఇందుకు ఎత్తిపోతలతోపాటూ 9.2 కిమీల సొరంగంతోపాటూ 299.25 కిమీల మేర కాలువ తవ్వాలి. కాలువ వెంట ఎస్సారెస్పీ (శ్రీరాంసాగర్ ప్రాజెక్టు) రెండో దశ ఆయకట్టుకు, శ్రీశైలం ప్రాజెక్టు ఎడమ కాలువ కింద మొత్తం 2.78 లక్షల హెక్టార్లకు ఆయకట్టుకు నీళ్లందించవచ్చు. దాంతోపాటూ నాగార్జునసాగర్ ఆయకట్టును స్థిరీకరించవచ్చు. ఈ ప్రతిపాదన అమలుకు రూ.26,289 కోట్లు అవసరం. దీన్ని చేపట్టేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నా.. ఇచ్ఛంపల్లి వద్ద నీటి లభ్యత లేదనే సాకు చూపుతూ తెలంగాణ సర్కార్ మోకాలడ్డుతోంది.




దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో అనంతపురం జిల్లా రెండో స్థానంలో ఉంది. వైఎస్సార్ కడప, కర్నూల్ జిల్లాలదీ అదే కథ. **కృష్ణా (ఆల్మట్టి)–పెన్నా (కాలువపల్లి)** అనుసంధానంతో రాయలసీమను సుభిక్షం చేయవచ్చు. ఆల్మట్టి నుంచి 587.17 కిమీల పొడవున కాలువ తవ్వి 1980 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీటిని పెన్నా బేసిన్‌కు తరలించవచ్చు. కాలువ వెంట కర్ణాటక పరిధిలోని బాగల్‌కోట, బీజాపూర్, కొప్పళ, బళ్లారి, రాయచూర్ జిల్లాల్లో 2.58 లక్షల హెక్టార్లకు నీళ్లందించడంతోపాటు రాయలసీమలో తుంగభద్ర ప్రాజెక్టు ఆయకట్టును స్థిరీకరించి, కొత్తగా లక్ష ఎకరాలకు నీళ్లందించవచ్చు. ఇందుకు రూ.6599.80 కోట్లు వ్యయం అవుతుంది. తుంగభద్రలో నీటి లభ్యత తగ్గిన నేపథ్యంలో ఈ అనుసంధాన ప్రతిపాదన రాయలసీమకు వరంగా మారుతుంది. కానీ.. కర్ణాటక సర్కార్ ఈ ప్రతిపాదనకు మోకాలడ్డుతోంది. దీని స్థానంలోనే కర్ణాటక ప్రభుత్వం అప్పర్ కృష్ణా మూడో దశ ప్రాజెక్టును చేపట్టింది.

**మహానది (మణిభద్ర డ్యామ్)–గోదావరి (ధవళేశ్వరం బ్యారేజీ)–కృష్ణా–పెన్నా (సోమశిల)–కావేరీ (గ్రాండ్ ఆనకట్ట)** ప్రతిపాదన అత్యంత కీలకమైంది. ఈ అనుసంధానం ప్రక్రియ పూర్తయితే ఒడిశాలో వరద ముప్పును అధిగమించడంతోపాటూ 3.21 లక్షల హెక్టార్లకు నీటిని అందించవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో పెన్నా బేసిన్‌లో ఆయకట్టును స్థిరీకరించి.. తమిళనాడులో కావేరీ బేసిన్‌లోని ఆయకట్టును రక్షించవచ్చు. మణిభద్ర జలాశయం నిర్మాణంవల్ల 59,400 హెక్టార్ల భూమి ముంపునకు గురవుతుందనే నెపంతో ఒడిశా సర్కార్ ఈ ప్రతిపాదనకు మోకాలడ్డుతోంది. 2015లో కేంద్రం అనేక దఫాలుగా చర్చలు జరిపినా ఒడిశా ప్రభుత్వం అంగీకరించలేదు. దాంతో ఈ ప్రతిపాదన దాదాపుగా మరుగునపడినట్లే.






# పేదల హృదయాల్లో నిలిచారు

**వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో కేవీపీ, రఘువీరా**

**సాక్షి, అమరావతి/విజయవాడ సెంట్రల్:** రైతులకు రైతుగా.. కూలీలకు కూలీగా.. రోగులకు డాక్టర్‌గా మహానేత, దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల హృదయాల్లో నిలిచిపోయారని రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు పేర్కొన్నారు. వైఎస్ 8వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం పీసీసీ అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి, కేవీపీ తదితర నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేవీపీ మాట్లాడుతూ రెండు పూటలా గంజికి లేని కుటుంబాల్లో కూడా వైఎస్ కృషితో నేడు డాక్టర్లు, ఇంజనీర్లు అయ్యారని గుర్తు చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మీద మీకు కోపం ఉంటే ఉండొచ్చు.. కానీ ఆ ఫిలాసఫీకి దయచేసి మీరు పాతర వేయవద్దంటూ ప్రభుత్వాలకు సూచించారు. రఘువీరా మాట్లాడుతూ రాజకీయంగా వైఎస్ అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నా గట్టిగా నిలబడ్డారని గుర్తు చేశారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, నాయకులు గిడుగు రుద్రరాజు, పక్కాల సూరిబాబు, ధనేకుల మురళీమోహన్, మీసాల రాజేశ్వరరావు, నరహరిశెట్టి నరసింహారావు, రాజీవ్ రతన్, కె.శివాజీ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జరిగిన వైఎస్ వర్ధంతి కార్యక్రమంలో తెలంగాణ పీసీసీ నేతలు మల్లు భట్టివిక్రమార్క, పొన్నాల లక్ష్మయ్య, దానం నాగేందర్ తదితరులు వైఎస్సార్‌కు ఘన నివాళులర్పించారు. ఆయనతో అనుబంధాన్ని నెమరేసుకున్నారు.



విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో చీరలు పంపిణీ చేస్తున్న పీసీసీ అధ్యక్షుడు రఘువీరా, ఎంపీ కేవీపీ రామచంద్రరావు

# విశాఖ స్టీల్‌కు హాల్ ఆఫ్ ఫేమ్ అవార్డు

**ఉక్కునగరం (గాజువాక):** విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సీఐవో–100 హాల్ ఆఫ్ ఫేమ్ –2017 అవార్డు లభించింది. దేశంలో అతి పెద్ద మీడియా టెక్నాలజీ పరిశోధన సంస్థ ఇంటర్నేషనల్ డాటా గ్రూప్(ఐడీజీ) ఇన్ఫర్మేషనల్ టెక్నాలజీలో ప్రతిభ చూపిన సంస్థలకు ఏటా ఈ అవార్డును అందచేస్తుంది. స్టీల్ ప్లాంట్ ఐటీలో చూపుతున్న ప్రతిభకుగాను ఈ అవార్డు ప్రకటించారు. శుక్రవారం పుణేలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఐటీ, ఈఆర్‌పీ జీఎం కేవీఎస్ఎస్ రాజేశ్వరరావు ఈ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో దేశంలోని వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న ఉక్కు జీఎం రాజేశ్వరరావు

## గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

## వధువు కావలెను



SC హిందు మాదిగ /B.Tech / IIT/ C. Govt. డిప్యూటీ మేనేజర్/ HAL/ 70,000/- PM/5'10"/ 28 సం॥ల వరునికి వధువుకు కావలెను. 9618009352 [HA-16522]

SC మాల/M.Tech(IIT)/Govt. R.W.S. Asst. Exq. ఇంజినీర్, 52,000/- PM/ 5'9"/ 29 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. 8978868220 [HA-691084]

కాపు/నాయుడు/M.Tech/C. Govt. / ONGC / Asst. మేనేజర్/90,000/- PM/ 5'11"/ 27 సం॥ అందమైన వరుడికి తగిన వధువు కావలెను. 8340841945 [HA-691084]

పద్మశాలి/B.Tech /సైంటిస్ట్ (DRDO) / 60,000/- PM/ 28 సం॥ /5'8"/ వెల్ సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. 9505240814 [HA-691084]

మాదిగ/30 Year / 5'10"/B.Tech /MBA/ Scale - 2 Officer in Bank of Baroda/ 50,000/- PM/ (2 Cr ప్రాపర్టీ) వెల్ సెటిల్డ్ అయిన వరుడికి వధువు కావలెను. 8142220475 [HA-061]

కుల పట్టింపులేదు/ రెండవ సంబంధం/34 Year / 5'10"/MBA/ Own Business / 1.5 Lks PM (2 Cr ప్రాపర్టీ) వెల్ సెటిల్డ్ అయిన వరుడికి వధువు కావలెను. 8142220817 [HA-061]

రెడ్డి/ విడో, కుల, ధన ప్రసక్తి లేదు/ 40 కోట్ల ఆస్తి / వయసు 34/5'4"/ Qly: వెరీ ఫేర్/ నెలకు 20 లక్షలు సంపాదన గల అందమైన వరుడికి వధువు కావలెను. 7997651656 [HA-691619]

తండ్రి బ్రాహ్మిణ్ తల్లి SC, M.Sc., 5'5", 26 సం॥ Income Tax Department లో Steno, 30 వేలు జీతం , 50 లక్షల ఆస్తి, కుల కట్న ప్రసక్తిలేని అందమైన వధువు కావలెను. VARMA - 91332 17931 [R- 434]

క్రిస్టియన్ మాదిగ / M.Tech (IIT)/ C. Govt. Jr. ఇంజినీర్ (రైల్వే) / 50000/ -PM /5'9" ఎత్తు/ 27 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. 9885055185 [HA-8136]

CNB/Christian / 45 Years / Divorcee / C. Govt. Employee / No Children/ Height 5'7"/ Ph No. 9676564376, Hyderabad [HA-691326]

CHRISTIAN / 41 Years/5'.6"Feet/ Medium Colour/ B.Com/Business. Seeks Bride. Contact Cell: 9581297603. [T-845942]

Sunny Saudi Rtd. Eng:63/5.5 young very active excellent health religious. Exceptionally well settled family with all in deen and duniya. seek for religious lady.All sons Doctors all working Saudimnistry. Ph: 08446536665 [C-860787]

★★

46Y / Ist Marriage / 5.6 / ముదిరాజ్/ Gnt. Govt డాక్టర్/1లక్షp.m/ఒంటరికి 30-35సం॥ డిగ్రీ వధువు కావలెను. డైవర్సీ/ విడో/ పిల్లలు లేకుండా, హిందు BC, OC. Time: 7pm-10pm, డైరెక్ట్ 9866671346 [G-617458]

SC హిందు మాల (కట్న ప్రసక్తి లేదు) 27/5'10" B.Tech S/W/E, TCS 80,000/- PM అందమైన వెల్‌సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. ఫోన్ : 80080 55675 [V- 596783]

70 సం॥ వృద్ధునికి వధువు కావలెను. 40-55 సం॥ మధ్య కాపు, కమ్మ, ఒంటరి మహిళ ఏ బాదర బందిలేని వారు వివరాలకు సంప్రదించండి. నో బ్రోకర్స్. 81063 66699 [V- 680305]

Rajamundry /బ్రాహ్మిన్/ 6N / శాండిల్యస / 36 సం॥/5'5"/M.Com / LLB / MBA/ ఆదాయం / 20 Lakhs (నో బ్రోకర్స్) 9848540316 [HA-691857]

## వరుడు కావలెను



రెడ్డి /విడో/ కుల, ఆస్తి ప్రసక్తి లేదు / 32/5'6" / Fair / B.Tech / 10 కోట్ల ఆస్తి / 20 నెలల పాప కలిగిన ఒంటరి వధువుకు 1వ, 2వ, మ్యారేజ్ వరుడు కావలెను. పిల్లలున్నా సరే. Ph: 7287844396 [HA-691377]

కుల, ఆస్తి ప్రసక్తి లేదు /కమ్మ/ లేట్ మ్యారేజ్/ 8 కోట్ల ఆస్తి / 34/5'5" / Fair /డిగ్రీ/యాక్సిడెంట్‌లో ఫ్యామిలీని కోల్పోయి Hydలో ఉంటున్న ఒంటరి వధువుకు మధ్యతరగతి వరుడు కావలెను. 9502554983 [HA-691377]

రెడ్డి/5 కోట్ల ఆస్తి /రామోజీ ఫిల్మ్‌సిటి సమీపంలో 20 ఎకరాల ల్యాండ్ /5'5" / Fair / Medicine చేసిన / 26 సం॥ల/తండ్రి లేని అందమైన వధువుకు వరుడు కావలెను. కుల ఆస్తి ప్రసక్తి లేదు. 8008067028 [HA-691377]

క్షత్రియ/సూర్య వంశం రాజులు/24/5'6" / Fair / డిగ్రీ/6 కోట్ల ఆస్తి/Hydలో సెటిల్డ్ అయిన చాలా అందమైన వధువుకు సాంప్రదాయక మధ్యతరగతి వరుడు కావలెను. CNB, ఇల్లరికం Ok. 9618265637 [HA-691377]

కుమ్మరి / B.Tech / SWE / 40,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-16522]

క్రిస్టియన్ మాల/ CA /చార్టర్డ్ ఎకౌంటెంట్/ 40,000/- PM/ 5'5" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618009352 [HA-16522]

www.avinashreddy.com అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (రెడ్డిలకు మాత్రమే) D.V. Koti Reddy 690, Road No.3, Banjara Hills, (TV 9 Opp Colony) Hyderabad 98480 11818, 93933 11818

వాల్మీకి బోయ/BSc / Agri / Govt. ఆఫీసర్/ అగ్రికల్చర్ Dept / 35,000/- PM/ 5'4" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007823 [HA-16522]

పద్మశాలి / MBA / బ్యాంక్ మేనేజర్ (SBI) / 50,000/- PM/ 25 సం॥ల / 5'5"/ ఎత్తు / అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9505240814 [HA-691084]

ముదిరాజ్/24 Year / 5'4"/ M.Tech / SWE/ 40,000/- PM/ (2 Cr ప్రాపర్టీ) వెల్ సెటిల్డ్ అయిన వధువుకు వరుడు కావలెను. Ph: 8142220475 [HA-061]

కుల పట్టింపులేదు/24 Year / 5'4"/ MBA/ SBI in Cashier/ 40,000/- PM/ ఏకైక పుత్రిక - ఇల్లరికం) వెల్ సెటిల్డ్ అయిన వధువుకు వరుడు కావలెను. Ph: 8142220817 [HA-061]

కాపు/లేట్ మ్యారేజ్/29y / 5'4"/ మెడికల్ ఆఫీసర్‌కు 10 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపులేని వరుడు కావలెను. 8106499144 [HA-691619]

CNB/వ: 57 సం॥/విడో/41 లేట్ మ్యారేజ్/ 40 సం॥ /2nd మ్యాచ్ / విడో / ఆర్థికంగా స్థిరపడిన వధువులకు వరులు కావలెను. తోడు, ఇల్లరికం ఐన Ok. 7396570769 [HA-691619]

రెడ్డి/విడో/32y / 5'4"/MSc (BEd)/ Govt. / 50,000/- PM/ 3 కోట్ల ఆస్తి కల్గిన 3 సం॥ల పాపను కూడ అంగీకరించే వరుడు కావలెను.(కుల, ధన ప్రసక్తిలేదు) 9502523516 [HA-8136]

కుల పట్టింపులేదు/(2వ పెళ్ళి)/57 / 5'3"/10th క్లాస్ / 10 ఎ॥ వ్యవసాయ భూమి + 2 ఎ॥ వరిపంట / 1 లక్ష PA వధువుకు వరుడు కావలెను. 7032764715 [HA-8136]

కమ్మ/ డైవర్సీ/కుల పట్టింపులేదు/22 కోట్ల ఆస్తి / 5'3"/30 / MBA / నెలకు 7 లక్షలు సంపాదన / అందమైన వధువుకు మంచి వరుడు కావలెను. 7286906109 [HA-8136]

మాల: MBBS,MD (Rodiology)/5'5/26Y/20 Cr. * B.Tech (IIT), 25y/ 5'.4/20 Cr / సెంట్రల్ Govt. 70 వేలు వధువుల కొరకు Rich వరులు (అర్జంట్‌గా)సంప్ర© 8121494810, 90320 94810 [B-300]

Hindu / Mala / 26 / 5'6" / M.Pharm / Well Cultured Bride / Looking for Groom with Government Job only / Phone : 8978530671 [HA-3110]

★★

కమ్మ/విడో/45/5'4"/Project Director /Govt. Job/ 1.5 L విజయవాడలో 20ఎ॥ పొలం / ఫాంహౌస్/ 15 Cr ప్రాపర్టీ తండ్రిని కోల్పోయిన వధువుకు వరుడు కావలెను. (CNB) 8978930291 [HA-693994]

రెడ్డి/డైవర్సీ/38/5'5"/PG / MPDO / Govt. Job / 2 L PM/ 2 సొంత ఇల్లు / 20 కోట్లు ప్రాపర్టీ గల ఏకైక వధువుకు తగిన వరుడు కావలెను. 9121881498 [HA-693994]


రెడ్డి/విడో/ 45/ 5'4"/BSc - BEd / Govt. టీచర్/35000/-PM గల వధువుకు కుల / ఆస్తి ప్రసక్తి లేని ఇల్లరికం వరుడు కూడా (Ok.) పిల్లలున్నా Ok. Ph: 7095922464 [HA-691044]

కమ్మ/5'5"/BCom BEd / Govt. టీచర్/ 35000/-PM/10 Cr/ ఈ మధ్యనే ఫ్యామిలీని కోల్పోయిన వధువుకు కుల / ఆస్తి ప్రసక్తి లేని ఇల్లరికం వరుడు కావలెను. V. అర్జెంట్. 7075384912 [HA-691043]

కాపు / 32 'y/ B.Tech, 60 వేల వధువుకు B.Tech వరుడు కావలెను.అన్ని కులాలకు ప్రధమ ద్వితీయ సంబంధాలు కుదర్చబడును లతా మ్యారేజ్ లింక్స్ ఫోన్ : 98495 61502 94412 11749 [P- 856211]

27/ 5'3"/ M.Tech Christian A.E.Eng. No Cast Bar Any Christian Qualified Govt Emp. below 30 years Direct; 96424 34977 [R-10460]

## వేదికలు



15 రోజులలో అన్ని కులములకు 1వ, 2వ, లేట్ దేశ, విదేశ సంబంధాలకై వ్యక్తిగత శ్రద్ధతో "పెళ్ళి పుస్తకం" వివాహ వేదిక సంప్ర॥M. శ్రీనివాస్‌రెడ్డి (రిటైర్డ్ ఇంజినీర్) 9246201550 [HA-691619]

ఓన్లీ రెడ్డీస్ / రెడ్డీస్ / డాక్టర్స్/, సాఫ్ట్‌వేర్స్ / Govt. / NRI's/ MBA / MCA/ బిజినెస్/ 1వ/2వ/విడో, దేశ/విదేశ సంబంధాలు ఫాస్ట్‌గా కుదర్చబడును. 9121010959 [HA-691512]

150రో॥ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. info@rohinimarriages.com, ✆ 9849058673, 94418 29644, 94920 33897, 94407 85888 [B-1067]

100% ఉచిత వివాహ సమాచార వెబ్‌సైట్ jeelakarrabellam.com నందు ఫ్రీగా రిజిస్టర్ చేసుకొని మీకు నచ్చిన Profiles ఫోన్ నెంబర్లు ఉచితంగా చూసుకోండి సంప్ర॥ 98497 44707 [G-617460]

కారుణ్య మేరేజ్ బ్యూరో. మా వద్ద అన్ని కులముల వధువు, వరునికి తగిన మేచింగ్స్ కుదుర్చబడును. లేట్ మ్యారేజ్, 2nd మ్యారేజ్ వారికి మేచింగ్స్ కలవు. ఫోన్ : 86886 65731 [V- 680263]

కావ్యశ్రీ మ్యారేజ్ బ్యూరో. రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 1000/- మాత్రమే. 1వ, 2వ లేట్ మ్యారేజస్, డైవర్సీస్, విడో, పెన్షనర్లకు అన్ని కులాల వారికి సంబంధములు త్వరగా కుదర్చబడును. (స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) 9705782042 [H-693963]

కేవలం మాల మాదిగ ST, క్రిస్టియన్, మా ప్రత్యేకత 1వ, 2వ, లేటు, డైవర్సీ, విడోస్, ఇల్లరికం Govt & సాఫ్ట్‌వేర్ జాబ్స్, దేశ విదేశ సంబంధాలకై AP, తెలంగాణలో (3 బ్రాంచిలు) 7032961809 [H-691502]

★★

మాల క్రైస్తవ, హిందూ వివాహ పరిచయ వేదిక M.B. విజ్ఞాన కేంద్రం, Opp. రాఘవయ్య పార్కు, బందరు రోడ్డు, విజయవాడ 24-9-17న 9 am to 2 pm వరకు, కళ్యాణమాల ✆ 94405 45049 [B-491]

TEAM మ్యారేజి బ్యూరో: కమ్మ మరియు అన్ని కులముల వారికి పెళ్ళి సంబంధములు కుదర్చబడును. విడోస్, డైవర్సీకి ఫ్రీ కన్సల్టెన్సీ. సంప్ర॥ ✆ 0866-6659296, 97053 59007. [B-599112]

విశ్వబ్రాహ్మణ వివాహ సమాచార కేంద్రం బ్రహ్మముడి గుంటూరు. ఇది విశ్వబ్రాహ్మణు ల ప్రత్యేక సంస్థ (ఉచిత సేవలు మరియు రుసుముతో కూడిన) సేవలు.94911 25725 [G-617251]

### ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి పెళ్ళిచూపులు

Combined : 1430/- for 4 Lines 385/- Extra Line
Andhra Pradesh: 990/- for 4 Lines (Incl. Hyd) 275/- Extra Line
Telangana : 880/- for 4 Lines (Incl. Hyd) 240/- Extra Line
* Color 25% Extra

| | | | | | |
|---|---|---|---|---|---|
| నిజామాబాద్ | : 99122 20764 | తిరుపతి | : 99122 20584 | తాడేపల్లి గూడెం | : 99122 20558 |
| కరీంనగర్ | : 9705933396 | కడప | : 99516 02932 | రాజమండ్రి | : 99122 20358 |
| వరంగల్ | : 99516 02868 | అనంతపూర్ | : 99122 20718 | విజయవాడ | : 9912225442 |
| నల్గొండ | : 95055 08382 | కర్నూల్ | : 99122 20575 | గుంటూరు | : 99122 20349 |
| మహబూబ్‌నగర్ | : 99128 22811 | శ్రీకాకుళం | : 99122 20343 | ఒంగోలు | : 99122 25431 |
| ఖమ్మం | : 99122 20596 | విశాఖపట్నం | : 99122 20550 | నెల్లూరు | : 99122 20736 |

మరియు మీ దగ్గరలోని సాక్షి ప్రాంతీయ కార్యాలయములలో సంప్రదించండి.

6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-23256000 Ext: 6230 / 6235 Cell: 9912225456.

# బంగారం దోపిడీ కేసులో మరో ఇద్దరు అరెస్టు

### రెండు పిస్టళ్లు, మూడు రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం

**విజయవాడ:** విజయవాడ నడిబొడ్డున బీసెంట్ రోడ్డు సమీపంలో బంగారు నగల తయారీ కార్ఖానాలో జూలై 11వ తేదీ రాత్రి జరిగిన భారీ దోపిడీ కేసులో మరో ఇద్దరు నిందితులును పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి రెండు పిస్టళ్లు, మూడు రౌండ్ల బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. సూర్యారావుపేట పోలీసు స్టేషన్‌లో జాయింట్ సీపీ బి.వి.రమణకుమార్ శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈ కేసులో ఇప్పటికే ఏడుగురు నిందితులను అరెస్టు చేశామన్నారు. తాజాగా ఉత్తరప్రదేశ్‌లోని బలియాజిల్లా, బహువారా గ్రామానికి చెందిన రామ్‌లకన్ సింగ్ అలియాస్ సాగర్ సింగ్, ఘాజీపూర్ జిల్లా జోట్న గ్రామానికి చెందిన పంకజ్‌సింగ్ అలియాస్ రాజాను అరెస్టు చేశామని పేర్కొన్నారు. పట్టుబడిన ఇద్దరు నిందితులు అత్యంత ప్రమాద కరమైన పాత నేరస్తులని జాయింట్ సీపీ రమణకుమార్ చెప్పారు.

**పోలీసులపై కాల్పులు జరిపిన నిందితులు**

ఉత్తరప్రదేశ్ ఘాజ్‌పూర్ జిల్లా సైదుపూర్ పోలీసు స్టేషన్ ఏరియాలో నేరస్తులు రామ్‌లకన్ సింగ్, పంకజ్‌సింగ్ ఉన్నట్లు పక్కా సమాచారంతో అక్కడి పోలీసుల సాయంతో సీసీఎస్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించారని తెలిపారు. గతనెల 28న సాయంత్రం 6 గంటల సమయంలో పోలీసుల రాకను గమనించిన నిందితులిద్దరు తమ వద్ద ఉన్న పిస్టళ్లతో పోలీసులపై కాల్పులు ప్రారంభించారని చెప్పారు. పోలీసులు చాకచక్యంతో వ్యవహరించి కాల్పుల నుంచి తప్పించుకుని నిందితులను పట్టుకున్నారని తెలిపారు. నిందితుల వద్ద దొరికిన పిస్టళ్లు బీసెంట్ రోడ్డులో జరిగిన దొంగతనం కేసులో ఉపయోగించారని వివరించారు. విలేకరుల సమావేశంలో డీసీపీ క్రాంతి రాణా టాటా తదితరులు పాల్గొన్నారు.

# పేట్రేగిన ఎమ్మెల్యే చింతమనేని

### అటవీశాఖ అధికారులపై బూతుపురాణం

- కొల్లేరు అభయారణ్యంలో చేపల పెంపకాన్ని అడ్డుకున్న అధికారులు
- అనుచరులతో వచ్చి దూషణలు, బెదిరింపులకు దిగిన ఎమ్మెల్యే
- సెల్‌ఫోన్లు లాక్కుని ఫొటోలు, వీడియోలు తొలగింపు

ఘటన స్థలంలో పోలీసులు (ఇన్‌సెట్‌లో) చింతమనేని



**ఏలూరు రూరల్:** పశ్చిమగోదావరి జిల్లా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మరోసారి రెచ్చిపోయారు. అక్రమ చేపల సాగును అడ్డుకున్న అటవీశాఖ అధికారులపై జులుం ప్రదర్శించారు. అనుచరులను రెచ్చగొట్టి అధికారులపై దాడులకు ఉసిగొల్పారు. అడ్డుపడిన సిబ్బందిపై బూతు పురాణం ఎత్తుకున్నారు. కొల్లేరులో శనివారం జరిగిన ఈ సంఘటన మరోసారి అధికార పార్టీ నాయకుల దుర్మార్గాన్ని బహిర్గతం చేసింది. వివరాల్లోకి వెళితే... ఏలూరు మండలం ప్రత్తికోళ్లలంక పరిధి అటవీ భూమిలో 100 ఎకరాల విస్తీర్ణం గల రెండు చెరువుల్లో టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చేప పిల్లలు వేసేందుకు ప్రయత్నించారు. ఇందుకోసం సుమారు 10 లారీలలో చేప పిల్లలను చెరువు వద్దకు తరలించి అనుచరులకు సూచనలు చేసి వెళ్లిపోయారు. ఈ విషయం తెలుసుకున్న పెదపాడు, ఏలూరు, భీమడోలు మొబైల్ టీం అటవీశాఖ డిప్యూటీ రేంజర్లు పి.గంగారత్నం, వెంకటరెడ్డి, ఈశ్వర్ తన సిబ్బందితో చెరువుల వద్దకు చేరుకున్నారు. చెరువులో చేప పిల్లలను వేయవద్దని అడ్డుకున్నారు. అభయారణ్యం పరిధిలో ఉన్న చెరువులో చేపలు సాగు చేయవద్దని హైకోర్టు ఉత్తర్వులు విధించిందని చెప్పుకొచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా అభయారణ్యంలో చేపల సాగు చేయడం నేరం అని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న చింతమనేని ప్రభాకర్ రెండు వ్యాన్లు, రెండు కార్లు, ఒక జీప్‌లో సుమారు 50 మంది అనుచరులతో కలిసి చెరువు వద్దకు చేరుకున్నారు. వచ్చీ రాగానే... 'ఎవడ్రా ఇక్కడ పనులు అడ్డుకున్నది. ఏమనుకుంటున్నార్రా...' అంటూ బూతు పురాణం విప్పాడు. 'ఎవడు అడ్డుకుంటాడో చూస్తా. చెరువులో పిల్లలు వేయండి' అంటూ అనుచరులకు చెప్పాడు. దీంతో అనుచరులు చెరువులో పిల్లలు వేసేందుకు మరోసారి ప్రయత్నించడంతో సిబ్బంది అడ్డుపడ్డారు. దీంతో రెచ్చిపోయిన చింతమనేని ప్రభాకర్ అధికారులతో పాటు సిబ్బందిని తీవ్రస్థాయిలో దూషిస్తూ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తానేంటో రుచి చూపిస్తా జాగ్రత్త అంటూ ఆవేశంతో ఊగిపోయారు. ఈ సంఘటనతో అధికారులు, సిబ్బంది ఒక్కసారిగా ఆందోళనకు గురై వెనక్కి తగ్గారు. ఇదే అదునుగా ఆయన అనుచరులు చేప పిల్లలను చెరువుల్లో వేసి వెళ్లిపోయారు.

**సెల్‌ఫోన్స్ లాక్కున్నారు:** ఈ తతంగం మొత్తాన్ని ఫొటో లేదా వీడియో తీశారనే అనుమానంతో చింతమనేని అనుచరులు కొందరు అటవీశాఖ అధికారులు, సిబ్బంది సెల్‌ఫోన్స్ లాక్కున్నారు. ఫొటోలు డిలీట్ చేసి తిరిగి ఇచ్చేశారు. ఒకరిద్దరి ఫోన్స్ తీసుకెళ్లిపోయారని తెలిసింది. ఈ ఘటనపై అధికారులు, సిబ్బంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు కేసు పెట్టేందుకు వెనకాడారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.

### కోర్టు ఆదేశాలు ధిక్కరిస్తూ చేపల సాగు...

ప్రత్తికోళ్లలంక గ్రామంలోని సుమారు 460 ఎకరాల చేపల చెరువులపై గ్రామస్థుల మధ్య మూడేళ్ల కిందట వివాదం ఏర్పడింది. దీనిపై ఇరువర్గాలు హైకోర్టును ఆశ్రయించాయి. కోర్టు ఆదేశాల మేరకు సర్వే చేపట్టిన అటవీ, రెవెన్యూ అధికారులు చెరువులు అభయారణ్య పరిధిలో ఉన్నాయంటూ నివేదిక అందజేశారు. దీన్ని పరిశీలించిన కోర్టు ఈ చెరువుల్లో చేప పిల్లలు వేయడం, పెంపకం, మేత కట్టడం, చేపల పట్టుబడిని నిషేధం చింది. దాంతో అక్కడ చేపల సాగు చేయడం మీవల్ల కాదంటూ ప్రజల నుంచి చెరువులను ఎమ్మెల్యే చేజిక్కించుకున్నారు. అప్పటినుంచి ఈ చెరువులు చింతమనేని, ఆయన అనుచరుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. కోర్టు ఆదేశాలు ధిక్కరిస్తూ పలుసార్లు చెరువుల్లో కోట్ల రూపాయల విలువ చేసే చేపలు పట్టుకుని సొమ్ము చేసుకున్నారు. తాజాగా నెలరోజుల కిందట వివాదానికి కారణమైన చెరువులో చేపలను సైతం పట్టేశారు. తిరిగి మళ్లీ పిల్లలు వేసేందుకు ప్రయత్నించడంతో అధికారులు అడ్డుకున్నా అనుకున్న పని చేసేశారు.

# లోపం తెలిసింది.. విచారణ మొదలైంది

- పీఎస్‌ఎల్వీ రాకెట్ ఉష్ణపు గదిలో గాలి పీడనం తగ్గటమే వైఫల్యానికి కారణం
- ఇందుకు కారణం ఏమిటనే దానిపై అధ్యయనం
- షార్‌లో ప్రాంతీయ విభేదాలే అనర్థాలకు కారణం!
- 418 కిలోమీటర్ల ఎత్తులోనే వేలాడుతున్న రాకెట్ శకలం
- మెల్లిగా కిందకు దించి సముద్రంలోకి కూల్చివేయాలని నిర్ణయం



**శ్రీహరికోట (సూళ్లూరుపేట):** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి గురువారం ప్రయోగించిన పీఎస్‌ఎల్వీ సీ-39 రాకెట్ విఫలం కావడంపై శాస్త్రవేత్తల్లో చర్చోపచర్చలు సాగుతున్నాయి. ఇందుకు గల కారణాలపై ఇస్రో చైర్మన్ ఏఎస్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం వరకు సుదీర్ఘ సమీక్ష జరిగింది. పీఎస్ ఎల్వీ రాకెట్ రోదసి ప్రయాణంలో రెండో దశ ప్రారంభం కాగానే 115 నుంచి 120 కిలోమీటర్ల ఎత్తులో హీట్‌షీల్డ్ (ఉపగ్రహానికి ఉపరితలంపై అమర్చిన ఉష్ణపు గది) తెరుచుకోవాల్సి ఉంది. అయితే, అందులో ఉండే మర్మన్ బ్యాండ్ అనే పరికరం యాక్టివేట్ అయినట్టు మల్టీ ఆబ్జెక్టివ్ ట్రాకింగ్ రాడార్ గుర్తించింది. హీట్‌షీల్డ్ తెరుచుకోవడానికి సెపరేషన్ కమాండ్ వెళ్లినప్పటికీ.. ఫైర్ బోల్ట్స్ ఓపెన్ కాలేదని గుర్తించినట్టుగా తెలుస్తోంది. హీట్‌షీల్డ్ తెరుచుకోవాలంటే అందులో 22 శాతం గాలి పీడనం అవసరం. అయితే, అందులో సగం పీడనం కూడా లేకపోవడంతో అది తెరుచుకోలేదనే విషయాన్ని గుర్తించారు. హీట్‌షీల్డ్ తెరుచుకోవడానికి రెండో దశ నుంచి నాలుగో దశ వరకు ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. నాలుగో దశలోని 2.5 టన్నుల ద్రవ ఇంధనం పూర్తిగా మండుతూ హీట్‌షీల్డ్‌తో కలిసి ఉన్న ఉపగ్రహాన్ని సుమారు 418 కిలోమీటర్ల ఎత్తు వరకు తీసుకెళ్లింది. ఆ సమయంలో నాలుగో దశ పూర్తి కాగా.. రాకెట్ నుంచి ఉపగ్రహం విడిపోయి హీట్‌షీల్డ్‌ను గుద్దుకున్నట్టు గుర్తించారు. ప్రస్తుతం ఉపగ్రహం హీట్‌షీల్డ్‌తో కలిసి 418 కిలోమీటర్ల ఎత్తులోనే ఉంది. ఉపగ్రహంలో ఉన్న 857 కిలోల ఇంధనాన్ని మండిస్తే (బ్లాస్ట్ చేస్తే) హీట్‌షీల్డ్ విడిపోతుందని ఓ సీనియర్ సైంటిస్ట్ సలహా ఇచ్చారు. దానిపైనా శుక్రవారం చర్చ జరిగింది. ఈ పని చేస్తే ఒక శకలంగా ఉన్న హీట్ షీల్డ్ విభాగం బ్లాస్ట్ అయి అనేక శకలాలుగా విడిపోయి రోదసిలో ఉన్న ఇతర ఉపగ్రహాలకు హాని కలిగించే ప్రమాదం ఉందని మరో శాస్త్రవేత్త స్పష్టం చేయడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ప్రస్తుతం 418 కిలోమీటర్ల ఎత్తులో వున్న ఈ శకలాన్ని నెమ్మదిగా కిందకు తీసుకొచ్చి సముద్రంలోకి కూల్చివేయడానికి సిద్ధమవుతున్నారు.

**విచారణకు ప్రత్యేక కమిటీ**

పీఎస్‌ఎల్వీ సీ-39 ప్రయోగం విఫలంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపేందుకు ఐసాక్ డైరెక్టర్ ఎం.అన్నాదురై ఆధ్వర్యంలో ఐదుగురి సభ్యులతో కమిటీని నియమించారు. 39 ప్రయోగాల తరువాత పీఎస్‌ఎల్వీ విఫలం కావడం, గతంలో ఎన్నడూ లేని విధంగా హీట్‌షీల్డ్ ఓపెన్ కాకపోవడంపై అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో హీట్‌షీల్డ్ క్లోజింగ్ విభాగంలో ప్రతి సెక్షన్‌లో పనిచేసిన వారిని క్షుణ్ణంగా విచారించేందుకు కమిటీ సిద్ధమవుతోంది. ఇస్రోలో ఇటీవల ప్రాంతీయ విభేదాలు తీవ్రస్థాయికి చేరుకోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయా అనే కోణంలోనూ విచారణ జరగనుందని తెలిసింది.

### మరో ప్రయోగానికి సిద్ధంకండి

షార్‌లోని రెండో ప్రయోగ వేదికపై పీఎస్‌ఎల్వీ సీ-40 ప్రయోగానికి సిద్ధం కావాలని ఇస్రో చైర్మన్ ఏఎస్ కిరణ్‌కుమార్ ఆదేశాలిచ్చారు. ఈ ప్రయోగానికి కావాల్సిన మెటీరియల్‌ను వెంటనే షార్ కేంద్రానికి చేర్చే విధంగా చూస్తామని చెప్పినట్టు సమాచారం. వెంటనే రెండో ప్రయోగ వేదికకు సంబంధించిన వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో అనుసంధానం పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్-1 హెచ్ బదులుగా అదే ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు ఇస్రో సిద్ధమవుతోంది.

# డేరా ఆశ్రమంలో బాలిక అదృశ్యం

**చండీగఢ్:** డేరా సచ్చా సౌదా ఆశ్రమంలో విద్యాభ్యాసం కొనసాగిస్తున్న బాలిక కనిపించడం లేదంటూ ఆమె కుటుంబ సభ్యులు ఆరోపించారు. హరియాణాలోని తివాలాకు చెందిన శ్రద్ధా అనే బాలికను చదువు నిమిత్తం ఆమె కుటుంబ సభ్యులు చాలా ఏళ్ల క్రితమే డేరా ఆశ్రమంలో చేర్పించారు. ఆమె అక్కడ యోగా నేర్చుకుంటోందని చివరిసారి డేరా నిర్వహణలోని మేగజీన్‌లో చూశామని శ్రద్ధా సోదరుడు పర్మిందర్ సింగ్ చెప్పారు. అయితే డేరా చీఫ్ గుర్మీత్‌కు శిక్ష విధించిన తరువాత శ్రద్ధా ఆశ్రమం నుంచి వెళ్లిపోయిందని మైనర్ బాలికల విభాగం ఇంచార్జీ పూనమ్ చెప్పినట్లు పేర్కొన్నారు. డేరా అధికారులను మొబైల్ ఫోన్ ద్వారా సంప్రదించడానికి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని వెల్లడించారు. అక్కడ ఇంకా కర్ఫ్యూ కొనసాగుతున్నందున లోపలికి వెళ్లలేక పోయామని తెలిపారు. డేరా ఆశ్రమంలోని సాహె బైటియాన్ బసీరా(మైనర్ బాలికల కేంద్రం)లో 29 మంది బాలికలు ఆశ్రయం పొందినట్లు తెలిసింది. వీరిని సోనిపట్‌లోని వేర్వేరు జువెనైల్ కేంద్రాలకు తరలించామని అధికారులు తెలిపారు.

**వారసుని ఎంపికపై వదంతులు నమ్మొద్దు: డేరా**

'గురూజీ(గుర్మీత్) తన వారసుడిని ప్రకటించారంటూ చాలా వదంతులు వ్యాపించాయి. అలాంటిదేం లేదు. వాటిని నమ్మొద్దు' అని డేరా చైర్‌పర్సన్ ట్వీటర్‌లో పేర్కొన్నారు. గుర్మీత్ దత్తపుత్రిక హనీప్రీత్ సింగ్ జాడ కనిపెట్టడానికి పోలీసులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. డేరా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ సభ్యత్వాన్ని ది ఇండియన్స్ ఫిల్మ్స్ అండ్ టీవీ డైరెక్టర్స్ అసోసియేషన్(ఐఎఫ్‌టీడీఏ) రద్దు చేసింది. గూండాలు, రేపిస్టులు, హంతకులకు తమ సంస్థలో చోటులేదని పేర్కొంది. గుర్మీత్ నిర్మించిన సినిమాలకు పనిచేసిన ఆయన దత్తపుత్రిక హనీప్రీత్ సింగ్ సభ్యత్వాన్ని కూడా రద్దు చేశామని వెల్లడించింది. విమానాశ్రయాల్లో వీఐపీ లాంజ్ సదుపాయం వినియోగించుకోవడానికి గుర్మీత్‌కు ఇచ్చిన అనుమతులను వెంటనే విరమించుకుంటున్నట్లు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ)కి రాసిన లేఖలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ ఆదేశాలను పాటించాలంటూ అన్ని విమానాశ్రయ డైరెక్టర్లకు ఆదేశాలు పంపామని అధికారులు తెలిపారు.

# నగరాలకు వరద ముప్పు



### మేల్కోకపోతే కష్టాలు తప్పవంటున్న నిపుణులు

సమగ్ర వరద నీటి ప్రణాళికలు, వాటిని కచ్చితంగా అమలు చేసే విధానాలు, యంత్రాంగం కొరవడడం నగరాలకు శాపంగా మారుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవలి భారీ వర్షాలకు ఆర్థిక రాజధాని ముంబై మునిగిపోగా, అటు అమెరికాలో నాలుగో అతిపెద్ద నగరం హూస్టన్‌లోనూ విషమ పరిస్థితులు ఏర్పడటం తెలిసిందే. 2000, 2015, 16 సంవత్సరాల్లో హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాలు వరదల బారిన పడి తీవ్రనష్టం వాటిల్లింది. అలాగే 2001లో అహ్మదాబాద్, 2002,03,09,2010 ఏడాదిల్లో ఢిల్లీ నగరాలను భారీ వరదలు అల్లకల్లోలం చేశాయి. దక్షిణ భారతంలోనే అతిపెద్ద నగరమైన చెన్నై 2004, 2015ల్లో వరదలకు అస్తవ్యస్తమైంది.

**అధికారుల అలసత్వమే అసలు సమస్య**

చెరువులు, నాలాల ఆక్రమణలు, కాలువలు పూడికలతో పేరుకుపోవడం, డ్రైనేజీల్లో చెత్తనిల్వలు చేరుకోవడం, అడ్డూ అదుపూ లేకుండా నిర్మాణాలు సాగిస్తుండటం మన దేశంలోని నగరాల్లో వరదలకు ప్రధాన కారణాలవుతున్నాయి. వరద ముప్పు ఏర్పడినప్పుడు అధికారులు తాత్కాలిక పరిష్కారాలకే మొగ్గు చూపుతూ సమస్య మూలాల్లోకి వెళ్లడం లేదు. మామూళ్ల మత్తులో అధికారులు అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలను పట్టించుకోవటమే లేదనే విమర్శలు ఉన్నాయి. శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోవడం వల్లనే వరద కష్టాలు పునరావృతమవుతున్నాయని అధ్యయనకారులు చెబుతున్నారు. పట్టణాల్లో వర్షపు నీటి నిర్వహణకు సరైన ప్రణాళికలు కొరవడితే దేశ జీడీపీలో 3 శాతం వరకు భారం పడుతుందని గ్రీన్ ఎకానమీ నివేదిక (యూఎన్‌ఈపీ, 2011) హెచ్చరించింది. భారత్‌లో నగరాల ప్రణాళికల ప్రక్రియ వివిధస్థాయిల్లో లోపభూయిష్టంగా ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**ప్రణాళికల రూపకల్పన, అమల్లో వైఫల్యం...**

నగరాల్లోని వివిధ వ్యవస్థలపై 2016లో భారత సర్వే విభాగం ఓ అధ్యయనం చేసింది. నగర ప్రణాళికల అమలు విషయానికొస్తే మొత్తం 21 ప్రధాన నగరాల్లో 14 నగరాలకు సున్నా మార్కులు, మిగతా 7 నగరాలకు 0.9 మార్కులు వచ్చాయి. భారత్‌లో నాలుగు లక్షల జనాభాకు ఒకే ఒక టౌన్ ప్లానర్ ఉండగా ఇంగ్లండ్‌లో 148 మంది ఉన్నారు. శాస్త్ర, సాంకేతిక పద్ధతుల్లో కాల్వల డిజైన్, మురుగు, వరదనీటిని వేరు చేయడం, వరదనీటి కోసం తగినంతగా కాల్వల నిర్మాణం వంటివి నగర ప్రణాళికలో ప్రధానం. అయితే దేశంలోని ఏ నగరానికీ మురుగునీటి పారుదల కోసం ప్రామాణికమైన ఆకృతి లేకపోవడం, చాలా నగరాలకు తగిన డ్రైనేజీ సౌకర్యాలు లేకపోవడం సమస్యగా మారింది. చెన్నైలో 2,847 కి.మీ పొడవైన రోడ్లు ఉంటే కేవలం 855 కిలో మీటర్ల పొడవైన వరద నీటి కాలువలు ఉన్నాయి. ఈ కారణంగా ఒకమోస్తరు భారీ వర్షాలకే వరద పరిస్థితి ఏర్పడుతోంది. ముంబైలోని వరద కాల్వల్లోకి 40 శాతం వరకు మురుగునీరు వచ్చి చేరడంతో వరదకాల్వల సామర్థ్యం తగ్గిపోతోంది.

**లండన్ నుంచి పాఠాలు నేర్వాలి**

వరద నీటి నిర్వహణ విషయంలో లండన్ నుంచి మనం పాఠాలు నేర్చుకోవాల్సి ఉంది. థేమ్స్ నది ఒడ్డున ఉంటూ వరద ముప్పును ఎదుర్కొంటున్న లండన్‌లో... 'థేమ్స్ బారియర్'పేరిట ముందుచూపుతో 2070 సంవత్సరం వరకు ఉపయోగపడేలా ఏర్పాటు చేసుకున్న వరద రక్షణ వ్యవస్థ ప్రస్తుతం సమర్థంగా పనిచేస్తోంది. ఇదే కాకుండా భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా 2100 సంవత్సరం వరకు ఉపయోగపడేలా 'థేమ్స్ ఈస్ట్యువరీ'ని రూపొందించుకున్నారు. భారత్‌లో విపత్తులను ఎదుర్కునేందుకు సమర్థవంతమైన యంత్రాగాన్ని, ముందస్తు హెచ్చరికల వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రమాదం పొంచిఉన్నప్పుడు దానిని ఎదుర్కోవడం కంటే ముందస్తు ప్రణాళికలు, పరిష్కారాలను సిద్ధం చేసుకోవడం మంచిదనీ, లేకపోతే నగరాలను వరద ప్రమాదాలు, మునకలు వెంటాడుతూనే ఉంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

- సాక్షి నాలెడ్జ్ సెంటర్

విద్య నేటి విద్యలో..
- జనరల్ స్టడీస్: వరల్డ్ జాగ్రఫీ
- టెన్త్ క్లాస్: సోషల్ ప్రిపరేషన్ టిప్స్
- జనరల్ స్టడీస్: ఫిజిక్స్

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్
sakshieducation@gmail.com

**దరఖాస్తు చేశారా?**

- ఫెడరల్ బ్యాంక్‌లో ఆఫీసర్, క్లర్క్ పోస్టులకు చివరి తేదీ: సెప్టెంబర్ 4
- ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో నేవిక్ (జనరల్ డ్యూటీ) 10+2 ఎంట్రీ-2018 బ్యాచ్‌కు చివరి తేదీ: సెప్టెంబర్ 4
- నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ)లో 18 సైట్ ఇంజనీర్ పోస్టులకు చివరి తేదీ: సెప్టెంబర్ 4

# లౌకిక భావన-పరిశీలన

**భారతదేశం బహు మతాలకు, భిన్న సంస్కృతులకు, భాషలకు నిలయం. భిన్నత్వంలో ఏకత్వాన్ని కలిగి ఉంటూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచే స్థాయిలో ఉండటం గర్వించాల్సిన విషయం. మత సామరస్యం కోసం లౌకిక రాజ్యంగా ప్రకటించడం జరిగింది. అయినా కొన్ని సందర్భాల్లో మత విశ్వాసాలకు, ఆధునిక అభివృద్ధికి, ప్రజల మనోభావాలకు మధ్య ఘర్షణ ఏర్పడుతోంది. వివిధ సందర్భాల్లో స్థానికంగా మతం రాజకీయ సమీకరణకు ప్రాతిపదిక అవుతూ వచ్చింది. ఈ పరిణామాల నేపథ్యంలో రాజ్యాంగ లౌకిక మూలాలు, ప్రకరణలు, చట్టాలను పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.**

## పోటీ పరీక్షల ప్రత్యేకం
## ఇండియన్ పాలిటీ

ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వాలు చాలా వరకు లౌకిక రాజ్యాలే. లౌకిక రాజ్యమంటే ప్రజలు, ప్రభుత్వానికి మధ్య సంబంధాలు, పరిపాలన.. మత విశ్వాసాల ప్రాతిపదికన కాకుండా రాజ్యం, చట్టపరంగా నిర్ణయించి కొనసాగించడం. లౌకికం అంటే భౌతిక ప్రపంచం గురించి ఆలోచించడం. మనకు తెలిసిన ప్రాపంచిక విషయాలను మన అనుభవం, పరిశీలనతో వ్యాఖ్యానించడం లేదా వివరించడం. మతం మనకు తెలియని మరో లోకాన్ని గురించి ఊహించి చెప్పే ప్రయత్నం చేస్తుంది.

- లౌకికవాదం అనే పదాన్ని 19వ శతాబ్దానికి చెందిన సామాజిక శాస్త్రవేత్త జార్జి జాకబ్ హోలియోక్ తొలిసారిగా వాడుకలోకి తెచ్చారు. ఈ పదం లాటిన్ భాషలోని Seculum (సెక్యులమ్) అనే పదం నుంచి ఉద్భవించింది. తరం (జనరేషన్) అని దీని అర్థం. ఆ తర్వాత వాడుకలో ప్రభుత్వాన్ని, పరిపాలనను.. మతం ముఖ్యంగా చర్చి నుంచి వేరుచేయడం.. పాలన చట్టం, రాజ్యాంగం ప్రకారం కొనసాగించడం అనే భావనలు లౌకికవాదంగా ప్రాచుర్యం పొందాయి.

### లౌకిక భావన, వివిధ పార్శ్వాలు

లౌకిక భావనకు రాజకీయ, సామాజిక పార్శ్వాలున్నాయి. రాజకీయ కోణంలో పరిశీలించినప్పుడు లౌకికవాదం అనేది చారిత్రక నేపథ్యంలో రాజ్యానికి-చర్చికి జరిగిన సంఘర్షణ. పూర్వకాలంలో ప్రజల అన్ని విషయాలను మతం, మతాచార్యులే నిర్దేశించేవారు. రాజు కూడా వీరు చెప్పినట్లే నడుచుకోవాల్సిన పరిస్థితి ఉండేది. కాబట్టి లౌకిక భావన అనేది రాజ్యాన్ని మత నియంత్రణ నుంచి వేరు చేసే ప్రయత్నంలో జరిగిన సంఘర్షణగా చెప్పొచ్చు. సామాజిక కోణంలో చూస్తే లౌకిక భావన అనేది ప్రజలు తమ జీవన విధానాన్ని స్వతంత్రంగా మలచుకొనే దశలో మితిమీరిన మత జోక్యాన్ని, ప్రభావాన్ని నిరసించే సామాజిక తిరుగుబాటుగా వర్ణించొచ్చు.

### భారతీయ భావన భిన్నం

పైన ఉదహరించిన రెండు అంశాలు పాశ్చాత్య సమాజానికి సంబంధించిన పరిణామాలు. అయితే భారతదేశంలో అలా లేదు. భిన్న మతాలు, విశ్వాసాలు, జాతులు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వానికి రెండు ప్రధాన ప్రాథమ్యాలుంటాయి. మొదటిది మతాన్ని రాజకీయాల నుంచి వేరు చేయడం, రెండోది భిన్న మతాల మధ్య సామరస్యాన్ని సాధించడానికి అన్ని మతాలకు సమాన గౌరవాన్ని కల్పించడం. ఈ నేపథ్యంలోనే భారత రాజ్యాంగ నిర్మాతలు లౌకికతత్వాన్ని రాజ్యాంగంలో పొందుపరిచారు.

- ప్రఖ్యాత భారతీయ తత్వవేత్త, భారతదేశ రెండో రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ భారతీయ లౌకిక భావనను ఈ విధంగా వర్ణించారు.. 'లౌకిక వాదం అంటే మతరహిత సమాజం కాదు. మత వ్యతిరేకం కూడా కాదు. ప్రాపంచిక సుఖాలు అంతకంటే కాదు. విశ్వవ్యాప్తమైన ఆధ్యాత్మిక విలువలను విభిన్న మార్గాల్లో అన్వేషించడమే'.

### లక్షణాలు

- ప్రభుత్వానికి అధికార మతం ఉండరాదు.
- అన్ని మతాలకు సమాన గుర్తింపు, గౌరవం, సమాన అవకాశాలు. మత వివక్షకు తావు లేదు.
- మత విశ్వాసాలను హేతుబద్ధతతో పాటించడం. మూఢ విశ్వాసాలను త్యజించడం.
- న్యాయమైన, మానవీయమైన జీవన పరిస్థితులను కల్పించడం.
- మతం పూర్తిగా వ్యక్తిగతం. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా మాత్రమే ప్రభుత్వ జోక్యం ఉండాలి.



### రాజ్యాంగ సవరణ-లౌకిక భావన ద్విగుణీకృతం

లౌకికతత్వం (సెక్యులర్) అనే పదాన్ని మౌలిక రాజ్యాంగంలో ప్రస్తావించలేదు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రవేశికలో పొందుపరిచారు. ఈ పదం చేరికతో రాజ్యాంగ లౌకికతత్వం మరింత స్పష్టంగా ద్విగుణీకృతమైంది. అంతేకాకుండా మౌలిక నిర్మాణంలో అంతర్భాగంగా పరిగణనలో ఉంది.

### లౌకికతత్వం- రాజ్యాంగ ప్రకరణలు

రాజ్యాంగం వివిధ ప్రకరణల్లో లౌకికతత్వాన్ని స్పష్టీకరించింది. దీనికి అనుగుణంగా పార్లమెంటు.. చట్టాలను కూడా రూపొందించింది. ప్రవేశికలో లౌకికతత్వం అనే పదం చేరిక, ప్రాథమిక హక్కులలో మత స్వేచ్ఛను గుర్తించడం, నిర్దేశిక నియమాలలో ఉమ్మడి పౌర నియమాలను ప్రస్తావించడం, ప్రాథమిక విధుల్లో పరమత సహనాన్ని ప్రతి పౌరుడు కలిగి ఉండాలని కోరడం, లౌకికతత్వానికి మచ్చుతునకలుగా చెప్పొచ్చు. వాటిని ఈ కింది విధంగా పరిశీలించొచ్చు.

### ప్రవేశిక - లౌకిక భావన

భారత రాజ్యాంగ ఆత్మ, హృదయంగా పరిగణించే ప్రవేశికలో లౌకికం అని చేర్చడం, ప్రతి వ్యక్తికి ఆరాధన, విశ్వాసం, నమ్మకం అనే అంశాలలో స్వేచ్ఛను గుర్తించడం లౌకికతత్వానికి ప్రతీకగా పేర్కొనొచ్చు.

### ప్రాథమిక హక్కులు- లౌకికతత్వం

రాజ్యాంగం మూడో భాగంలో మత స్వేచ్ఛను ప్రాథమిక హక్కుగా పేర్కొనడం విశేషంగా పరిగణించాలి. ముఖ్యంగా..

- ప్రకరణ-14 ప్రకారం చట్టం ముందు అందరూ సమానులే. చట్టం మూలంగా అందరికీ సమాన రక్షణ.
- ప్రకరణ-15 ప్రకారం మత ప్రాతిపదికపై ప్రజల పట్ల వివక్షను నిషేధించడం.
- ప్రకరణ-16 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో కొన్ని మినహాయింపులు తప్ప అందరికీ సమాన అవకాశాలు ఇవ్వడం.
- ప్రకరణ-25 ప్రకారం ప్రతి వ్యక్తి తన ఆత్మ ప్రబోధం మేరకు తనకు నచ్చిన మతాన్ని అవలంబించడం, ఆచరించడం, ప్రచారం చేసుకోవడం వంటివి చేయొచ్చు.
- ప్రకరణ-26 ప్రకారం మత సంస్థలను స్థాపించుకొని, నిర్వహించుకునే హక్కును గుర్తించడం.
- పకరణ-27 ప్రకారం మతం ఆధారంగా పన్నులు విధించకుండా నిషేధించడం.
- ప్రకరణ-28 ప్రకారం ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు విద్యా సంస్థల్లో ప్రత్యేక మత బోధన నిషేధించడం.
- నిర్దేశిక నియమాల్లో ప్రకరణ 44 ప్రకారం ఉమ్మడి పౌర నియమావళిని అమలు చేయాలని ప్రభుత్వానికి మార్గదర్శకత్వం చేయడం ద్వారా దేశ ఐక్యత, సమగ్రతలకు మత విశ్వాసాలు సమస్యగా పరిణమించకుండా నియంత్రించొచ్చు.

**రాజ్యాంగం ప్రకారం ఏ ప్రజా ప్రతినిధికి పోటీ చేయడానికైనా మతం అడ్డంకి కాదు. ఉదా:**


- రాష్ట్రపతి పదవికి పోటీచేయడం (ప్రకరణ-58)
- ఉపరాష్ట్రపతి పదవికి పోటీచేయడం (ప్రకరణ-66)
- గవర్నర్ నియామకం (ప్రకరణ-155)
- పార్లమెంటు, శాసనసభలకు పోటీ చేయడం (ప్రకరణ 80, 173) మొదలైన అంశాలు.
- అదేవిధంగా 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికి ఓటు హక్కును కల్పించడం (ప్రకరణ-325) కూడా లౌకికవాదానికి ఉదాహరణలుగా చెప్పొచ్చు.

### లౌకికతత్వం, వివాదాలు, సుప్రీంకోర్టు తీర్పులు

రాజ్యాంగంలో లౌకిక రాజ్యం అనే పదం ప్రత్యక్షంగా పేర్కొననప్పటికీ భారతదేశం లౌకిక రాజ్యమే అని ప్రాథమిక హక్కుల్లోని ప్రకరణలు 25 నుంచి 28 వరకు స్పష్టంగా తెలియజేస్తున్నాయని సుప్రీంకోర్టు... జేవియర్ కాలేజ్ Vs స్టేట్ ఆఫ్ గుజరాత్ కేసు (1974)లో తీర్పు చెప్పింది. అదేవిధంగా 1994లో ఎస్ఆర్ బొమ్మాయ్ Vs స్టేట్ ఆఫ్ కర్ణాటక కేసులో లౌకికతత్వం రాజ్యాంగంలోని మౌలిక సారాంశంలో అంతర్భాగమని, లౌకికతత్వాన్ని ఉల్లంఘించే రాష్ట్రాలపై ప్రకరణ 356 ప్రకారం చర్యలు చేపట్టవచ్చని స్పష్టం చేసింది. లౌకికతత్వాన్ని సకారాత్మకంగా, నిర్మాణాత్మకంగా చూడాలని, పాఠశాలలో వివిధ మత విలువలను విద్యార్థులకు బోధించడం ద్వారా ఇతర మతాల పట్ల గౌరవాన్ని కలిగి ఉండటానికి, పరమత సహనానికి తోడ్పడుతుందని అది లౌకికతత్వానికి విఘాతం కాదని 2003లో అరుణారాయ్ Vs ఇండియన్ యూనియన్ కేసులో సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అదేవిధంగా కొన్ని మార్గదర్శక సూత్రాలను ప్రకటించింది.

### లౌకికతత్వాన్ని పెంపొందించే అంశాలు

- శాస్త్రీయ విద్యను, తార్కిక ఆలోచనను ప్రోత్సహించాలి.
- రాజకీయాల్లో మత సంస్థలు పాల్గొనరాదు.
- వ్యక్తి ప్రజా జీవితంలో తాము నిర్వహించే పాత్రలో తన వ్యక్తిగత మత విశ్వాసాలను చొప్పించరాదు.




మొత్తానికి మత స్వేచ్ఛ, నమ్మకాలు వ్యక్తిగత ఔన్నత్యానికి, ఆధ్యాత్మిక చింతనకు తోడ్పడినంత వరకు ఫర్వాలేదు కానీ మత స్వేచ్ఛల పేరుతో మత సామరస్యానికి చేటు చేసేవారిపై తగిన చర్యలు తీసుకోవాల్సిందే. లేదంటే ప్రతి చిన్న విషయం అలజడికి కారణమై దేశ ఐక్యత, సమగ్రతకు సవాలుగా పరిణమించవచ్చు. కారల్‌మార్క్స్ అన్నట్లు మతం మత్తు మందుగా మారుతుంది. మతోన్మాదానికి దారితీస్తుంది. ఉన్మాదంగా చెలరేగుతుంది. మానవ సంస్కృతిని మింగేస్తుంది. దీనికి చరిత్రలో చాలా ఆధారాలున్నాయి. మతోన్మాద చరిత్ర ఎప్పటికీ పునరావృతం కారాదు. చరిత్ర నుంచి గుణపాఠాలు నేర్చుకోకపోతే అవి పునరావృతం అవుతాయి. లౌకికతత్వం వర్ధిల్లాలి. రాజ్యాంగ, చట్టపాలన కొనసాగాలి.

బి.కృష్ణారెడ్డి
డైరెక్టర్,
క్లాస్-వన్ స్టడీ సర్కిల్



## కాంపిటీటివ్ కౌన్సెలింగ్

**పోటీ పరీక్షల్లో మెంటల్ ఎబిలిటీ విభాగానికి సంబంధించి ఎలాంటి ప్రశ్నలు వస్తాయి? వాటికి ఎలా ప్రిపేర్ కావాలి?**

*ఆర్. పార్థసారథి, ఖమ్మం*

పోటీ పరీక్షల్లో మెంటల్ ఎబిలిటీ చాలా ముఖ్య విభాగం. ఇందులో వెర్బల్, నాన్ వెర్బల్, లాజికల్ రీజనింగ్‌తోపాటు డేటా ఇంటర్‌ప్రిటేషన్ లాంటి అంశాలు ఉంటాయి. క్రమ పరీక్ష, భిన్న పరీక్ష, క్యాలెండర్, దిశలు, దూరాలు, రక్త సంబంధాలు, పోలిక పరీక్ష తదితర అంశాలపై ఎక్కువగా ప్రశ్నలు వస్తాయి. ఈ విభాగ ప్రశ్నలను మ్యాథ్స్ విద్యార్థులే చేయగలరని చాలా మంది భావిస్తారు. కానీ సాధన చేస్తే ఆర్ట్స్, మ్యాథ్స్ అనే భేదం లేకుండా ఎవరైనా సమాధానాలను తేలిగ్గా గుర్తించవచ్చు. పరీక్షలో సమయం చాలా విలువైంది. క్రమంతప్పకుండా సాధన చేయడం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ సమాధానాలు గుర్తించే అవకాశం ఉంది. దీంతోపాటు కచ్చితత్వం కూడా అలవడుతుంది. క్రమ పరీక్ష, నంబర్ పోలిక, భిన్న పరీక్ష, డేటా ఇంటర్‌ప్రిటేషన్‌కు సంబంధించిన సమస్యలను సాధించడానికి 1 నుంచి 20 వరకు ఎక్కాలు; 1 నుంచి 25 వరకు వర్గాలు; ఘనాలు తెలిసి ఉండాలి. తద్వారా జవాబులను వేగంగా గుర్తించవచ్చు. అలాగే కోడింగ్-డీకోడింగ్ ప్రశ్నలకు సమాధానాలను సులభంగా గుర్తించడానికి 'ఎ' నుంచి 'జెడ్' వరకు ఆంగ్ల అక్షరాల సంఖ్యా క్రమం తెలిసి ఉండాలి. దిశలు-దూరాలు అధ్యాయంలోని సమస్యలను సాధించడానికి అన్ని దిశలు తెలిసి ఉండాలి. దిశల్లోని మొదటి అక్షరాల (ఉ, ఈ, తూ, ఆ, ద, నై, ప, వా)తో అన్ని దిశలను గుర్తుంచుకోవాలి. పాత ప్రశ్నపత్రాలను పరిశీలించడం ద్వారా ప్రశ్నల సరళిపై అవగాహన వస్తుంది.

**పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలో రీజనింగ్ నుంచి ఎలాంటి ప్రశ్నలు ఇస్తారు?**

*కె. సుబ్బారావు, జమ్మలమడుగు*

రీజనింగ్ విభాగంలో వెర్బల్ రీజనింగ్, నాన్ వెర్బల్ రీజనింగ్ అనే రెండు అంశాలు ఉంటాయి. ఇందులో వెర్బల్ రీజనింగ్ నుంచి ఎక్కువ శాతం ప్రశ్నలు వస్తాయి. వెర్బల్ రీజనింగ్‌లో సిరీస్, అనాలజీ, క్లాసిఫికేషన్, కోడింగ్ అండ్ డీ కోడింగ్, రక్త సంబంధాలు, దిక్కులు, తార్కిక వెన్ చిత్రాలు, సిల్లాయిజమ్ సంబంధిత అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి. నాన్ వెర్బల్ విభాగం నుంచి సిరీస్, అనాలజీ, క్లాసిఫికేషన్స్, మిర్రర్/వాటర్ ఇమేజెస్ మొదలైన అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. మాదిరి ప్రశ్నపత్రాలను ఎక్కువగా ప్రాక్టీస్ చేయడం వల్ల ఇందులో మంచి స్కోర్ సాధించవచ్చు.

# National Sports Awards 2017

National Sports Awards are given every year to recognize and reward excellence in sports. These awards are given every year on August 29, National Sports Day. It is the birth anniversary of hockey legend Major Dhyan Chand. For the year 2017 the President Ram Nath Kovind honored the following sports persons with the awards on August 29 at Rashtrapati Bhawan in New Delhi.

- Rajiv Gandhi Khel Ratna award was given to two players. The winners are Devendra Jhajharia (Para-Athlete) and Sardar Singh. (Hockey). Javelin thrower Devendra Jhajharia is the first paralympian to be conferred India's highest sporting honor. He is the first Indian to win two Paralympic gold medals. Sardar Singh is former hockey captain.

**Arjuna awards were given to 17 players. They are:**

1. Jyothi Surekha Vennam (Archery)
2. Khushbir Kaur (Athletics)
3. Arokia Rajiv (Athletics)
4. Devendro Singh (Boxing)
5. Prashanti Singh (Basketball)
6. Cheteshwar Pujara (Cricket)
7. Harmanpreet Kaur (Cricket)
8. Oinam Bembem Devi (Football)
9. SSP Chawrasia (Golf)
10. S.V. Sunil (Hockey)
11. Jasvir Singh (Kabaddi)
12. Prakash Nanjappa (Shooting)
13. Anthony Amalraj (Table Tennis)
14. Saketh Myneni (Tennis)
15. Satyawart Kadian (Wrestling)
16. Mariyappan Thangavelu (Para Athlete)
17. Varun Bhati (Para Athlete)

**Dronacharya Awards were presented to 7 coaches. They are:**


1. R.Gandhi-Athletics(posthumously)
2. Heera Nand Kataria (Kabaddi)
3. G.S.S.V. Prasad (Badminton)
4. Brij Bhushan Mohanty (Boxing)
5. P.A. Raphel (Hockey)
6. Sanjoy Chakraverthy (Shooting)
7. Roshan Lal (Wrestling)

**Dhyan Chand Awards were given to three persons.**

1. Bhupender Singh (Athletics)
2. Syed Shahid Hakim (Football)
3. Sumarai Tete (Hockey)

- Punjabi University, Patiala was presented the Maulana Abul Kalam Azad Trophy for the best university. The university has claimed the coveted trophy for the 10th time.
- Rashtriya Khel Protsahan Puraskar is given to corporate entities and individuals who have played a role in the area of sports promotion and development. The recipients include the Reliance Foundation and the Industrial Infrastructure Development Corporation (IDCO), a public sector undertaking based in Odisha.




### Rajiv Gandhi Khel Ratna

It is India's highest Sporting honor. It is named after former Prime Minister of India Rajiv Gandhi. It is awarded annually by the Ministry of Youth Affairs and Sports. The winners are honored for their spectacular and most outstanding performance in the field of sports over a period of four years at international level. The award comprises a medallion, a certificate and a cash prize of Rs 7.5 lakh. It was instituted in 1991-92. The first recipient of the award was Chess Grandmaster Viswanathan Anand. In 2001, shooter Abhinav Bindra became the youngest recipient at the age of 18. As of 2017, there are 34 recipients of Khel Ratna Award.

### ARJUNA AWARD

Arjuna awards are given to recognize outstanding achievement in National sports. It was instituted in 1961. The award carries a cash prize of Rs 5 lakh, a bronze statue of Arjuna and a scroll. More than 700 players are given this award.

### DRONACHARYA AWARD

Dronacharya Award is presented for excellence in sports coaching. The award comprises a bronze statue of Dronacharya, a scroll and a cash prize of Rs 5 lakh. It was started in 1985. So far 104 persons won this award. In 2012, B.I. Fernandez became the first foreign coach to get this award. He is Cuban Boxing coach. First recipients in 1985 are O.M. Nambiar (Athletics), Om Prakash Bhardwaj (Boxing) and Bhalchandra Bhaskar Bhagwat (Wrestling).

**Rajiv Gandhi Khel Ratna.. Winners**

| Year | Recipient(s) | Discipline |
|---|---|---|
| 1991-92 | Viswanathan Anand | Chess |
| 1992-93 | Geet Sethi | Billiards |
| 1993-94 | Homi Motivala | Yachting |
| 1993-94 | Garg Pushpendra Kumar | Yachting |
| 1994-95 | Karanam Malleswari | Weightlifting |
| 1995-96 | N. Kunjarani | Weightlifting |
| 1996-97 | Leander Paes | Tennis |
| 1997-98 | Sachin Tendulkar | Cricket |
| 1998-99 | Jyotirmoyee Sikdar | Athletics |
| 1999-2000 | Dhanraj Pillay | Hockey |
| 2000-01 | Pullela Gopichand | Badminton |
| 2001 | Abhinav Bindra | Shooting |
| 2002 | K.M. Beenamol | Athletics |
| 2002 | Anjali Bhagwat | Shooting |
| 2003 | Anju Bobby George | Athletics |
| 2004 | Rajyavardhan Singh Rathore | Shooting |
| 2005 | Pankaj Advani | Billiards& Snooker |

**Rajiv Gandhi Khel Ratna.. Winners**

| Year | Recipient(s) | Discipline |
|---|---|---|
| 2006 | Manavjit Singh Sandhu | Shooting |
| 2007 | Mahendra Singh Dhoni | Cricket |
| 2008 | No Award | |
| 2009 | Mary Kom | Boxing |
| 2009 | Vijender Singh | Boxing |
| 2009 | Sushil Kumar | Wrestling |
| 2010 | Saina Nehwal | Badminton |
| 2011 | Gagan Narang | Shooting |
| 2012 | Vijay Kumar | Shooting |
| 2012 | Yogeshwar Dutt | Wrestling |
| 2013 | Ronjan Sodhi | Shooting |
| 2014 | No Award | |
| 2015 | Sania Mirza | Tennis |
| 2016 | P.V. Sindhu | Badminton |
| 2016 | Sakshi Malik | Wrestling |
| 2016 | Dipa Karmakar | Gymnastics |
| 2016 | Jeetu Rai | Shooting |

## Competitive Guidance
## Current Affairs

### DHYAN CHAND AWARD

Dhyan Chand Award is given for lifetime achievement in sports. It is named after former hockey great Dhyan Chand. The award was started in 2002. It carries a cash prize of Rs 5 lakh. So far 51 persons are given Dhyan Chand award. First winners in 2002 are Aparna Ghosh (Basketball), Ashok Diwan (Hockey) and Shahuraj Birajdar (Boxing).

### Major Dhyan Chand


Dhyan Chand was an Indian hockey player, who is considered as the greatest hockey player of all time. He played a crucial role in India winning three gold medals in the 1928 Amsterdam, 1932 Los Angeles and 1936 Berlin Olympics. He was awarded Padma Bhushan in 1956. His birthday, August 29, is celebrated as National Sports Day in India. GOAL is the name of his autobiography. He scored over 400 goals in his career spanning 22 years. National Stadium in New Delhi is named after him as the Major Dhyan Chand National Stadium in 2002.



ఎన్.విజయేందర్‌రెడ్డి
జనరల్ అవేర్‌నెస్
సీనియర్ ఫ్యాకల్టీ



# స్కైప్ ఇంటర్వ్యూకు.. సిద్ధమవ్వండిలా!



ఇంటర్వ్యూ గైడెన్స్

**ఇప్పుడంతా సాంకేతికమయం. పరిజ్ఞానం దినదినాభివృద్ధి చెందుతుండటంతో అన్నీ ఆన్‌లైన్ అయిపోయాయి. చివరికి వ్యక్తిగతంగా నిర్వహించే ఇంటర్వ్యూలను సైతం సంస్థలు ఫోన్ లేదా వీడియో కాల్ ద్వారా పూర్తి చేస్తున్నాయి. తమ సమయం ఆదా చేసుకోవడానికి, అభ్యర్థులకు ప్రయాణ భారం తగ్గించడానికి రిక్రూటర్లు ఎక్కువగా స్కైప్ వంటి యాప్‌లపైనే ఆధారపడుతున్నారు. ఉద్యోగార్థులు ఈ తరహా ముఖాముఖిలో విజయం సాధించడానికి ఉపయోగపడే కొన్ని సూత్రాలు..**

### వ్యక్తిగత ఇంటర్వ్యూలాగే

స్కైప్ ఇంటర్వ్యూలో మీరు నేరుగా ఇంటర్వ్యూ చేసే వారి ముందు హాజరు కాకపోయినా.. వస్త్రధారణ విషయంలో జాగ్రత్త వహించాలి. ఫ్యాషన్ల జోలికి వెళ్లకుండా సౌకర్యవంతంగా ఉండే దుస్తులు ధరించడం మేలు. మీరు ఇంటర్వ్యూకు హాజరుకాబోతున్న సంస్థకు సంబంధించిన వెబ్‌సైట్, ఫేస్‌బుక్ పేజీ, ట్వీటర్ అకౌంట్‌లను గమనిస్తే.. ఆ సంస్థ ఉద్యోగుల వస్త్రధారణ, ప్రవర్తన ఎలా ఉంటాయో తెలుస్తుంది. వ్యక్తిగతంగా హాజరయ్యే ఇంటర్వ్యూకి ఎలా సన్నద్ధమవుతారో స్కైప్ ఇంటర్వ్యూకి కూడా అలాగే తయారు కావాలి.

### పరిసరాలు కూడా

ఇంటర్వ్యూ ఫోన్ లేదా వీడియో కాల్ ద్వారా జరుగుతున్నట్లైతే.. పరిసరాలు నిశబ్దంగా, శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. మీకు సంబంధించిన వస్తువులను గదిలో చిందరవందరగా పడేయకండి. బ్యాక్ గ్రౌండ్ తెల్లటి తెరలాంటిది ఏర్పాటు చేసుకోవడం మంచిది. అలాగే డెస్క్‌టాప్ నీట్‌గా ఉండేలా చూసుకోవాలి. మొబైల్ ఫోన్ సైలెంట్ మోడ్‌లో ఉంచుకోవాలి. తలుపులున్న గదిలో అయితే ప్రశాంత వాతావరణం ఉంటుంది.

### ముందస్తు సాధన

ఇదే మీకు మొదటి వీడియో కాల్ అయితే.. ఎటువైపు చూడాలి..? చేతులు ఎలా ఉంచుకోవాలి..? ఎంత గట్టిగా మాట్లాడితే వినిపిస్తుంది లాంటి సందేహాలు తలెత్తుతాయి. అలాంటప్పుడు స్నేహితులు లేదా కుటుంబ సభ్యులతో ఒకసారి వీడియో కాల్ మాట్లాడటం ద్వారా ఈ ఇబ్బందులను అధిగమించవచ్చు. సంభాషణలు రికార్డ్ చేయడం మర్చిపోవద్దు. ఈ విశ్లేషణ ఆధారంగా స్కైప్ ఇంటర్వ్యూలను తేలికగా పూర్తి చేయగలమనే ధీమా వచ్చే వరకు సాధన చేయండి.

### ముఖంపై చిరునవ్వు

ముఖాముఖి మాదిరే స్కైప్ ఇంటర్వ్యూలో కూడా చిరునవ్వు చాలా అవసరం. వీడియో కాల్ కొనసాగుతున్నంత సేపు దీనిని చెదరనీయకండి. ఇంటర్వ్యూ చేసేవారికి మీపై మంచి అభిప్రాయం కలిగించేది చిరునవ్వే అన్న విషయాన్ని మరిచిపోకండి.

### సాంకేతిక సమస్యా..?

స్కైప్ ఇంటర్వ్యూలో ఉన్న సమయంలో ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తవచ్చు. బలహీనమైన నెట్ కనెక్షన్, చిన్న చిన్న అంతరాయాలు, మాట సరిగా వినిపించకపోవడం లాంటి ఇబ్బందులు రావచ్చు. అలాంటి పరిస్థితే ఎదురైతే 'ఎక్స్‌క్యూజ్ మీ' అంటే సరిపోతుంది. ఇంటర్వ్యూ చేసే వాళ్లు దీనిని అర్థం చేసుకో గలరు. సమస్యను సరిచేస్తున్నంత సేపు స్నేహపూర్వకంగా, నిశబ్దంగా ఉండండి. ఒకవేళ సమస్య పరిష్కారం కాకపోతే మరోసారి ఇంటర్వ్యూకి అవకాశం ఇవ్వమని అభ్యర్థించండి.

### సూటిగా చూడండి

వెబ్‌కామ్ వైపు నేరుగా చూస్తూ మాట్లాడండి. స్క్రీన్ లేదా నేలను చూస్తూ మాట్లాడటం మంచి పద్ధతి కాదు. ల్యాప్‌టాప్ అయితే పుస్తకాలపై లేదా ఎత్తైన వస్తువుల మీద ఉంచడం ద్వారా కెమెరాను మీ ముఖానికి సరిపోయేలా అమర్చుకోవచ్చు.

### స్పందించండి

వినడంపై శ్రద్ధ వహించండి. అవతలివాళ్లకి ఈ సంగతి తెలియడం చాలా ముఖ్యం. వింటున్నట్లు తెలిపే శబ్దం.. (ఉదాహరణకు 'ఎస్') వస్తే ఇంటర్వ్యూ చేసేవాళ్లకి మీరు ఆన్‌లైన్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. తమ మాటలు వినిపిస్తున్నాయని అర్థమవుతుంది. ఎలాంటి సాంకేతిక సమస్యలు లేకుండా సంభాషణ సజావుగా సాగుతోందని, మీరూ వింటూ ఉన్నారని ఇంటర్వ్యూ చేసేవారికి తెలియజేయడానికి ఇది చాలా అవసరం.

### మైక్ ఉన్న హెడ్‌ఫోన్

మైక్ ఉన్న హెడ్‌ఫోన్స్ అయితే స్కైప్ ఇంటర్వ్యూ సమయంలో చాలా ఉపయోగపడతాయి. అవతలి వారికి మాట మరింత స్పష్టంగా వినిపించడానికి తోడ్పడుతుంది. వాళ్లు మాట్లాడుతున్నది కూడా మీకు స్పష్టంగా అర్థమవుతుంది.

### ఇవి ముఖ్యం..!

- యూజర్ నేమ్‌గా ముద్దు పేరును కాకుండా.. మీ పేరు స్పష్టంగా తెలిసేలా ఉన్న యూజర్ నేమ్‌ను ఉపయోగించడం మంచి పద్ధతి.
- ప్రశ్న స్పష్టంగా విన్న తర్వాతే జవాబు చెప్పాలి. గందరగోళానికి తావుండకూడదు.
- ఆత్మవిశ్వాసంతో ఉండటం చాలా ముఖ్యం. తడబాటుకు లోనుకాకుండా ఇంటర్వ్యూ ప్రశాంతంగా పూర్తి చేయడానికి ప్రయత్నించండి.
- ఇంటర్వ్యూ పూర్తికాగానే థ్యాంక్స్ చెప్పడం మరిచిపోకండి.

### నో అనవద్దు..!

మిమ్మల్ని స్కైప్ ద్వారా ఇంటర్వ్యూ చేస్తామంటే.. 'నాకు స్కైప్ లేదు, ఇంటర్నెట్ కనెక్షన్ స్లోగా ఉంది, ఫోన్‌లో ఇంటర్వ్యూ చేయండి' లాంటి సమాధానాలు చెప్పడం సరికాదు. అలా అన్నారంటే మీ ఇంటర్వ్యూలో మొదటి ప్రశ్నకు 'నో' అని సమాధానం చెప్పినట్లే. స్కైప్ ఉపయోగించడం ఇప్పుడు సాధారణమైన విషయం. కాబట్టి యాప్ డౌన్‌లోడ్ చేసుకుని, అకౌంట్ క్రియేట్ చేసి ఉంచుకోవడం మేలు. ఇంటర్వ్యూ చేసేవాళ్లు అడిగితే వెంటనే మీ అకౌంట్ వివరాలను మెయిల్ చేయండి.

## బులెటిన్ బోర్డ్

### ఐఏఆర్ఐలో 27 ఖాళీలు

**ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఏఆర్ఐ) జెనెటిక్స్ విభాగం.. వివిధ ప్రాజెక్టుల్లోని 27 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువరించింది.**




- **పోస్టుల పేరు-ఖాళీలు :** సీనియర్ రీసెర్చ్ ఫెలో(ఎస్ఆర్ఎఫ్)-12; జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్)-4; స్కిల్డ్ హెల్పర్-9; ఫీల్డ్/టెక్నికల్ అసిస్టెంట్-2.
- **వేతనం:** ఎస్ఆర్ఎఫ్, జేఆర్ఎఫ్‌కు రూ.25,000+30శాతం హెచ్ఆర్ఏ; స్కిల్డ్ హెల్పర్-రూ.16,182; ఫీల్డ్/టెక్నికల్ అసిస్టెంట్-రూ.10,998.
- **అర్హతలు:** ఎస్ఆర్ఎఫ్, జేఆర్ఎఫ్‌కు మాస్టర్స్‌డిగ్రీ(జెనెటిక్స్/ప్లాంట్ బ్రీడింగ్ /బయో టెక్నాలజీ/ సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ/లైఫ్ సైన్స్). అలాగే 4/5 ఏళ్ల బ్యాచిలర్ డిగ్రీలో కనీసం మూడేళ్ల యూజీసీ/సీఎస్ఐఆర్/ఐసీఏఆర్ నెట్ లేదా తత్సమాన అర్హత కచ్చితంగా ఉండాలి. లేదా సంబంధిత సబ్జెక్టులతో పీహెచ్‌డీ ఉండాలి; స్కిల్డ్ హెల్పర్, ఫీల్డ్/టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు పదో తరగతి లేదా తత్సమాన విద్యార్హత అవసరం.
- **వయో పరిమితి:** ఎస్ఆర్ఎఫ్ పోస్టులకు 35 ఏళ్లు, స్కిల్డ్ హెల్పర్ పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ నిబంధనలు వర్తిస్తాయి.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం:** నిర్దేశిత విధానంలో దరఖాస్తు పత్రంలో వివరాలు నింపాలి. సంబంధిత ధ్రువపత్రాలు జతచేసి నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలి.
- **ఇంటర్వ్యూ తేదీలు:** ఎస్ఆర్ఎఫ్, జేఆర్ఎఫ్ పోస్టులకు సెప్టెంబర్ 11, 2017; స్కిల్డ్ హెల్పర్, ఫీల్డ్/టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు సెప్టెంబర్ 12, 2017.
- **ఇంటర్వ్యూ వేదిక:** డివిజన్ ఆఫ్ జెనెటిక్స్, ఐసీఏఆర్-ఐఏఆర్ఐ, న్యూఢిల్లీ-110012
- **వెబ్‌సైట్:** www.iari.res.in

### సీబీఆర్ఐలో 17 ఖాళీలు




**రూర్కీలోని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీబీఆర్ఐ).. 17 'సైంటిస్ట్' ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువరించింది.**

- సైంటిస్ట్/సీనియర్ సైంటిస్ట్-17
- **వేతనం:** సైంటిస్ట్-రూ.67,700; సీనియర్ సైంటిస్ట్-రూ.78,800
- **అర్హతలు:** సంబంధిత పోస్టులను అనుసరించి ఎంఈ/ఎంటెక్/పీహెచ్‌డీ (ఇంజనీరింగ్)+(బీఈ/బీటెక్) / పీహెచ్‌డీ(ఇంజనీరింగ్)/ఎంఆర్క్/ బీఆర్క్+పీహెచ్‌డీ(ఆర్కిటెక్చర్/ప్లానింగ్). దీంతోపాటు నిబంధనల మేర ఉద్యోగానుభవం.
- **వయో పరిమితి:** సైంటిస్ట్-32 ఏళ్లు, సీనియర్ సైంటిస్ట్-37 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్ నిబంధనలు వర్తిస్తాయి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.500; ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ/మహిళ/సీఎస్ఐఆర్ ఉద్యోగులు/విదేశీ కేటగిరీ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు హార్డ్ కాపీని ప్రింటవుట్ తీసుకుని సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు తదితర అవసరమైనవాటిని జతచేసి కవరులో ఉంచి 'అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, రూర్కీ-247667' చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** అక్టోబర్ 3, 2017
- **దరఖాస్తు హార్డ్‌కాపీలు చేరడానికి చివరి తేదీ:** అక్టోబర్ 10, 2017
- **వెబ్‌సైట్:** www.cbri.res.in

## జాబ్ ట్రెండ్స్

**బ్యాంకింగ్.. పేరులో ఉన్నట్లే ఉద్యోగ కల్పనల పరంగా కొన్నేళ్లుగా ఎవర్‌గ్రీన్ సెగ్మెంట్‌గా నిలుస్తున్న రంగం. ఇంజనీరింగ్ నుంచి కామర్స్ వరకు.. టెక్నికల్ టు ట్రెడిషనల్ డిగ్రీలు.. అభ్యర్థుల నేపథ్యం ఏదైనా నిరంతరం నియామకాలతో ఉద్యోగార్థుల్లో ఆశలు రేకెత్తిస్తోంది. అయితే.. ఇందులోనూ కార్యకలాపాలకు ఆధునిక సాంకేతికత వినియోగం రోజు రోజుకూ పెరుగుతోంది. ఇప్పటికే చాలావరకు ఆటోమేటెడ్ (యాంత్రిక) సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఆర్ఐ), ఆటోమేషన్ ప్రభావం గణనీయంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఔత్సాహికులు సంబంధిత నైపుణ్యాలు పెంచుకుంటేనే కొలువుదీరే అవకాశం లభిస్తుంది అంటున్నారు నిపుణులు. ఈ నేపథ్యంలో బ్యాంకింగ్ రంగ నియామకాలపై ఆటోమేషన్ ప్రభావం గురించి..**




# ఆటోమేషన్ ప్రభావం

### 30 నుంచి 40 శాతం!

బ్యాంకింగ్ రంగ కార్యకలాపాల్లో ఆటోమేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం కొత్త నియామకాలపై 30 శాతం నుంచి 40 శాతం మేర ఉంటుందని ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ పేర్కొంది. ముఖ్యంగా కిందిస్థాయి సిబ్బంది నియామకాలు తగ్గుముఖం పట్టే పరిస్థితి కనిపిస్తోంది. ఈ స్థాయి సిబ్బంది చేపట్టే కస్టమర్ సపోర్ట్ సర్వీసెస్‌ను 70 నుంచి 80 శాతం మేరకు ఆటోమేషన్ విధానంలో అందిస్తుండటమే ఇందుకు కారణం. దేశంలోని పలు ప్రముఖ బ్యాంకుల్లో శాఖల సంఖ్య పెరుగుతున్నా ఆ మేరకు నియామకాలు లేకపోవడానికి ఆటోమేషన్ ప్రభావమే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ వంటి ప్రైవేటు రంగ బ్యాంకులు తమ సేవలను సాధ్యమైనమేరకు ఆటోమేటెడ్ విధానంలో.. కస్టమర్లే సొంతంగా నిర్వహించుకునే రీతిలో అమలు చేస్తున్నాయి.

### ప్రముఖ బ్యాంకులకేనా..?

ఆటోమేషన్ ప్రభావం ప్రముఖ బ్యాంకులకే పరిమితమని; దేశంలోని బ్యాంకింగ్ వినియోగదారుల పరిస్థితుల దృష్ట్యా మానవ ప్రమేయ సేవలు తప్పనిసరని మరో ప్రముఖ స్టాఫింగ్ సంస్థ టీమ్ లీజ్ పేర్కొంది. ఉదాహరణకు మన దేశంలోని ఖాతాదారుల్లో అధిక శాతం గ్రామీణ ప్రాంతాల వారేనని.. జన్‌ధన్ ఖాతాలను పరిగణనలోకి తీసుకున్నా నిరక్షరాస్యులే ఎక్కువని.. అలాంటివారు ఆటోమేషన్ కార్యకలాపాలు, సెల్ఫ్ సర్వీస్ సిస్టమ్స్‌ను వినియోగించుకోవడం కష్టమేనని పేర్కొంది. ఈ సంస్థ గణాంకాల ప్రకారం.. రానున్న పది, పన్నెండు నెలల కాలంలో 10 నుంచి 11 శాతం మేర నియామకాలు పెరుగుతాయని తెలుస్తోంది.

### యాంత్రీకరణ ఇలా..

బ్యాంకింగ్ రంగంలో యాంత్రీకరణ సేవలు పెరుగుతున్నాయనడానికి తాజా నిదర్శనం.. పాస్‌బుక్‌లో లావాదేవీల నమోదు తీరు. ఒకప్పుడు ఇందుకోసం ఖాతాదారులు స్వయంగా బ్యాంక్‌కు వెళ్లి క్లర్క్/ఆఫీసర్ స్థాయి అధికారిని సంప్రదించాల్సి వచ్చేది. ఇప్పుడు.. పలు ప్రముఖ బ్యాంకులు పాస్‌బుక్ నమోదు యంత్రాలను నెలకొల్పాయి. పాస్‌బుక్‌ను ఇన్‌సర్ట్ చేసి ఏఏ తేదీల మధ్య లావాదేవీల వివరాలు కావాలో పేర్కొంటే క్షణాల్లో సదరు ఎంట్రీలతో పాస్‌బుక్ చేతికందుతోంది. ఈ రంగంలో సాంకేతిక విప్లవానికి తొలి అడుగుగా ఏటీఎంల ఏర్పాటును పేర్కొనవచ్చు. ఎప్పుడైనా డబ్బులు తీసుకునే ఈ వ్యవస్థ.. బ్యాక్ ఎండ్ టెక్నాలజీ వల్లే సాధ్యమైంది. ఇప్పుడు ఆన్‌లైన్ బ్యాంకింగ్, డిజిటల్ బ్యాంకింగ్ కారణంగా.. అసలు బ్యాంకుకు వెళ్లకుండానే స్మార్ట్‌ఫోన్ ద్వారా అన్ని సేవలు పొందే వీలు కలిగింది.

### ఆ సేవలకు సిబ్బంది తప్పనిసరి

బ్యాంకింగ్ రంగంలో కొన్ని సేవలకు వినియోగదారులతో నేరుగా సంప్రదించాల్సి ఉంటుంది. ముఖ్యంగా కొత్త వాళ్లతో ఖాతాలు తెరిపించడం, సేవల గురించి వివరించడం వంటి వాటికి మానవ ప్రమేయ కార్యకలాపాలు తప్పనిసరి. కాబట్టి కొత్త నియామకాలపరంగా ఉద్యోగార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నది నిపుణుల అభిప్రాయం. వచ్చే ఆరు నెలల వ్యవధిలో నాలుగు వేల మందిని నియమించుకోవాలని ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ ఏయూ ఫైనాన్షియర్స్ భావిస్తోంది. రెండేళ్లలో పది వేల మందిని రిక్రూట్ చేసుకునేలా ప్రణాళికలూ రూపొందిస్తోంది. మొన్నటి వరకు మైక్రో ఫైనాన్స్ రంగంలో ఉండి ప్రస్తుతం బ్యాంకుగా అవతరించిన బంధన్ బ్యాంక్ కూడా ప్రస్తుతం ఉన్న 24 వేల మంది సిబ్బందిని 2018 మార్చి నాటికి 30 వేలకు పెంచాలని నిర్ణయించింది.

### హైఎండ్ ప్రొఫైల్స్‌పై

ఆటోమేషన్ ద్వారా కార్యకలాపాలు.. సాంకేతిక నైపుణ్యాల అవసరాన్ని పరిగణనలోకి తీసుకుంటే హై ఎండ్ ప్రొఫైల్స్‌వారికి కొంత ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యే సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఏజీఎం, జీఎం స్థాయి కేడర్లలో నియామకాలపై ఈ ప్రభావం కనిపించనుంది. వీరి స్థానంలో టెక్ నిపుణులను నియమించుకుని రోబోటిక్ సేవల రూపకల్పనకు బ్యాంకులు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

### బిగ్‌డేటా, ఐటీ నిపుణులకు డిమాండ్

బ్యాంకింగ్ రంగంలో బిగ్‌డేటా అనలిస్టులు, బిగ్ డేటా మేనేజ్‌మెంట్ నిపుణులకు డిమాండ్ పెరిగే అవకాశముంది. ఉదాహరణకు కస్టమర్ల ప్రొఫైల్ ఆధారంగా వారికి రుణ మంజూరు అర్హత ఉందో? లేదో?.. బిగ్ డేటా ఆధారంగా నిమిషాల్లోనే తెలుసుకునే వీలు కలుగుతోంది. గతంలో రుణానికి దరఖాస్తు చేస్తే వారి ఆర్థిక పరిస్థితులను అంచనా వేసేందుకు సిబ్బంది క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించాల్సి వచ్చేది. ఇప్పుడు బిగ్‌డేటా సాయంతో కస్టమర్ల గత చెల్లింపుల చిట్టా, బ్యాంకింగ్ కార్యకలాపాల వివరాల ఆధారంగా మంజూరుపై నిమిషాల్లో నిర్ణయం తీసుకోవచ్చు. ఇది పరోక్షంగా బ్యాంకింగ్ రంగంలో ఐటీ నిపుణుల ప్రాధాన్యం పెంచుతోంది. రోబోటిక్స్, బిగ్‌డేటా, డేటాఅనలిస్ట్ వంటి రంగాల్లో నైపుణ్యాలున్న వారి కోసం బ్యాంకులు అన్వేషిస్తున్నాయి. ఐఐటీలు, ఐఐఎంలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్ సైతం నిర్వహిస్తూ అవసరమైన అభ్యర్థులను నియమించుకుంటున్నాయి.

### బ్యాంకింగ్ రంగం.. రిక్రూట్‌మెంట్ గణాంకాలు

- 2015-16 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి దేశంలో ప్రైవేటు, ప్రభుత్వ, ఫారెన్ బ్యాంకుల్లో మొత్తం ఉద్యోగుల సంఖ్య 8.60 లక్షలు
- 2016లో 9 వేల మంది పీఓలను నియమించుకున్న పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు. ఇంతే సంఖ్యలో క్లరికల్ కేడర్‌లో నియామకాలు.
- 2016-17లో 20 శాతం మేర పెరిగిన నియామకాలు. రానున్న మూడేళ్లలోనూ ఇదే పంథా కొనసాగే అవకాశం.

### డిజిటల్ ఆపరేషన్స్‌పై చైతన్యం

పట్టణాలు, నగరాల్లోని వినియోగదారుల్లో బ్యాంకు సేవలకు సంబంధించి డిజిటల్ ఆపరేషన్స్‌పై అవగాహన పెరుగుతోంది. ముఖ్యంగా మొబైల్ ఆధారిత సర్వీసులు ముందంజలో ఉంటున్నాయి. అయితే కొన్ని ప్రాంతాల వినియోగదారుల ఆసక్తులను, కొన్ని బ్యాంకుల సర్వీసులను పరిగణనలోకి తీసుకుని ఒక నిర్ణయానికి రావడం కష్టం. భవిష్యత్తులో మాత్రం బ్యాంకింగ్ రంగంలో ఆటోమేషన్ పెరగడం ఖాయంగా కనిపిస్తోంది.

– ప్రొఫెసర్. ఎన్.వి.నరేంద్ర కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్, ఐడీఆర్‌బీటీ

# సాక్షి
## రాష్ట్రీయం
వైఎస్ఆర్ జిల్లా
ఆదివారం I సెప్టెంబర్ I 3 I 2017
www.sakshi.com
14



**భారత్‌లో స్వైన్ ఫ్లూ మొదటి కేసు 2009లో నమోదు అయినప్పటినుంచీ 2017 ఆగస్టు 20 వరకు 8,958 మంది మరణించారు. 2017లోనే ఇప్పటివరకు వెయ్యి మరణాలు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది.**



## దోమను చంపినందుకు ట్వీటర్ ఖాతా క్లోజ్!



హింసను ప్రేరేపించేలా ఉన్న ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో ఉంచితే సంబంధిత ఖాతాలను నిలిపివేస్తామని ట్వీటర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. చెప్పినట్లుగానే చనిపోయిన దోమ ఫొటో ట్వీట్ చేశాడని ఓ వ్యక్తి ట్వీటర్ ఖాతాను సదరు సంస్థ నిలిపివేసింది. ఈ సంఘటన శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగింది. జపాన్‌కి చెందిన ఓ వ్యక్తి శాన్‌ఫ్రాన్సిస్కోలో నివాసముంటున్నాడు. ఆగస్టు 20న అతడు ఇంట్లో టీవీ చూస్తుండగా దోమ కుట్టిందట. ఈ క్రమంలో కోపంతో ఆ దోమను చంపి దాన్ని ఫొటో తీసి ట్వీటర్‌లో ఉంచాడు. 'నేను టీవీ చూస్తూ విశ్రాంతి తీసుకునే సమయంలో నన్ను కుట్టడానికి ప్రయతిన్స్తావా! చావు' అని అతడు ట్వీట్ చేశాడు. ఆ కొద్దిసేపటికే 'మీ ట్విటర్ ఖాతాను తొలగిస్తున్నాం. ఇక నుంచి మీరు ఈ ఖాతాను తెరవలేరు' అని అతనికి ఓ మెసేజ్ వచ్చింది. వెంటనే అతడు ఆగస్టు 26న మరో ట్వీటర్ ఖాతాను తెరిచి 'చంపిన దోమ ఫొటో ట్వీటర్‌లో ఉంచినందుకు నా పాత ఖాతాను పూర్తిగా నిలిపివేశారు. ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధమా' అంటూ ప్రశ్నించాడు. ఈ ట్వీట్ ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. 32 వేల మంది రీట్వీట్ చేయగా 28 వేల లైక్‌లు వచ్చాయి.




## రూ.61 లక్షలతో గణపతి అలంకారం



వినాయక ఉత్సవాల్లో భాగంగా గుంటూరు జిల్లా మంగళగిరిలోని హుస్సేన్ కట్ట వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి నిర్వాహకులు శనివారం రాత్రి రూ.61,01,116తో అలంకరణ చేశారు. భక్తులు గణనాథుడిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. నిర్వాహకులు దామర్ల శివవెంకటరాజు, దామర్ల రాఘవేంద్రరావు, డోకిపర్తి శ్రీనివాసరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. – మంగళగిరి

## కో ఆర్డినేటర్ల తొలగింపు అన్యాయం: ఐవైఆర్



**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్‌లో కో ఆర్డినేటర్లుగా పనిచేస్తున్న వారిని ప్రభుత్వం హఠాత్తుగా తొలగిస్తూ తీసుకున్న నిర్ణయం అన్యాయమని ప్రభుత్వ రిటైర్డు ప్రధాన కార్యదర్శి, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఐవైఆర్ కృష్ణారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా విధుల్లోంచి తొలగించడం వల్ల ఆ కుటుంబాలు ఇరుకున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా పేద బ్రాహ్మణుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమా లను అర్హులకు అందజేయడంలో కోఆర్డి నేటర్ల కృషి ఎనలేనిదన్నారు. గత ఆరు నెలలుగా కార్పొ రేషన్‌కు ఎండీ లేకపోయినా కో ఆర్డినేటర్ల సాయంతోనే పథకాలు ముందుకు సాగు తున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయం వల్ల బ్రాహ్మణ కార్పొరేషన్ మరింత నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

## చెల్లి చావుకబురు చెప్పి వస్తూ అన్న దుర్మరణం

**చింతపల్లి (పాడేరు):** అనారోగ్యంతో మరణించిన చెల్లెలి సమాచారాన్ని బంధువులకు చెప్పి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో అన్న మృతి చెందాడు. విశాఖ జిల్లా చింతపల్లి మండలం కుడుముసారి పంచాయతీ నిమ్మపాడుకు చెందిన వంతల మత్సరాజు, పార్వతమ్మ గిరిజన దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుమార్తె దొసుధ (30) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. చెల్లెలి మరణ వార్తను పెదబయలు మండలంలోని తమ బంధువులకు చెప్పేందుకు పెద్దన్నయ్య గోవిందరావు (35), గ్రామంలోని మరో యువకుడు సంద్రం (28) ద్విచక్రవాహనంలో వెళ్లారు. శనివారం ఉదయం తిరిగి వస్తుండగా అన్నవరంలో కిల్లోలుక్కు (37) అనే గిరిజనుడు స్వగ్రామానికి వెళ్లేందుకు అదే వాహనం ఎక్కాడు. గ్రామానికి మరో ఐదు నిమిషాల్లో చేరుకునే సమయంలో ఎదురుగా వస్తున్న ఇసుక వ్యాన్ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొట్టడంతో వాహనం నడుపుతున్న గోవిందరావు అక్కడికక్కడే మృతి చెందాడు.

## వ్యవసాయ సుస్థిరతపై 23 నుంచి జాతీయ సదస్సు

**సాక్షి, అమరావతి:** సంక్షోభంలో చిక్కుకున్న వ్యవసాయ రంగాన్ని పునర్జీవింపజేసి సుస్థిర సాధన వైపు మళ్లించేందుకు చేపట్టాల్సిన విధివిధానాలను చర్చించేందుకు ప్రజ్ఞాభారతి సంస్థ రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో జాతీయ సదస్సు నిర్వహించనుంది. నగర శివార్లలోని రాజేంద్రనగర్ భారతీయ వరి పరిశోధనా కేంద్రంలో (ఐఐఆర్ఆర్) ఈ నెల 23, 24 తేదీల్లో ఈ సదస్సు జరుగుతుంది. నీతి ఆయోగ్, నాబార్డ్ వంటి సంస్థల సహకారంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్టు నిర్వాహక సమన్వయ కర్త సీహెచ్ రఘునందన రావు శనివారం తెలిపారు. ప్రస్తుత వ్యవసాయ విధానాలు, వర్షాధారిత సాగు సమస్యలు, పరిష్కార మార్గాలు, వ్యవసాయ పరిశోధన, వ్యవసాయాభివృద్ధి– పశుసంపద పాత్ర, వ్యవసాయ మహిళల సమస్యలు, సవాళ్లు, రైతు ఆత్మహత్యలకు దారి తీస్తున్న సమస్యలు వంటి అంశాలను ఈ సదస్సులో చర్చిస్తారు. వివరాలకు 9014030809 నంబరును సంప్రదించవచ్చు.

## గోరఖ్‌పూర్ ఘటనలో మరో అరెస్ట్

**గోరఖ్‌పూర్:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గోరఖ్‌పూర్ బీఆర్‌డీ ఆసుపత్రి ఘటనలో హీరోగా కీర్తించబడిన డాక్టర్ కఫీల్ ఖాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో ఈ ఘటనలో అరెస్ట్‌ల సంఖ్య మూడుకు చేరింది. ఖాన్ తన సొంత ఖర్చులతో ఆక్సిజన్ సిలిండర్లను ఏర్పాటు చేసి హీరో అనిపించుకున్నారు. అయినప్పటికీ విధుల్లో ఆయన తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని విచారణలో తేలడంతో అరెస్ట్ చేశారు. గత నెలలో ఐదు రోజుల వ్యవధిలో బీఆర్‌డీ ఆసుపత్రిలో ఆక్సిజన్ అందక 60మందికి పైగా పిల్లలు మరణించిన సంగతి తెలిసిందే. ఘటన అనంతరం మెదడువాపు వ్యాధి వార్డుకు నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న ఖాన్‌ను ప్రభుత్వం తొలగించింది. కఫీల్ ఖాన్‌ను గోరఖ్‌పూర్ శివారులో ఎస్టీఎఫ్ అధికారులు అరెస్టు చేశారని గోరఖ్‌పూర్ ఎస్ఎస్పీ అనిరుధ్ సిద్ధార్థ్ పంకజ్ తెలిపారు. బీఆర్‌డీ కాలేజ్ ప్రిన్సిపాల్ రాజీవ్ మిశ్రా, ఆయన భార్య పూర్ణిమా శుక్లాను పోలీసులు గత నెల 29న అరెస్టు చేశారు. అనంతరం వారిని కోర్టుకి తరలించగా, శుక్రవారం 14రోజుల రిమాండ్ విధించింది. కాగా, ఈ ఘటనలో మరో ఆరుగురిపై శుక్రవారం నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ అయ్యాయి.

## డెంగీని అంచనా వేసేందుకు నూతన వ్యవస్థ

**లండన్:** భారతదేశంలోని వివిధ ప్రాంతాల వాతావరణంలో డెంగీ వ్యాధి వ్యాప్తిని అంచనా వేసేందుకు నూతన వాతావరణ ఆధారిత వ్యవస్థను శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ వ్యవస్థ ఆయా ప్రాంతాల్లోని వాతావరణ పరిస్థితులను అంచనా వేసి వ్యాధి వ్యాప్తి గురించి తెలుపుతుందని వివరించారు. పంజాబ్, హరియాణా, రాజస్తాన్, గుజరాత్, కేరళ రాష్ట్రాల్లోని ఉష్ణోగ్రతలు, దోమల్లో డెంగీ వ్యాధి బాహ్య పొదుగుదల కాలం (ఎక్స్‌ట్రిన్సిక్ ఇంక్యుబేషన్ పీరియడ్)లకు సంబంధించిన అంశాలపై బ్రిటన్‌లోని లివర్‌పూల్ వర్సిటీ పరిశోధకులు అధ్యయనం చేశారు. దీనికోసం వర్సిటీ పరిశోధకులు హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ), గువాహటిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సంస్థలకు చెందిన పరిశోధకులతో సంయుక్తంగా పనిచేశారు. ఉష్ణోగ్రతలు వేడిగా ఉంటూ.. తేమగా ఉండే ప్రాంతాల్లో వ్యాధి పొదుగుదల కాలం తగ్గి డెంగీ వ్యాధి వ్యాప్తి పెరుగుతుందని పరిశోధకులు తెలిపారు. అలాగే వర్షాకాలంలో కూడా వ్యాధి పొదుగుదల కాలం తక్కువగా ఉంటుందని, దీంతో డెంగీ వ్యాధి వ్యాప్తి అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. తమ వాతావరణ ఆధారిత వ్యవస్థ వల్ల డెంగీ వ్యాధి వ్యాప్తిని గుర్తించి ప్రభుత్వం ముందుగానే చర్యలు తీసుకునేందుకు ఉపయోగపడుతుందని పరిశోధనకు నేతృత్వం వహించిన ఐఐసీటీకి చెందిన పరిశోధకుడు శ్రీనివాసరావు వివరించారు.

## వ్యవసాయ పరికరాల కోసం
# రైతుల నిరీక్షణ

- ప్రారంభం కాని టెండర్ల ప్రక్రియ
- రెండు నెలల క్రితం ప్రారంభమైన ఖరీఫ్
- మూలుగుతున్న నిధులు

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో ఖరీఫ్ సీజను ప్రారంభమై రెండు నెలలైనా వ్యవసాయ పరికరాల కోసం రైతులు ఎదురుచూస్తూనే ఉన్నారు. ధరల నిర్ణయంపై వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోకపోవడంతో పరికరాల పంపిణీకి అధికారులు టెండర్లు ఆహ్వానించలేదు. దీంతో అందుకు కేటాయించిన రూ.700 కోట్లు ప్రభుత్వ ఖజానాలో మూలుగుతున్నాయి. ప్రతి సంవత్సరం వ్యవసాయశాఖ 50 శాతం సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పరికరాలను పంపిణీ చేస్తోంది. ఆయిల్ ఇంజన్లు, రొటోవేటర్లు, తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్లు, వరినాటే యంత్రాలు, వరికోత యంత్రాలు, డ్రిప్ ఇరిగేషన్‌లో స్ప్రింక్లర్లను సరఫరా చేస్తోంది.

మూడేళ్లుగా వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన ప్రత్తిపాటి పుల్లారావు హయాంలో పరికరాల పంపిణీలో తీవ్రజాప్యం చోటుచేసుకుంది. అదును దాటిన తరువాతనే వ్యవసాయ శాఖ పరికరాలను పంపిణీ చేయడంతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. మంత్రివర్గ విస్తరణలో ఆ శాఖ బాధ్యతలు సోమిరెడ్డి చేపట్టారు. కొత్త మంత్రి హయాంలోనైనా పరిస్థితి మారుతుందని రైతులు, వ్యవసాయ పరికరాల తయారీ సంస్థలు భావించినా, అందుకు అనుగుణంగా మంత్రి నిర్ణయాలు తీసుకోలేదు. ముఖ్యంగా వ్యవసాయ పరికరాల ధరలను నిర్ణయించకపోవడంతో అధికారులు పరికరాల పంపిణీకి టెండర్ల ప్రక్రియ ప్రారంభించలేదు. మంత్రి మారినా పరిస్థితి మారకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎట్టకేలకు మంత్రి సోమిరెడ్డి శనివారం తన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ పరికరాల తయారీ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ధరల నిర్ణయంపై తయారీ సంస్థలు, మంత్రి ఏకాభిప్రాయానికి రాలేదు. మరోసారి సమావేశమై పరికరాల ధరలను ఖరారు చేయాలని ఇరువర్గాలు నిర్ణయానికి వచ్చాయి.

### ఆయిల్ ఇంజన్లు, తైవాన్ స్ప్రేయర్లకు డిమాండ్

ఈ ఖరీఫ్ సకాలంలో ప్రారంభమైందని ప్రచారం చేసుకోడానికి రాష్ట్ర ప్రభుత్వం రైతులపై వత్తిడి తీసుకువచ్చి వరినాట్లు ప్రారంభించేలా చర్యలు తీసుకుంది. ముఖ్యంగా పట్టిసీమ నుంచి సాగునీటిని పూర్తిగా అందుబాటులోకి తీసుకువస్తామని, వరి నాట్లు వేసుకోవాలని అటు వ్యవసాయశాఖ, ఇటు జలవనలరుశాఖ రైతులపై వత్తిడి తీసుకువచ్చాయి. దీంతో కృష్ణా డెల్టాలో రైతులు వరినాట్లు వేశారు. అయితే వర్షభావ పరిస్థితులు, పట్టిసీమ నుంచి ఆశించిన రీతిలో సాగునీరు విడుదల కాకపోవడంతో అనేక ప్రాంతాల్లో వరినాట్లు ఎండిపోయాయి. రైతులు నాటిన పంటను బతికించుకోవడానికి సాగునీటి, మురుగునీటి కాల్వలోని నీటిని ఆయిల్ ఇంజన్ల సహాయంతో పంట పొలాలకు పెట్టుకుంటున్నారు. ఆయిల్ ఇంజన్లను ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో రైతులు అద్దె ప్రాతిపదికపై వీటిని తెచ్చుకుని పంటను రక్షించుకుంటున్నారు. అదే రీతిలో కాల్వ ఎగువ భాగంలోని రైతులకు సాగునీటి సమస్య లేకపోవడంతో కొన్ని జిల్లాల్లో వరినాట్లు పూర్తయి పైరు ఏపుగా వస్తోంది. ఈ సమయంలో పైరుకు చీడపీడలు ఆశించకుండా రైతులు పురుగు మందులను వాడతారు. అయితే తైవాన్ స్ప్రేయర్ల పంపిణీ జరగకపోవడంతో వాటినీ రైతులు అద్దెకు తీసుకుంటున్నారు. ఇప్పటికైనా వ్యవసాయశాఖ టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి వ్యవసాయ పరికరాల పంపిణీని పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

## ఏఎస్పీ గన్‌మెన్
# గన్ మిస్ ఫైర్
### చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి


రమేష్ (ఫైల్)

**నెల్లూరు సిటీ :** నెల్లూరు జిల్లా అడిషనల్ ఎస్పీ శరత్‌బాబు గన్‌మెన్ వద్ద ఉన్న ఏకే–47 తుపాకీ ప్రమాదవశాత్తు పేలి.. అందులోని తూటాలు శరీరంలోకి దూసుకెళ్లడంతో ఆయన వాహనం డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి జిల్లా ఎస్పీ కార్యాలయంలో చోటుచేసుకుంది. ఏఎస్పీ శరత్‌బాబు శనివారం రాత్రి ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. ఆయన వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ నాగేంద్ర వాహనం నుంచి దిగుతుండగా, అతని వద్ద ఉన్న ఏకే –47 గన్ మిస్ ఫైర్ అయ్యింది. అందులోని రెండు బుల్లెట్లు వాహనం నడుపుతున్న డ్రైవర్, ఏఆర్ కానిస్టేబుల్ మండ్ల రమేష్ (32) ఛాతీలోకి దూసుకెళ్లాయి. హుటాహుటిన కిమ్స్ ఆస్పత్రికి తరలించగా... చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందాడు. రమేష్ సీతారామపురం మండలానికి చెందిన వ్యక్తి. 2009 బ్యాచ్ ఏఆర్ కానిస్టేబుల్. ఏఎస్పీ వాహనం డ్రైవర్‌గా ఐదేళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నాడు. ఈ విషయం తెలిసి ఎస్పీ పీహెచ్‌డీ రామకృష్ణ, ఏఎస్పీ శరత్‌బాబు ఆస్పత్రికి చేరుకున్నారు. ఘటనపై విచారణ చేస్తున్నారు.

# భక్తిశ్రద్ధలతో బక్రీద్ పర్వదిన వేడుకలు

- విజయవాడ ఐజీఎంసీ స్టేడియంలో ఈదుల్ అజ్‌హా నమాజు
- ఆరువేల మందికి పైగా ముస్లింల హాజరు
- కడపలో బక్రీద్ ప్రార్థనలకు పోటెత్తిన భక్తులు

లబ్బీపేట(విజయవాడ తూర్పు)/కడప కల్చరల్


విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


కడప బిల్టప్ సర్కిల్ వద్దగల ఈద్గాలో భక్తుల సామూహిక బక్రీద్ ప్రార్థనలు

ఎంతో పవిత్రమైనదిగా భావించే బక్రీద్(ఈదుల్ అజ్‌హా) పండుగను శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విజయవాడ మహాత్మాగాంధీ రోడ్డులోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ప్రాంగణంలో ఈదుల్ అజ్‌హా నమాజు జరిపారు. ముస్లిం డెవలప్‌మెంట్ సొసైటీ, ఈద్గాహ్ కమిటీ సంయుక్తంగా నిర్వహించిన ఈ సామూహిక నమాజులో ఆరువేల మందికిపైగా ముస్లింలు హాజరై భక్తిశ్రద్ధలతో నమాజు, జువా(ప్రార్థన) నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రదర్ అబ్దుల్ కరీమ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఇతరులతో సోదరభావంతో మెలుగుతూ సమాజంలో శాంతి సామరస్యాలు పెంపొందించేందుకు కృషి చేయాలని ఉద్బోధించారు. మౌలానా అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ దేవుని సాన్నిహిత్యం పొందాలంటే కామ, క్రోధ, లోభ, మోహాలను అదుపులో ఉంచుకుని, అన్నివేళలా మహోన్నతుడైన అల్లాహ్ (సృష్టికర్త)ను శరణుకోరి ధన, మాన ప్రాణాలను త్యాగం చేయాలని సూచించారు. అదే బక్రీద్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సందర్భంగా హాఫీజ్ ఇలియాస్ బక్రీద్ నమాజ్ చేశారు. కార్యక్రమంలో ముస్లిం డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ ఇస్మాయిల్, ఈద్గా కమిటీ సభ్యులు మునీర్ అహ్మద్, ముఖ్తార్ అలీ తదితరులు పాల్గొన్నారు.

### కడపలోనూ..

వైఎస్సార్ జిల్లా కడప బిల్టప్ సర్కిల్ సమీపంలోని ఈద్గాలో నగర వాసులతోపాటు సమీప గ్రామాలకు చెందిన ప్రజలు అధికసంఖ్యలో ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మతగురువు ముఫ్తీ మహమ్మద్ న్యామతుల్లా సందేశమిస్తూ.. త్యాగమయ జీవితంతోనే ప్రపంచమంతా శాంతిస్థాపన సాధ్యమన్నారు. అనంతరం పెద్దదర్గా పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరిఫుల్లా హుసేని సాహెబ్ భక్తులచే సామూహిక ప్రార్థనలు చేయించారు.

## 'ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రాధాన్యం'

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలోని దేవాలయాలకు వస్తున్న భక్తులు, యాత్రికులను దృష్టిలో ఉంచుకుని తగు వసతి సౌకర్యాలను కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రాధాన్యమివ్వాలి, దీనిని మరింత ప్రోత్సహించేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఇటీవల వెలగపూడి తాత్కాలిక సచివాలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులతో సీఎస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులు, ఉద్యోగులకు కూడా చంద్రన్న బీమా పథకం వర్తింప చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. సీజీఎఫ్ కింద వివిధ ఆలయాల్లో చేపట్టిన అభివృద్ధి పనులపైన సమీక్షించారు. శ్రీశైలంలోని మల్లికార్జున స్వామి, విజయవాడలోని కనకదుర్గమ్మ, అన్నవరంలోని శ్రీ సత్యనారాయణస్వామి, సింహాచలంలోని శ్రీ వరహా లక్ష్మీ నరసింహాస్వామి లాంటి 25 ప్రధాన దేవాలయాల్లో కల్పించిన సౌకర్యాలు భద్రతా చర్యలకు సంబంధించి మాస్టర్ ప్రణళిక కింద చేపట్టిన పనులపైన కూడా దినేశ్‌కుమార్ చర్చించారు.

# బడా బాబుల డబ్బుతో బాబు విజయాలు

- కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ధ్వజం
- ఎవరెవరి వద్ద ఎంత వసూలు చేశారో నాకు తెలుసు
- కాపు ఉద్యమానికి తాత్కాలిక విరామమే



**తుని రూరల్:** ముఖ్యమంత్రి చంద్రబాబు నంద్యాల ఉప ఎన్నిక, కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో బడా బాబులు అందించిన డబ్బును వెదజల్లి విజయం సాధించారని కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ధ్వజమెత్తారు. చంద్రబాబు మాత్రం తన అభివృద్ధిని చూసి ప్రజలు ఓట్లు వేశారని చెప్పుకుంటుండటం దారుణం అన్నారు. శనివారం తూర్పు గోదావరి జిల్లా తుని మండలం ఎస్.అన్నవరంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రైతు రక్తం తాగేసే కంపెనీల ప్రభావం ఎన్నికల్లో స్పష్టంగా కనిపించిందన్నారు. నాలుగైదు లక్షల రూపాయలతో రైతుల భూములను తీసుకున్న బడా నేతల వద్ద నుంచి ఎంతెంత వసూళ్లు చేస్తున్నారో ఎవరికీ తెలియదనుకుంటే పొరపాటేనని అన్నారు. ఆ ఆధారాలు తన వద్ద ఉన్నాయని, నిజంగా అభివృద్ధి విజయమేనని చంద్రబాబు ప్రకటిస్తే అప్పుడు తాను దీటుగా స్పందిస్తానని చెప్పారు. తాను ఈ ఎన్నికల్లో ఫలానా పార్టీకి ఓటు వేయాలని పిలుపు ఇవ్వలేదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

### ప్రధాని దృష్టికి తీసుకెళ్తాం..

కాపు ఉద్యమానికి తాత్కాలిక విరామమేనని, రిజర్వేషన్లు సాధించే వరకు ఉద్యమం కొనసాగిస్తామని ముద్రగడ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో పేద కాపులకు ఇచ్చిన హామీతో ముఖ్యమంత్రి పీఠంపై చంద్రబాబు నాయుడిని కుర్చోబెట్టామన్నారు. అప్పుడు ఇచ్చిన హామీనే అమలు చేయాలని ఉద్యమం చేస్తున్నామన్నారు. హామీని గుర్తు చేసేందుకు చేపట్టిన చలో అమరావతి యాత్ర వల్ల ఏం నష్టం వాటిల్లుతుందని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు జిల్లాలో ఉండగానే గత నెల 27న ఆరు కిలోమీటర్లు పాదయాత్ర చేశానని, పోలీస్ ఉన్నతాధికారుల విజ్ఞప్తి మేరకు తాత్కాలికంగా యాత్ర నిలిపివేశానన్నారు. గాంధీమార్గంలో ఉద్యమం చేస్తుంటే తీవ్రవాదుల్లా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తుని ఘటనలో వాస్తవాలేమిటన్నది పోలీసులకు తెలుసన్నారు. అధికారంలో ఉన్న వారికి చట్టాలు చుట్టాలుగా మారాయన్నారు. రెండు నెలల్లో సమస్యను పరిష్కరిస్తానని ముఖ్యమంత్రి ప్రకటించడంతో ఉద్యమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని చెప్పారు. కాపు రిజర్వేషన్ల సమస్యను ప్రధాన మంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించామన్నారు. బ్రిటీష్ పాలనలో కాపు రిజర్వేషన్లు రద్దు చేయాలని భావించినప్పుడు.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జోక్యం చేసుకొని 'తమకంటే హీనమైన స్థితిలో ఉన్నవారి రిజర్వేషన్లు రద్దు చేయడం తగదని' వాదించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

# గంజాయి దాడులా.. మేం చేయలేం!

- చేతులెత్తేసిన అబ్కారీ అధికారులు
- కార్యాచరణ ప్రణాళికకు గండి కొట్టిన ఓ ఉన్నతాధికారి

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో విశాఖ ఏజెన్సీ కేంద్రంగా సాగుతున్న గంజాయి సాగు.. అక్రమ రవాణాను అడ్డుకోలేమని ఎక్సైజ్ యంత్రాంగం చేతులెత్తేసింది. ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ విభాగం గంజాయి సాగు నియంత్రణ, అక్రమ రవాణాపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, అబ్కారీ పోలీసులను పాడేరులో మోహరించి సాగును ధ్వంసం చేయాలని, అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు ఈ కార్యాచరణ రూపొందించారు. ఇందుకోసం రూ.2 కోట్లను కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. రెండు దశల్లో దీన్ని అమలు చేసేందుకు నిర్ణయించారు. అయితే ఎక్సైజ్ యంత్రాంగం పాడేరు కేంద్రంగా ఈ ఆపరేషన్ నిర్వహించలేమని చేతులెత్తేసింది. రాష్ట్రంలోని పలువురు ఏఈఎస్‌లు ఈ అంశంపై కమిషనర్‌ను కలిసి కేవలం ఎక్సైజ్ అధికారుల వల్లే ఈ ఆపరేషన్ సాధ్యంకాదని తేల్చి చెప్పారు. గంజాయి అక్రమ రవాణా అరికట్టడంలో పోలీసులు, నార్కోటిక్ అధికారులకు బాధ్యత ఉందని, అయితే ఎన్‌ఫోర్సుమెంట్ విభాగం తమనే బాధ్యులను చేయడం భావ్యం కాదని కమిషనర్‌కు చెప్పినట్లు సమాచారం. ఈ విషయంపై ఎక్సైజ్ శాఖలో గత రెండు రోజుల్నుంచీ పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. ఎన్‌ఫోర్సుమెంట్ విభాగం రూపొందించిన కార్యాచరణ ప్రణాళికకు ఓ ఉన్నతాధికారి గండి కొట్టారని, రూ.2 కోట్లు కేటాయించడం సాధ్యం కాదని తేల్చి చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది.

**స్పేస్ టెక్నాలజీ ద్వారా గంజాయి సాగును గుర్తింపు**

స్పేస్ టెక్నాలజీ ద్వారా ఏజెన్సీలో సాగవుతున్న గంజాయి తోటలను ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ విభాగం గుర్తించింది. ఈ తోటలను ధ్వంసం చేసేందుకు జిల్లాల్లో ఏఈఎస్‌లకు బాధ్యతలు అప్పగించేందుకు నిర్ణయించారు. పాడేరు కేంద్రంగా ఆపరేషన్‌కు ప్రణాళిక రూపొందించగా, ఎక్సైజ్ యంత్రాంగం నుంచి సహాయ నిరాకరణ ఎదురవడం గమనార్హం.

**సవాల్ విసురుతున్న గంజాయి స్మగ్లర్లు**

విశాఖపట్టణం ఏజెన్సీ ప్రాంతాలలో గంజాయి స్మగ్లర్లు స్థానికులతో సాగు చేయించి పశ్చిమబెంగాల్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు అక్రమ రవాణా చేస్తున్నారు. రైళ్ల ద్వారా, రోడ్డు మార్గంలోనూ కంటైనర్ల ద్వారా గంజాయి భారీగా తరలిస్తున్నారు. గతంలో తూర్పుగోదావరి జిల్లా సరిహద్దులో రోడ్డు మార్గం ద్వారా తరలిస్తున్న గంజాయి పట్టుకునేందుకు ఎక్సైజ్ అధికారులు ప్రయత్నిస్తే స్మగ్లర్లు దాడి చేసి పారిపోయారు. ఈ ఘటనలో ఎక్సైజ్ అధికారులు ఇరువురు మరణించిన సంగతి తెలిసిందే. ఈ ఘటననే ఎక్సైజ్ యంత్రాంగం గుర్తు చేసి కనీసం తమ వద్ద ఆయుధాలు లేకుండా స్మగ్లర్లను ఎలా అడ్డుకోవాలని ప్రశ్నిస్తున్నారు. మొత్తం మీద గంజాయి దాడులకు ఎన్‌ఫోర్సుమెంట్ విభాగం రూపొందించిన కార్యాచరణ ప్రణాళికకు ఆదిలోనే హంసపాదు ఎదురైందని ఎన్‌ఫోర్సుమెంట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

## 'జీవో 64ను రద్దు చేయాలి'

**సాక్షి, అమరావతి:** వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) గుర్తింపు లేని యూనివర్సిటీల్లో చదివిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించే జీవో నంబర్ 64ను రద్దు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు బహిరంగ లేఖ రాశారు. జీవో నంబర్ 64 కారణంగా గుర్తింపు కలిగిన కాలేజీల్లో చదివిన వేలాది మంది విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. 2000లో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈ జీవో ప్రకారం వ్యవసాయ శాఖలో ఉద్యోగాల భర్తీకి ఐసీఏఆర్ గుర్తింపు కలిగిన కాలేజీల నుంచి డిగ్రీ పొందాల్సి ఉందన్నారు. అందుకు విరుద్ధంగా ఇప్పుడు ప్రభుత్వం జీవో 64 విడుదల చేయడం సరికాదని పేర్కొన్నారు. నకిలీ సర్టిఫికెట్లతో దొడ్డిదారిన వ్యవసాయ శాఖలో ఉద్యోగాలు పొందడానికి అవకాశాలు కల్పించినట్టు అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి తక్షణం స్పందించి జీవో 64ను రద్దు చేయాలన్నారు.

సాక్షి స్పోర్ట్స్
ఆదివారం 3-9-2017



## తల్లి అయిన అమెరికా టెన్నిస్ స్టార్ సెరెనా విలియమ్స్

సెరెనా సూపర్ స్టార్ అయింది... సెరెనా చాంపియన్ అయింది. తరచూ ఆమె గురించిన వార్తలివి. కానీ ఇప్పుడు ఆమె ఓ 'అమ్మ'యింది. ఎప్పుడూ కోర్టులు, మ్యాచ్‌లంటూ దేశాలు తిరిగే టెన్నిస్ పవర్ స్టార్ ఇప్పుడు మాతృత్వపు మధురిమల్లో మునిగి తేలుతోంది. ఫ్లోరిడాలోని సెయింట్ మెడికల్ సెంటర్‌లో బుధవారం అడ్మిట్ అయిన 35 ఏళ్ల సెరెనా భారత కాలమానం ప్రకారం గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డల ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపినట్లు మీడియా పేర్కొంది.



# జైత్రయాత్ర కొనసాగాలని!

**సమరోత్సాహంతో కదం తొక్కుతున్న భారత్ ఇక చివరి దెబ్బకు సిద్ధమవుతోంది. టెస్టు సిరీస్ మాదిరిగానే ఐదు వన్డేల సిరీస్‌ను కూడా 5-0తో క్లీన్‌స్వీప్ చేసేందుకు కోహ్లి సేన ఆత్రుతగా ఎదురుచూస్తోంది. 2014 భారత్ పర్యటనలోనూ లంక ఇదే రీతిన దెబ్బతింది. మరోవైపు లంక గడ్డపై జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌లను క్లీన్‌స్వీప్ చేసిన తొలి జట్టుగా నిలిచేందుకు భారత్ మరో విజయం దూరంలోనే ఉంది. ఇక ఇప్పటిదాకా ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో ముగ్గురు కెప్టెన్లతో ఆడి ఓడిన శ్రీలంక పరిస్థితి దారుణంగా ఉంది. సిరీస్‌లో చివరి మ్యాచ్‌లోనైనా గెలిచి పరువు కాపాడుకోవాలని ఆరాటపడుతోంది.**

**కొలంబో:** సొంతగడ్డపై పేలవ ప్రదర్శనతో నిరాశపరుస్తున్న శ్రీలంక జట్టు మరో వైట్‌వాష్‌కు సిద్ధమైనట్టేనా? టెస్టు సిరీస్‌తో పాటే ఈ ఐదు వన్డేల సిరీస్‌ను కూడా భారత్‌కు అప్పగించినట్టేనా? కోహ్లి సేన జోరును చూస్తుంటే ఇదేమంత కష్టంగా అనిపించడం లేదు. ప్రేమదాస స్టేడియంలో నేడు ఇరు జట్ల మధ్య చివరిదైన ఐదో వన్డే జరగబోతోంది. అయితే వన్డే ప్రపంచకప్‌కు నేరుగా బెర్త్ దక్కించుకోవాలని ఆశపడుతున్న లంకకు ఈ మ్యాచ్ గెలవడం అత్యంత కీలకం. కానీ క్లీన్‌స్వీప్‌పై కన్నేసిన భారత్ ఆ అవకాశమిచ్చే ఆలోచనలో మాత్రం లేదు. అత్యంత పటిష్టంగా కనిపిస్తున్న టీమిండియాను ఎలా ఎదుర్కోవాలో వారికి అర్థం కావడం లేదు. తమ మధ్య జరిగిన చివరి సిరీస్‌ను కూడా 5–0తో నెగ్గిన భారత్... గతంలో ఇంగ్లండ్ జట్టును కూడా ఇదే తరహాలో రెండు సార్లు క్లీన్‌స్వీప్ చేసింది.

**రహానేకు అవకాశం..**

భారత జట్టు తమ 2019 ప్రపంచకప్ ప్రయోగాలను దృష్టిలో పెట్టుకుని నాలుగో వన్డేలో మనీశ్ పాండే, కుల్దీప్ యాదవ్, శార్దుల్ ఠాకూర్‌లను పరీక్షించింది. ఈ ముగ్గురూ తమకు దక్కిన అవకాశాన్ని చక్కగా వినియోగించుకున్నారు. అయితే అన్ని ఫార్మాట్లలో ఆడే బౌలర్లకు పని ఒత్తిడి పడకుండా చూడాల్సి ఉందన్న కోచ్ రవిశాస్త్రి వ్యాఖ్యలతో హార్దిక్ పాండ్యాకు విశ్రాంతినిచ్చే అవకాశం లేకపోలేదు. అదే జరిగితే కేదార్ జాదవ్ మరోసారి జట్టులోకి వస్తాడు. ఇప్పటిదాకా జట్టులో ఒక్క అజింక్యా రహానేకు మాత్రమే బరిలోకి దిగే అవకాశం రాలేదు. రోహిత్ పునరాగమనంలో దుమ్ము లేపుతుండటంతోపాటు ధావన్ కూడా ఫామ్‌లో ఉండటంతో అతడు బెంచీకే పరిమితమయ్యాడు. అయితే ధావన్ భారత్‌కు తిరిగి రావడంతో రహానే జట్టులో చేరడం ఇక ఖాయమే. మిడిలార్డర్‌లో కుదురుకోలేకపోతున్న రాహుల్ వైఫల్యమొక్కటే జట్టును ఇబ్బంది పెట్టే విషయం. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో అతను చేసింది 4,17,7 స్కోర్లు మాత్రమే. ఈ మూడుసార్లూ స్పిన్నర్ ధనంజయ బౌలింగ్‌లోనే అవుటయ్యాడు.

**లంక పోరాడగలదా..**

ఆటగాళ్లలో అనుభవలేమితో పాటు గాయాలు శ్రీలంక జట్టును ఇబ్బంది పెడుతున్నాయి. తొలి మూడు మ్యాచ్‌ల్లో ముందుగా బ్యాటింగ్ చేసినా కనీసం 250 పరుగులు చేయలేకపోవడం లంక బ్యాటింగ్ ఆర్డర్ దయనీయతను చూపుతుంది. ఇక సస్పెన్షన్ ముగియడంతో రెగ్యులర్ కెప్టెన్ ఉపుల్ తరంగ తిరిగి జట్టులోకి వచ్చాడు. అతను మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు దిగి తిరిమన్నెతోనే ఓపెనింగ్ చేయించే అవకాశం ఉంది. యువ బ్యాట్స్‌మన్ కుశాల్ మెండిస్ వైఫల్యం జట్టును దెబ్బతీస్తోంది. పేసర్ లసిత్ మలింగ కూడా ఏమాత్రం ప్రభావం చూపలేకపోతున్నాడు. రెండో మ్యాచ్‌లో ధనంజయ ఆరు వికెట్ల ప్రదర్శన తప్ప ఈ సిరీస్‌లో లంక ఏమాత్రం ఆకట్టుకోలేకపోతోంది.

**పిచ్, వాతావరణం**

నాలుగో వన్డే మాదిరే ఈసారి కూడా పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించవచ్చు. సాయంత్రం వర్షం కురిసే అవకాశాలున్నాయి. ఒక వేళ మ్యాచ్ ఆగినా రిజర్వ్ డే ఉంటుంది.

### క్లీన్‌స్వీప్‌పై కన్నేసిన భారత్

- శ్రీలంకతో నేడు చివరి వన్డే
- మధ్యాహ్నం గం. 2.30 నుంచి సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

### జట్లు (అంచనా)

**భారత్:** కోహ్లి (కెప్టెన్), రోహిత్ శర్మ, రహానే, లోకేశ్ రాహుల్, మనీశ్ పాండే, ధోని, హార్దిక్ పాండ్యా/ కేదార్ జాదవ్ , అక్షర్, కుల్దీప్, శార్దుల్, బుమ్రా.

**శ్రీలంక:** తరంగ (కెప్టెన్), డిక్‌వెలా, మునవీర, తిరిమన్నె, మాథ్యూస్, సిరివర్ధన, హసరంగ, అకిల ధనంజయ, పుష్పకుమార, ఫెర్నాండో, మలింగ.

### స్వదేశానికి ధావన్

శ్రీలంకతో జరిగే చివరి వన్డేతో పాటు ఏకైక టి20 మ్యాచ్‌కు శిఖర్ ధావన్ దూరం కానున్నాడు. తన తల్లి అనారోగ్య కారణాలరీత్యా ధావన్ స్వదేశానికి వచ్చాడు. ఇప్పటికే ఇద్దరు రిజర్వ్ ఓపెనర్లు రాహుల్, రహానే ఉండటంతో మరో ఆటగాడిని లంకకు పంపడం లేదు.

## భళా... భారత బౌలర్లు


సునీల్ గావస్కర్

ఈ సిరీస్‌లో భారత్ శ్రీలంకతో అద్భుతంగా ఆడుతోంది. అయితే ఇప్పుడు ప్రపంచ క్రికెట్‌లో లంక బలమైన ప్రత్యర్థి కాదు. బౌలింగ్ పేలవంగా ఉంది. అంతర్జాతీయ స్థాయికి అదేమాత్రం సరితూగదు. కానీ... బ్యాటింగ్‌లో కొందరు మేటి ఆటగాళ్లున్నారు. అయితే వీరిని భారత బౌలర్లు చక్కగా కట్టడి చేశారు. బ్యాటింగ్ పిచ్‌లపై కూడా వారికి అవకాశం ఇవ్వకుండా దెబ్బ తీసిన బౌలర్లను తప్పకుండా అభినందించాల్సిందే. నాలుగో వన్డేలో పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా చెలరేగిన తీరు అద్భుతం. నిప్పులు చెరిగే బౌలింగ్‌తో... వైవిధ్యమైన యార్కర్లతో లంక బ్యాట్స్‌మెన్‌ను బాగా ఇబ్బంది పెట్టాడు. వారి ఇన్నింగ్స్‌ను కోలుకోలేని దెబ్బతీశారు. కొత్త కుర్రాడు శార్దుల్ ఠాకూర్ కూడా ఫ్లాట్ పిచ్‌పై చక్కగా రాణించాడు. కుల్దీప్ యాదవ్, హార్దిక్ పాండ్యా ఇలా అందరూ కలిసి లంక ఇన్నింగ్స్‌ను కూల్చారు. ఈ మ్యాచ్‌లో భువనేశ్వర్‌తో పాటు, కేదార్ జాదవ్, యజువేంద్ర చహల్‌ను డగౌట్‌కు పరిమితం చేసి రాహుల్‌కు మరో అవకాశమిచ్చారు. అయితే వెస్టిండీస్ సిరీస్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచిన రహానేను మరోసారి పక్కన బెట్టడం ఆశ్చర్యపరిచింది. రోహిత్ శర్మ, కెప్టెన్ కోహ్లి భాగస్వామ్యం భారీస్కోరుకు బాట వేసింది. కోహ్లి నిష్క్రమణ తర్వాత హార్దిక్ పాండ్యాకు బదులుగా రాహుల్‌ను బరిలోకి దించి ఉంటే అతను క్రీజులో నిలదొక్కుకునేందుకు మంచి అవకాశం ఉండేది. అయితే కోహ్లి, రోహిత్‌ల సెంచరీలతో పాండ్యా, రాహుల్‌ల వైఫల్యం లెక్కలోకి రాలేదు. ధనంజయ అద్భుతమైన డెలివరికి రాహుల్ పెవిలియన్ చేరాడు. ఏదేమైనా ఆటగాడిపై నమ్మకముంచడం మంచి పనే కానీ... ఇందుకోసం ఓ ఫామ్‌లో ఉన్న బ్యాట్స్‌మన్ (రహానే)ను కాదని ఇవ్వడం మాత్రం తగని పని. మొత్తానికి లంక పర్యటనలో భారత ఆటగాళ్లంతా తమ ప్రతిభను చాటుకున్నారు. బ్యాటింగ్, బౌలింగ్ ఇలా అన్ని రంగాల్లో సత్తా కనబరిచారు.

SONY LIV
WE LIV TO ENTERTAIN
పైన
మ్యాచ్‌ని లైవ్‌గా చూడండి
ఏపిని డౌన్‌లోడ్ చేసుకోండి లేదా www.Sony LIV.com పైన చూడండి

## ఆనంద్, హరికృష్ణలపైనే దృష్టి

### నేటి నుంచి ప్రపంచకప్ చెస్ టోర్నీ



**తిబిలిసి (జార్జియా):** వచ్చే ఏడాది జరిగే క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌కు అర్హత పొందడమే లక్ష్యంగా ఆదివారం మొదలయ్యే పురుషుల ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్‌లో భారత అగ్రశ్రేణి క్రీడాకారులు విశ్వనాథన్ ఆనంద్, పెంటేల హరికృష్ణ బరిలోకి దిగనున్నారు. 128 మంది మేటి క్రీడాకారులు పాల్గొంటున్న ఈ నాకౌట్ టోర్నమెంట్‌లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారు క్యాండిడేట్స్ చెస్ టోర్నీకి అర్హత సాధిస్తారు. తొలి రౌండ్‌లో తియాన్ లి యో (మలేసియా)తో విశ్వనాథన్ ఆనంద్; యూరీ గొంజాలెజ్ విడాల్ (క్యూబా)తో హరికృష్ణ తలపడతారు. ప్రతి రౌండ్‌లో రెండు గేమ్‌లు జరుగుతాయి. ఎక్కువ పాయింట్లు సాధించిన వారిని విజేతగా ప్రకటిస్తారు. ఒకవేళ స్కోరు సమమైతే టైబ్రేక్ గేమ్‌ల ద్వారా విజేతను నిర్ణయిస్తారు. ఆనంద్, హరికృష్ణలతోపాటు భారత్ నుంచి విదిత్ సంతోష్ గుజరాతి, ఆదిబన్, దీప్ సేన్‌గుప్తా, సేతురామన్, కార్తికేయన్ మురళీ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. క్యాండిడేట్స్ టోర్నీ ద్వారా ప్రస్తుత ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)తో వచ్చే ఏడాది జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో తలపడే ప్రత్యర్థిని నిర్ణయిస్తారు. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో రుస్లాన్ పొనోమరియోవ్ (ఉక్రెయిన్)తో సేతురామన్; వలెజో పోన్స్ (స్పెయిన్)తో కార్తికేయన్ మురళి; ఎన్గుయెన్ త్రుయోంగ్ సన్ (వియత్నాం)తో ఆదిబన్; వాంగ్ హావో (చైనా)తో దీప్ సేన్ గుప్తా; డెల్గాడో (పరాగ్వే)తో విదిత్ తలపడతారు. ఎనిమిది సార్లు ప్రపంచ కప్ జరగ్గా... భారత్ తరఫున విశ్వనాథన్ ఆనంద్ రెండుసార్లు (2000లో, 2002లో) విజేతగా నిలిచాడు. 15 ఏళ్ల తర్వాత ఆనంద్ మరోసారి ప్రపంచ కప్‌లో బరిలోకి దిగుతుండటం విశేషం.



# షరపోవా జోరు

- ప్రిక్వార్టర్స్‌లోకి రష్యా స్టార్
- ప్లిస్కోవా, ముగురుజా కూడా
- యూఎస్ ఓపెన్ టోర్నీ

**న్యూయార్క్:** డోపింగ్ నిషేధం గడువు ముగిశాక బరిలోకి దిగిన తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ యూఎస్ ఓపెన్‌లో రష్యా స్టార్ మరియా షరపోవా హడలెత్తిస్తోంది. తొలి రెండు రౌండ్‌లలో మూడు సెట్‌లలో గట్టెక్కిన ఈ మాజీ చాంపియన్... మూడో రౌండ్‌లో మాత్రం వరుస సెట్‌లలో విజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ మూడో రౌండ్‌లో షరపోవా 7–5, 6–2తో సోఫియా కెనిన్ (అమెరికా)పై గెలిచింది. 2011 యూఎస్ ఓపెన్ నుంచి ఇప్పటివరకు 15 గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో బరిలోకి దిగిన షరపోవా 14 సార్లు ప్రిక్వార్టర్ ఫైనల్ దశకు చేరుకోవడం విశేషం. సోఫియాతో గంటా 42 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో షరపోవా ఎనిమిది ఏస్‌లు సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. 38 విన్నర్స్ కొట్టిన ఈ మాజీ విజేత 33 అనవసర తప్పిదాలు చేసింది. మరోవైపు మూడో సీడ్ ముగురుజా (స్పెయిన్), తొమ్మిదో సీడ్ వీనస్ విలియమ్స్ (అమెరికా), 16వ సీడ్ అనస్తాసియా సెవస్తోవా (లాత్వియా) కూడా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. మూడో రౌండ్‌లో వీనస్ 6–3, 6–4తో మరియా సకారి (గ్రీస్)పై, ముగురుజా 6–1, 6–1తో రిబరికోవా (స్లొవేకియా)పై, సెవస్తోవా 6–2, 6–2తో డోనా వెకిక్ (క్రొయేషియా)పై గెలిచారు.

**ఐదో సీడ్ సిలిచ్‌కు షాక్**

పురుషుల సింగిల్స్ విభాగంలో రెండు సంచలనాలు నమోదయ్యాయి. 2014 చాంపియన్, ఐదో సీడ్ మారిన్ సిలిచ్ (క్రొయేషియా), పదో సీడ్ జాన్ ఇస్నెర్ (అమెరికా) మూడో రౌండ్‌లోనే నిష్క్రమించారు. 29వ సీడ్ డీగో ష్వార్ట్‌జమన్ (అర్జెంటీనా) 4–6, 7–5, 7–5, 6–4తో సిలిచ్‌పై... 23వ సీడ్ మిషా జ్వెరెవ్ (జర్మనీ) 6–4, 6–3, 7–6 (7/5)తో జాన్ ఇస్నెర్‌పై గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

**షపోవలోవ్ దూకుడు...**

కెనడా రైజింగ్ స్టార్, 18 ఏళ్ల డెనిస్ షపోవలోవ్ 3–6, 6–3, 6–3, 1–0తో ఆధిక్యంలో ఉన్న దశలో అతని ప్రత్యర్థి ఎడ్మండ్ (బ్రిటన్) గాయం కారణంగా వైదొలగడంతో షపోవలోవ్‌ను విజేతగా ప్రకటించారు. 1989లో మైకేల్ చాంగ్ (17 ఏళ్లు) తర్వాత యూఎస్ ఓపెన్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరిన రెండో పిన్న వయస్కుడిగా క్వాలిఫయర్ షపోవలోవ్ గుర్తింపు పొందాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో 12వ సీడ్ పాబ్లో బుస్టా (స్పెయిన్)తో షపోవలోవ్ ఆడతాడు. గత 3 మ్యాచ్‌ల్లో ఒక్క సెట్ కూడా కోల్పోని బుస్టా 1967 తర్వాత ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ క్వాలిఫయర్‌ను ఎదుర్కోనున్న తొలి ప్లేయర్‌గా గుర్తింపు పొందనున్నాడు. మరోవైపు 35 ఏళ్ల ప్రాయంలో ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తొలిసారి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరిన ప్లేయర్‌గా లొరెంజీ (ఇటలీ) రికార్డు నెలకొల్పాడు. మూడో రౌండ్‌లో లొరెంజీ 6–2, 6–4, 6–4తో ఫాబియానోపై గెలిచాడు.

**ఓటమి అంచుల నుంచి...**

మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) అతికష్టమ్మీద ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. షుయె జాంగ్ (చైనా)తో జరిగిన మూడో రౌండ్‌లో ప్లిస్కోవా 3–6, 7–5, 6–4తో గెలిచింది. తొలి సెట్ కోల్పోయి, రెండో సెట్‌లో స్కోరు 4–5 వద్ద జాంగ్ సర్వీస్‌లో మ్యాచ్ పాయింట్ కాపాడుకున్న ప్లిస్కోవా స్కోరును 5–5తో సమం చేసింది. ఆ తర్వాత మరోసారి జాంగ్ సర్వీస్‌ను బ్రేక్ చేసి రెండో సెట్‌ను దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచింది. మూడో సెట్‌లోనూ గట్టిపోటీ ఎదుర్కొన్న ప్లిస్కోవా పట్టుదలతో పోరాడి గట్టెక్కింది.



## 'మిక్స్‌డ్'లో సానియా జంటకు చుక్కెదురు

మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత స్టార్ సానియా మీర్జాకు నిరాశ ఎదురైంది. తొలి రౌండ్‌లో సానియా–ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) ద్వయం 7–5, 3–6, 6–10తో 'సూపర్ టైబ్రేక్'లో ఒస్టాపెంకో (లాత్వియా)–ఫాబ్రిస్ మార్టిన్ (ఫ్రాన్స్) జోడీ చేతిలో ఓడిపోయింది. పురుషుల డబుల్స్‌లో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. రెండో రౌండ్‌లో పదో సీడ్ రోహన్ బోపన్న–పాబ్లో క్యువాస్ (ఉరుగ్వే) ద్వయం 7–5, 4–6, 4–6తో ఫాబియో ఫాగ్‌నిని–సిమోన్ బొలెలీ (ఇటలీ) జంట చేతిలో... దివిజ్ శరణ్–ఆంద్రీ బెగెర్‌మన్ (జర్మనీ) జోడీ 4–6, 4–6తో ఫెలిసియానో లోపెజ్–మార్క్ లోపెజ్ (స్పెయిన్) జంట చేతిలో ఓడిపోగా... తొలి రౌండ్‌లో లియాండర్ పేస్–పురవ్ రాజా (భారత్) జోడీ 6–1, 6–3తో జాంకో టిప్సరెవిచ్–విక్టర్ ట్రయెస్కి (సెర్బియా) జంటపై విజయం సాధించింది.



# హామిల్టన్ 'పోల్' రికార్డు

**ఎఫ్1 చరిత్రలో అత్యధికంగా 69 సార్లు పోల్ పొజిషన్ ◆ షుమాకర్ పేరిట ఉన్న రికార్డు బద్దలు**

**మోంజా (ఇటలీ):** ఫార్ములావన్ క్రీడలో శనివారం కొత్త రికార్డు నమోదైంది. మెర్సిడెస్ జట్టు డ్రైవర్, ప్రపంచ మాజీ చాంపియన్ లూయిస్ హామిల్టన్ ఈ క్రీడా చరిత్రలో అత్యధికసార్లు 'పోల్ పొజిషన్' సాధించిన డ్రైవర్‌గా రికార్డు నెలకొల్పాడు. శనివారం జరిగిన ఇటలీ గ్రాండ్‌ప్రి క్వాలిఫయింగ్ సెషన్‌లో హామిల్టన్ అందరికంటే వేగంగా ఒక నిమిషం 35.554 సెకన్లలో ల్యాప్‌ను పూర్తి చేసి అగ్రస్థానాన్ని పొందాడు. ఆదివారం జరిగే ప్రధాన రేసును తొలి స్థానం నుంచి ప్రారంభించే అవకాశాన్ని దక్కించుకున్నాడు. తాజా ప్రదర్శనతో హామిల్టన్ జర్మనీ దిగ్గజం మైకేల్ షుమాకర్ (68 సార్లు) పేరిట ఐదేళ్లుగా ఉన్న 'పోల్ పొజిషన్' రికార్డును బద్దలు కొట్టాడు. తన కెరీర్‌లో హామిల్టన్ పోల్ పొజిషన్‌తో మొదలుపెట్టిన రేసుల్లో 37 సార్లు విజేతగా నిలిచాడు. రెడ్‌బుల్ జట్టు డ్రైవర్లు వెర్‌స్టాపెన్, రికియార్డో వరుసగా రెండు, మూడు స్థానాల నుంచి రేసును ఆరంభిస్తారు. భారత్‌కు చెందిన ఫోర్స్ ఇండియా జట్టు డ్రైవర్లు ఒకాన్ ఐదో స్థానం నుంచి, పెరెజ్ 11వ స్థానం నుంచి రేసును మొదలుపెడతారు.

**గ్రిడ్ పొజిషన్స్:** 1. హామిల్టన్ (మెర్సిడెస్), 2. వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్), 3. రికియార్డో (రెడ్‌బుల్), 4. లాన్స్ స్ట్రోల్ (విలియమ్స్), 5. ఒకాన్ (ఫోర్స్ ఇండియా), 6. బొటాస్ (మెర్సిడెస్), 7. రైకోనెన్ (ఫెరారీ), 8. వెటెల్ (ఫెరారీ), 9. మసా (విలియమ్స్), 10. వాన్‌డూర్నీ (మెక్‌లారెన్), 11. పెరెజ్ (ఫోర్స్ ఇండియా), 12. హుల్కెన్‌బర్గ్ (రెనౌ), 13. అలోన్సో (మెక్‌లారెన్), 14. క్వియాట్ (ఎస్టీఆర్), 15. సెయింజ్ (ఎస్టీఆర్), 16. మాగ్నుసెన్ (హాస్), 17. పాల్మెర్ (రెనౌ), 18. ఎరిక్సన్ (సాబెర్), 19. వెర్లీన్ (సాబెర్), 20. గ్రోస్యెన్ (హాస్).

**నేటి ప్రధాన రేసు**

సా. గం. 5.25 నుంచి స్టార్ స్పోర్ట్స్ సెలెక్ట్-2లో ప్రత్యక్ష ప్రసారం

## గుజరాత్ జెయింట్స్‌కు ఝలక్

**కోల్‌కతా:** వరుసగా ఏడు మ్యాచ్‌ల్లో అపజయమనేదే లేకుండా దూసుకెళుతున్న గుజరాత్ ఫార్చూన్ జెయింట్స్ జోరుకు అడ్డుకట్ట పడింది. ప్రొ కబడ్డీ లీగ్‌లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో హర్యానా స్టీలర్స్ 42–36 తేడాతో గుజరాత్‌పై ఘనవిజయం సాధించింది. ప్రశాంత్ కుమార్ రాయ్ 14 రైడింగ్ పాయింట్లతో అదరగొట్టగా... గుజరాత్ నుంచి సచిన్ 13 పాయింట్లు సాధించినా ఫలితం లేకపోయింది. తొలి అర్ధభాగంలో గుజరాత్ ఏడు పాయింట్ల తేడాతో ఆధిక్యంలో ఉన్నా చివరి ఎనిమిది నిమిషాల్లో హర్యానా పుంజుకుంది. ఇక హోరాహోరీగా సాగిన బెంగాల్ వారియర్స్, యూపీ యోధ మ్యాచ్ 26–26తో టైగా ముగిసింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో జైపూర్ పింక్‌పాంథర్స్‌తో గుజరాత్ ఫార్చూన్ జెయింట్స్... తమిళ్ తలైవాస్‌తో బెంగాల్ వారియర్స్ తలపడతాయి.



## కోచ్ ఓల్ట్‌మన్స్‌కు ఉద్వాసన

### హాకీ ఇండియా అనూహ్య నిర్ణయం



**న్యూఢిల్లీ:** భారత హాకీ జట్టు కోచ్ రోలంట్ ఓల్ట్‌మన్స్‌ను హాకీ ఇండియా (హెచ్‌ఐ) ఉన్నపళంగా తప్పించింది. హై పెర్ఫార్మెన్స్, డెవలప్‌మెంట్ కమిటీ సమీక్షా సమావేశం ముగిసిన అనంతరం కోచ్‌ను తప్పిస్తున్నట్లు హెచ్‌ఐ వెల్లడించింది. హాకీ జట్టు ఇంటా బయటా ఆశించిన ఫలితాలు సాధించకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ప్రస్తుత హై పెర్ఫార్మెన్స్ డైరెక్టర్ డేవిడ్ జాన్‌కు తాత్కాలిక కోచ్ బాధ్యతలు అప్పగించింది. పూర్తిస్థాయి కోచ్ నియామకం జరిగే వరకు ఆయన సీనియర్ జట్టు కోచ్‌గా పనిచేస్తారని హెచ్‌ఐ తెలిపింది. హాలెండ్‌కు చెందిన ఓల్ట్‌మన్స్ తొలుత 2013లో హై పెర్ఫార్మెన్స్ డైరెక్టర్‌గా చేరారు. అనంతరం 2015 జూలైలో కోచ్‌గా నియమితులయ్యారు. ఆయన మార్గదర్శనంలోనే చాంపియన్స్ ట్రోఫీలో భారత్ రజతం సాధించింది. జూనియర్ జట్టు ప్రపంచకప్‌లో విజేతగా నిలిచింది. అయితే అజ్లాన్ షా, హాకీ వరల్డ్ లీగ్ సెమీఫైనల్స్ ఈవెంట్లలో భారత్ తమ కన్నా తక్కువ ర్యాంకు ఉన్న మలేసియా, కెనడా జట్ల చేతిలో ఓడటం హెచ్‌ఐ ఉన్నతాధికారులను అసంతృప్తి పరిచింది.



నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే -4 ప్రకారం దేశంలో మొబైల్ ఫోన్ కలిగివున్న మహిళల (15-49 ఏళ్ల గ్రూపు) శాతం 46. కేరళ(81.2), గోవా (80.9), సిక్కిం (79.8) రాష్ట్రాల మహిళలు ముందు వరుసలో ఉన్నారు.



## చిన్న తప్పుతో ఖాతాలో కోట్లు



సాంకేతిక తప్పిదాలు ఘోరాలకు దారితీయటమే కాదు.. అప్పుడప్పుడు అదృష్టాన్ని కూడా తెచ్చిపెడుతుంటాయి. దక్షిణాఫ్రికాలో ఓ యూనివర్సిటీ అధికారులు చేసిన చిన్న తప్పు ఓ యువతికి కోట్లు తెచ్చిపెట్టింది. తూర్పు కేప్ ప్రాంతంలో ఉన్న వాల్టర్ సిసులు యూనివర్సిటీలో ఓ యువతి చదువుతోంది. నెల భోజన ఖర్చుల నిమిత్తం విశ్వవిద్యాలయ అధికారులు ఆమెకు 1,400 రాండ్(మన కరెన్సీలో 6,800 రూపాయలు) స్కాలర్‌షిప్ రూపంలో అందజేస్తున్నారు. అయితే జూన్‌లో మాత్రం పొరపాటున 1,400కు బదులు 14 మిలియన్ రాండ్( మన కరెన్సీలో సుమారు 7 కోట్లు) ఆమె అకౌంట్‌లో జమ చేశారు. మరి అంత డబ్బు కనిపించేసరికి యువతి ఊరుకుంటుందా? ఎడాపెడా షాపింగ్‌లు, పార్టీలతో జల్సా చేసింది. ఓ ఖరీదైన మొబైల్ ఫోన్, బట్టలు కొనుగోలు చేసింది. మొత్తం సొమ్ములో సుమారు 80,000 రాండ్‌లు (39 లక్షలు) ఖర్చు చేసేసింది. ఆలస్యంగా చేసిన తప్పును గమనించిన యూనివర్సిటీ అధికారులు యువతి అకౌంట్ నుంచి మిగతా డబ్బును వెనక్కి తీసేసుకున్నారు. నిబంధనల ప్రకారం ఖర్చు చేసిన సొమ్మును విద్యార్థిని చెల్లించాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. సౌతాఫ్రికాలో రెండేళ్లుగా వర్సిటీలో ఉచిత విద్య కోసం విద్యార్థులు ఆందోళనలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో వాళ్లను శాంతపరిచేందుకు సహాయ నిధి ఏర్పాటు చేసి ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు ఇస్తోంది.

## చాక్లెట్‌తో షుగర్‌కు చెక్!



మధుమేహం ఉన్నవారు తీయని పదార్థాలకు కచ్చితంగా దూరంగా ఉండాలి. ఒకవేళ చాక్లెటో, స్వీటో తింటే వారిలో షుగర్ లెవల్స్ అమాంతం పెరిగిపోతాయి. కానీ రోజూ ఓ చాక్లెట్ తింటే షుగర్ వ్యాధి రాదని చెబుతున్నారు పరిశోధకులు. వినడానికి కాస్త ఆశ్చర్యంగా ఉన్నా శాస్త్రీయంగా దీనిని నిరూపించారు కూడా. రోజూ ఓ చాక్లెట్ తీసుకుంటే టైప్ టూ డయాబెటిస్ రాకుండా అడ్డుకోవచ్చని, చాక్లెట్‌లో ఉండే కొకోవా అనే పదార్థం శరీరం ఇన్సులిన్‌ను ఎక్కువగా విడుదల చేసేందుకు దోహదపడుతుందని చెబుతున్నారు. రక్తంలో గ్లూకోజ్ పరిమాణం పెరుగుదలకు దీటుగా స్పందిస్తుందని బ్రిగ్‌హామ్ యంగ్ యూనివర్సిటీ పరిశోధకులు గుర్తించారు. ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసేందుకు దోహదపడే బీటా కణాలు మెరుగ్గా పనిచేసేందుకు ప్రేరేపించే పదార్థాలు కొకోవాలో పుష్కలంగా ఉన్నట్లు జర్నల్ ఆఫ్ న్యూట్రిషనల్ బయోకెమిస్ట్రీలో ప్రచురితమైన ఓ అధ్యయనం కూడా వెల్లడించింది. ఒత్తిడిని నియంత్రించి కణాలకు పునరుత్తేజం కల్పించే గుణం కూడా చాక్లెట్లలో ఉందని, కొకోవాపై దశాబ్దకాలంగా ఎన్నో పరిశోధనలు జరిగినా దీని ఉపయోగంపై నిర్దిష్ట ప్రయోజనాలను విశ్లేషిస్తూ సాగిన అధ్యయనం ఇదేనని పరిశోధకులు చెబుతున్నారు.

# స్థానికులను ముంచేసింది!

- పోలవరం నిర్వాసితుల జీవితాలతో సర్కారు చెలగాటం
- అన్ని ధ్రువపత్రాలు, తాతల కాలం నుంచి ఉంటున్నా స్థానికులు కాదట
- రూ.300 కోట్ల పరిహారానికి గండి
- రోడ్డున పడ్డ 4,000 కుటుంబాలు

**సాక్షి ప్రతినిధి, ఏలూరు, వేలేరుపాడు:** పోలవరం నిర్వాసితుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది. పరిహారం చెల్లింపులో 'స్థానికత' సాకుతో నాలుగు వేల పైచిలుకు నిర్వాసిత కుటుంబాలను రోడ్డున పడేసింది. పోలవరం ముంపు మండలాలైన వేలేరుపాడు, కుక్కునూరులో నిర్వాసితులను స్థానికేతరులుగా చెబుతూ వారికి చట్టబద్ధంగా రావాల్సిన పునరావాస ప్యాకేజీని అడ్డుకుంటోంది.

**ఇంటి విలువ లేకుండా వ్యక్తిగత ప్యాకేజీ ప్రకటన**

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 29,545 కుటుంబాలు ఇళ్లు కోల్పోతున్నాయి. ఇందులో పదివేల గిరిజన కుటుంబాలుండగా, గిరిజనేతర కుటుంబాలు 19,545 ఉన్నాయి. జూన్ 12న గ్రామసభలు నిర్వహించి అభ్యంతరాలు స్వీకరించారు. అనంతరం 3,430 మందిని నకిలీ నిర్వాసితులుగా గుర్తించారు. వడపోతల అనంతరం చివరకు ఈ రెండు మండలాల్లో 26,115 మందిని నిర్వాసితులుగా తేల్చారు. పది నెలల క్రితం సర్వే చేసిన అధికారులు నిర్వాసితుల ఇళ్ల విలువను వెల్లడించలేదు. తక్కువ విలువతో కూడిన ఇళ్ల జాబితాను మాత్రం ప్రకటించారు. ఇంటి స్థిరాస్తి విలువ లేకుండా కేవలం వ్యక్తిగత ప్యాకేజీ మాత్రమే ప్రకటించారు. అయితే కుక్కునూరు మండలంలో సుమారు 2,600 మందిని, వేలేరుపాడు మండలంలో సుమారు 1,500 మందిని స్థానికేతరులని పేర్కొంటూ అనర్హులుగా ప్రకటించారు. వ్యక్తిగత ప్యాకేజీ కింద గిరిజనులకైతే రూ.7.26 లక్షలు, గిరిజనేతరులకైతే రూ.6.36 లక్షలు చెల్లించాల్సి ఉంది. స్థానికేతరులుగా ప్రకటించడం వల్ల ఈ రెండు మండలాల్లో సుమారు 4 వేలకు పైగా కుటుంబాలు రూ. 300 కోట్ల మేర పునరావాస పరిహారాన్ని కోల్పోతున్నాయి. తమ గోడు వినిపించడానికి వెళ్లిన బాధితుల మాట వినే ఓపిక కూడా ఉన్నతాధికారులకు లేకపోవటంతో నిర్వాసితుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. రేషన్ డీలర్ల ద్వారా వివరాలు సేకరించి అనర్హులుగా ప్రకటించడంపై వ్యతిరేకత వ్యక్తం అవుతోంది.



### అన్నీ ఉన్నా నివాసి కాదు..



45 ఏళ్లుగా భూదేవిపేటలో ఉంటున్నాం. నా భర్త ఎనిమిదేళ్ల క్రితం మృతి చెందాడు. నాకు ఇద్దరు అమ్మాయిలు. వీరికి పెళ్లిళ్లు అయిపోయాయి. నాకు రేషన్ కార్డు, ఓటర్ కార్డు ఉంది. ప్రతి నెలా రేషన్ తీసుకుంటున్నా. రోజూ ఉపాధి కూలి పనికెళ్తున్నా, బ్యాంక్‌లో ఉపాధి వేతనం పొందుతున్నా. వితంతు పెన్షన్ వస్తోంది. ఇలాంటి అన్ని ఆధారాలు ఉన్నా జాబితాలో నాన్ రెసిడెంట్‌గా ప్రకటించారు. నా గోడు ఎవరికి చెప్పుకోవాలి.

– చీపుర్ల ఆదిశేషు, భూదేవిపేట, వేలేరుపాడు మండలం

### విడాకులు తీసుకున్నా..



నాకు 2008 ముందు పెళ్లయింది. 2009లో కోర్టు ద్వారా విడాకులు తీసుకున్నా. కానీ పునరావాస ప్యాకేజీ జాబితాలో పెళ్లి అయినట్లు చూపారు. విడాకులు తీసుకున్నట్లు ఆధారాలన్నీ ఉన్నాయి. నాకు అధికారులు మళ్లీ పెళ్లి చేస్తారా..? ఇదేం అన్యాయం?

– గుబ్బల ఈశ్వరి, కట్కూరు, వేలేరుపాడు మండలం

### 50 ఏళ్లుగా నివాసముంటున్నా..



50 ఏళ్లుగా మా తాతముత్తాతల కాలం నుంచి వేలేరుపాడులో నివాసముంటున్నా. తహశీల్దార్ కార్యాలయం పక్కనే హోటల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నా. అధికారులు నా హోటల్‌లోనే భోజనం చేస్తారు. రేషన్‌కార్డు, ఓటర్ ఐడీ ఉంది. వితంతు పెన్షన్ కూడా వస్తున్నా జాబితాలో నాన్‌లోకల్‌గా ప్రకటించారు.

– దాసరి అమృతం, వేలేరుపాడు

### రేషన్‌కార్డున్నా నాన్ లోకలే



నన్ను కొండరెడ్డినని కూడా కనికరించలేదు. భూమికి బదులు భూమి కింద పట్టా పత్రం ఇచ్చారు. 15 ఏళ్లుగా రేషన్ కార్డు ఉన్నా పునరావాస ప్యాకేజీ జాబితాలో స్థానికేతరురాలిగా ప్రకటించారు. మా బాధ ఎవరికి చెప్పుకున్నా పట్టించుకోవడం లేదు.

– వాళ్ల దమయంతి, కట్కూరు

## మేజర్ పిల్లలకు ప్యాకేజీ వర్తించదు

**భూ సేకరణ చట్టానికి రాష్ట్ర ప్రభుత్వం తూట్లు**

**సాక్షి, అమరావతి:** భూసేకరణ చట్టం–2013కు రాష్ట్ర ప్రభుత్వం వక్రభాష్యం చెబుతోంది. సాగునీటి ప్రాజెక్టుల కింద ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలకు దన్నుగా నిలవాల్సింది పోయి అన్యాయం చేస్తోంది. ముంపు గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన మేజర్ పిల్లలను సహాయ పునరావాస ప్యాకేజీ కింద లబ్ధిదారులు(ప్రాజెక్టు ప్రభావిత కుటుంబం)గా గుర్తించలేమని స్పష్టం చేసింది.

**చట్టం ఏం చెబుతోంది..?**

ఈ చట్టం ప్రకారం ముంపు గ్రామాల్లో నిర్వాసిత కుటుంబాల్లో.. కుటుంబ పెద్దతో పాటు 18 ఏళ్లు నిండిన మేజర్లయిన పిల్లలను 'ప్రత్యేక' కుటుంబాలుగా గుర్తించి సహాయ, పునరావాస ప్యాకేజీని అమలు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో పునరావాసం కల్పిస్తే 100 చదరపు మీటర్లలోనూ, పట్టణ ప్రాంతాల్లో పునరావాసం కల్పిస్తే 50 చదరపు మీటర్ల విస్తీర్ణంలోనూ ఇంటిని నిర్మించి ఇవ్వడంతోపాటు జీవనోపాధి కింద మొదటి ఏడాది నెలకు రూ.3 వేలు.. ఆ తర్వాత 20 ఏళ్ల పాటు నెలకు రూ.2 వేల చొప్పున సహాయం అందించాలి. కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలి.

**రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోంది..?**

రాష్ట్ర ప్రభుత్వం ఏకకాల పరిష్కారం కింద ఒక్కో ప్రాజెక్టు కింద ఒక్కోలా నిర్వాసితులకు పరిహారం అందిస్తోంది. శ్రీకాకుళం జిల్లాలో వంశధార ప్రాజెక్టు, వైఎస్సార్ జిల్లాలో గండికోట రిజర్వాయర్, ప్రకాశం జిల్లాలో వెలిగొండ ప్రాజెక్టుల్లో ముంపు గ్రామాల నిర్వాసితులకు సగటున రూ.5 లక్షల వంతున పరిహారం అందిస్తోంది. తాజాగా 18 ఏళ్లు నిండిన మేజర్ పిల్లలను లబ్ధిదారులుగా ఎంపిక చేయకూడదని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం వల్ల వివిధ ప్రాజెక్టుల కింద కనీసం 7.50 లక్షల మంది నిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముంపు గ్రామాల్లో భూములు, ఇళ్లు ఉన్నా వాటిలో నివాసం ఉండకుండా మరో గ్రామంలో నివసిస్తున్న వారికి సహాయ పునరావాస ప్యాకేజీని వర్తింపజేయకూడదని నిర్ణయించింది.

## హైదరాబాద్ నుంచి మైసూరుకు ట్రూజెట్ సర్వీసు

**సాక్షి, అమరావతి:** విమానయాన సంస్థ ట్రూజెట్ తన సర్వీసులను మైసూరుకు విస్తరించింది. ప్రతి రోజు హైదరాబాద్ నుంచి మైసూర్‌కు సర్వీసులను నడపనుంది. ఉడాన్ పథకం కింద సెప్టెంబర్ 15 నుంచి హైదరాబాద్, మైసూర్ మధ్య సర్వీసులను ప్రారంభించనున్నట్లు ట్రూజెట్ ఎండీ ఉమేష్ వంకాయలపాటి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇదే విధంగా త్వరలో కర్ణాటకలోని బళ్లారి, హంపీ పట్టణాలకు వెళ్లడానికి విద్యానగర్‌కు సర్వీసులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉడాన్ పథకం కింద నడిపే సర్వీసుల్లో టికెట్ల ధర రూ. 2,500 మించకూడదని నిబంధన విధించిన సంగతి తెలిసిందే.

## ఆన్‌లైన్‌లో ఉక్కు మేనేజ్‌మెంట్ ట్రైనీ పరీక్ష

**ఉక్కునగరం(గాజువాక):** విశాఖ స్టీల్ ప్లాంట్ మేనేజ్‌మెంట్ ట్రైనీ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ విషయాన్ని ఉక్కు యాజమాన్యం తన వెబ్‌సైట్‌లో ప్రకటించింది. ఈ ఏడాది జూన్ 25న ఆఫ్‌లైన్‌లో నిర్వహించిన మేనేజ్‌మెంట్ ట్రైనీ టెక్నికల్, ఫైనాన్స్, జూనియర్ మెడికల్ పరీక్షలపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఆ పరీక్షలను రద్దు చేస్తున్నట్టు జూన్ 29న యాజమాన్యం ప్రకటించింది. అప్పట్నుంచీ వివిధ పుకార్లు షికార్లు చేశాయి. ఎట్టకేలకు యాజమాన్యం ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించడానికి మొగ్గుచూపింది. వెబ్‌సైట్‌లో పొందుపరిచిన పేర్లలో తమ పేర్లున్నాయో లేదో అభ్యర్థులు సరిచూసుకోవాలని కోరింది. పేరు లేకపోతే.. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు అందించాలని తెలిపింది. తప్పుడు దరఖాస్తు ఇస్తే మూడేళ్లపాటు స్టీల్‌ప్లాంట్ పరీక్షల నుంచి డిబార్ చేస్తామని హెచ్చరించింది. పరీక్ష నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొంది.

## లిఫ్టులో ఇరుక్కుపోయిన సినీ నటుడు నిఖిల్



గుంటూరులో నిఖిల్ సందడి

**పాత గుంటూరు:** సినీ నటుడు నిఖిల్ శనివారం గుంటూరు నగరంలో సందడి చేశారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన ఇక్కడికి విచ్చేశారు. కార్యక్రమంలో హాజరయ్యేందుకు భవనంలోని లిఫ్టులో వెళ్తుండగా, సాంకేతిక సమస్యతో డోర్ తెరుచుకోలేదు. దీంతో సుమారు 15 నిమిషాల పాటు లిఫ్టులోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఈ ఘటనతో నిఖిల్ కొంత అసౌకర్యానికి గురయ్యారు. నిఖిల్‌తో పాటు మరో ముగ్గురు లిఫ్టులోనే ఉండిపోయారు. చివరికి నిఖిల్ బాడీగార్డులు లిఫ్టు డోర్ తెరవడంతో ఆయన బయటికొచ్చారు.

## రాయలసీమకు వర్ష సూచన

- ప్రభావం చూపుతున్న ద్రోణులు..
- రెండు రోజుల తర్వాత రాష్ట్రంలో వానలు ఉధృతం: ఐఎండీ

**సాక్షి, విశాఖపట్నం:** వివిధ ద్రోణుల ప్రభావంతో రాయలసీమలో వర్షాలు పడేందుకు అవకాశమేర్పడింది. ప్రస్తుతం ఈశాన్య బిహార్ నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు ఉపరితల ద్రోణి, రాయలసీమ నుంచి దక్షిణ తమిళనాడు వరకు మరొక ద్రోణి కొనసాగుతున్నాయి. మరోవైపు ఒడిశా నుంచి దక్షిణ తమిళనాడు వరకు కోస్తాంధ్ర మీదుగా అల్పపీడన ద్రోణి స్థిరంగా ఉంది. వీటి ప్రభావంతో ఆది, సోమవారాల్లో రాయలసీమతోపాటు కోస్తాంధ్రలోని కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. అదే సమయంలో రాయలసీమలో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే వీలుందని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) శనివారం రాత్రి విడుదల చేసిన నివేదికలో తెలిపింది. ఈ నెల ఐదో తేదీ నుంచి రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురవనున్నాయని పేర్కొంది.

## విజయవాడలో స్వైన్ ఫ్లూ కలకలం

### మహిళకు వ్యాధి సోకినట్లు నిర్ధారణ!


**లబ్బీపేట (విజయవాడ తూర్పు):** విజయవాడ నగరంలో స్వైన్ ఫ్లూ కలకలం రేగింది. నగరానికి చెందిన మహిళ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో శుక్రవారం ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేరింది. ఆమెకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు స్వైన్ ఫ్లూగా నిర్ధారించినట్లు తెలిసింది. దీంతో ఆమెను మరొక ఆస్పత్రికి మార్చి, ప్రత్యేక వార్డులో ఉంచి చికిత్స చేస్తున్నారని సమాచారం. నగరంలోని కండ్రిక ప్రాంతానికి చెందిన ఆసుల సీతామహాలక్ష్మి (49)కి వైరల్ ఫీవర్ సోకిందని తొలుత భావించిన వైద్యులు, అనంతరం స్వైన్ ఫ్లూగా అనుమానించి నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తెలిసింది. ఆ పరీక్షల్లో పాజిటివ్‌గా రావడంతో కుటుంబ సభ్యులకు సైతం కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం. ఇప్పటికే వైరల్ జ్వరాలు జిల్లాను వణికిస్తుండగా, తాజాగా స్వైన్‌ఫ్లూ కేసు నమోదు కావడం వైద్య శాఖ అధికారులను కలవరపెడుతోంది.

## హైబ్రీడ్ వాహనాలపై టయోటాతో సీఎం చర్చలు

**సాక్షి, అమరావతి:** రాజధానిలో హైబ్రీడ్ వాహనాల ప్రాజెక్టు పనులను వెంటనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు టయోటా కిర్లోస్కర్ మోటార్ కంపెనీ ప్రతినిధులను కోరారు. శనివారం ఉండవల్లిలో సీఎం చంద్రబాబును కలసిన కిర్లోస్కర్ కంపెనీ ఎండీ అకిటో టచిబనతో కూడిన ప్రతినిధి బృందం హైబ్రీడ్ వాహనాలపై ప్రజెంటేషన్ ఇచ్చింది. బ్యాటరీలతో నడిచే ఈ వాహనాలను విద్యుత్‌తో ఛార్జింగ్ చేసుకోవాలి. ఛార్జింగ్ లేని సమయంలో ఇంజన్‌తో నడిచేలా ఈ వాహనాలను తయారు చేస్తామని తెలిపింది. ఛార్జింగ్ ఇబ్బందుల వల్ల బ్యాటరీ కార్లు తక్కువ దూరం మాత్రమే ప్రయాణించే పరిస్థితులను హైబ్రీడ్ వాహనాలు అధిగమిస్తాయని చెప్పారు. వెంటనే రాజధానితో పాటు రాష్ట్రంలో ఈ ప్రాజెక్టును ప్రారంభించేందుకు పనులు ప్రారంభించాలని సీఎం కోరారు. రాజధాని అమరావతిలో భవిష్యత్తు రవాణా అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టును చేపట్టాలని సూచించారు. త్వరలో దీనిపై ఒప్పందం చేసుకుందామని ప్రతిపాదించారు.

## పోలవరం ఖర్చును పూర్తిగా కేంద్రమే భరించాలి

- రాష్ట్రంపై భారం పడరాదు
- ఏపీ విభజన చట్టానికి కట్టుబడి ఉండేలా చూడాలి
- కనీసం 2019లోగా పూర్తయ్యేలా చూడాలి
- జలవనరుల స్థాయీసంఘానికి ఎంపీ కేవీపీ లేఖ



**సాక్షి, న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టానికి కట్టుబడి కేంద్రం పోలవరం ప్రాజెక్టుకయ్యే ప్రతి పైసా ఖర్చును పూర్తిగా భరించేలా చూడాలని రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు జలవనరులపై పార్లమెంటరీ స్థాయీసంఘం చైర్మన్ హుకుం సింగ్‌ను కోరారు. ఈ మేరకు 8 పేజీల లేఖను రాశారు. దీన్ని శనివారం ఢిల్లీలో మీడియాకు విడుదల చేశారు. కనీసం 2019 మార్చినాటికైనా ప్రాజెక్టును పూర్తిచేసేలా కేంద్రానికి సలహా ఇవ్వాలని అందులో కోరారు. ప్రాజెక్టు వ్యయం, పునరావాస సాయం పూర్తిగా కేంద్రం చెల్లించడం ద్వారా రాష్ట్రంపై భారం లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ రాష్ట్రాల్లో అమలవుతున్న భారీ నీటి ప్రాజెక్టులను తనిఖీ చేసి పురోగతిపై వాస్తవ నివేదిక ఇవ్వాలని స్థాయీసంఘం నిర్ణయం తీసుకోవడాన్ని ఆయన అభినందించారు.

**వైఎస్సార్ హయాంలోనే అన్ని అనుమతులు..**

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టు నిర్మాణ ఆవశ్యకతను వైఎస్ రాజశేఖరరెడ్డి తన పాదయాత్రలో గుర్తించి ప్రజల కష్టాల్ని తీర్చేందుకు నడుంబిగించారని కేవీపీ లేఖలో తెలిపారు. ''ప్రాజెక్టును సాకారం చేసేందుకు 2004లో గద్దెనెక్కిన వైఎస్ ప్రభుత్వం కేంద్రంనుంచి అన్ని అనుమతులు పొందడమేగాక, అనుమతుల ప్రక్రియ పూర్తయ్యేలోపు ప్రతిపాదిత 177 కి.మీ. పొడవు కుడికాలువలో 145 కి.మీ. మేర నిర్మించారు. అలాగే ప్రతిపాదిత 180 కి.మీ. ఎడమ కాలువలో 135 కి.మీ. మేరకు 2009లోపే నిర్మించారు. రాజశేఖరరెడ్డి ఆకస్మిక మరణంతో పోలవరం ప్రాజెక్టు తాత్కాలికంగా కుంటుపడింది. తదనంతరం వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు 2010 జూలైలో తుది అటవీ అనుమతులూ తీసుకున్నాయి. 2011లో ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.16,010 కోట్లుగా లెక్కేశారు. 2012లో ప్రాజెక్టు టెండర్లు కూడా పిలిచారు. అనంతరం 2014లో రాష్ట్రం విడిపోయినప్పుడు దీన్ని జాతీయ ప్రాజెక్టుగా పరిగణిస్తూ కేంద్రం విభజనచట్టంలో పేర్కొంది. ఈ ప్రాజెక్టును కేంద్రం చేపట్టకపోవడం విభజన చట్టాన్ని ఉల్లంఘించడమేగాక రాష్ట్రంపై భారం మోపడమే అవుతుంది. ఇందుకు రాష్ట్రప్రభుత్వం కూడా కారణమైంది. కేంద్రం 2014 నాటి ధరల ప్రకారం అయ్యే వ్యయాన్ని మాత్రమే చెల్లిస్తానని స్పష్టం చేసింది. 2016 సెప్టెంబర్ 8న కేంద్రం రాష్ట్రానికి ప్రత్యేక సాయం చేసినరోజునే రాష్ట్రప్రభుత్వం పోలవరం అంచనా వ్యయాన్ని పెంచింది. ఈ నేపథ్యంలో నేను రాజ్యసభలో ప్రశ్నించగా పెరిగిన అంచనా వ్యయంతో సంబంధం లేదని కేంద్రం బదులిచ్చింది. మరోవైపు ప్రాజెక్టును 2018లోగా పూర్తిచేయాల్సి ఉందని, ఒకవేళ పూర్తికానిపక్షంలో కేంద్రం ఇచ్చే గ్రాంటును రుణంగా పరిగణించాల్సి వస్తుందని, అనుమతి లేకుండా చేసే అదనపు వ్యయం ఇవ్వడం కుదరదని కేంద్రం షరతులు విధించింది. ఇలాంటి షరతులున్నప్పుడు రాష్ట్రప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్మిస్తానని తీసుకోవడంపై అనుమానాలు కలుగుతున్నాయి. అందువల్ల పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేవరకు ప్రతిపైసాను కేంద్రమే భరించేలా చూడాలి'' అని కేవీపీ తన లేఖలో కోరారు.

## వైద్యమందక మత్స్యకారుడు మృతి

- ఫోన్ చేసినా రాని 108 వాహనం
- వైఎస్సార్ వర్ధంతి రోజునే ఘోరం
- విశాఖ జిల్లాలో పదిరోజుల్లో ఇది రెండో ఘటన



సూదుల రమణ

**నక్కపల్లి(పాయకరావుపేట):** ఫోన్ కొడితే కుయ్.. కుయ్.. మంటూ రావాల్సిన 108 వాహనం ఎంతకూ రాకపోవడం.. సకాలంలో ఆస్పత్రికి చేర్చలేకపోవడంతో ఓ మత్స్యకారుడి నిండు ప్రాణాలు గాల్లో కలిశాయి. విశాఖ జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఈ ఘోరం శనివారం చోటు చేసుకుంది. ప్రాణాపాయ సమయాల్లో రోగుల్ని తక్షణం ఆస్పత్రులకు తరలించేందుకు 108 వాహనాల్ని ప్రవేశపెట్టిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి రోజునే ఈ ఘటన చోటు చేసుకోవడం బాధాకరం. నక్కపల్లి మండలం రాజయ్యపేటకు చెందిన సూదుల రమణ అనే మత్స్యకారుడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బంధువులు 108 వాహనానికి ఫోన్ చేశారు. నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాలకు సేవలందించే 108 వాహనం మరో కేసుకు అటెండ్ అయిందని, యలమంచిలి నుంచి వాహనాన్ని పంపించాల్సి ఉంటుందని సమాధానమొచ్చింది. ఈ నేపథ్యంలో ఎంతకీ 108 వాహనం రాకపోవడంతో బంధువులు ఆటో తీసుకొచ్చి ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని తక్షణం నక్కపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యుడు సూచించడంతో మరో ఆటోకోసం వేచిచూశారు. ఆటో రావడం ఆలస్యమవడంతో రమణ మృతిచెందాడు. 108 అంబులెన్స్ రాకపోవడంతో వైద్యమందక ఒక ప్రాణం గాలిలో కలిసిపోయిందని బంధువులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, పదిరోజులక్రితం ఈ ప్రాంతంలో ఇదే తరహా సంఘటన చోటు చేసుకుంది. ఫోన్ చేసినా 108 వాహనం రాకపోవడంతో పెదబయలు మండలం లకేయిపుట్టులో ఆగస్టు 21న పాంగి రవి(8) అనే చిన్నారి మృతిచెందాడు.

## దేశమంతటికీ విశాఖ నుంచే గంజాయి

- గంజాయి సాగు వెనక పెద్దపెద్ద వాళ్లున్నారు
- మంత్రి గంటా శ్రీనివాసరావు వ్యాఖ్య



**బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు):** యావత్తు దేశానికి విశాఖ నుంచే గంజాయి సరఫరా అవుతోందని, ఇది రాష్ట్రానికి, ముఖ్యంగా జిల్లాకు అవమానకరమని మంత్రి గంటా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. గంజాయి సాగుపై కలెక్టరేట్‌లో శనివారం అధికారులతో ఆయన సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరానికి ఇది మాయనిమచ్చని, ఇటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల్ని నియంత్రించేందుకు స్వల్ప, దీర్ఘకాలిక ప్రణాళికలతో పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గిరిజనులను అడ్డుపెట్టుకొని కొంతమంది బడాబాబులు గంజాయి సాగు చేస్తున్నారని ఆయన అన్నారు. వారెవరో కనిపెట్టి కఠినంగా శిక్షిస్తామన్నారు. వచ్చే మూడేళ్లలో పూర్తిస్థాయిలో గంజాయి సాగును నియంత్రిస్తామని చెప్పారు. ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ, ఐటీడీఏ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలు రూపొందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 8 మండలాల్లోని 151 గ్రామాల్లో గంజాయి సాగు జరుగుతున్నట్లు గుర్తించామని, అందులో విశాఖ ఏజెన్సీలోనే 110 గ్రామాలున్నాయని తెలిపారు. క్షేత్ర స్థాయిలో లోటుపాట్లను తెలుసుకునేందుకు ఈనెల 11 నుంచి రెండు వారాలపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. గిరిజనుల ఉపాధికోసం ప్రత్యామ్నాయ మార్గాల్ని చూపిస్తామన్నారు. దీనిపై ఈ నెల 9న జరిగే కేబినెట్ సమావేశంలో చర్చిస్తామన్నారు.

## రహస్య ఓటు హక్కును పరిరక్షించండి

### ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు దేరంగుల ఉదయ్‌కిరణ్

**హైదరాబాద్:** రహస్య ఓటు హక్కును పరిరక్షించాలని ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు దేరంగుల ఉదయ్‌కిరణ్ ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఎర్రగడ్డలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రహస్య బ్యాలెట్ బహిర్గతం ద్వారా అభ్యర్థులు ఓటర్లపై కక్ష్యసాధింపు చర్యలకు దిగుతున్నారని పేర్కొన్నారు. పోలింగ్ స్టేషన్, ఈవీఎం, ప్రాంతం చెప్పడం ద్వారా రహస్య బ్యాలెట్‌కి అర్థం లేకుండా పోతోందని, ఈ విషయంపై ఎన్నికల సంఘం దృష్టి సారించాలని కోరారు. ఈవీఎంల నంబర్లను తొలగించి లెక్కింపు అధికారులకు పంపడం ద్వారా రహస్య ఓటు హక్కును పరిరక్షించవచ్చని చెప్పారు. కాగా, అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బీసీ సబ్‌ప్లాన్‌ను చట్టబద్ధం చేయాలని ఆయన కోరారు.

## 'హార్వీ' నష్టం పూడ్చేందుకు 14 బిలియన్ డాలర్లు

**అమెరికా కాంగ్రెస్‌ను కోరిన శ్వేతసౌధం వర్గాలు**

**వాషింగ్టన్/హూస్టన్:** అమెరికాలోని టెక్సాస్, లూసియానా రాష్ట్రాల్లో హార్వీ తుపాను వల్ల కలిగిన నష్టాన్ని పూడ్చేందుకు 14 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.90 వేల కోట్లు) విడుదల చేయాల్సిందిగా శ్వేతసౌధం వర్గాలు అమెరికా కాంగ్రెస్‌ను కోరాయి. హార్వీ వల్ల కనీవినీ ఎరుగని వరద అనేక ప్రాంతాలను ముంచెత్తిందనీ, ప్రజల జీవితాలు తలకిందులయ్యాయనీ, లక్షకు పైగా ఇళ్లు దెబ్బతిన్నాయని తెలుపుతూ శ్వేతసౌధం బడ్జెట్ చీఫ్ మిక్ ముల్వనీ కాంగ్రెస్‌కు ఓ లేఖ రాశారు. 43,500 మంది వరద బాధితులు ఇంకా శిబిరాల్లోనే ఉన్నారనీ, లక్షలాది మంది ఇంటి మరమ్మతులకు సహాయం కోరుతున్నారని ఆయన లేఖలో పేర్కొన్నారు. కాగా, హార్వీ తుపాను ప్రభావితులకు మద్దతుగా ఈ ఆదివారాన్ని (సెప్టెంబరు 3) అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జాతీయ ప్రార్థనా దినంగా ప్రకటించారు.

**కార్పొరేట్ల విరాళం 170 మిలియన్ డాలర్లు**

వరద బాధితుల సహాయార్థం అమెరికాలోని ప్రముఖ కార్పొరేట్ సంస్థలు, వ్యక్తులు విరివిగా విరాళాలు ప్రకటిస్తున్నారు. గురువారం నాటికి పలువురు ప్రకటించిన విరాళాల మొత్తం 170 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.1,100 కోట్లు)కు చేరింది.

## భారతీయ విద్యార్థి అంత్యక్రియలు పూర్తి

సరస్సులో మునిగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన భారతీయ విద్యార్థి నిఖిల్ భాటియా అంత్యక్రియలు శుక్రవారం పూర్తయ్యాయి. నిఖిల్ తల్లి, మిత్రుల అశ్రునయనాల మధ్య హూస్టన్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. నిఖిల్ అస్థికలు తీసుకుని ఆమె తల్లి సోమవారం భారత్‌కు బయలుదేరనున్నారు. కాగా, నిఖిల్‌తోపాటు సరస్సులో మునిగిన షాలినీ సింగ్ పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని వైద్యులు చెప్పారు.


స్ఫూర్తి DSC
చాకలి వీధి, VRC, నెల్లూరు
SGT, TPT, SA
State Ranks
గ్రూప్-IV, VRO, కానిస్టేబుల్
9440009134, 9703204607

S.I. కానిస్టేబుల్
S.I.
HIP హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్
Hyd. 9849771902, 9848262600

SI-కానిస్టేబుల్స్
S.I, కానిస్టేబుల్స్
New Batch : 7-9-2017 ప్రారంభం
యూనిక్
DILSUKHNAGAR, HYD 9492459622 9059949607

కృష్ణా జిల్లా, అవనిగడ్డ
ప్రగతి DSC
AP&TS గ్రూప్స్-II, III, IV
SI, కానిస్టేబుల్ బ్యాచ్: 9-9-2017
81062 68437, 81062 68482



Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 and Printed at Jagati Publications Limited, Survey No. 310, Tadigotla Village, Chintakommadinne Mandal, YSR Kadapa District. 516 003 EDITOR: V. Murali, Phone No. 08562-200076, 77 RNI Regn No. APTEL/2008/23796.